
'సామాన్యులకు వైద్యం
ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు.
అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 171


బుధవారం 11-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సైబర్ నేరాల కట్టడికి ఏఐ

దర్యాప్తు సంస్థలకు హోం మంత్రి అమిత్ షా సూచన -6లో



ఈవీ విక్రయాలు.. ఏటా కోటి!


5 కోట్ల ఉద్యోగాల కల్పన.. 2030 నాటికి అంచనాలు: గడ్కరీ -15లో



విషమంగా ఏచూరి ఆరోగ్యం

ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.

వివరాలు 6లో ▸



మానవతా జోన్‌పై ఇజ్రాయెల్ దాడి

దక్షిణ గాజాలో వలసదారులకు ఆశ్రయం కల్పిస్తున్న మానవతా జోన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 19 మంది మృతి చెందారు.

వివరాలు 6లో ▸



సుప్రీం డెడ్‌లైన్ బేఖాతరు..

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో జూనియర్ వైద్యుల సమ్మె యథాప్రకారం కొనసాగుతోంది.

వివరాలు 6లో ▸



మళ్లీ రాజుకుంటున్న మణిపూర్

మణిపూర్‌లో పరిస్థితి అదుపు తప్పుతోంది. జాతుల ఘర్షణతో గతేడాది అట్టుడికిన ఆ రాష్ట్రంలో మరోసారి హింస పెచ్చరిల్లుతోంది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

సుప్రీం మార్గదర్శకాల మేరకు.. బీసీ రిజర్వేషన్లను నిర్ధారించండి



వికాస్ కిషన్‌రావ్ గవాలీ వర్సెస్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు బీసీ కోటాను నిర్ధారించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీని అమలుకు 3 నెలల సమయం కావాలని ఏజీ కోరారు.

- వివరాలు 12లో▶

హైదరాబాద్‌లో బ్యాటరీ బస్సులే తిప్పండి



హైదరాబాద్‌లో డీజిల్ బస్సుల స్థానంలో బ్యాటరీ బస్సులే తిరగాలని సీఎం రేవంత్ అధికారులకు చెప్పారు. డీజిల్ బస్సులను తొలగించి బ్యాటరీ సర్వీసుల్లోకి మార్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

- వివరాలు 16లో▶

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అవార్డు



సైబర్ నేరాల అనాలసిస్‌తోపాటు క్రిమినల్ నెట్‌వర్క్‌ను గుర్తించడంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను కేంద్ర హోంశాఖ సత్కరించింది.

- వివరాలు 16లో▶


సీట్లు రానివారికా.. అందరికీ అవకాశమా !



ఇంజనీరింగ్ కాలేజీల్లో పెరిగిన సీట్లు ఎవరికి దక్కుతాయి? కౌన్సెలింగ్ ఎలా నిర్వహిస్తారు? అనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు.

- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి





రవీంద్ర భారతిలో చాకలి ఐలమ్మ జీవిత చరిత్రపై నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల బృందం

మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు

చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి

- ఐలమ్మ స్ఫూర్తిని మా ప్రభుత్వం కొనసాగిస్తుంది
- ఇందిరాగాంధీ తెచ్చిన భూ సంస్కరణలకు ఐలమ్మ పోరాటమే స్ఫూర్తి
- ఐలమ్మ కుటుంబ సభ్యులు మా ప్రభుత్వంలో భాగస్వాములు కావాలనుకుంటున్నాం
- మనవరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తున్నట్లు వెల్లడి
- అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల

5 లో

సాయం చేయండి

16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం వినతి

- విద్య, ఆరోగ్యం, ఉద్యోగాల కల్పన తదితర రంగాల్లో వెనుకబడి ఉన్నాం.. భరించలేని స్థాయిలో అప్పుల భారం
- అసలు, వడ్డీలు చెల్లించేందుకే నెలకు రూ.5,200 కోట్లు అవసరం
- బడ్జెట్‌లో 36 శాతం వేతనాలు, పింఛన్లకే వ్యయం
- తడిసి మోపెడవుతున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ ఖర్చు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల తలసరి ఆదాయంలో వ్యత్యాసం ఉంది.. తలసరి ఆదాయం ఎక్కువ ఉందన్న కారణంతో సాయాన్ని తగ్గించొద్దు
- రాష్ట్రంలోని క్షేత్రస్థాయి పరిస్థితులన్నీ పరిగణనలోకి తీసుకోండి
- గ్రాంట్ల వినియోగంలో స్వతంత్రత ఇవ్వండి..
- కేంద్రం నుంచి ఎక్కువ సాయం అందేలా సిఫారసులు చేయండి



సమావేశంలో పనగరియా, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రం అనేక సామాజిక సూచికల్లో వెనుకబడి ఉంది. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, ఉద్యోగాల కల్పన తదితర రంగాల్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వెనుకంజలో ఉన్నాం. తలసరి ఆదాయం విషయంలో కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చాలా తేడా కనిపిస్తోంది. అప్పుల భారం భరించలేని స్థాయికి చేరింది. ప్రభుత్వం నేరుగా తీసుకున్న రుణాలు, గ్యారంటీలు కలిపి ప్రస్తుతం రాష్ట్ర నికర అప్పు రూ.7.27 లక్షల కోట్లకు చేరింది. ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్ల కోసమే బడ్జెట్‌లో 36% వరకు అనివార్యంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇది దీర్ఘకాలిక భారంగా పరిణమిస్తోంది. నెలకు రూ.5,200 కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకు గాను అసలు, వడ్డీలు చెల్లించేందుకే అవసరమవుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ ఖర్చు తడిసి మోపెడవుతోంది. తక్షణ అవసరాల కోసం స్వల్ప కాలిక రుణాలకు వెళ్లాల్సి రావడం బడ్జెట్‌పై ఒత్తిడిని కలుగజేస్తోంది. తెలంగాణ అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రమనే కారణంతో కేంద్రం నుంచి రావాల్సిన సాయాన్ని తగ్గించొద్దు. రాష్ట్రంలోని క్షేత్రస్థాయి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం నుంచి వీలున్నంత ఎక్కువ

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రానికి సవాలుగా రుణ భారం

16వ ఆర్థిక సంఘంతో భేటీలో సీఎం

- గత ఆర్థిక సంవత్సరంలో రూ.6.85 లక్షల కోట్లకు చేరిన అప్పులు
- రుణాలు రీస్ట్రక్చర్ చేసేందుకు అవకాశం కల్పించాలి.. లేకుంటే అదనపు ఆర్థిక సహాయం చేయాలి

2 లో

సెస్‌లు, సర్‌చార్జీల్లో వాటా కుదరదు

రాష్ట్రాలకు వాటిల్లో వాటా కావాలంటే రాజ్యాంగ సవరణ జరగాలి: పనగరియా

రుణాల రీస్ట్రక్చరింగ్ అంశం మా పరిధిలోకి రాదు

హైడ్రా ఎన్‌ఓసీ ఇస్తేనే నిర్మాణాలు!



- చెరువులు, నాలాల సమీపంలోని భవనాలకు అనుమతులు తప్పనిసరి
- అక్రమంగా నిర్మిస్తే ఇంటినంబరు, నల్లా, విద్యుత్ కనెక్షన్లు రానట్టే..
- ఈ మేరకు భవన నిర్మాణ నిబంధనల సవరణపై కసరత్తు

సాక్షి, హైదరాబాద్

భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియలో హైడ్రా కూడా భాగస్వామ్యం కానుంది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌ఓసీ) ఉంటేనే నిర్మాణ అనుమతులు జారీ చేయనున్నారు. చెరువులు, నాలాలకు సమీపంలో నిర్మించే నివాస, వాణిజ్య సముదాయాలకు హైడ్రా ఎన్‌ఓసీ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు విశ్వసనీయ సమాచారం. ఒకవేళ అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఆయా భవనాలకు ఇంటి నంబరు, నల్లా, విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయరు. ఈ మేరకు భవన నిర్మాణ నిబంధనల చట్ట సవరణపై పురపాలకశాఖ కసరత్తు చేస్తోంది. ఇది అమలులోకి వస్తే గ్రేటర్ హైదరాబాద్‌లో గృహ కొనుగోలుదారులకు భరోసా కలుగుతుందని స్థిరాస్తి రంగం నిపుణులు చెబుతున్నారు.

కొనుగోలుదారుల భరోసాకే...

దొడ్డిదారిలో అనుమతులు తీసుకొని.. చెరువులను ఆక్రమించిన భవన నిర్మాణాలను హైడ్రా కూల్చుతోంది. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తూ, జలాశయాలను కాపాడాలన్న ప్రభుత్వ ఉద్దేశం మంచిదే. కానీ.. హైడ్రా పనితీరుతో స్థిరాస్తి కొనుగోలుదారుల్లో గందరగోళం నెలకొంది. ఏ ప్రాజెక్ట్ సరైనదో తెలియక సందిగ్ధంలో పడిపోయారు. దీంతో గృహ కొనుగోళ్లు తగ్గడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులకు భరోసా కలిగించేందుకు నిర్మాణ అనుమతుల జారీలో హైడ్రాను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు.

గతంలో రెరా తీసుకొచ్చిందీ ఇలాగే..

రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్ (రెరా) కంటే ముందు డెవలపర్లు నిర్మాణ అనుమతులు రాకముందే అబద్ధపు హామీలతో ముందుగానే విక్రయించేవారు. తీరా న్యాయపరమైన చిక్కులతో సంబంధిత ప్రాజెక్ట్‌కు అనుమతులు మంజూరు కాకపోవడంతో కస్టమర్లు రోడ్డున పడేవారు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో కొనుగోలుదారులకు భరోసా కల్పించేందుకు కేంద్రం రెరాను అమలులోకి తీసుకొచ్చింది. దీంతో స్థిరాస్తి రంగంలో పెట్టుబడులకు భద్రత, పారదర్శకత, నిర్మాణంలో నాణ్యత పెరిగాయి. నిర్మాణ అనుమతులతోపాటు రెరా ఆమోదం పొందిన ప్రాజెక్టులలో కొనుగోళ్లకే కస్టమర్లు మొగ్గు చూపిస్తున్నారు. ఇదే తరహాలో ఇప్పుడు భవన నిర్మాణాలకు ఎలాగైతే

మిగతా 3వ పేజీలో ▶

'హైడ్రా'కు బలగం :

- తొలి విడతలో 23 మంది కేటాయింపు
- వీరిలో 15 మంది ఇన్‌స్పెక్టర్ స్థాయి వారు

3 లో

కొత్తగా 400 ఎంబీబీఎస్ సీట్లు



- తాజాగా 4 మెడికల్ కాలేజీలకు కేంద్రం అనుమతి
- దీంతో ఈ ఏడాది మొత్తం 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు
- ఫలితంగా రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కాలేజీల్లో 4,090కి చేరిన సీట్లు
- మంత్రి దామోదర రాజనర్సింహ ప్రయత్నాలు సఫలం
- కేంద్రానికి, సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపిన దామోదర


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది అదనంగా 400 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం మంగళవారం 4 కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ యాదాద్రి భువనగిరి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్, మెదక్ కాలేజీలకు అనుమతి ఇస్తూ ప్రిన్సిపాళ్లకు లేఖ రాసింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మొత్తం 8 కొత్త కాలేజీల కోసం దరఖాస్తు చేసింది. వాటిలో

మిగతా 12వ పేజీలో ▶

ఓఆర్‌ఆర్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు!

9 కొత్త రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం

ఈ రోడ్ల మొత్తం పొడవు 216.9 కిలోమీటర్లు



గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు ఇక్కడే..

ఎక్కడి నుంచి	ఎక్కడి వరకు	మొత్తం కి.మీ.
ఎగ్జిట్ నంబర్–13రావిర్యాల	ఆమన్‌గల్	41.5
కోహెడ	గుడ్డిమల్కాపురం	28.5
ఎగ్జిట్ నంబర్–10 తారామతిపేట	ఎర్రంబల్లి	31.4
ఎగ్జిట్ నంబర్–8 కీసర	కోమటికుంట	29.2
ఎగ్జిట్ నంబర్–4 సుల్తాన్‌పూర్	అంగడిపేట	24.7
ఎగ్జిట్ నంబర్–2 కొల్లూర్	పులిమామిడి	27.6
ఎగ్జిట్ నంబర్–15 పెద్ద గోల్కొండ	బూర్గుల్	31
ఎగ్జిట్ నంబర్–15 పెద్ద గోల్కొండ	కేశంపేట	30.6
ఎగ్జిట్ నంబర్–15 పెద్ద గోల్కొండ నుంచి 4 కి.మీ. దూరంలో	తలకొండపల్లి	34

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ సమగ్రాభివృద్ధిలో భాగంగా 352 కి.మీ. మేర రూపుదిద్దుకోనున్న రీజనల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు చేరుకొనేందుకు వీలుగా ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్) నుంచి గ్రీన్‌ఫీల్డ్ రహదారులను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా 216.9 కిలోమీటర్ల మేర తొమ్మిది గ్రీన్‌ఫీల్డ్ రోడ్లను నిర్మించనుంది.

రావిర్యాల టు ఆమన్‌గల్ వయా ఫ్యూచర్ సిటీ

సుమారు 14 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించినందున భవిష్యత్తులో ఈ మార్గంలో వాహనాల రాకపోకల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ఈ మార్గాన్ని ఫ్యూచర్ సిటీ మీదుగా ప్రతిపాదించింది. ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నంబర్–13 రావిర్యాల నుంచి ఆర్‌ఆర్‌ఆర్ లోని ఆమన్‌గల్ ఎగ్జిట్ నంబర్–13 వరకు 300 అడుగుల మేర గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మించనుంది. ఈ మార్గం

మిగతా 12వ పేజీలో ▶

ఫ్యూచర్ సిటీపై ఆచితూచి


ఫార్మాసిటీ భూసేకరణపై కోర్టు కేసుల నేపథ్యంలో ప్రభుత్వం మల్లగుల్లాలు

- ఇప్పటికే ఏఐ సిటీ, స్కిల్స్ వర్సిటీ, స్పోర్ట్స్ హబ్‌లపై ప్రకటనలు
- ఈ నెల 20లోగా ఫార్మాసిటీపై ప్రభుత్వ వైఖరి చెప్పాలన్న హైకోర్టు
- దీంతో 'నాలుగో నగరం'పై స్పీడ్ తగ్గించే యోచనలో ప్రభుత్వం
- కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకెళ్లే యోచన
- ప్రస్తుతానికి గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటుకు కట్టుబడి ఉండేలా ప్రణాళికలు
- ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌లో మార్పులకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ శివారులో నాలుగో నగరంగా ఏర్పాటు చేసే 'ఫ్యూచర్ సిటీ'పై ఆచితూచి అడుగులు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణ సమస్యలు, ఇప్పటికే జరిగిన భూసేకరణపై స్థానిక రైతులు కోర్టును ఆశ్రయించడం తదితరాలు 'ఫ్యూచర్ సిటీ'ఏర్పాటుపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. ఫార్మాసిటీ ఏర్పాటు కోసం సేకరించిన భూములను ఇతర అవసరాలకు మళ్లిస్తే ఎదురయ్యే న్యాయపరమైన అడ్డంకులపై మల్లగుల్లాలు పడుతోంది. మరోవైపు గతంలో ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం తాజాగా కాలుష్యరహిత 'గ్రీన్ ఫార్మాసిటీ'ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. భూములు కోల్పోయిన వారిని భాగస్వాములను చేస్తూ పరిసర గ్రామాలకు ఇబ్బంది లేకుండా ముచ్చర్ల ప్రాంతంలో ఇప్పటికే ఎంపిక చేసిన ప్రదేశాల్లో గ్రీన్ ఫార్మాసిటీని అభివృద్ధి చేయాలని సీఎం రెండు రోజుల క్రితం ఆదేశించారు. ఈ నేపథ్యంలో 'ఫ్యూచర్ సిటీ'మాస్టర్ ప్లాన్‌లో భారీ మార్పులు చోటుచేసుకొనే అవకాశముందని అధికార వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఫార్మాసిటీ ప్రతిపాదన కొనసాగుతున్నదీ లేనిదీ ఈ నెల 20లోగా చెప్పాలని రెవెన్యూ ముఖ్య కార్యదర్శిని

మిగతా 3వ పేజీలో ▶



దాదాపు 16 ఏళ్ల క్రితం భారీ వర్షాల కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లా డోర్నకల్ సమీపంలోని గుండ్రాతిమడుగు వద్ద రైల్వేట్రాక్ కొట్టుకుపోయింది. దాన్ని పునరుద్ధరించేందుకు 3-4 రోజులు పట్టడంతో రైళ్ల దారిమళ్లింపు కష్టంగా మారింది.

ఈ నెల 1న భారీ వర్షాలు, వరదలకు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం-ఇంటికన్నె మధ్య రైల్వేట్రాక్ కొట్టుకుపోవడంతో రెండు రోజులపాటు ఉత్తర, దక్షిణాదిని కలిపే గ్రాండ్ ట్రంక్ రూట్‌లో వందలాది రైళ్లను రద్దు చేయాల్సి వచ్చింది.

ఈ మార్గానికి ప్రత్యామ్నాయమైన బీబీనగర్-గుంటూరు లైన్ డబ్లింగ్ చేయాలని దశాబ్దాలుగా కోరుతున్నా రైల్వేశాఖ పట్టించుకోలేదు. రైల్వే శాఖ అప్పుడే గుణపాఠం నేర్చుకొని డబ్లింగ్ పనులు చేపట్టి ఉంటే ఇటీవల వరదలప్పుడు రైళ్ల రాకపోకలకు సమస్యలు తప్పి ఉండేవి.

రైల్వే నేర్వని గుణపాఠం!

దశాబ్దాలుగా బీబీనగర్-గుంటూరు లైన్ డబ్లింగ్‌ను పట్టించుకోని రైల్వే

- కాజీపేట-విజయవాడ గ్రాండ్ ట్రంక్ రూట్‌కు ప్రత్యామ్నాయమైన ఈ మార్గం అభివృద్ధిపై నిర్లక్ష్యం
- ఇటీవల కేసముద్రం వద్ద ట్రాక్ కొట్టుకుపోయిన రూట్ 'గ్రాండ్ ట్రంక్'లో భాగమే.. ఆ ట్రాక్‌ను పునరుద్ధరించేలోగా బీబీనగర్ మార్గంలోకి మళ్లింపు
- సింగిల్ లైన్ కావడంతో వందల రైళ్లను రద్దు చేసిన అధికారులు.. డబ్లింగ్ పనులే పరిష్కారం

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ఉత్తర-దక్షిణాదిని కలిపే కీలక రైలుమార్గం గ్రాండ్ ట్రంక్ రూట్. కన్యాకుమారి నుంచి కశ్మీర్‌ను జోడించే ప్రధాన లైన్ ఇది. ఎగువ రాష్ట్రాల రైళ్లు బల్లార్షా ద్వారా వచ్చి కాజీపేట-ఖమ్మం-విజయవాడ మీదుగా దక్షిణ భారత్‌లోకి ప్రవేశిస్తాయి. ఒడిశా తదితర తీరప్రాంతాల నుంచి మరో మార్గం మీదుగా విజయవాడ వచ్చి అక్కడి నుంచి దక్షిణాదిలోకి వెళ్లే అవకాశం ఉంది. కానీ దానితో పోలిస్తే కాజీపేట మీదుగా వెళ్లేదే ప్రధాన మార్గం. ఈ మార్గం ద్వారా నిత్యం దాదాపు 400 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. అలాంటి కీలక మార్గంలోనే ఇటీవల అవరోధం ఏర్పడింది. కేసముద్రం మార్గంలో ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాల నుంచి గ్రాండ్ ట్రంక్ రూట్ మీదుగా వెళ్లే కొన్ని రైళ్లను విజయవాడ మీదుగా హౌరా మార్గం నుంచి, మరికొన్నింటిని నిజామాబాద్ మార్గం మీదుగా నాగ్‌పూర్ నుంచి నడిపారు. కానీ ఆ మార్గాలన్నీ కిక్కిరిసి ఉండటం వల్ల మూడు రోజుల వ్యవధిలో 357 రైళ్లను రద్దు చేయాల్సి వచ్చింది. అదే ఒకవేళ ట్రాక్ కొట్టుకుపోయిన ప్రాంతం నుంచి విజయవాడ వైపు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఉండి ఉంటే ఈ అవస్థలన్నీ తప్పేవి.

ఆ మార్గం డబ్లింగ్ అయ్యుంటే..: సికింద్రాబాద్-కాజీపేట మార్గంలో పగిడిపల్లి వద్ద నడికుడి-గుంటూరు లైన్ మొదలవుతుంది. ఇది గుంటూరు మీదుగా విజయవాడకు అనుసంధానమవుతుంది. కాజీపేట-విజయవాడ గ్రాండ్ ట్రంక్ రూట్‌కు స్థానికంగా ఇది ప్రత్యామ్నాయ మార్గమే. ఈ మార్గంలో గుంటూరు-మాచర్ల సెక్షన్ 1930లో ప్రారంభమైంది. బీబీనగర్-నడికుడి మధ్య 1974లో రైళ్ల రాకపోకలు మొదలయ్యాయి. క్రమంగా ఇది కీలకంగా మారింది. కానీ ఆ మార్గంలో రెండో లైన్ నిర్మించాల్సి ఉన్నా రైల్వేశాఖ దృష్టి సారించలేదు. మూడు దశాబ్దాలుగా డబ్లింగ్ కోసం ఒత్తిడి పెరిగినా ఆ ప్రాజెక్టును మంజూరు చేయలేదు. సామర్థ్యానికి మించి 200 శాతంతో అవి నడుస్తున్నాయి. గ్రాండ్ ట్రంక్ రూట్‌కు ప్రత్యామ్నాయమే అయినప్పటికీ భారీ రద్దీతో ఆ మార్గం ఉపయోగపడకుండా పోయింది. కేసముద్రం వద్ద ట్రాక్ కొట్టుకుపోవడంతో నడికుడి మార్గంలో గూడ్సు రైళ్లను ఆపి కొన్ని రైళ్లను మాత్రమే మళ్లించగలిగారు.

ఎట్టకేలకు టెండర్లు..: 248 కి.మీ. ఈ మార్గంలో డబ్లింగ్ పనులు చేపట్టేందుకు గత బడ్జెట్‌లో కేంద్రం తొలిసారి రూ. 200 కోట్లను కేటాయించడంతో ఎట్టకేలకు టెండర్లు పిలిచారు. ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తే భవిష్యత్తులో ఇది గ్రాండ్ ట్రంక్ రూట్‌కు కీలక ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడనుంది.

సేవల రంగం.. సుస్థిర ప్రగతి

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో స్థిరంగా అభివృద్ధి

- భారీగా పెరుగుతున్న తలసరి ఆదాయం
- వ్యవసాయం, పరిశ్రమల రంగాల్లో అభివృద్ధి ఉన్నా అస్థిరత
- ద్రవ్యలోటు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 16వ ఆర్థిక సంఘానికి సర్కారు నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక పురోగతిలో సేవల రంగం కీలకపాత్ర పోషిస్తోందని, కరోనా విపత్తు తర్వాత కోలుకున్న ఈ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తోందని గణాంకాలు చెబుతున్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక, ఉత్పత్తి రంగాల్లో అభివృద్ధి కనిపిస్తున్నప్పటికీ అస్థిరత, మందగమనం కూడా నమోదవుతున్నాయని ఈ గణాంకాలను బట్టి స్పష్టమవుతోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన సమగ్ర నివేదికను ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘం ముందుంచింది. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన సమావేశంలో, ఈ నివేదికలోని అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో ఆర్థిక శాఖ వివరించింది.

- రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో స్థిరంగా అభివృద్ధి కనిపిస్తోంది. జీఎస్‌డీపీ వృద్ధి రేటు జాతీయ సగటు 10.1 శాతం కాగా, తెలంగాణ 12.8% వృద్ధి నమోదు చేసుకుంటోంది. దేశ జనాభాలో తెలంగాణ జనాభా 2.8% కాగా, జీడీపీలో తెలంగాణ వాటా 5.1%.
- రాష్ట్ర తలసరి ఆదాయం దేశ సగటుతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉంది. ఈ వ్యత్యాసం ఏటా భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశ తలసరి ఆదాయం రూ. 1.84 లక్షలు కాగా, తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.57 లక్షలు.
- 2014-15 నుంచి 2022-23 వరకు బడ్జెట్ ప్రతిపాదనలను పరిశీలిస్తే కేవలం 81 శాతం మాత్రమే ఖర్చు నమోదయింది. అంటే రూ.100 బడ్జెట్‌లో ప్రతిపాదిస్తే రూ.81 మాత్రమే ఖర్చు చేయగలిగాం.
- రెవెన్యూ ఆదాయంలో అస్థిరత ఆర్థిక ప్రగతిలో హెచ్చుతగ్గులు, ద్రవ్యలోటుకు దారితీస్తోంది. జీఎస్‌డీపీతో పోలిస్తే దేశంలోని ఇతర రాష్ట్రాల రెవెన్యూ ఆదాయం 14.6 శాతం కాగా, తెలంగాణ ఆదాయం 12.2 శాతం మాత్రమే.
- జీఎస్‌డీపీతో పోలిస్తే ద్రవ్యలోటు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. పంజాబ్ (4.5 శాతం), కేరళ (4.90 శాతం) తర్వాతి స్థానంలో రాష్ట్రం ఉంది.
- జీఎస్‌డీపీతో పోలిస్తే అప్పులు 2014-15లో 18.1 శాతం ఉంటే, 2023-24 నాటికి 27.4 శాతానికి చేరాయి.

ప్రజెంటేషన్‌లో రంగాల వారీగా పేర్కొన్న గణాంకాలివే..

వ్యవసాయ అనుబంధ రంగాలు (ప్రైమరీ సెక్టార్)
సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) ప్రకారం ఈ రంగంలో దేశ సగటు 3.5 శాతంతో పోలిస్తే తెలంగాణ సగటు 5.4 శాతంగా నమోదయింది. ఈ మేరకు ప్రగతి శాతం ఎక్కువగానే ఉన్నా ఈ రంగంలో అస్థిర పురోగతి నమోదవుతోంది. జీఎస్‌డీపీలో ఈ రంగం వాటా పరిశీలిస్తే పశువులు, జీవాలు 7.7 శాతం, మైనింగ్ 7.4 శాతం, మత్స్య పరిశ్రమ 6.4 శాతంగా నమోదయ్యాయి.
పారిశ్రామిక రంగం (సెకండరీ సెక్టార్): ఈ రంగంలో ప్రగతి అస్థిరంగా ఉంది. దేశ సగటు 5.9 శాతంతో పోలిస్తే మందగమనం కనిపిస్తోంది. ఈ రంగంలో తెలంగాణ సగటు కేవలం 5.7శాతం మాత్రమే. జీఎస్‌డీపీలో ఈ రంగం వాటా కింద నిర్మాణ రంగం 7.6 శాతం, తయారీ రంగ పరిశ్రమలు 5.4 శాతం నమోదు చేస్తున్నాయి.
సేవల రంగం (టెరిటరీ సెక్టార్): ఈ రంగంలో మాత్రం అభివృద్ధి సుస్థిరంగా కనిపిస్తోంది. దేశ సగటు 6.5 శాతంగా ఉంటే తెలంగాణ సగటు 8.1 శాతంగా నమోదవుతోంది. జీఎస్‌డీపీలో ఈ రంగం వాటా పరిశీలిస్తే వాణిజ్య సేవలు 12.4 శాతం, స్టోరేజీ 12, వాయు రవాణా 10.9 శాతం, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సేవలు 8.9 శాతంగా నమోదు చేసుకున్నాయి.

రూ.5 వేల కోట్లు ఇప్పించండి

కేంద్ర ప్రభుత్వం నుంచి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.5 వేల కోట్లకు పైగా నిధులను ఇప్పించాలని 16వ ఆర్థిక సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం (2014)లోని సెక్షన్ 94(2) ప్రకారం రూ.1,800 కోట్లు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రూ.1,188.88 కోట్లు, ఏపీ నుంచి రావాల్సిన రూ.408.49 కోట్లు, 2014-15 సంవత్సరంలో లెవీ కింద ఎక్కువగా తీసుకున్న రూ.1,468 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరంలోని మూడు, నాలుగు త్రైమాసికాలకు గాను జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఇవ్వాల్సిన రూ.323.73 కోట్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది.

సెస్‌లు, సర్‌చార్జీల్లో రాష్ట్రాలకు వాటా కుదరదు



- 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియా స్పష్టీకరణ
- రాష్ట్రాలకు వాటిల్లో వాటా కావాలంటే రాజ్యాంగ సవరణ జరగాలి
- పనితీరు బాగా ఉన్న రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటా పంపిణీలో అన్యాయం జరగడం లేదు
- రుణాల రీస్ట్రక్చరింగ్ అంశం మా పరిధిలోకి రాదు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర పన్నుల వాటా పంపిణీలో పనితీరు బాగా ఉన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందనే ఆరోపణలను 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియా తోసిపుచ్చారు. పంపిణీ చేయదగిన కేంద్ర నిధుల నుంచి రాష్ట్రాలకు 41 శాతాన్ని పంపిణీ చేయాలని 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిందని, చట్టరీత్యా తప్పనిసరిగా కేంద్రం పంపిణీ చేయాల్సిందేనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నికర పన్నుల ఆదాయంలో సెస్‌లు, సర్‌చార్జీలు సైతం కలిసి ఉంటాయని, వీటిని రాష్ట్రాలకు పంపిణీ చేయడం కుదరదన్నారు. సెస్‌లు, సర్‌చార్జీలను సైతం లెక్కించి కేంద్రం రాష్ట్రాలకు 31 లేదా 32 శాతం నిధులు మాత్రమే ఇస్తోందని రాష్ట్రాలు అంటున్నాయని తెలిపారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా మంగళవారం ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం వసూలు చేసే సెస్‌లు, సర్‌చార్జీల్లో సైతం రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని సిఫారసు చేస్తారా? అని జర్నలిస్టులు ప్రశ్నించగా, ఈ అంశం ఆర్థిక సంఘం పరిధిలోకి రాదంటూనే.. సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేసి 100 శాతం తీసుకునే అధికారం కేంద్రానికి రాజ్యాంగం కల్పించిందని చెప్పారు. ఆ విధంగా రాష్ట్రాలకు వాటా ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందన్నారు.

తెలంగాణ పట్టణాభివృద్ధి ప్రణాళికలు భేష్
దేశంలో గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తుండడంతో పట్టణాభివృద్ధి నిర్లక్ష్యానికి గురవుతోందని, తెలంగాణ ఈ విషయంలో చాలా ముందుచూపుతో వెళ్తోందని అరవింద్ పనగరియా ప్రశంసించారు. పట్టణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేసిన ప్రణాళికలు ఒక ఆర్థికవేత్తగా తనను ఆకట్టుకున్నాయన్నారు. ఆర్థిక ప్రణాళికల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చాలా స్పష్టతతో ఉందని, ప్రభుత్వం వివరించిన రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు తమను బాగా ఆకట్టుకున్నాయని చెప్పారు. రాష్ట్రానికి భారంగా మారిన రుణాల రీస్ట్రక్చరింగ్ అంశం తమ పరిధిలోకి రాదని వివరించారు.

జీఎస్డీపీ ఆధారంగా నిధుల పంపిణీని రాష్ట్రం కోరింది
ఏ ప్రాతిపదికన కేంద్రం, రాష్ట్రాల మధ్య నిధుల పంపకాలు జరగాలి? ఏ ప్రాతిపదికన రాష్ట్రాల మధ్య నిధుల పంపకాలు జరగాలి? అనే అంశంపై రాష్ట్రం సూచనలు చేసిందని పనగరియా చెప్పారు. జీడీపీకి ఒక్కో రాష్ట్రం అందిస్తున్న చేయూత, ఆయా రాష్ట్రాల స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ)ని ప్రామాణికంగా తీసుకుని 28 రాష్ట్రాల మధ్య సమానంగా (హారిజాంటల్‌గా) నిధుల పంపిణీ విషయంలో నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిందని వెల్లడించారు. ఇప్పటివరకు తాము 6 రాష్ట్రాల్లో పర్యటించగా, కర్ణాటక, తెలంగాణ ఈ తరహా డిమాండ్ చేశాయని తెలిపారు. రాష్ట్రం చేసిన విజ్ఞప్తులను పరిశీలిస్తామని చెప్పారు. తాము ఇంకా 20కి పైగా రాష్ట్రాల్లో పర్యటించాల్సి ఉందని తెలిపారు.

ఏం సిఫారసులు చేస్తామో ఇప్పుడే చెప్పలేం

2026-27 నుంచి 2030-31 మధ్య ఐదేళ్ల కాలంలో కేంద్ర పన్నుల ఆదాయం.. కేంద్రం, రాష్ట్రాల మధ్య పంపిణీ, రాష్ట్రాల వాటా నిధులు మళ్లీ రాష్ట్రాల మధ్య పంపిణీ, కేంద్ర సంఘటిత నిధి నుంచి పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధుల పంపిణీ, విపత్తుల నిర్వహణకు నిధుల పంపిణీ విషయంలో కేంద్రానికి 16వ ఆర్థిక సంఘం సిఫారసులు చేయనుందని పనగరియా వివరించారు. అయితే ఎలాంటి సిఫారసులు చేస్తామో ఇప్పుడే వెల్లడించలేమన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసులనే కేంద్రం సరిగ్గా అమలు చేయడం లేదని విమర్శలున్న నేపథ్యంలో, 16వ ఆర్థిక సంఘం సిఫారసులకు ఏం విలువ ఉంటుందని జర్నలిస్టులు ప్రశ్నించగా.. కేంద్రం, రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీ, స్థానిక సంస్థలు, విపత్తుల నివారణకు నిధుల పంపిణీ విషయంలో తమ సిఫారసులను కేంద్రం తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇతర సిఫారసుల అమలు కేంద్రంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. 16వ ఆర్థిక సంఘం సభ్యులు అజయ్ నారాయణ్ ఝా, జార్జి మాథివ్, మనోజ్ పాండ, సౌమ్య కంటి ఘోష్ సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్రానికి సవాలుగా రుణ భారం

16వ ఆర్థిక సంఘంతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

- గత ఆర్థిక సంవత్సరంలో రూ.6.85 లక్షల కోట్లకు చేరిన అప్పులు
- రాష్ట్ర ఆదాయంలో అధిక భాగం అప్పులు, వడ్డీల చెల్లింపులకే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి సవాలుగా మారిన భారీ రుణాలను రీస్ట్రక్చర్ చేసేందుకు అవకాశం కల్పించాలని, లేనిపక్షంలో రాష్ట్రానికి అదనపు ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి 16వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.6.85 లక్షల కోట్లకు చేరిన రుణ భారం రాష్ట్రానికి సవాలుగా మారిందని చెప్పారు. మంగళవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగరియా, ఇతర సభ్యుల బృందంతో సీఎం సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ప్రాథమ్యాలు, అభివృద్ధి ప్రణాళికలు, నిధుల అవసరాలను బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ రాష్ట్రం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. గత పదేళ్లలో ప్రభుత్వం (గత) భారీగా అప్పులు చేసిందని, రాష్ట్ర ఆదాయంలో అధిక భాగం రుణాలు, వడ్డీ చెల్లించేందుకే వెచ్చించాల్సిన పరిస్థితిని తీసు కొచ్చిందని అన్నారు. రుణాలు, వడ్డీలను సక్రమంగా చెల్లించని పక్షంలో రాష్ట్ర పురోగతిపై భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రుణాల సమస్యను పరిష్కరించేందుకు సహాయం చేయాలని కోరారు.

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచండి

దేశంలోనే తెలంగాణ చిన్న రాష్ట్రమని, రాష్ట్రాన్ని ది ఫ్యూచర్ స్టేట్‌గా పిలుస్తున్నామని రేవంత్‌రెడ్డి ఆర్థిక సంఘానికి తెలిపారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని, రాష్ట్రాని కి తగిన సహాయం అందించాలని కోరారు. రాష్ట్రం దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందని చెప్పారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను నెరవేర్చితే దేశా న్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్య సాధనకు తాము సంపూర్ణంగా సహకరిస్తామని చెప్పారు. దేశాన్ని ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో తమ వంతు బాధ్యతను నెరవేరుస్తామన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్ రావు, సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మళ్లించాల్సి వస్తోంది: డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణ తీవ్ర సంధికాలంలో ఉందని, రూ.6.85 లక్షల కోట్లకు పైగా అప్పులకు అసలు, వడ్డీలు చెల్లించేందుకు గాను అభివృద్ధి పనులకు కేటాయించాల్సిన నిధులు మళ్లించాల్సి వస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 16వ ఆర్థిక సంఘానికి తెలిపారు. ప్రభుత్వానికి ఉన్న రుణాలను రీస్ట్రక్చర్ చేసేందుకు సాయమందించాలని కోరారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ డిమాండ్లు, సూచనలను ఆయన ఆర్థిక సంఘం ముందుంచారు. కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) కోసం ఇచ్చే గ్రాంట్లను మూసపద్ధతిలో కాకుండా, ఆంక్షలు, కోతలు లేకుండా ఇవ్వాలని కోరారు. తెలంగాణలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో సంపదను సృష్టించే రంగాలు కొద్ది మంది చేతుల్లోనే ఉండిపోయాయని చెప్పారు. ఆర్థిక సంఘంతో భేటీ తర్వాత ప్రజాభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సామాజిక అసమానతలు, భౌగోళిక పరిస్థితులను ఆర్థిక సంఘానికి వివరించినట్టు భట్టి తెలిపారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

రూ.10 వేల కోట్లు అడిగాం
రైతు భరోసా, రుణమాఫీ లాంటి కార్యక్రమా లకు ఆర్థిక సాయం చేయాలని ఆర్థిక సంఘాన్ని కోరామని, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.10 వేల కోట్లు ఇవ్వాల్సిందిగా అడిగామని చెప్పారు. స్కిల్స్ వర్సిటీ, ఐటీఐల అప్‌గ్రెడేషన్, మూసీ ప్రక్షాళన, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏర్పాటు, స్పోర్ట్స్ వర్సిటీ లాంటి కార్యక్రమాల కోసం కూడా ఆర్థిక సాయం చేయాలని, రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల అభివృద్ధికి చేయూతనందించాలని కోరినట్లు తెలిపారు. ఆర్థిక సంఘం సభ్యులు సానుకూలంగా స్పందించారని, తెలంగాణ ప్రభుత్వం తరపున ఇచ్చిన ప్రజెంటేషన్ల విషయంలో వారు సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. రుణాల రీస్ట్రక్చర్ అంశం తమ పరిధిలోకి రాదని ఆర్థిక సంఘం సభ్యులు అంటున్నారు కదా అని ప్రశ్నించగా, తమ అభిప్రాయాన్ని తెలియజేశామని, ప్రధాని, ఆర్థిక మంత్రికి కూడా ఇప్పటికే విన్నవించామని తెలిపారు. ఆర్థిక సంఘం కూడా ఈ విషయంలో తమకు సాయం చేయాలని కోరామని, అవకాశమున్న ప్రతి చోటా తమ విజ్ఞప్తిని తెలియజేస్తామని భట్టి చెప్పారు. విలేకరుల సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఉన్నతాధికారులు సందీప్‌కుమార్ సుల్తానియా, కృష్ణభాస్కర్, హరిత పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల లెక్క తేల్చండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ తుర్కయంజాల్‌లోని సర్వే నంబర్ 383లోని ప్రభుత్వ భూముల లెక్క తేల్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. భూములను రెండు నెలల్లో గుర్తించడంతోపాటు అవి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. భర్త గిఫ్ట్‌గా ఇచ్చిన ప్లాటు రిజిస్ట్రేషన్‌ను వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ శైలజ అనే మహిళ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. నిషేధిత జాబితా నుంచి కొన్ని భూములను తొలగించాలని 2017లో జిల్లా రిజిస్ట్రార్ లేఖ రాసినా ఇప్పటివరకు కలెక్టర్ ఎలాంటి చర్యలు చేపట్టలేదని సబ్ రిజిస్ట్రార్ చెప్పారు. సర్వే నంబర్ 383లో 259 ఎకరాల సర్కార్ భూమి ఉందని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 2 నెలల్లో ఆ ప్రక్రియ పూర్తి చేయాలని చెబుతూ, చట్టప్రకారం పిటిషనర్ ప్లాట్ రిజిస్ట్రేషన్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సాయం చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

సాయం అందేలా సిఫారసులు చేయండి..' అని రాష్ట్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆర్థిక సంఘం సభ్యులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఐదు కీలక విజ్ఞప్తులను 16వ ఆర్థిక సంఘం ముందుంచారు.

ఐదు కీలక విజ్ఞప్తులు

- కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) అమలు కోసం ఇచ్చే గ్రాంట్లను వినియోగించుకునే విషయంలో రాష్ట్రాలకు స్వతంత్రత ఇవ్వాలని, స్థానిక అవసరాలకు అనుగుణంగా రూపొందించుకునే పథకాల కోసం ఈ నిధులను వినియోగించుకునే వెసులుబాటు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.
- రాష్ట్ర ప్రభుత్వ అప్పులను రీస్ట్రక్చర్ చేయాలని విజ్ఞప్తి చేసింది. ఆర్ఈసీ (రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్), పీఎఫ్‌సీ (పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్)ల ద్వారా తీసుకున్న వాటికి, ఇతర రుణాలకు 10 నుంచి 12 శాతం వరకు వడ్డీలు కట్టాల్సి వస్తోందని తెలిపింది. ఈ వడ్డీల భారం కారణంగా అభివృద్ధికి నిధులు వెచ్చించే పరిస్థితి లేదని, తక్కువ వడ్డీకి రుణాలిప్పిస్తే ప్రస్తుతము న్న రుణాలను చెల్లించి భారం తగ్గించుకుంటా మని విజ్ఞప్తి చేసింది. లేదంటే అభివృద్ధి వనరులను పెంపొందించుకునేలా అదనపు సాయాన్ని కేంద్రం నుంచి ఇప్పించాలని కోరింది.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని కోరింది.
- కేంద్ర పన్నుల్లో వాటాకు తలసరి ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం ద్వారా తెలంగాణ లాంటి రాష్ట్రానికి నష్టం కలుగుతోందని, జీఎస్‌డీపీ ప్రాతిపదికన ఈ వాటాను నిర్ధారించాలని కోరింది.
- కేంద్ర ప్రభుత్వం వసూలు చేసుకుంటున్న సెస్‌లు, సర్‌చార్జీల్లో వాటా ఇవ్వకపోవడంతో రాష్ట్రాల పన్ను ఆదాయం తగ్గిపోతోందని తెలిపింది. కేంద్ర పన్నుల్లో వాటా పెంపు ద్వారా రాష్ట్రాల్లో సంక్షేమ కార్యక్రమాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన, పథకాలు సమగ్రంగా అమలు చేయడంలో రాష్ట్రాల అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుతాయని సూచించింది. ఈ ప్రతిపాదన దేశంలోని అన్ని రాష్ట్రాలకు లబ్ధి కలిగిస్తుందని, సమాఖ్య స్ఫూర్తికి ఊతమిస్తుందని అభిప్రాయపడింది.

సంక్షేమ పథకాలు అనివార్యం

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రజెంటేషన్‌లోని మరికొన్ని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

- తలసరి ఆదాయంలో తెలంగాణ ముందంజలో ఉంది. కానీ సంపద సృష్టి, ఆదాయ పంపిణీ విషయంలో ప్రాంతాల వారీగా భారీ వైరుధ్యా లున్నాయి. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత కూడా ఈ వ్యత్యాసాన్ని తగ్గించే క్రమంలో వెనుకబడ్డాం. కేంద్ర పన్నుల్లో వాటా నిర్ణయించేందుకు తలసరి ఆదాయాన్ని కాకుండా జీఎస్‌డీపీలో 50 శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.
- ఉచితాలుగా పరిగణించే కొన్ని సంక్షేమ పథకాలు అనివార్యంగా అమలు చేయాల్సి ఉంది. రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఆహార సబ్సిడీలు ఆర్థిక స్థిరత్వాన్ని కలిగించడంతో పాటు వెనుకబడిన వర్గాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తాయి. ఈ నేపథ్యంలో సదరు సంక్షేమ పథకాలను పెట్టుబడిగా పరిగణించాలి.
- కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులకు అంచనాల పెంపు, ప్రాజెక్టుల నిర్వహణ భారంగా మారుతున్నాయి.
- మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల కోసం ఆఫ్ బడ్జెట్ అప్పులకు వెళ్లాల్సి వస్తోంది.
- హైదరాబాద్ లాంటి నగర ప్రాంతాల్లో అభివృద్ధి ఎక్కువగా ఉంటోంది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉంటోంది.

పోస్టు గ్రాడ్యుయేట్ మహిళల్లో 100% నిరుద్యోగం

- గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువత, మహిళల్లో నిరుద్యోగం ఎక్కువగా కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పోస్టు గ్రాడ్యుయేట్ మహిళల్లో 100 శాతం నిరుద్యోగం ఉంది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కంటే ఇక్కడ నిరుద్యోగం ఎక్కువ ఉంది.
- ఆరోగ్య, పౌష్టికాహార అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మహిళలు, చిన్నారుల్లో ఎనీమియా (రక్తహీనత) పెరుగుతోంది. బరువు తక్కువ ఉండే చిన్నారులు, పౌష్టికాహార లోపం లాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి.
- ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలో రాష్ట్ర అవసరాలు తీరేలా 16వ ఆర్థిక సంఘం సిఫారసులు ఉండాలని కోరుతున్నాం.

రూ.70 వేల కోట్ల గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇప్పించండి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి రూ.13 వేల కోట్లను గ్రాంటు రూపంలో కేంద్రం నుంచి ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘాన్ని కోరింది. మిషన్ భగీరథకు రూ.12 వేల కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.7 వేల కోట్లు, తాగునీటి సరఫరా వ్యవస్థకు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.2 వేల కోట్లు గ్రాంట్ గా ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. వీటితో పాటు ఇతర ప్రాజెక్టులకు అవసరమైన మరో రూ.36 వేల కోట్లు కలిపి మొత్తం రూ.70 వేల కోట్లను ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద తెలంగాణకు ఇచ్చేలా సిఫారసు చేయాలని కోరింది.

ఇంజనీరింగ్ కాలేజీల్లో పెరిగిన సీట్లు ఎవరికి దక్కుతాయి? కౌన్సెలింగ్ ఎలా నిర్వహిస్తారు? అనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు. మొదట్లో డిమాండ్ లేని కోర్సులు రద్దు చేసుకున్న ప్రైవేట్ కాలేజీలకు కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లలో సీట్లు పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించలేదు. దీనిపై కాలేజీ యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించడం, తాజాగా సీట్ల పెంపునకు అనుకూలంగా కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం తెలిసిందే. మాప్‌అప్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పించాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో పెరిగిన సీట్లపై విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు.

- సాక్షి, హైదరాబాద్

సీట్లు రానివారికా... అందరికా

రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటాకింద 86 వేల ఇంజనీరింగ్ సీట్లు ఉండగా, ఇందులో ఈ ఏడాది 79 వేల సీట్లు భర్తీ అయ్యాయి. మూడు దశలతోపాటు, ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. అంతిమంగా స్పాట్ అడ్మిషన్లు కూడా పూర్తయ్యాయి. సీట్లు వచ్చిన విద్యార్థులు సంబంధిత కాలేజీల్లోనూ రిపోర్టు చేసి, సర్టిఫికెట్లు కూడా ఇచ్చారు. సీట్లు రానివారు ఇతర రాష్ట్రాల్లోని కాలేజీల్లో, దోస్త్ ద్వారా డిగ్రీలోనూ చేరారు. ఈ దశలో కౌన్సెలింగ్ నిర్వహించడం కష్టమని అధికారులు భావిస్తున్నారు. కేవలం మిగిలిపోయిన విద్యార్థులకు మాత్రమే కౌన్సెలింగ్ చేపట్టాలా? మొత్తం అభ్యర్థులకూ ఆప్షన్లు ఇచ్చే అవకాశం ఇవ్వాలా? అనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. ఎక్కడా సీటు రాని వారు మాత్రమే ప్రస్తుతం మిగిలిపోయారు. వీరి కన్నా ఎక్కువ ర్యాంకు వచ్చిన వారు కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌కు ప్రయత్నించినా, ఆఖరుకు సివిల్, మెకానికల్, ఈఈఈలో చేరారు. ఇప్పుడు 3 వేల సీట్లు పెరిగితే, అందులో 2,100 కన్వీనర్ కోటా కింద ఉంటాయి. కేవలం సీట్లు రాని వారికే వీటిని కేటాయిస్తే, అంతకన్నా ఎక్కువ ర్యాంకు వచ్చిన వారికి అన్యాయం జరుగుతుందని అధికారులు అంటున్నారు.

కౌన్సెలింగ్ ఎలా ?

పెరిగిన ఇంజనీరింగ్ సీట్లపై అస్పష్టత

- ప్రభుత్వ ఆదేశాల్లేవంటున్న అధికారులు..
- కోర్టుకెళ్లే అవకాశాలపై ఉన్నత స్థాయి చర్చ
- కోర్టు తీర్పుతో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌పై అయోమయం



యూటర్న్ కష్టమే

ఇప్పటికే 79 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరారు. పెరిగిన సీట్లకు వీరు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇస్తే కౌన్సెలింగ్ ప్రక్రియ మళ్లీ మొదటికొస్తుంది. వివిధ కాలేజీల్లో పలు గ్రూపుల్లో చేరిన వారు కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరేందుకు ప్రయత్నిస్తారు. దీనివల్ల ఇప్పటికే చేరిన కాలేజీల్లో మళ్లీ సీట్లు ఖాళీ అవుతాయి. వీటికి మరో దఫా కౌన్సెలింగ్ చేపట్టాలి. మొత్తం మీద కౌన్సెలింగ్ ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి చేపట్టడమే అవుతుందని సాంకేతిక విద్య విభాగం చెబుతోంది. ఇదే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే, ప్రైవేట్ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీ పూర్తయింది. ఉన్నత విద్యామండలి ర్యాటిఫికేషన్ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. కోర్టు తీర్పు ద్వారా పెరిగిన సీట్లకు కౌన్సెలింగ్ చేపడితే ర్యాటిఫికేషన్ ప్రక్రియ వాయిదా వేయాల్సి ఉంటుంది. పరిస్థితి అంతా గందరగోళంగానే ఉందని సాంకేతిక విద్యకు చెందిన ఓ ఉన్నతాధికారి అన్నారు. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలని అధికారులు, విద్యార్థులు కోరుతున్నారు.

నేటి నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సాక్షి, హైదరాబాద్: ఈనెల 17న గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ 21న రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. మంగళవారం మఖ్దూంభవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. 11 నుంచి 17 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించాలని తెలిపారు. 11న ట్యాంక్‌బండ్‌పై ఉన్న మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాలని, రావి నారాయణరెడ్డి అమరవీరుల ట్రస్టు భవన్‌లో సభ నిర్వహించాలన్నారు. వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 12న ఆందోళనలు చేయాలని సాంబశివరావు పిలుపునిచ్చారు. కాగా, తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారోత్సవాల పోస్టర్‌ను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు విడుదల చేశారు.

ఇంటర్ ప్రవేశాల గడువు 15 వరకు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరేందుకు గడువును పొడిగించారు. ఈ నెల 15 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కాలేజీల్లో విద్యార్థులను చేర్చుకోవాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శ్రుతి ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.

హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే ఆ 25 చెరువులను కాపాడాలి

బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: హైడ్రా పేరుతో సామాన్యులను ఇబ్బంది పెట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ హైడ్రాకు, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నాలాలు, చెరువులను కబ్జాల చెర నుంచి విడిపించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలపై హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని పాయల్ శంకర్ చెప్పారు.

సుప్రీం మార్గదర్శకాలు పాటించాల్సిందే..



'సాగర్'లో పీవోపీ విగ్రహాల నిమజ్జనం వద్దు

- అధికారులకు మరోసారి తేల్చిచెప్పిన హైకోర్టు
- నిమజ్జనాల వేళ ధిక్కరణ పిటిషన్‌పై ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: హుస్సేన్‌సాగర్‌లో గణేశ్ నిమజ్జనాలు చేయొద్దంటూ సుప్రీంకోర్టు 2021లో ఇచ్చిన మార్గదర్శకాలను విధిగా పాటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చిచెప్పింది. మట్టి, ఎకో ఫ్రెండ్లీ విగ్రహాలనే నిమజ్జనం చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్లాస్టర్ ఆఫ్‌పారిస్ (పీవోపీ) విగ్రహాలను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసే కృత్రిమ నీటికుంటల్లోనే నిమజ్జనం చేయాలని ఆదేశించింది. న్యాయవాది వేణుమాధవ్ వేసిన ధిక్కరణ పిటిషన్‌పై జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం మధ్యాహ్నం విచారణ చేపట్టింది. అధికారులు కోర్టు ధిక్కరణకు పాల్పడుతూ పీవోపీ విగ్రహాల నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్‌పై భారీ క్రేన్లు నిలుపుతున్నారని న్యాయవాది వేణుమాధవ్ అభ్యంతరం తెలిపారు. భారీ క్రేన్ల వల్ల ట్యాంక్‌బండ్‌కు ముప్పు ఉందన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదిస్తూ 'కోర్టు ధిక్కరణ చట్ట ప్రకారం ఒక వ్యక్తిని ప్రాసిక్యూట్ చేయడానికి గడువు ఒక సంవత్సరం. కానీ పిటిషనర్ 2021 నాటి సుప్రీం మార్గదర్శకాలను ప్రస్తావిస్తున్నారు కనుక పిటిషన్ అక్కడే వేయాలి. ఇక్కడ వేసిన పిటిషన్‌ను అనుమతించొద్దు'అని కోరారు.

ఇన్నాళ్లూ ఏం చేశారు?

న్యాయవాది వేణుమాధవ్ వాదనలపై హైకోర్టు ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. '2021లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇస్తే రెండేళ్లుగా ధిక్కరణ పిటిషన్ ఎందుకు వేయలేదు? అధికారులు ఒకవేళ రెండేళ్లు మార్గదర్శకాలు పాటించి ఉంటే ఇప్పుడు పాటించరని ముందే ఎలా చెబుతారు? అయినా ఈ ఏడాది వినాయక చవితి ఎప్పుడో ముందే తెలిసినా ఇన్ని నెలలు పిటిషన్ వేయకుండా నిమజ్జనాల వేళ పిటిషన్ వేయడంలో మీ ఉద్దేశం ఏమిటి? పీవోపీ విగ్రహాల నిమజ్జనం చేస్తే ఫొటోలతో నివేదిక అందజేయాలని 2023లో హైకోర్టు ఆదేశించినా ఆ పని చేయలేదు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు ఇచ్చే నాటికి హైడ్రా మనుగడలో లేదు. అలాంటప్పుడు హైడ్రాను ప్రతివాదిగా ఎలా చేరుస్తారు? ప్రస్తుతానికి కేసు మెరిట్‌లోకి వెళ్లడం లేదు. పిటిషన్‌ను అనుమతించడంపైనే విచారణ చేస్తున్నాం. ఆలస్యంపట్ల మీరు విచారం వ్యక్తం చేసినా అనుమతించలేం. చివరి నిమిషంలో ప్రభుత్వం ఎస్‌ఎల్‌పీ దాఖలు చేయడాన్ని సుప్రీంకోర్టు కూడా 2021లో తప్పుబట్టింది కదా. అదే ఉత్తర్వులు అందరికీ వర్తిసాయి. పీవోపీ విగ్రహాల నిమజ్జనం, కాలుష్య ఆరోపణలను రుజువు చేసేందుకు ఆధారాలు, గణాంకాలను వెల్లడించలేదు. అయితే జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారులు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను విధిగా పాటించాల్సిందే'అని ధర్మాసనం తేల్చిచెప్పింది. ధిక్కరణ పిటిషన్‌లో విచారణ ముగించింది. కాగా, పీవోపీ విగ్రహాల తయారీపై నిషేధం విధిస్తూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌లో పీసీబీ తీరుపై ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే అవి చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలిగానీ రహదారినే తీసేస్తామన్నట్లు అధికారుల చర్యలు ఉన్నాయని వ్యాఖ్యానించింది.

'జోయెటిస్' కేంద్రం ప్రారంభం

- 2025 నాటికి పశువైద్య నిపుణులకు ఉద్యోగాలు
- మా ఆహ్వానం మేరకు తక్కువ సమయంలో ఏర్పాటు: దుద్దిళ్ల



జోయెటిస్ గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: పశువైద్య రంగంలో దిగ్గజ సంస్థ 'జోయెటిస్'ఏర్పాటు చేసిన గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని (జీసీసీ) ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. రాయదుర్గంలో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా వాణిజ్య కార్యకలాపాలు, డేటా మేనేజ్‌మెంట్, పరిశోధన, అభివృద్ధి తదితర కార్యకలాపాలను జోయెటిస్ చేపడుతుంది. పశువులు, పెంపుడు జంతువుల ఔషధాలు, పోషకాల ఉత్పత్తిలో ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. జోయెటిస్ ద్వారా హైదరాబాద్ కేంద్రంగా 2025 చివరి నాటికి వందలాది మంది సాఫ్ట్‌వేర్, పశువైద్య నిపుణులకు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. జీసీసీ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వెటర్నరీ వైద్యులు, పెంపుడు జంతువుల యజమానులు, పశువులు, జీవాల పెంపకందారులకు ఔషధాల సరఫరా, ఆరోగ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు సూచనలు అందించే అవకాశం ఏర్పడుతుంది. ఇటీవలి అమెరికా పర్యటనలో తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోయెటిస్ యాజమాన్యంతో చర్చలు జరిపిన విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా ప్రస్తావించారు. తమ ఆహ్వానం మేరకు అతి తక్కువ సమయంలో జోయెటిస్ సామర్థ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. జోయెటిస్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సార్బ్రాగ్, జోయెటిస్ ఇండియా సామర్థ్య కేంద్రం వైస్ ప్రెసిడెంట్ అనిల్ రాఘవ్, టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్, ఫార్మా డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం: అభివృద్ధి చెందుతున్న భారత్‌లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన అమెరికా కాన్సులేట్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీ ఎగుమతుల్లో హైదరాబాద్ దేశంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. తగినంతమంది సాంకేతిక నిపుణులు అందుబాటులో ఉండటం వల్లనే ఇది సాధ్యమైందన్నారు.

ఫ్యూచర్ సిటీపై ఆచితూచి

▶ మొదటి పేజీ తరువాయి

హైకోర్టు ఆదేశించింది. దీంతో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో 'ఫ్యూచర్ సిటీ'ఏర్పాటుకు సంబంధించి స్పీడ్ తగ్గించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. హైకోర్టు నిర్ణయాలకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీపై ముందుకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది.

మాస్టర్ ప్లాన్ మరింత ఆలస్యం

న్యూయార్క్ కంటే ఆధునికంగా రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో 'ఫ్యూచర్ సిటీ'ని నాలుగో నగరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాలుష్యంలేని 'నెట్ జీరో కార్బన్ సిటీ'గా తీర్చిదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించింది. ముచ్చర్లలో గత ప్రభుత్వం ప్రతిపాదించిన 'హైదరాబాద్ ఫార్మాసిటీ'స్థానంలో 'ఫ్యూచర్ సిటీ' ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. ఫ్యూచర్ సిటీని 8 జోన్లుగా విభజించి ఏఐ, లైఫ్‌సైన్సెస్, ఆరోగ్యం, క్రీడలు, ఎలక్ట్రానిక్స్ తయారీ, విద్యాసంస్థలు, వినోద కేంద్రాలు, జనావాసాలు ఏర్పాటు చేసేలా మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో 'హైదరాబాద్ ఫార్మా సిటీ' మాస్టర్ ప్లాన్ రూపొందించిన సింగపూర్ సంస్థ సుర్బానా జురోంగ్‌కు ఫ్యూచర్ సిటీ మాస్టర్‌ప్లాన్ తయారు చేసే బాధ్యత అప్పగించింది. అయితే ఫ్యూచర్ సిటీ ఏర్పాటుపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్న నేపథ్యంలో మాస్టర్ ప్లాన్ రూపకల్పన ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ఫార్మాసిటీ స్థానంలో ఫార్మా క్లస్టర్లు

ఔషధ ఉత్పత్తి రంగంలో హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల ప్రాంతంలో 19,333 ఎకరాల్లో 'హైదరాబాద్ ఫార్మా సిటీ'ఏర్పాటు చేస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. సుమారు 13 వేల ఎకరాలకుపైగా భూమిని కూడా సేకరించింది. 2019లో హైదరాబాద్ ఫార్మాసిటీకి కేంద్ర ప్రభుత్వం 'నిమ్జ్'హోదాను ప్రకటించింది. ఫార్మాసిటీ ఏర్పాటుకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్ కూడా గత ప్రభుత్వం సిద్ధం చేసింది. అయితే నిధుల లేమితో ఈ ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదు.

ప్రభుత్వ మార్పుతో..

గతేడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. పర్యావరణ సమస్యలు, రైతుల అభ్యంతరాలు, భూసేకరణ వివాదాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దాని బదులు వెయ్యి నుంచి రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో పదిచోట్ల ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూముల్లో 'ఫ్యూచర్ సిటీ'నిర్మిస్తామని తెలిపింది. ఫ్యూచర్ సిటీలో భాగంగా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఆగస్టు 1న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి సీఎం శంకుస్థాపన చేశారు. దీంతోపాటు ఏఐ సిటీ, బీసీసీఐ సహకారంతో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వంటి వాటిపై ప్రకటనలు కూడా చేశారు. ప్రస్తుతం ముచ్చర్ల గ్రీన్ ఫార్మాసిటీ పనులు వేగవంతం చేయాలనే ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ విషయంలో ప్రభుత్వం అనుసరించబోయే వైఖరిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

'హైడ్రా'కు బలగం

- తొలి విడతలో 23 మంది కేటాయింపు
- వీరిలో 15 మంది ఇన్‌స్పెక్టర్ స్థాయి వారు



మహేశ్ భగవత్

సాక్షి, హైదరాబాద్: హైడ్రాకు సిబ్బందిని నియమించే ప్రక్రియలో భాగంగా తొలి విడతగా 23 మందిని అటాచ్‌మెంట్ విధానంలో కేటాయిస్తూ అదనపు డీజీ (శాంతిభద్రతలు) మహేశ్ భగవత్ ఉత్తర్వులు జారీ చేశారు. జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రాలో 3,500 మంది సిబ్బంది, అధికారులు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ నుంచి దాదాపు 3 వేల మందితో ఉన్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) ఈ విభాగంలో విలీనమైంది. మిగిలిన దాదాపు 259 మంది సిబ్బందిని పోలీసు, ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ తదితర విభాగాల నుంచి తీసుకోనున్నారు. పోలీసు విభాగం నుంచి వచ్చే అధికారులు హైడ్రాలో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. హైడ్రాకు హైప్ వచ్చిన నేపథ్యంలో గడిచిన కొన్ని రోజులుగా పలువురు అధికారులు, సిబ్బంది ఈ విభాగంలోకి రావడానికి ఆసక్తి చూపుతూ కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు లేఖలు ఇచ్చి వెళ్లారు. అయితే సిబ్బంది, అధికారుల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరించాలని నిర్ణయించిన రంగనాథ్..ఆసక్తి చూపిన వారితోపాటు సమర్థులుగా భావించిన వారి వివరాలతో ఓ జాబితాను రూపొందించారు. దీనిని రాష్ట్ర నిఘా విభాగంతోపాటు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు పంపి అన్ని కోణాల్లోనూ విచారణ చేయించారు. ఇలా వడకట్టిన వారి పేర్లతో జాబితా రూపొందించిన రంగనాథ్ వీరిని తమకు కేటాయించాలని కోరుతూ డీజీపీకి లేఖ రాశారు. ఆయన ఆదేశాల మేరకు తొలివిడతగా 23 మందిని కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరిలో 13 మంది ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు రిజర్వ్ ఎస్సైలు, ముగ్గురు శాంతిభద్రతల విభాగం ఎస్సైలు ఉన్నారు. ఈ అధికారులు ప్రధానంగా నిఘా, దర్యాప్తు, విచారణ బాధ్యతలు చేపడతారు. హైడ్రాపై ఆర్డినెన్స్ జారీ తర్వాత ఏర్పడబోయే ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌లోనూ వీరిలో కొందరు విధులు నిర్వర్తించనున్నారు.

కరీంనగర్-హసన్‌పర్తి కొత్త లైన్‌కు అనుమతి ఇవ్వండి

- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బండి సంజయ్ వినతి



అశ్వినీవైష్ణవ్‌తో బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: కరీంనగర్ – హసన్‌పర్తి కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టు పూర్తి నివేదిక (డీపీఆర్) సిద్ధమైనందున నిర్మాణ పనులకు అనుమతి ఇవ్వాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఢిల్లీలో మంగళవారం అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన బండి సంజయ్ ఈ మేరకు లేఖను అందించారు. కరీంనగర్ నుంచి హసన్‌పర్తి వరకు 61.8 కి.మీ.ల మేరకు నిర్మించే కొత్త రైల్వేలైన్‌కు రూ.1,415 కోట్ల వ్యయం అవుతుందని, ఈ మేరకు డీపీఆర్ కూడా సిద్ధమైందని బండి సంజయ్ రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రైల్వే బోర్డు వద్ద ఈ అంశం పెండింగ్‌లో ఉందని, తక్షణమే ఆమోదం తెలపాలని కోరారు. కొత్త రైల్వేలైన్ నిర్మాణం పూర్తయితే కరీంనగర్ - వరంగల్ మధ్య వాణిజ్య కార్యకలాపాలు పెరిగి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని బండి సంజయ్ పేర్కొన్నారు. అంతేగాక కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు .. జమ్మికుంట స్టేషన్ వద్ద దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ రైల్వే మంత్రికి బండి సంజయ్ మరో లేఖ అందించారు. ఉప్పల్ స్టేషన్ అభివృద్ధిలో భాగంగా ప్లాట్‌ఫాం, రైల్వే స్టేషన్ భవనాన్ని ఆధునీకరించాలని, కొత్త రైల్వే సేవలను ప్రవేశపెట్టాలని కోరారు.

హైడ్రా ఎన్‌ఓసీ ఇస్తేనే నిర్మాణాలు!

▶ మొదటి పేజీ తరువాయి

రెవెన్యూ, ఇరిగేషన్, ఫైర్, ఎన్విరాన్‌మెంట్ వంటి పలు శాఖల ఎన్‌ఓసీ తప్పనిసరో...అలాగే హైడ్రా అనుమతి కూడా కావాల్సిందే.

కేవైసీ లాగే కేవైఎల్

చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటైన హైడ్రా కూల్చివేతలతో ఇబ్బందులు ఎదురవుతున్నా.. దీర్ఘకాలంలో మాత్రం ప్రయోజనం చేకూరుతుంది. వరదలు, నీటికొరత, భూగర్భ జలాల తగ్గదల వంటి ఇబ్బందులు తలెత్తవు. భావితరాలకు సమృద్ధిగా జల వనరులు, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుంది. బ్యాంక్‌లు, బీమా సంస్థలు ఎలాగైతే 'నో యువర్ కస్టమర్'(కేవైసీ) నిర్ధారించిన తర్వాతే సేవలు అందిస్తాయో.. అచ్చం అలాగే గృహ కొనుగోలుదారులు 'నో యువర్ లొకాలిటీ'(కేవైఎల్) ఆయా ప్రాంతం గురించి తెలుసుకున్న తర్వాతే కొనుగోలు నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

కస్టమర్లకు నమ్మకం కలుగుతుంది



ప్రస్తుతం గృహ కొనుగోలుదారుల్లో నెలకొన్న గందరగోళానికి హైడ్రా ఎన్‌ఓసీ చక్కని పరిష్కారం. దీంతో భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోననే భయం కస్టమర్లలో తొలగిపోతుంది. రియల్టీ రంగంపై విశ్వాసం పెరిగి, మార్కెట్ తిరిగి పుంజుకుంటుంది. – నరేంద్రకుమార్, ప్రణీత్ గ్రూప్ డైరెక్టర్

సింగిల్ విండో తీసుకురావాలి



ఇప్పటికే పలు విభాగాల నుంచి ఎన్‌ఓసీలు తీసుకురావాలంటే 6–9 నెలల సమయం పడుతుంది. కొత్తగా హైడ్రా ఎన్‌ఓసీ అంటే ఏడాది సమయం పడుతుంది. దీంతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ జరగదు. అందుకే సింగిల్‌విండో ద్వారా అన్ని విభాగాల ఎన్‌ఓసీలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలి. – పోశం నర్సిరెడ్డి, ఐరా రియల్టీ ఎండీ



తృప్తి అనేది తెలియనివాళ్లకు, స్వర్గతుల్య రాజభవనంలో ఉన్నప్పటికీ తృప్తి ఉండదు. తృప్తి అనేది తెలియనివాళ్లు ధనవంతులైనా పేదవాళ్లే. అది తెలిసినవాళ్లు పేదవాళ్లయినప్పటికీ ధనవంతులే.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 11 సెప్టెంబర్ 2024

ప్రజాభీష్టానికి పాతర

వేసవి ఒలింపిక్స్, పారాలింపిక్స్ – రెండూ పూర్తవడంతో ఫ్రాన్స్‌లో ఆటల వేడి ముగిసిందేమో కానీ, రాజకీయ క్రీడ మాత్రం బాగా వేడెక్కింది. కన్జర్వేటివ్ రిపబ్లికన్స్ పార్టీ నేత మిషెల్ బార్నియెర్‌ను దేశ ప్రధానిగా నియమిస్తున్నట్టు ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ గడచిన గురువారం చేసిన ప్రకటనతో రచ్చ రేగుతోంది. కొద్ది నెలల క్రితం జూన్ 9న పార్లమెంట్ దిగువ సభను రద్దు చేసి, ఆకస్మిక ఎన్నికలు ప్రకటించి, దేశాన్ని రాజకీయ ప్రతిష్టంభనకు గురి చేసిన మెక్రాన్ తీరా ఎన్నికల ఫలితాలొచ్చిన 60 రోజుల తర్వాత తాపీగా ప్రజాతీర్పుకు భిన్నంగా నాలుగో స్థానంలో నిలిచిన పార్టీ వ్యక్తిని ప్రధానమంత్రి పీఠంపై కూర్చోబెట్టారు. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన దేశంలో జరిగిన ఈ అపహాస్యమే ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది. ఆగ్రహించిన వేలాది జనం వీధుల్లోకి వచ్చి, ప్రదర్శనలకు దిగింది అందుకే. కొత్త ప్రధాని సారథ్యంలో సరికొత్త ప్రభుత్వం కొలువు తీరుతుంది కానీ, రాజకీయ సంక్షోభం అంచున ఉన్న దేశానికి సారథ్యం వహించడం అగ్నిపరీక్షే. వెరసి ఫ్రాన్స్‌లో అనిశ్చితి తొలగకపోగా, మరింత పెరగనుండడమే వైచిత్రి.

నిజానికి, ఫ్రాన్స్‌లో జూలైలో రెండో విడత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తీవ్ర మితవాద పక్షమైన 'నేషనల్ ర్యాలీ'నీ, అలాగే మెక్రాన్‌కు చెందిన 'రినైజెన్స్ బ్లాక్'నూ వెనక్కి నెట్టారు. వామపక్ష కూటమి 'న్యూ పాపులర్ ఫ్రంట్' (ఎన్ఎఫ్‌పీ)కి అధిక మద్దతు ప్రకటించారు. అయితే, ఎన్ఎఫ్‌పీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో హంగ్ పార్లమెంట్ ఏర్పడింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ లేని విధంగా ఇన్నాళ్ళుగా కొత్త ప్రభుత్వమేదీ లేకుండానే మెక్రాన్ కథ నడిపారు. పైగా, అధ్యక్షుడిగా తనకున్న విశేషాధికారాన్ని వాడి, వామపక్ష కూటమి ప్రతిపాదించిన అభ్యర్థులెవరినీ ప్రధానిగా అంగీకరించలేదు. చివరకు ఎన్నికల్లోని ప్రజా తీర్పును అగౌరవిస్తూ, నాలుగో స్థానంలోని పార్టీ తాలూకు వ్యక్తిని ప్రధానిగా దేశాధ్యక్షుడు ఎంపిక చేయడం ఓటర్లకు, అందునా యువతరానికి అమితమైన ఆగ్రహం కలిగించింది. దాని పర్యవసానమే – వేలాదిగా జనం వీధుల్లోకి రావడం! ఒక రకంగా ఈ ప్రధానమంత్రి ఎంపిక 'ఎన్నికల చోరీ' అని పేర్కొంటూ, ఏకంగా దేశాధ్యక్షుడు మెక్రాన్‌కే ఉద్వాసన పలకాలంటూ వాదించే స్థాయికి పరిస్థితి వెళ్ళింది.

ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ లేని పరిస్థితుల్లో ఉన్నంతలో అధిక స్థానాలున్న కూటమికే పగ్గాలు అప్పగించడం విహితమని స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వ సిద్ధాంతాలను ప్రవచించిన ఘన ప్రజాస్వామ్యం నుంచి ఎవరైనా ఆశిస్తారు. కానీ, 2017 నుంచి విభజన రాజకీయాలు చేస్తున్న ప్రెసిడెంట్ మెక్రాన్ ఎన్నికలలో తన పార్టీ కింద పడ్డా తనదే పైచేయిగా వ్యవహరించారు. వరుసగా చేస్తూ వస్తున్న తప్పుల్ని కొనసాగిస్తూ ఇష్టారీతిన వ్యవహరించారు. ఆ మాటకొస్తే, రాజకీయాల పట్ల నమ్మకం క్షీణింపజేసే ఇలాంటి చర్యల వల్లనే ఫ్రాన్స్ సహా యూరప్ అంతటా తీవ్ర మితవాదం పైకి ఎగసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో ఆధిక్యం కనబరిచినవారికి కనీసం ఏకాభిప్రాయ సాధనకైనా అవకాశమివ్వకుండా అధ్యక్షుడు తన పదవీకాలపు లెక్కలతో తోచిన ఎంపికలు చేయడం అవివేకం. తీవ్ర మితవాదానికీ, దాని జాత్యహంకార, విదేశీయతా విముఖ సిద్ధాంతానికీ పట్టం కట్టరాదన్న ప్రజాభీష్టానికి వ్యతిరేకం. ఈ కొత్త సర్కార్ కింగ్ మేకర్లయిన తీవ్ర మితవాదుల మద్దతుపై ఆధారపడక తప్పని స్థితి. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో అధ్యక్షుడు దేశాన్ని మళ్ళీ చిక్కుల్లోకి నెట్టారు.

అలాగని ప్రధానిగా ఎంపికైన 73 ఏళ్ళ బార్నియెర్ మరీ అనామకుడేమీ కాదు. బ్రెగ్జిట్‌పై యూరోపియన్ యూనియన్ పక్షాన గతంలో సంప్రతింపులకు సారథ్యం చేసిన వ్యక్తి. ఏకాభిప్రాయ సాధనలో ప్రసిద్ధుడు. రాజకీయ – సైద్ధాంతిక విభేదాలకు అతీతంగా అందరినీ కలుపుకొని పోగలిగినవాడు. ముగ్గురు దేశాధ్యక్షుల హయాంలో మంత్రిగా చేసిన ఆయనది యూరోపియన్ అనుకూల వైఖరి. అది వామపక్షాలకు నచ్చవచ్చు. ఇక, వలసల నియంత్రణకు మరింత కఠినమైన నిబంధనలు ఉండాలన్న వాదననే బార్నియెర్ సమర్థిస్తున్నారు. అది కన్జర్వేటివ్‌లకు నచ్చే అంశం. ప్రభుత్వ భవితవ్యంపై అనిశ్చితి నెలకొనడంతో... ప్రధానిగా ఇలాంటి వ్యక్తే సరైనవాడని మెక్రాన్ ఎంచుకున్నారట. కానీ, ఫ్రెంచ్ సమాజం నుంచి ఆమోదం లభించడం, రాజకీయంగా విజయం సాధించడం మెక్రాన్, బార్నియెర్‌లు ఇద్దరికీ అంత సులభమేమీ కాదు. సుదీర్ఘంగా శ్రమించక తప్పదు. యూకేతో బ్రెగ్జిట్ ఒప్పందం వేళ చేసినట్టే... ఇప్పుడూ ఏదో ఒక రాజీ మార్గంలో, అందరి మధ్య సహకారం సాగేలా కొత్త ప్రధాని చేయగలుగుతారా అన్నది ఆసక్తికరమైన అంశం.

వచ్చే 7 నుంచి 12 ఏళ్ళ లోగా ఫ్రాన్స్ తన ప్రభుత్వ లోటును 10 వేల కోట్లు యూరోల పైగా తగ్గించనట్లయితే, ఇటలీ లాగానే ఫ్రాన్స్ సైతం అప్పుల సుడిగుండంలో చిక్కుకుపోతుందని ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అక్టోబర్ 1లోగా కొత్త ప్రధాని, ఆర్థిక మంత్రితో కలసి 2025 బడ్జెట్ ముసాయిదాతో బిల్లుకు రూపకల్పన చేయాల్సి ఉంది. అది అతి కీలకమైన మొదటి అడుగు. అదే సమయంలో దేశాన్ని ఒక్క తాటి మీదకు తీసుకురావడానికే తాను పగ్గాలు చేపట్టినట్టు ఫ్రెంచ్ ప్రజానీకానికి ఆయన నచ్చజెప్పగలగాలి. ఏమైనా, ప్రజలు, పార్టీల మధ్య నెలకొన్న తీవ్ర స్థాయి విభేదాలతో ఫ్రెంచ్ రిపబ్లిక్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో ఉంది. అది ఈ ఘన ప్రజాస్వామ్యానికి పెను ముప్పు. ఆ ప్రమాదాన్ని తప్పించడంతో పాటు ఇంకా అనేక సమస్యలను కొత్త ప్రధాని నేతృత్వంలోని ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంది. ఇప్పటికే పాలన పూర్తిగా అటకెక్కిన ఫ్రాన్స్‌ను ఆ దేశపు అతి పెద్ద వయసు ప్రధాని, అధ్యక్షుడు కలసి ఎలా ముందుకు నడిపిస్తారో వేచి చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.అష్టమి సా.6.16 వరకు తదుపరి నవమి, **నక్షత్రం:** జ్యేష్ఠ సా.5.26 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** రా.1.39 నుండి 3.09 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.33 నుండి 12.21 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.10 నుండి 9.50 వరకు.

సూర్యోదయం: 5.50
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

బెజవాడ ముంపు పాపం ఎందరిది?

ఇళ్ళకు నీరు కావాలి గానీ, ఇళ్ళ లోనికి నీరు రాకూడదు. బుడమేరు వరద వల్ల పదుల సంఖ్యలో జనం చనిపోయారు. లక్షలాది ఎకరాల్లో వంట వరదపాలైంది. లక్షలాది ఇళ్లు నీళ్లలో నానుతున్నాయి. ఇంతటి ఉపద్రవానికి కారణమేంటి? బుడమేరుకు 'విజయవాడ దుఃఖదాయని' అని ఓ చెడ్డ పేరుంది. కానీ, ప్రకృతి విపత్తులు ఒక క్రమంలోనే జరుగుతుంటాయి. వాటివల్ల విధ్వంసం జరిగితే ఆ తప్పు ప్రకృతిది కాదు; ప్రకృతితో చెలగాటం ఆడిన మనుషులది.

అధికారంలోని వారి అజ్ఞాన ఫలితం

అభిప్రాయం



దానీ

రెండు ఆబ్జెక్ట్స్ ఒకే సమయంలో ఒకే స్పేస్‌లో ప్రవేశించే ప్రయత్నం చేస్తే యాక్సిడెంట్ జరుగుతుందనేది ఫిజిక్స్ సూత్రం. మనుషులు సామాజిక జీవితంలోనూ తరచూ ఇలాంటి తప్పులు చేస్తుంటారు. పాపం వాళ్ళకు యాక్సిడెంట్ సూత్రం తెలీక పోవచ్చు. కానీ, అత్యంత బాధ్యతగల పదవుల్ని నిర్వహిస్తున్న వారికి తెలియాలిగా? తెలియకపోతే విజయవాడ ముంపు లాంటి విషాదాలే జరుగుతాయి.

ప్రకాశం బ్యారేజిని కష్టకాలంలో ఆంధ్ర రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు రెండు దశల్లో నిర్మించాయి. ఇప్పటి ప్రకాశం బ్యారేజికి కొన్ని అడుగులు దిగువన బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నిర్మించిన 'బెజవాడ ఆనకట్ట' వుండేది. దీన్ని 1852లో మొదలెట్టి 1855లో పూర్తిచేశారు. ఆ ఆనకట్టను కెప్టెన్ ఆర్థర్ థామస్ కాటన్ డిజైన్ చేయగా, మరో కెప్టెన్ ఛార్లెస్ అలెగ్జాండర్ ఆర్ నిర్మించాడు. ఒక శతాబ్ద కాలం సమర్థంగా పనిచేసిన కాటన్–ఆర్ ఆనకట్ట 1952 సెప్టెంబరులో కూలిపోయింది.

అప్పుడు ఈ ప్రాంతం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వుండేది. సి.రాజగోపాలాచారి ముఖ్యమంత్రి. అప్పుడే ఆంధ్రలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సాగుతోంది. పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష మొదలెట్టడంతో రాజకీయం వేడెక్కింది. ఈ సంక్షోభ సమయంలో మద్రాసు ప్రభుత్వం, బెజవాడ ఆనకట్ట కూలిపోవడాన్ని పట్టించుకోలేదు. 1953 అక్టోబరులో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.

కొత్త రాష్ట్రం; చిన్న రాష్ట్రం; నిధుల కొరత వున్న రాష్ట్రం. అయినా సరే పాత ఆనకట్ట స్థానంలో భారీ బరాజ్ కట్టాలని తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు నడుం బిగించారు. పాత ఆనకట్ట ఆయకట్టు కన్నా మూడురెట్లు ఎక్కువ – అంటే దాదాపు 13 లక్షల ఎకరాలకు సాగునీరు, డెల్టా గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విజయవాడ వద్ద కృష్ణానది వరద గరిష్ఠంగా 12 లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తుందని 175 యేళ్ళ క్రితం ఆర్థర్ థామస్ కాటన్ అంచనా వేశాడు. దాన్ని తగ్గించడం కుదరదు. అలా 12 అడుగుల ఎత్తు క్రస్ట్ గేట్లతో ఒక భారీ డిజైనింగ్ రూపుదిద్దుకుంది.



బరాజ్ నిర్మాణ కాలంలోనే భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికగా ఆంధ్రా ప్రాంతానికి తెలంగాణా కలిసి 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవ రెడ్డి హయాంలో 1957లో బరాజ్ నిర్మాణం పూర్తయింది. మూడు రాష్ట్రాలు నలుగురు ముఖ్యమంత్రులు మారినా అంతటి నిర్మాణం మూడేళ్ళలో (1954–57) పూర్తయింది. ఇప్పుడు టెక్నాలజీ పెరిగినా చిత్తశుద్ధి తగ్గినందున భారీ బరాజ్‌ల నిర్మాణానికి దశాబ్దాలు పడుతోంది.

సాంకేతికంగా ప్రకాశం బరాజ్ నిర్మాణంలో ఒక మెలిక వున్నది. వర్షాకాలంలో మాత్రమే బరాజ్‌కు నీరు వచ్చి చేరుతుంది. వేసవిలో ఎగువ నుండి నీరు రావు. బరాజ్ రిజర్వాయర్‌లో నిల్వవుండే మూడు టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు వాడేవారు. నది ఎండిపోయినపుడు క్రస్ట్ గేట్లకు మరమ్మత్తులు చేసేవారు. జలాశయంలో చేరిన మేటను తొలగించేవారు. ఇప్పుడయితే నీరుండగానే గేట్లు మార్చే 'స్టాప్ లాగ్ గేట్ల' సాకర్యం వచ్చింది.

సుబ్బి పెళ్ళి ఎంకి చావుకు వచ్చినట్టు విజయవాడ సమీపంలో థర్మల్ పవర్ స్టేషన్ (వీటీపీఎస్) రావడంతో ప్రకాశం బరాజ్‌కు ముప్పు మొదలైంది. థర్మల్ పవర్ ప్రాజెక్టుల్లో వేడి నీటిని చల్లార్చి మళ్ళీ వాడటానికి వీలుగా కూలింగ్ టవర్స్‌ను ఏర్పాటు చేయాలి. వీటీపీఎస్ నేరుగా కృష్ణానదిని కూలింగ్ యూనిట్‌గా మార్చుకుంది. అందుకు అనువుగా కృష్ణానది నుండి వీటీపీఎస్‌కు ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో కాలువలు నిర్మించారు. ఇన్ ఫ్లో కాలువ లోనికి కృష్ణానది నీరు పారాలంటే (గ్రావిటీ ఫ్లో) రిజర్వాయర్ నీటి మట్టాన్ని పూర్తి స్థాయిలో (ఎఫ్ఆర్ఎల్) నిరంతరం నిండుగా వుంచాల్సి వచ్చింది.

ఒక ప్రత్యేక లక్ష్యం కోసం నిర్మించిన బరాజ్‌ను వేరే లక్ష్యంతో నిర్మించిన వీటీపీఎస్‌తో లంకె పెట్టడం పొరపాటు. ఒకే సమయంలో ఒకే స్పేస్‌లో రెండు ఆబ్జెక్ట్స్ ప్రవేశించాయి. దీనివల్ల నాలుగు ప్రమాదాలు జరిగాయి. జలాశయాన్ని నిరంతరం నిండుగా వుంచాల్సి రావడంతో వేసవిలో దిగువ గ్రామాలకు తాగునీరు అందించడం సాధ్యం కాలేదు. వేసవిలో క్రస్ట్ గేట్లకు మరమ్మత్తులు చేపట్టడం కుదరలేదు. బరాజ్ పిల్లర్లు, క్రస్ట్ గేట్లు నీటిలో ఎలా వున్నాయో కనీసం పరిశీలించడానికి వీలు కాలేదు. మేటను తీయడం సాధ్యం కాకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది.

ప్రకాశం బరాజ్ బలం తగ్గుతోందనే భయాలు 1980ల లోనే మొదలయ్యాయి. వీటీపీఎస్‌తో లింకు తెగ్గొట్టాలని ఆయకట్టు రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సమస్యకు పరిష్కారంగా వీటీపీఎస్‌కు ఇన్–ఫ్లో కెనాల్ కోసం బరాజ్ ఎగువన పంపింగ్ స్టేషన్ నిర్మించారు. ఒక ప్రశ్నకు సమాధానం మరో ప్రశ్నకు దారితీస్తుంది అనేది జ్ఞాన సూత్రం. ఒక సమస్యకు పరిష్కారం మరో సమస్యకు దారితీయడం అజ్ఞాన సూత్రం. అలాంటిది వీటీపీఎస్ ఔట్ ఫ్లో (కూలింగ్) కెనాల్ విషయంలో జరిగింది.

ఆ వివరాల్లోనికి వెళ్ళడానికి ముందు బుడమేరు చరిత్రను పరిశీలించాలి. అదొక చిన్న వాగు. తరచూ నీళ్లు లేక ఎండిపోయి వుంటుంది. ఏరు మార్గం త్రాచుపాములా మెలికలు తిరిగి వుంటుంది. నేరుగా వెళితే 10 కిలోమీటర్లు కూడా లేని దూరాన్ని మెలికలతో 33 కిలోమీటర్లు సాగుతుంది. అలా కిందికి పోయి కొల్లేరు సరస్సులో కలుస్తుంది. ఖమ్మం జిల్లాలోనో, కృష్ణాజిల్లా వాయవ్య ప్రాంతంలోనో భారీ వర్షాలు కురిసినపుడు బుడమేరుకు ఆకస్మిక వరదలు వస్తాయి. వరద రోజుల్లో బుడమేరులో 20 వేల క్యూసెక్కుల వేగంతో నీరు పారుతుందని అంచనా. ఈ వేగానికి వాగు మెలికలు తట్టుకోలేవు గనుక గట్లు తెగి నీరు విజయవాడ మీద పడుతుంది. అందుకే బుడమేరుకు 'విజయవాడ దుఃఖదాయని' అని ఓ చెడ్డ పేరుంది.

1960లలో విజయవాడ కృష్ణలంకను వరద ముంచేసినపుడు ఆ బాధితులకు పట్టణ శివార్లలో పునరావాసం కల్పించారు అప్పటి మునిసిపల్ కమిషనర్ అజిత్ సింగ్. అలా ఆయన పేరున సింగ్ నగర్ ఏర్పడింది. నగరం విస్తరించే కొద్దీ సింగ్ నగర్ కూడా అనేక పేర్లతో విస్తరించింది. విచిత్రం ఏమంటే ఆ పరిసరాలన్నీ బుడమేరు పరివాహక ప్రాంతం. దాని అర్థం ఏమంటే కృష్ణా ముంపు బాధితులు బుడమేరు ముంపు బాధితులుగా మారారు.

అంతిమంగా నీతి ఏమంటే, ఇళ్ళకు నీరు కావాలిగానీ, ఇళ్ళ లోనికి నీరు రాకూడదు. ఇళ్ళూ నీళ్ళూ ఒకే సమయంలో ఒకే స్పేస్‌లో వుండడం అస్సలు కుదరదు. నీటిలో ఇళ్ళు కట్టినా, ఇళ్ళ లోనికి నీరు వచ్చినా విపత్తు తప్పదు.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు

బాబు ఆర్భాటంతోనే ఆలస్యం

అభిప్రాయం



డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

ఏపీ నడిబొడ్డున ఉన్న బెజవాడ నగరం వారం రోజులు దాటినా వరద ముంపులోనే ఉండటాన్ని నిపుణులు ఎత్తి చూపుతున్నారు. ముంపునకు ఎటుచూసినా సీఎం చంద్రబాబే కారణమన్నది స్పష్టమౌతోంది. వరదలు రావడానికి ఆయన నివాసం కారణమైతే, వారం రోజులు దాటినా ముంపు తగ్గకపోవడానికి చంద్రబాబు కారణం అంటున్నారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వరదలు వచ్చిన వారం రోజుల వరకూ సహాయక చర్యలు జరిగే ప్రాంతానికి వెళ్లిన దాఖలాలు లేవు. అక్కడ నియమించిన ఐఏఎస్ అధికారులు ఒక ప్లాన్ రూపొందించుకుని, విజయవంతంగా సహాయక చర్యలు చేపట్టేవారు. కానీ, చంద్రబాబు తానేదో చేస్తున్నట్లుగా బిల్డప్ ఇచ్చుకునేందుకు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రచార ఆర్భాటం చేశారు. దీంతో ముఖ్యమంత్రి వస్తే అధికారులు ఉండాలన్న ప్రోటోకాల్ నిబంధనలతో అసలు ప్లానింగ్ లేకుండా పోయింది.

అసలు ముంపునకు కారణం చంద్రబాబే అని బాధితులు అంటున్నారు. ఆయన ఇళ్లు మునగకుండా ఉండేందుకు బుడమేరు లాకులను వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఎత్తివేయడం జరిగిందని ఆరోపిస్తున్నారు. ఇది చంద్రబాబు సొంతంగా పూడ్చాల్సిన నష్టంగానే భావించాలి. అంతేకాదు, బుడమేరు ఆక్రమణ జగన్ హయాంలో జరిగిందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అసహ్యం పుట్టించాయి. ప్రకాశం బ్యారేజీ గేట్లకు ఢీకొన్న బోట్లు కూడా జగన్ కేంద్రంగా తిరిగాయన్న భావన తీసుకొచ్చారు. జగన్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు పనికిరావంటూ ఒక్కొక్కటిగా ఉద్వాసన పలికిన చంద్రబాబు ప్రభుత్వం... ఇప్పుడవే సచివాలయాలు, అవే ఎండీయూ వాహనాలతో సహాయక చర్యలు చేపట్టడం గమనార్హం.

ప్రకృతి ప్రకోపంతో 57 మంది వరకూ చనిపోయారు. లక్షలాది ఎకరాల్లో వంట వరదపాలైంది. లక్షలాది ఇళ్లు నీళ్లలో నానుతున్నాయి. ఇంతటి ఉపద్రవానికి కారణమేంటి? క్షణాల్లో సమాచారం అందించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అరచేతిలో కనిపిస్తుంటే... కనీసం ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయలేదు. ఈ లోపాలను ప్రతిపక్ష పార్టీ ఎత్తిచూపకుండా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర తీశారు. కానీ, ఆకలితో అలమటించిన, వరద నీటిలో అల్లాడిపోయిన ప్రజలకు రాష్ట్రంలో ఏం జరిగిందనేది కచ్చితంగా తెలిసిపోయింది. 'సూపర్ సిక్స్' హామీలు అమలు చేయకపోయినా జనం ఓర్పు పట్టారు. కానీ తమ ప్రాణాలతో చెలగాట మాడుతుంటే సహిస్తారా? సహాయక చర్యల గురించి జనాన్ని 'ఐవీఆర్ఎస్' ద్వారా అడిగితే, 70 శాతానికి పైగా ఇంటికి పంపాలని చెప్పారని చంద్రబాబే స్వయంగా అన్నారు. జగన్ పాలనా పటిమ అది. సామాన్యుడికి ఏం కావాలో తెలుసుకుని జగన్ ముందుగానే ఏర్పాటు చేశారు.

వ్యాసకర్త వైఎస్సార్ టీయూసీ ఏపీ అధ్యక్షులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

రాష్ట్రపతి పాలనే!



మణిపుర్‌లోని పరిస్థితులకు రాష్ట్రపతి పాలనే శరణ్యం. ప్రభావశీలమైన ఏకీకృత సైనిక దళం గవర్నర్ కింద పని చేయాలి.– వేద్ మాలిక్, ఆర్మీ మాజీ చీఫ్

మేమూ ఆపగలం



బంగ్లాదేశ్‌లోని యూనస్ ప్రభుత్వం ఇండియాకు హిల్సా చేపల ఎగుమతిని ఆపాలని నిర్ణయించుకుంది. ఓకే, నో ప్రాబ్లమ్. దయచేసి చాలాకాలంగా ఇండియాకు పెండింగులో ఉన్న 50 కోట్ల డాలర్ల విద్యుత్ బకాయిలు చెల్లించండి. మీ హిల్సా మీ దగ్గరే ఉండనీ, మా కరెంట్ మా దగ్గర ఉంటుంది. అంతే!

– హిందోళ్ సేన్ గుప్తా, ప్రొఫెసర్

విదేశీ అయితే చాలా?




'మ్యాగీ'లో సోడియం ఉందని అందరికీ తెలుసు. కానీ ఉన్నట్టుండి భారత్‌లో ఆదరణ పొందిన 'టాకీస్', కొరియన్ నూడుల్స్‌లో మ్యాగీ కంటే రెట్టింపు సోడియం ఉంది. అధిక సోడియం వల్ల గుండె సంబంధిత సమస్యలు, స్థూల కాయం, రక్తపోటు రావొచ్చు. చాలా కొరియన్ నూడుల్స్ బ్రాండ్లను డెన్మార్క్‌లో నిషేధించారు కూడా! విదేశీ కంపెనీలు అమ్ముతున్నంత మాత్రాన ఆ ఉత్పత్తులు నాణ్యమైనవి అయిపోవు. పైగా ఇండియా నియంత్రణలు బలహీనంగా ఉంటాయని వాళ్లకు బాగా తెలుసు.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

భూదానోద్యమ పిత

మహాత్మా గాంధీ ఆధ్యాత్మిక వారసునిగా, భూదానోద్యమ పితామహులుగా ప్రసిద్ధికెక్కిన ఆచార్య వినోబా భావే 1895 సెప్టెంబర్ 11న మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో జన్మించారు. భారతదేశంలో దోపిడి రహిత సమ సమాజ నిర్మాణానికి, గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్య లక్ష్యసాధనకు వినోబా 1951 శివరాంపల్లి సర్వోదయ సమ్మేళన అనంతరం శాంతియాత్రను నిర్వహించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 18న నల్గొండ జిల్లా పోచంపల్లి గ్రామంలో సాయంత్రం ప్రార్థన సమావేశంలో వినోబా గ్రామాలలో ప్రజలు వివాదాలకు పోకుండా శాంతియుతంగా జీవించాలని కోరారు. ఆ సందర్భంలో హరిజనులు తమకు భూమి లేదనీ, కొంత భూమి ఇస్తే వ్యవసాయం చేసుకొని బతుకుతామనీ, ఏ ఉద్యమాల జోలికీ వెళ్లమన్నారు. దీంతో పోచంపల్లి గ్రామ భూస్వామి వెదిరె రామచంద్రారెడ్డి తన 100 ఎకరాల భూమిని వారికి పంచమని వినోబాకు దానం చేస్తూ కాగితంపై రాసి ఇచ్చాడు. దీంతో వినోబా 'శాంతి యాత్ర' పోచంపల్లి నుండి 'భూదానయాత్ర'గా మారింది.



ఆచార్య వినోబా భావే

ఈ భూదానోద్యమం దేశం మొత్తం విస్తరించింది. ఈ సమయంలో సోషలిస్టు పార్టీలో ప్రముఖ పాత్ర వహిస్తున్న జయప్రకాష్ నారాయణ బిహార్ రాష్ట్రం నుండి వచ్చి 1954లో మహబూబ్ నగర్ జిల్లాలో నాగర్ కర్నూల్, వనపర్తి తాలూకాల్లో పర్యటించారు. భూస్వాముల నుండి భూమి సేకరించి భూమిలేని వారికి పంచారు. సోషలిస్టు భావజాలంతో విద్యార్థి ఉద్యమాల్లోనూ, యువజన విభాగాలలోనూ పనిచేస్తున్న నేను జయప్రకాష్ నారాయణ పిలుపును అనుసరించి సర్వోదయ ఉద్యమం, భూదాన ఉద్యమంలో కార్యకర్తగా సేవలందించాను. దీని కోసం మహబూబ్ నగర్ జిల్లాలో రాష్ట్ర భూదాన సమితి ద్వారా పనిచేశాను.

నేను మొదటిసారి 1956 జనవరి 30న పోచంపల్లిలో వినోబాజీని కలుసుకున్నాను. వారితో ఆ మరునాడు బాటసింగారం వరకు కార్యకర్తగా పాదయాత్రలో పాల్గొన్నాను. నేను భూదాన కార్యకర్తగా నాగర్ కర్నూల్ రెవెన్యూ డివిజన్ కేంద్రంగా పనిచేస్తున్న సమయంలో వినోబా పాదయాత్ర బృందం మహబూబ్ నగర్ జిల్లాకు వచ్చింది. బొంబాయికి స్వయంప్రతిపత్తి, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వంటి ఉద్యమాలపై చర్చించేందుకు ఆచార్య వినోబా అభిప్రాయం తెలుసుకోవడానికి కొల్లాపురం తాలూకా మాధవరావుపల్లిలో వినోబాజీని 1956 ఫిబ్రవరి 7వ తేదీన ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ కలిసి వెళ్లారు. 1982 నవంబర్ 15న పవనార్ వార్ధా ఆశ్రమంలో వినోబా అస్తమించిన తర్వాత ఆయన సేవలకుగాను భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన 'భారతరత్న' పురస్కారాన్ని ప్రకటించింది.

– జి.వి. సుబ్బారావు, తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షులు, నాగర్‌కర్నూల్

(నేడు వినోబా భావే జయంతి)

ఇంత జరుగుతున్నా నోరు మెదపరేం?

బంగ్లాదేశ్ భయానక పరిస్థితులు గమనిస్తుంటే దేశ విభజన నాటి గాయాలు గుర్తుకొస్తున్నాయి. రిజర్వేషన్ల ముసుగులో ఆందోళన చేపట్టిన అల్లరి మూకలు హిందూ సంహారం కొనసాగిస్తున్నాయి.

విద్యార్థులు, యువకులు తమ ఉపాధి, ఉద్యోగాల కోసం చేస్తున్న పోరాటాలు హిందూ వ్యతిరేకతే లక్ష్యంగా సాగుతున్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువుగా పుట్టడమే పాపం అయిపోయింది. మైనారిటీలు (హిందువులు, సిక్కులు, బౌద్ధులు, క్రైస్తవులు)గా జీవించడమే శాపం అయిపోయింది.

ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందాల్సిన వారు హిందువులను వెంటాడి వేటాడితే రిజర్వేషన్లు లభిస్తాయా? హిందూ దేవాలయాలను ధ్వంసం చేస్తేనో, హిందూ అమ్మాయిలపై అత్యాచారం చేస్తేనో, హిందువులను చంపితేనో కొలువులు వస్తాయా? ఈ భూమిపై చిట్టచివరి హిందువును సైతం అంతం చేసే వరకు మా పోరాటం ఆగదు అంటూ కొన్ని ఉగ్రవాద సంస్థలు ప్రకటించడం వెనుక భయంకర ఉపద్రవం దాగి ఉంది.

శత్రువులను సైతం స్వాగతించి అక్కున చేర్చుకోవడం హిందువుల స్వభావం. నాడు సామాజిక రచయిత్రి తస్లీమా నస్రీన్‌ను బంగ్లా నుంచి తరిమేస్తే... భారత్ అక్కున చేర్చుకుంది. నేడు జిహాదీల హత్య నుంచి తప్పించుకొని పారిపోయి వచ్చిన షేక్ హసీనాకు సైతం ఆశ్రయం ఇచ్చిన భారత్... శాంతి, సహనంతో ప్రజాస్వామ్య విలువలతో కూడిన దేశంగా ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

రక్షించాల్సిన పోలీసులే రజాకారులుగా మారణకాండను ప్రోత్సహిస్తున్నారు. న్యాయ స్థానాలను ఆశ్రయిద్దామంటే ఆందోళనకారులు జడ్జీలను కూడా వదలడం లేదు. కోర్టులను చుట్టుముట్టి న్యాయమూర్తులనే దిగిపోవాలని హుకుమ్ జారీ చేస్తుంటే, అక్కడి మైనారిటీలకు రక్షణ ఏది? ఆస్తులు, ఇళ్లు, పొలాలు వదిలి పారిపోవాలా?



ప్రాణం కోల్పోవాలా? మతం మారాలా? అర్థం కాని స్థితిలో నరకం అనుభవించడం హిందువుల వంతయింది. ఏ తప్పు చేయకున్నా హిందువులు పిట్టల్లా ప్రాణాలు కోల్పోవడం నేటి మానవతా సమాజానికి మచ్చగా మారుతోంది.

హిందువు అనే ఒకే ఒక్క కారణంతో బంగ్లాదేశ్ క్రికెటర్ ఇంటికి మంట పెట్టడం... భయంతో పారిపోతున్న సినిమా హీరోలను, నిర్మాతలను కొట్టి చంపడం, సాహిత్యకారులు, కళాకారుల ఇళ్లను వారి కార్యాలయాలను, కళాస్మృతులను ధ్వంసం చేయడంపై క్రీడాలోకం, చిత్ర, సాహిత్య లోకాలూ స్పందించకపోవడం బాధాకరం.

బంగ్లాకు–భారత్‌కు అనుసంధానంగా ఉన్న ఇందిరాగాంధీ సాంస్కృతిక విజ్ఞాన కేంద్రాన్ని ధ్వంసం చేస్తే... కనీసం ఇందిరాగాంధీ కుటుంబ సభ్యులు స్పందించకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటి? వారి మౌనం ఆందోళనకారులకు మద్దతిచ్చినట్లే భావించాలా? సమాజం ఆలోచించాలి.

ఇంత జరుగుతున్నా సినీనటులూ, కళాకారులూ, మానవహక్కుల సంఘాలవాళ్ల గొంతు పెగలకపోవడం బాధాకరం. భారతదేశంలో కుక్కలపై, పిల్లులపై దాడి జరిగితే గగ్గోలుపెట్టే గ్యాంగులు... హిందువుల ఊచకోతను కనీసం పత్రికా ముఖంగానైనా ఎందుకు ఖండించడం లేదు?

ఏది ఏమైనా 'సేవ్ బంగ్లా' అంటూ ప్రపంచంలోని హిందువులంతా ఏకతాటిపైకి రావడం హర్షణీయం. దీని గురించి రాజకీయాలకు, కులాలకు అతీతంగా ప్రతి హిందువూ చర్చించడం స్వాగతించాల్సిందే. బంగ్లా విడిపోయిన సమయంలో 32 శాతం ఉన్న హిందూ జనాభా నేడు అక్కడ ఏడు శాతానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తూనే... ప్రతి హిందువూ తమ ఆత్మబంధు వేనని ముందుకు రావడం హిందూ ఐక్యతకు నిదర్శనంగా చెప్పవచ్చు.

– పగుడాకుల బాలస్వామి
ప్రచార ప్రసార ప్రముఖ్; విశ్వహిందూ పరిషత్, తెలంగాణ | 99129 75753

ధ్యానమే మార్గం!

సమాజంలో ప్రతి ఒక్కరూ ఏ స్థానంలో ఉన్నా లేదా ఏ స్థాయిలో ఉన్నా సుఖ శాంతులనే కోరుకుంటారు. వాస్తవానికి జనం ఇవి లభించే ప్రదేశాన్ని వదలి, మిగిలిన అన్ని ప్రదేశాలలో అన్వేషిస్తున్నారని పరిశీలన ఫలితంగా అర్థమవుతుంది.

మానవులు ఇంద్రియాల ద్వారా లభించే తాత్కాలిక సంతోషమే నిజమైనదీ, శాశ్వతమైనదీ అని భ్రమించి గందరగోళంలో పడిపోతున్నారు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

పరిపూర్ణ సుఖ శాంతులకు మూలం మనిషి అంతరాత్మలోనే ఉంది.

వీటిని పొందడానికి ధ్యానం ఒకటే తగిన సాధనం. ఇటువంటి ధ్యానాన్ని మన శాస్త్రాల్లో వర్ణించిన విధంగా కానీ లేక గురువు ఏ పద్ధతిని బోధిస్తారో ఆ పద్ధతి ద్వారా కానీ సాధన చేయాలి.

ఆరంభ దశలో ధ్యానం అంటే ఏదైనా ఒక ప్రత్యేక వస్తువు లేక చిహ్నంపై ఆలోచనను నిలపడం. ఇతర ఆలోచనలను దూరం చేసి, జాగ్రత్తగా ఏదైనా ఒకదానిపైనే ఆలోచనను నిలపడమే ధ్యానం. ఇది ఒక చర్య కాదు. జీవితంలోని అవిభాజ్యమైన భాగం. ఈ ఆధునిక ప్రపంచంలో భౌతిక వాదం తప్పించుకోవడానికి వీలులేనిదిగా అల్లుకుపోయింది. ఈ వాదం పర్యవసానంగా కలిగే చింతల నుండి, ఒత్తిళ్ళ నుండి బయటపడాలంటే ధ్యానం ఒకటే సింహద్వారం. ఎల్లప్పుడూ క్రమం తప్పకుండా కృత నిశ్చయంతో అనుసరిస్తే ధ్యానం ఒక్కటే సరైన మార్గం అవుతుంది. ఇందువలన శాశ్వతంగా శాంతి, దైవ సాక్షాత్కారాలు లభిస్తాయి.

మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు

చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




ఐలమ్మ జీవిత చరిత్రపై అలేఖ్య పుంజాల రూపొందించిన నృత్య రూపకాన్ని తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ పోరాట స్ఫూర్తిని చాటాలన్న ఉద్దేశంతో మంత్రివర్గ సహచరుల సమ్మతితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో జరిగిన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సభకు ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, ప్రత్యేక అతిథులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే..

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ గడీలలో గడ్డి మొలవాలన్న చాకలి ఐలమ్మ మాటలను, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని గుర్తుచేశారు. దొరల చేతుల్లో ఉన్న లక్షలాది ఎకరాల భూములను పేదలకు, రైతులకు పంచేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధీ తెచ్చిన భూ సంస్కరణలకు చాకలి ఐలమ్మ పోరాటమే స్ఫూర్తి అన్నారు. భూమి అనేది పేదలకు ఆత్మగౌరవం, జీవన ఆధారం అని చాటి చెబుతూ పేదలకు లక్షలాది ఎకరాల భూమిని పంచి ఇచ్చిన ఇందిరాగాంధీ ప్రతి పేదవాడి కుటుంబంలో దైవంగా నిలిచారన్నారు. భూహక్కులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని, తెలంగాణలో పేదల చేతుల్లో లక్షలాది ఎకరాల భూమి ఉండడానికి ఇందిరాగాంధీ తెచ్చిన భూ సంస్కరణలు, పీవీ నర్సింహారావు వాటిని అమలు చేయడమే కారణమని రేవంత్ చెప్పారు.

లక్షల ఎకరాలు లాక్కొనేందుకు గత సర్కార్ కుట్ర..

పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన భూములను, అసైన్‌మెంట్ పట్టాలను, పోడు భూముల పట్టాలను రద్దు చేసి లక్షలాది ఎకరాల భూములను లాక్కొనేందుకు ధరణి ముసుగులో గత ప్రభుత్వంలో కుట్రలు చేశారని సీఎం రేవంత్ ఆరోపించారు. పేదలకు ఇచ్చిన భూములను కాపాడే ప్రయత్నంలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రభుత్వం ఏర్పడిందన్నారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రతి ఒక్కరిలో ఉందని చెప్పారు. సమాజంలో సామాజిక చైతన్యం తెచ్చిన వ్యక్తులు, పేదలకు హక్కులను కల్పించిన వ్యక్తుల పేర్లు ఎప్పటికీ స్ఫూర్తిగా ఉండేలా సంస్థల పేర్లు పెడుతున్నామన్నారు.

ఆకట్టుకున్న నృత్యరూపకం

చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను తొలిసారి కూచిపూడి, జానపద శైలిలో ప్రదర్శించిన నృత్య రూపకం ఉత్తేజభరితంగా సాగింది. ఐలమ్మ జీవితంలోని ప్రధాన ఘట్టాలను, ఆమె సాగించిన సాయుధ రైతాంగ పోరాటాలను తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్, ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల అద్భుత ప్రదర్శనతో కళ్లకు కట్టేలా చూపారు. దివంగత రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ రచించిన చాకలి ఐలమ్మ నృత్య రూపకం కాన్సెప్ట్, నృత్య దర్శకత్వం డా. అలేఖ్య పుంజాల నిర్వహించగా, వి.బి.ఎస్. మురళి బృందం సంగీత సహకారం అందించి రక్తి కట్టించారు. ఈ దృశ్యకావ్యాన్ని సీఎం, మంత్రులు సహా ప్రేక్షకులంతా ఆసక్తిగా తిలకించారు. ప్రతి ఘట్టంలో ప్రొ. అలేఖ్య ప్రదర్శించిన హావభావాలు, అద్భుత సమన్వయంతో మిగతా బృందం అందించిన సహకారంతో ప్రదర్శన ఆసాంతం ఆహూతులను అలరించింది. సీఎం రేవంత్ తన ప్రసంగంలోనూ ఈ ప్రదర్శనను ప్రస్తావించారు. 'చాకలి ఐలమ్మ దృశ్యకావ్యాన్ని అలేఖ్య బృందం కళ్లకు కట్టినట్లు చూపింది. ఎంతో ఏకాగ్రత ఉంటే తప్ప ఇంత గొప్ప ప్రదర్శన సాధ్యం కాదు' అని సీఎం ప్రశంసించారు. తాను ఇప్పటివరకు ఎన్నో పాత్రలు ప్రదర్శించానని, సాయుధ పోరాట స్ఫూర్తిని చాటిన చాకలి ఐలమ్మ పాత్రను పోషించడం ఎంతో సంతోషాన్ని, సంతృప్తినిచ్చిందని అలేఖ్య పుంజాల అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి సూచనతోనే దీన్ని రూపొందించినట్లు చెప్పారు.

ఐలమ్మ మనవరాలికి మహిళా కమిషన్‌లో చోటు



సీఎం ప్రకటనతో భావోద్వేగానికి గురవుతున్న ఐలమ్మ మనవరాలు శ్వేత

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని సీఎం రేవంత్ చెప్పారు. ఐలమ్మ కుటుంబ సభ్యులు సైతం ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండాలని భావిస్తున్నామని... చాకలి ఐలమ్మ మనవరాలు శ్వేత ఐలమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రకటించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను సీఎం ఆదేశించారు. మహిళలపై దాడులను తిప్పికొట్టేందుకు, మహిళా హక్కుల పరిరక్షణకు ఉన్న మహిళా కమిషన్‌లో ఐలమ్మ వారసులు ఉండటం సముచితమని తాము భావిస్తున్నట్లు చెప్పారు. ప్రశ్నించే గొంతుకలే తమకు కావాలని.. ప్రజాసమస్యలపై పోరాడి వాటిని పరిష్కరించే వాళ్లే కాంగ్రెస్ ప్రభుత్వానికి కావాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అంతకుముందు ప్రొఫెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

టీవీవీపీ సిబ్బందికి వెంటనే జీతాలు ఇవ్వాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్/షాద్‌నగర్: ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఆసుపత్రుల్లో పని చేస్తున్న సిబ్బందికి ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం ఏమిటని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీవీవీపీలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి 6 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అమానుషమన్నారు. తక్షణమే సిబ్బందికి జీతాల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి జోక్యం చేసుకోవాలని హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

అప్పుడు వాడుకుని ఇప్పుడు తప్పుపడతారా?

హరీశ్‌రావు మంగళవారం మహబూబ్‌నగర్ వెళ్తూ రాయికల్ శివారులోని ఓ దాబా వద్ద ఆగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారం 'ఒడ్డు దాటే వరకు ఓడ మల్లప్ప.. ఒడ్డు దాటిన తర్వాత బోడి మల్లప్ప'అనే చందంగా ఉందని ఎద్దేవా చేశారు. గతంలో యూట్యూబ్ చానళ్లను వాడుకుని, వాటి తప్పుడు ప్రచారంతో అధికారంలోకి వచ్చిన ఆయన ప్రస్తుతం వాటిపై ఇష్టానుసారం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

క్లుప్తంగా...

జైనూర్ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా విచారణ

తెలంగాణ సీఎస్, డీజీపీకి నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఆసిఫాబాద్ కొమురంభీమ్ జిల్లాలోని జైనూర్‌లో గిరిజన మహిళపై అత్యాచారం, హత్యాయత్నం ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) సుమోటోగా విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఎఫ్ఐఆర్ స్థితి, బాధితురాలి ఆరోగ్యం, కౌన్సెలింగ్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున బాధితురాలికి అందించిన పరిహారం తదితర వివరాలతో సమగ్ర నివేదికను రెండు వారాల్లో అందజేయాలని ఆదేశించింది. గిరిజన మహిళపై జరిగిన దారుణంపై వెల్లువెత్తిన నిరసనలు హింసాకాండకు దారి తీశాయంటూ మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా కేసును సుమోటోగా తీసుకున్నట్లు ఎన్‌హెచ్‌ఆర్సీ తెలిపింది. ఆగస్టు 31న.. 45 ఏళ్ల గిరిజన మహిళపై ఆటోడ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడి హత్యకు ప్రయత్నించడంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

నేటి నుంచి మేడిగడ్డ బరాజ్‌లో ఏడీసీపీ పరీక్షలు



మేడిగడ్డ బరాజ్‌కు చేరుకున్న లక్నవరం బోటు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో ప్రవాహపు అంచనా పరీక్షలను ఎన్‌సీడబ్ల్యూఎస్‌పీ సూచనల మేరకు బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. ఏడీసీపీ (అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫెల్లర్) పరికరం బోటుకు అమర్చి పరీక్షలను పుణేకు చెందిన శాస్త్రవేత్తలు సంపత్, నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. బరాజ్‌లో 4 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో నాటు పడవలు కాకుండా లక్నవరం నుంచి ప్రత్యేకంగా బోటును మంగళవారం తీసుకొచ్చారు. ఆ బోటుకు ఏడీసీపీ పరికరం అమర్చి ప్రవాహం అంచనా వేయనున్నారు. కాగా ఇదే బృందం సభ్యులు అన్నారం బరాజ్‌లోనూ పరీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే.

కొమురవెల్లిలో కొత్త కాటేజీల నిర్మాణం

- దాతల సహాయంతో నిర్మాణానికి ప్రణాళికలు



కాటేజీలు నిర్మించే స్థలం

సాక్షి, సిద్దిపేట: కొమురవెల్లి దేవస్థానంలో వసతి కోసం భక్తులు పడుతున్న ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు అధికారులు దాతల సహకారంతో కొత్త కాటేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దేవాలయ అన్నదాన సత్రం సమీపంలో ఖాళీగా ఉన్న 1.15 ఎకరాల్లో తొలి విడతలో బహుళ అంతస్తుల (జీ ప్లస్4) కాంప్లెక్స్ ను నిర్మించనున్నారు. ఇందులో 80 కాటేజీలు ఉంటాయి. సింగిల్ బెడ్‌రూమ్ తరహాలో ఒక్కో కాటేజీలో ఒక వంటగదితోపాటు మరో రెండు రూమ్‌లు ఉంటాయి. దాతలు ఒక్కో కాటేజీ నిర్మాణానికి సుమారు రూ.18 లక్షలు విరాళంగా అందించాల్సి ఉంటుంది. వారి పేరు మీద కాటేజీని నిర్మిస్తారు. మరిన్ని వివరాలకు 9491000652 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ ఈఓ బాలాజీ కోరారు.

నేడు యాదాద్రిలో యూనిట్-2 సింక్రనైజేషన్

- పర్యవేక్షించనున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి
- ప్రక్రియలో భాగంగా జనరేటర్ గ్రిడ్‌తో అనుసంధానం

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని 800 మెగావాట్ల రెండో యూనిట్‌కు బుధవారం కీలకమైన సింక్రనైజేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా యూనిట్‌కి సంబంధించిన జనరేటర్‌ను విద్యుత్ సరఫరా వ్యవస్థ(గ్రిడ్)కు అనుసంధానం చేసి పరీక్షిస్తారు. జనరేటర్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ గ్రిడ్ ఫ్రిక్వెన్సీ, వోల్టేజీ, ఫేజ్ యాంగిల్స్‌తో మ్యాచ్ అయితే సింక్రనైజేషన్ విజయవంతమైనట్టుగా ప్రకటిస్తారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి విద్యుత్ కేంద్రానికి చేరుకొని సింక్రనైజేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తారు. సింక్రనైజేషన్ తర్వాత కమిషనింగ్, కమర్షియల్ ఆపరేషన్ డేట్ (సీఓడీ) ప్రక్రియలను పూర్తి చేస్తేనే యూనిట్ నిర్మాణం విజయవంతంగా పూర్తయినట్టు భావిస్తారు. కమిషనింగ్‌లో భాగంగా ఎలక్ట్రికల్, మెకానికల్, కంట్రోల్ యూనిట్స్, ఇతర అన్ని విభాగాలు విద్యుదుత్పత్తికి సిద్ధంగా ఉన్నాయా.. లేదా..అని పరీక్షిస్తారు. ఇందుకుగాను ఆయా విభాగాల పనులు సంపూర్ణంగా పూర్తి కావాల్సి ఉంటుంది. కమిషనింగ్ తర్వాత విద్యుదుత్పత్తి కొనసాగినా, విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తయినట్టు భావించరు. పూర్తి స్థాపిత సామర్థ్యంతో నిరంతరంగా 72 గంటలపాటు యూనిట్‌లో విద్యుదుత్పత్తి జరిగితేనే సీఓడీ ప్రక్రియ విజయవంతమైనట్టు భావిస్తారు. ఈ క్రమంలో కొత్త విద్యుత్ కేంద్రంలో బయటపడే ఒక్కో లోపాన్ని సరిదిద్దుకుంటూ పోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సీఓడీ ప్రక్రియ పూర్తి కావడానికి కొన్ని నెలల సమయం పట్టే అవకాశముంది.

యూనిట్	పూర్తయిన శాతం
యూనిట్-1	91
యూనిట్-2	92
యూనిట్-3	88
యూనిట్-4	89
యూనిట్-5	85

అక్టోబర్‌లో 2 యూనిట్లు పూర్తి కావాలి

యూనిట్-1, యూనిట్-2లు అక్టోబర్ 24, యూనిట్-3 వచ్చే ఏడాది ఫిబ్రవరి, యూనిట్-4 మార్చి, యూనిట్ -5 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని జెన్‌కో లక్ష్యంగా పెట్టుకుంది. అన్ని యూనిట్లకు సింక్రనైజేషన్, కమిషనింగ్, సీఓడీ నిర్వహించాల్సి ఉంది. నల్లగొండ జిల్లా దామరచర్లలో జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 4000(5x800) మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించి రూ.29,965 కోట్ల అంచనాలతో నిర్మాణ పనులు ప్రారంభించగా, తాజాగా వ్యయం రూ.34,543 కోట్లకు చేరింది. ఇప్పటివరకు రూ.27,486 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. వాస్తవానికి 2021 అక్టోబర్-2022 అక్టోబర్ మధ్యకాలంలో అన్ని యూనిట్లు పూర్తికావాల్సి ఉండగా, తీవ్ర జాప్యం జరిగింది.

భూగర్భ గనిలో ఊపిరాడక కార్మికుడు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

జైపూర్: భూగర్భ గనిలో ఊపిరాడక ఓ యువ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన ఎల్లవేన శ్రీనివాస్(32) మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం ఐకే-1ఏ గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మొదటి షిఫ్ట్‌లో వచ్చిన ఆయన గనిలో ఎస్-1ప్యానల్ 35వ డీప్ 4లెవల్ వద్ద పనిచేస్తుండగా, గాలి సరఫరా సరిగ్గా లేకపోవడంతో తీవ్ర అస్వస్థతతో అక్కడే కుప్పకూలిపోయాడు. పక్కన ఉన్న కార్మికులు ఇది గమనించి వెంటనే శ్రీనివాస్‌ను బయటకు తీసుకొచ్చారు. హుటాహుటిన అంబులెన్స్‌లో రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. గనిలో వెంటిలేషన్ సరిగ్గా లేకపోవడంతోనే శ్రీనివాస్ మరణించాడని కార్మికులు ఆరోపించారు. ఈ ఘటనపై హెచ్‌ఎంఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కొంతకాలంగా ఇక్కడ గాలి సరఫరా లేదని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా అధి కారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. తన భర్త గనిలో ఊపిరి ఆడకనే మృతి చెందాడని, అధికారులు ప్రాణంతో ఉన్నట్టు చిత్రీకరించి ఆస్పత్రికి తరలించాలని శ్రీనివాస్ భార్య అనిత వాపోయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు జైపూర్ ఎస్సై శ్రీధర్ తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడి మృతి?

బోధన్: వీధి కుక్కల దాడిలో పదకొండు నెలల బాలుడు ప్రాణాలు కోల్పోయినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు... బోధన్ మండలంలోని చిన్నమావంది గ్రామానికి చెందిన గంగామణి (35) కొంతకాలంగా పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. సోమవారం రాత్రి బస్టాండ్ ఆవరణలోని చెట్టు కింద పసిబాలుడితో కలిసి నిద్ర పోయింది. మంగళవారం తెల్లవారుజామున నిద్రలోంచి లేచి చూడగా కుమారుడు కనిపించకపోవడంతో కిడ్నాప్ అయినట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టౌన్ సీఐ వెంకట నారాయణ సిబ్బందితో బస్టాండ్ పరిసర ప్రాంతంలో పరిశీలించగా పొదల్లో పేగులు, కాలేయంతో కూడిన మాంసం ముద్ద కనిపించింది. వాటిని బోధన్ జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీధికుక్కలే దాడి చేసి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని, సమగ్ర విచారణ కోసం బాలుడి అవయవాలను ఫోరెన్సిక్‌ల్యాబ్‌కు పంపించనున్నట్లు పోలీసులు తెలిపారు.



మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆవంచ గ్రామంలో మంగళవారం జరిగిన శ్వేత అంతిమ వీడ్కోలు కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమ లాకర్, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌రెడ్డి, అలాగే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొని నివాళులర్పించారు. లక్ష్మారెడ్డిని ఓదార్చి మనోధైర్యం చెప్పారు. - జడ్చర్ల

గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ

భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరిన నీటిమట్టం



రామన్నగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలం అర్బన్ / ఏటూరునాగారం: గోదావరి నదికి ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. మంగళవారం ఉదయం 7:32 నిమిషాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి 43 అడుగులకు చేరింది. దీంతో ఆర్డీఓ దామోదర్‌రావు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటిమట్టం అంతకంతకూ పెరుగుతూ సాయంత్రం 5:15 గంటలకు 48 అడుగులు దాటి ప్రవహించడంతో రెండో ప్ర మాద హెచ్చరిక కూడా జారీ చేశారు. వరద పెరుగుతున్నందున పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్.వి.పాటిల్ సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి, ముంపు ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద.

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రం నాటికి 15.80 మీటర్లకు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ముంపు ప్రాంతాలైన రామన్నగూడెం, ఏటూరునాగారం గ్రామంలోని ఓడవాడ, 1, 2, 10 వార్డుల్లోని ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో నది ప్రవహిస్తోంది. 15.83 మీటర్లకు చేరితే.. రెండు ప్రమాద హెచ్చరిక, 17.33 మీటర్లకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. గోదావరి కరకట్ట వద్ద పోలీసులు, రెవెన్యూ, కేంద్ర జలవనరుల శాఖ, ఇరిగేషన్ అధికారులు పహారా కాస్తున్నారు.

సాగర్ 26 గేట్లూ ఎత్తివేత

నాగార్జునసాగర్/ దోమలపెంట: నాగార్జునసాగర్ జలాశయానికి వరద పెరిగింది. దీంతో మంగళవారం 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 2,50,257 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, అంతే నీటిని దిగువకు వదులుతున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు ఆరుగేట్లు కూడా...

కృష్ణానదికి ఎగువ నుంచి వరద వస్తుండటంతో మంగళవారం రాత్రి 7 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టు ఆరు గేట్లు పైకెత్తి 1,64,592 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపిస్తున్నారు.

గాలి నిండా మీథేన్!

మనిషి నిర్వాకం వల్ల గత 20 ఏళ్లలో వాతావరణంలోకి ఏకంగా 67 కోట్ల టన్నులు

విచ్చలవిడిగా బొగ్గు, చమురు వెలికితీతే ప్రధాన కారణం

మీథేన్‌తో గ్లోబల్ వార్మింగ్‌తో పాటు శ్వాసకోశ సమస్యలు



పర్యావరణానికి ప్రధాన శత్రువు మనిషేనని మరోసారి రుజువైంది. శిలాజ ఇంధనాల వాడకం, పారిశ్రామికీకరణ వంటి మానవ కార్యకలాపాల వల్ల 20 ఏళ్లలోనే ఏకంగా 67 కోట్ల టన్నుల మేరకు ప్రమాదకర మీథేన్ వాయువు వాతావరణంలోకి విడుదలైందట. స్టాన్‌ఫర్డ్ వర్సిటీ సైంటిస్టుల తాజా అధ్యయనంలో తేలిన చేదు నిజమిది. ఈ దెబ్బకు పారిశ్రామికీకరణకు ముందు నాటితో పోలిస్తే గాలిలో మీథేన్ పరిమాణం ఏకంగా 2.6 రెట్లు పెరిగిపోయిందని ఆ నివేదిక పేర్కొంది. పైగా, ''ఇవి 2020 నాటి గణాంకాల ఆధారంగా వేసిన లెక్కలు. ఈ నాలుగేళ్లలో పరిస్థితి మరింత దిగజారింది'' అంటూ హెచ్చరించింది...

2000 నుంచి కొన్నాళ్ల పాటు వాతావరణంలో మీథేన్ పెరుగుదల కాస్త అదుపులోనే ఉంటూ వచ్చింది. కానీ ఆ తర్వాత పలు దేశాలు శిలాజ ఇంధనాల ఉత్పత్తి, వాడకాలను విచ్చలవిడిగా పెంచేయడంతో ప్రమాదకర స్థాయిలో పెరుగుతూ వస్తోంది. బొగ్గు, చమురు, సహజవాయువు తదితరాల వెలికితీత, వాడకం వల్ల వెలువడుతున్న మీథేన్ పరిమాణం గత 20 ఏళ్లలో ఏకంగా 33 శాతం పెరిగిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అలాగే వ్యర్థాలు తదితరాల నుంచి మీథేన్ విడుదలవుతున్న 20 శాతం, వ్యవసాయం వల్ల మరో 14 శాతం పెరిగిందని అధ్యయనం తేల్చింది! 'ప్రపంచం పెద్దగా పట్టించుకోవడం లేదు గానీ, వాతావరణంలో పెరిగిపోతున్న మీథేన్ పరిమాణం పర్యావరణానికి పెద్ద విపత్తుగా పరిణమిస్తోంది' అని అధ్యయనానికి సారథ్యం వహించిన గ్లోబల్ కార్బన్ ప్రాజెక్ట్ హెడ్, స్టాన్‌ఫర్డ్ వర్సిటీలో పర్యావరణ శాస్త్రవేత్త రాబ్ జాక్సన్ హెచ్చరించారు. ఈ ప్రాజెక్టు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను ఎప్పటికప్పుడు గమనిస్తుంటుంది. ''2000 సంవత్సరంలో వాతావరణంలోని మొత్తం మీథేన్ పరిమాణంలో మనిషి వాటా 60 శాతంగా ఉండేది. ఇప్పుడది ఎకాయెకి 65 శాతానికి పెరిగింది. భూ వాతావరణంలో మీథేన్ పెరుగుదల కార్బన్ డయాక్సైడ్ (సీఓటూ) కంటే చాలా ఎక్కువగా నమోదవుతోంది. 2015లోనైతే వాతావరణంలో మీథేన్ సాంద్రత గత 80 లక్షల ఏళ్లలో ఎన్నడూ లేనంత భారీగా నమోదైంది! వాతావరణంలో వేలాది ఏళ్లపాటు ఉండిపోయే సీఓటూతో పోలిస్తే మీథేన్ ఉండేది 12 ఏళ్లే అయినా అది కలగజేసే నష్టం మాత్రం ఎక్కువ. ఎందుకంటే పర్యావరణానికి సీఓటూ కంటే మీథేన్ 82 రెట్లు ఎక్కువ నష్టం చేస్తుంది'' అని జాక్సన్ వివరించారు. ''మీథేన్, సీఓటూ ఉద్గారాలు ఇలాగే కొనసాగితే 2050 నాటికి ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు ఏకంగా 3 డిగ్రీలకు మించి పెరిగిపోతాయి. అది వినాశనానికి దారితీస్తుంది'' అని ఆందోళన వెలిబుచ్చారు. ఈ అధ్యయన ఫలితాలు 'ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్ లెటర్స్'లో మంగళవారం ప్రచురితమయ్యాయి.

> భూ సగటు ఉష్ణోగ్రతల పెరుగుదలను అంతర్జాతీయంగా అంగీకరించిన 1.5 డిగ్రీ సెల్సియస్ స్థాయికి పరిమితం చేయాలంటే సీఓటూ ఉద్గారాలను సగానికి, మీథేన్ ఉద్గారాలను మూడో వంతుకు తగ్గించాలి. ఈ దిశగా తక్షణ కార్యాచరణ అత్యవసరం
> – బిల్ హేర్, క్లైమేట్ అనలిటిక్స్ సీఈఓ, పర్యావరణ శాస్త్రవేత్త

కాగితాల్లోనే లక్ష్యం...

మీథేన్ ముప్పుపై అంతర్జాతీయ వేదికలపై ఎన్నోసార్లు చర్చోపచర్చలు జరిగాయి. పర్యావరణ శాస్త్రవేత్తల వరుస ఆందోళనల ఫలితంగా 2021లో దేశాలన్నీ దీనిపై లోతుగా చర్చించాయి. వాతావరణంలో మీథేన్ పరిమాణాన్ని తగ్గిస్తామంటూ ప్రతినబూనాయి. 'గ్లోబల్ మీథేన్ ప్లెడ్జ్'గా పిలిచే ఒప్పందంపై 100కు పైగా దేశాలు సంతకాలు చేశాయి. మీథేన్ ఉద్గారాలను 2030 నాటికి 30 శాతానికి పైగా తగ్గించాలన్నది దీని లక్ష్యం. ఫలితంగా 2050 నాటికి గ్లోబల్ వార్మింగ్‌లో 0.2 డిగ్రీ సెల్సియస్ మేరకు తగ్గుదల నమోదవుతుందని అంచనా. కానీ ఆచరణలో ఏ దేశమూ చేసింది పెద్దగా ఏమీ లేకపోవడంతో ఈ లక్ష్యం కాగితాలకే పరిమితమైంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

మీథేన్‌తో పెను ప్రమాదమే

- ఏటా 5.8 కోట్ల టన్నుల మీథేన్ వాతావరణంలోకి విడుదలవుతోందని అంచనా. ఇందులో మనిషి వాటాయే ఏకంగా 60 శాతం.
- వ్యవసాయం, శిలాజ ఇంధనాల వెలికితీత, వాటి వాడకం తదితరాల వల్ల 60 శాతం మీథేన్ విడుదలవుతోంది.
- అమెరికాలో కేవలం గ్యాస్ డ్రిల్లింగ్ కారణంగా 2005 నుంచి ఇప్పటిదాకా ఏకంగా 1.17 కోట్ల టన్నుల మీథేన్ విడుదలై ఉంటుందని అంచనా!
- గాల్లో మీథేన్ పరిమాణం పెరిగితే వచ్చే సమస్యలు అన్నీ ఇన్నీ కావు.
- గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణమైన గ్రీన్‌హౌజ్ వాయు ఉద్గారాల్లో మీథేన్‌దే పెద్ద వాటా.
- పారిశ్రామికీకరణ అనంతరం గత 150 ఏళ్లలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు ప్రమాదకరంగా పెరిగిపోతుండటం తెలిసిందే. అందులో మూడో వంతు పెరుగుదల మీథేన్ వల్లే సంభవిస్తోంది!
- వాతావరణంలోని వేడిని మీథేన్ నిర్బంధించి దాన్ని తిరిగి భూమిపైకే పంపుతుంది. మరోలా చెప్పాలంటే భూ ఉపరితలంపై ఓజోన్ పొరలాంటి దాన్ని ఏర్పరుస్తుంది. అలా భూ ఉష్ణోగ్రతలు పైకి వెళ్లకుండా అడ్డుకుంటుంది. తద్వారా పర్యావరణం నానాటికీ వేడెక్కుతోంది.
- వాయు నాణ్యతను కూడా మీథేన్ బాగా దెబ్బ తీస్తుంది. దాంతో మనుషులతో పాటు జంతువుల్లో కూడా శ్వాసకోశ సంబంధిత సమస్యలు పెరుగుతాయి.
- పర్యావరణానికి కార్బన్ డయాక్సైడ్ కంటే మీథేన్ వల్ల జరిగే నష్టం ఏకంగా 82 రెట్లు ఎక్కువ!
- తాజా అధ్యయనం కేవలం 2020 నాటికి అందులో ఉన్న డేటా ఆధారంగా చేసినదే. ఈ నాలుగేళ్లలో మీథేన్ ప్రభావం మరింత వేగంగా పెరుగుతూ వస్తోందన్నది పర్యావరణవేత్తల మాట. తక్షణం దిద్దుబాటు చర్యలు తప్పవని వారంటున్నారు.

విషమంగా ఏచూరి ఆరోగ్యం

24 గంటలు గడిచే వరకూ ఏమీ చెప్పలేం: ఎయిమ్స్ వైద్యులు




సాక్షి, న్యూఢిల్లీ: న్యూమోనియాతో బాధపడుతూ ఢిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు పార్టీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. న్యూమోనియా కారణంగా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌తో ఏచూరి బాధపడుతున్నారు. 72 ఏళ్ల ఏచూరిని కుటుంబీకులు ఆగస్టు 19న ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్చారు. ఆరోజు నుంచి ఆయనకు వెంటిలేటర్‌పైనే చికిత్స అందిస్తున్నారు. అయితే శరీరంలో ఇన్‌ఫెక్షన్ మరింత ఎక్కువ అవడం, ఇక్కడి మందులకు ఆ ఇన్‌ఫెక్షన్ తగ్గకపోవడంతో.. విదేశాల నుంచి మెడిసిన్ తెప్పించినట్లు తెలిసింది. మంగళవారం ఆయనకు విదేశాల నుంచి తెప్పించిన మెడిసిన్ ఇచ్చారు. 24 గంటలు గడిచిన తర్వాతనే ఆరోగ్య పరిస్థితిని వెల్లడించగలమని వైద్యులు కుటుంబీకులకు తెలిపారు. పలు విభాగాలకు చెందిన స్పెషలిస్టు డాక్టర్ల బృందం సీతారాం ఏచూరికి చికిత్స అందిస్తోంది. ఏచూరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న పార్టీ నేతలు, కార్యకర్తలు పరామర్శించేందుకు హస్తినకు వస్తున్నారు.

ఏఎస్‌జీగా ద్వారకానాథ్

హైదరాబాద్ న్యాయవాది నియామకం



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఆరుగురు అదనపు సొలిసిటర్ జనరళ్లను నియమించింది. వీరు మూడేళ్ల పాటు సేవలందిస్తారని పేర్కొంది. వీరిలో హైదరాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది ఎస్.ద్వారకానాథ్‌తో పాటు అర్చనా దవే, సత్యదర్శి సంజయ్, బ్రిజేందర్ చహార్, రాఘవేంద్ర శంకర్, రాజ్‌కుమార్ ఠాక్రే ఉన్నారు. ఈ నియామకాలతో మొత్తం 11 ఏఎస్‌జీ ఖాళీలనూ భర్తీ చేసినట్లయింది. ద్వారకానాథ్ న్యాయ రంగంలో విశేష అనుభవజ్ఞుడు. ఆయన తండ్రి, దివంగత దశరథరామరెడ్డి ఉమ్మడి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా చేశారు.



కశ్మీర్ వెళ్లేందుకు భయపడ్డా

- మాజీ హోం మంత్రి సుశీల్ కుమార్ షిండే వ్యాఖ్య
- అది కాంగ్రెస్ మార్కు పాలన అంటూ బీజేపీ విమర్శలు

న్యూఢిల్లీ: కశ్మీర్ వెళ్లేందుకు భయపడ్డానంటూ యూపీఏ హయాంలో కేంద్ర హోం మంత్రిగా పనిచేసిన సుశీల్ కుమార్ షిండే చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఢిల్లీలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో 'ఫైవ్ డికేడ్స్ ఆఫ్ పాలిటిక్స్'అనే పేరుతో తన ఆత్మకథను షిండే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పట్లో జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులను ఆయన గుర్తుకు తెచ్చుకున్నారు. 'హోం మంత్రి కాకమునుపు కశ్మీర్‌కు చాలాసార్లు వెళ్లాను. నా స్నేహితుడు, విద్యావేత్త విజయ్ ధార్ ఇంటికి అప్పట్లో వెళ్లేవాణ్ని. మంత్రి నయ్యాక మాత్రం 'శ్రీనగర్‌లో దాల్ సరస్సును చూడు, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరుగు. అంతేతప్ప, మిగతా చోట్లకు మాత్రం వెళ్లకు అని విజయ్ సలహా ఇచ్చాడు. దీంతో సాక్షాత్తూ దేశానికి హోం మంత్రినే అయినప్పటికీ కశ్మీర్ వెళ్లడానికి మాత్రం భయపడ్డా'అని చెప్పారు. 'స్వయంగా హోం మంత్రిని అయిన నేను ఈ విషయం ఎవరికి చెప్పుకోను? ఇప్పుడెందుకు చెబుతున్నానంటే..కేవలం నవ్వుకోడానికి మాత్రమే. మాజీ హోం మంత్రి ఇలాంటి వాటిపై మాట్లాడకూడదు'అని షిండే చెప్పారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో 2012–14 సంవత్సరాల్లో షిండే హోం మంత్రిగా ఉన్నారు. షిండే వ్యాఖ్యలపై బీజేపీ నేత, కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ..'కాంగ్రెస్ పాలనలో సాక్షాత్తూ దేశానికి హోం మంత్రే కశ్మీర్ వెళ్లేందుకు భయపడ్డారు. మోదీ హయాంలో మాత్రం ఏటా 2–3 కోట్ల మంది పర్యాటకులు జమ్మూకశ్మీర్‌ను సందర్శిస్తున్నారు. రెండు పార్టీల ప్రభుత్వాలకీ ఉన్న ముఖ్యమైన తేడా ఇదే'అని ఆయన పేర్కొన్నారు.



సుప్రీం డెడ్‌లైన్ బేఖాతరు..
సమ్మె ఆపని బెంగాల్ డాక్టర్లు

కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ఘటనపై బెంగాల్ వ్యాప్తంగా వైద్యుల సమ్మె కొనసాగుతోంది. వైద్యురాలి మృతికి కారకులపై చర్యలతో పాటు బాధ్యులైన కోల్‌కతా పోలీస్ కమిషనర్, రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఆరోగ్య సేవల డైరెక్టర్, వైద్యవిద్య విభాగం డైరెక్టర్ రాజీనామా కోసం వారు డిమాండ్ చేస్తుండటం తెలిసిందే. వారిపై సుప్రీంకోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేయడం, మంగళవారం సాయంత్రంలోగా విధుల్లో చేరాలని ఆదేశించడం తెలిసిందే. దాన్ని వైద్యులు బేఖాతరు చేశారు. తమ డిమాండ్లు నెరవేరేదాకా విధుల్లో చేరేది లేదన్నారు.

నేటి విచారణకు హాజరు కండి

బుధవారం ఎంక్వైరీ కమిటీ ముందు హాజరై నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని సమ్మెలో పాల్గొంటున్న 51 మంది వైద్యులకు ఆర్‌జీ కర్ ఆస్పత్రి యాజమాన్యం నోటీసులిచ్చింది. హాజరు కాని వారిని సంస్థ ఆవరణలోకి అనుమతించబోమని, కళాశాల కార్యక్రమాల నుంచి కూడా దూరంగా ఉంచుతామని స్పష్టం చేసింది.

చర్చల ఆహ్వానాన్ని తిరస్కరించిన జుడాలు

సమ్మె విరమణ కోసం చర్చలకు రావాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పంపిన ఆహ్వానాన్ని జూనియర్ డాక్టర్లు మంగళవారం తిరస్కరించారు. ఆహ్వానంలో వాడిన భాష అభ్యంతరకమని పేర్కొన్నారు. ''10 మందికి మించకుండా మీ చిన్న ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రతినిధులను కలవడానికి సచివాలయానికి రావొచ్చు' అంటూ ఆరోగ్యశాఖ కార్యదర్శి వారికి మెయిల్ పంపారు. ''ఈ భాష డాక్టర్లకు అవమానకరం. పైగా పరుషంగానూ ఉంది. అంతేగాక మేం రాజీనామా కోరుతున్న ఆరోగ్యశాఖ కార్యదర్శి ద్వారా పంపారు. ఇది మాకు అవమానమే. అందుకే దానికి స్పందించలేదు'' అని జుడాల నేత డాక్టర్ దేబాశిష్ హల్దార్ అన్నారు. చర్చల నిమిత్తం జూడాల ప్రతినిధుల కోసం సీఎం మమత రాత్రి 7.30 దాకా సచివాలయంలో వేచిచూశారని మంత్రి చంద్రిమా భట్టాచార్య తెలిపారు.

సందీప్ ఘోష్ కస్టడీ పొడిగింపు

ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు ఈ నెల 23వరకు పొడిగించింది. ఆయన భద్రతాధికారి అఫ్సర్ అలీ, సన్నిహితులు బిప్లవ్ సిన్హా, సుమన్ హజ్రా కస్టడీని కూడా 23 వరకు పొడిగించింది.వైద్యురాలి మృతి ఉదంతంలో నిర్లక్ష్యంతో పాటు ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకల ఆరోపణలతో ఆయన్ను సీబీఐ అరెస్టు చేయడం తెలిసిందే.

మళ్లీ రాజుకుంటున్న మణిపూర్

విద్యార్థుల చలో రాజ్‌భవన్ భగ్నం ● ఇంఫాల్, పరిసర ప్రాంతాల్లో కర్ఫ్యూ

5 జిల్లాలకు ఇంటర్నెట్ సేవలు బంద్ ● విద్యాసంస్థలకు 2 రోజులు సెలవు



నిరసనకారులపైకి టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్న పోలీసులు

ఇంఫాల్: కల్లోల మణిపూర్‌లో పరిస్థితి మళ్లీ అదుపు తప్పుతోంది. జాతుల ఘర్షణతో గతేడాది అట్టుడికిపోయిన ఆ రాష్ట్రంలో మరోసారి హింస పెచ్చరిల్లుతోంది. కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పెరిగిపోతున్న ఘర్షణలను నిరసిస్తూ విద్యార్థులు తలపెట్టిన ఆందోళనలు తీవ్ర రూపు దాలుస్తున్నాయి. డీజీపీ, భద్రతా సలహాదారును తొలగించాలంటూ గవర్నర్ నివాసాన్ని, సచివాలయాన్ని ముట్టించేందుకు వారంతా మంగళవారం విఫల యత్నం చేశారు. అడ్డుకున్న భద్రతా సిబ్బందిపైకి రాళ్లు తదితరాలు విసిరారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో 40 మందికి పైగా విద్యార్థులు గాయపడ్డారు. దాంతో లోయలోని ఐదు సమస్యాత్మక జిల్లాల్లో 5 రోజుల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం రాష్ట్రమంతటికీ వర్తిస్తుందని తొలుత పేర్కొన్నా, అనంతరం దాన్ని ఐదు జిల్లాలకే పరిమితం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్లు, విద్యా సంస్థలకు రెండు రోజుల పాటు సెలవు ప్రకటించారు. రాజధాని ఇంఫాల్‌తో పాటు పరిసర జిల్లాల్లో నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఎవరూ ఇళ్లనుంచి బయటికి రావొద్దని ఆదేశాలు జారీ చేశారు. ఆందోళనలు మరింత విస్తరించకుండా చూసేందుకే ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. మరో 2,000 మందికి పైగా సీఆర్పీఎఫ్ సిబ్బందిని కేంద్రం మణిపూర్‌కు తరలించింది. మణిపూర్‌లో వారం రోజులుగా జరుగుతున్న ఘర్షణల్లో కనీసం 12 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పలుచోట్ల డ్రోన్, రాకెట్ దాడులు జరిగినట్టు వార్తలొచ్చాయి. అవి వాస్తవమేనని ఐజీ కె.జయంతసింగ్ తెలిపారు. డ్రోన్లతో పాటు అధునాతన రాకెట్లతాలూకు విడి భాగాలను పౌర ఆవాస ప్రాంతాల్లో తాజాగా స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వెల్లడించారు. అంతకుమించి వివరాలు తెలిపేందుకు నిరాకరించారు. తౌబల్ ప్రాంతంలో నిరసనకారుల నుంచి దూసుకొచ్చిన తూటా ఓ పోలీసును గాయపరిచినట్టు చెప్పారు.

2.2% పెరిగిన పంటల సాగు

ఏపీ, తెలంగాణల్లో భారీ వర్షాల వల్ల దిగుబడులు తగ్గుతాయని అంచనా

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పంటల సాగు గణనీయంగా పెరిగిందని కేంద్ర వ్యవసాయ శాఖ పేర్కొంది. గతేడాదితో పోలిస్తే ఈసారి ఖరీఫ్‌లో పంటల సాగు 2.2 శాతం మేర పెరిగిందని తెలిపింది. గతేడాది 10.69 కోట్ల హెక్టార్లలో పంటలు సాగవ్వగా, ఈ ఏడాది సెప్టెంబర్ 6వ తేదీ నాటికి 10.92 కోట్ల హెక్టార్లలో పంటల సాగు జరిగిందని పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే వరి సాగు 3.53 కోట్ల హెక్టార్ల నుంచి 4 శాతం మేర పెరిగి 4.09 కోట్ల హెక్టార్లకు చేరిందని వెల్లడించింది. పప్పుధాన్యాల సాగు సైతం 1.17 కోట్ల హెక్టార్ల నుంచి 1.26 కోట్ల హెక్టార్లకు అంటే 7.5% పెరగ్గా, నూనె గింజల సాగు 1.89 కోట్ల హెక్టార్ల నుంచి 1.92 కోట్ల హెక్టార్లకు చేరిందని వెల్లడించింది. అయితే, పత్తి సాగు మాత్రం అధిక వర్షాల కారణంగా 1.23 కోట్ల హెక్టార్ల నుంచి 1.10 కోట్ల హెక్టార్లకు, 9% మేర తగ్గిందని వివరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగైనా భారీ వర్షాలు, వరదల కారణంగా దిగుబడి మాత్రం తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆయా రాష్ట్రాల్లో వాటిల్లిన పంట నష్టంపై అంచనాలు సిద్ధం కాలేదని తెలిపింది.

అల్ మవాసీ మానవతా జోన్‌పై
ఇజ్రాయెల్ దాడి

19 మంది దుర్మరణం



దాడి అనంతరం భీతావహ పరిస్థితి

డెయిర్ అల్ బలాహ్: గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడుల పర్వం ఆగడం లేదు. దక్షిణ గాజాలో వలసదారులకు ఆశ్రయం కల్పిస్తున్న మానవతా జోన్‌పై ఇజ్రాయెల్ దళాలు సోమవారం జరిపిన దాడుల్లో 19 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. 60 మంది గాయపడ్డారని పాలస్తీనా అధికారులు ప్రకటించారు. ఖాన్ యూనిస్ పరిధిలోని అల్–మవాసీ ప్రాంతంలో ఈ దాడి జరిగింది. మృతుల్లో మహిళలు, చిన్నారులు అధికంగా ఉన్నారు. అయితే 40 మంది చనిపోయినట్లు తొలుత వార్తలొచ్చాయి. మానవతా జోన్లలో రహస్యంగా పనిచేస్తున్న హమాస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఉగ్రవాదులపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. క్షిపణి దాడుల్లో 20 గుడారాలు దగ్ధమయ్యాయని, పేలుడు ధాటికి 30 అడుగుల లోతు గుంతలు ఏర్పడ్డాయని గాజా సివిల్ ఎమర్జెన్సీ సర్వీస్ తెలిపింది. గల్లంతైన వారి కోసం గాలిస్తున్న గాజా సివిల్ డిఫెన్స్ సభ్యులు ఇసుకను తవ్వుతున్న దృశ్యాలను హమాస్ మీడియా సంస్థ అల్ అక్సా టీవీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. ''200 పైచిలుకు నిర్వాసితుల గుడారాల్లో 20 ధ్వంసమయ్యాయి. వాటిలో ఉంటున్న కుటుంబాలు అదృశ్యమయ్యాయి'' అని గాజా సివిల్ డిఫెన్స్ అధికార ప్రతినిధి మహమూద్ బస్సాల్ చెప్పారు. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఇప్పటికీ దాడులు ఆపడం లేదని శరణార్థులు వాపోయారు. దాడి జరిగిన చోట తమ వాళ్లెవరూ లేరని హమాస్ పేర్కొంది.

ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు కుట్ర: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని దొడ్డిదారిన కూల్చాలని భారతీయ జనతా పార్టీ చూస్తోందని ఆప్ సీనియర్ నేత, మంత్రి ఆతిశి మంగళవారం ఆరోపించారు. రాష్ట్రపతి పాలనకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. కేజ్రీవాల్ జైలులో ఉండటంతో ఢిల్లీలో రాజ్యాంగ సంక్షోభం నెలకొందని బీజేపీ ఎమ్మెల్యేలు ఆగస్టు 30న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు వినతిపత్రం సమర్పించారు. ఆప్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని కోరారు. ఆరో ఫైనాన్స్ కమిషన్ (ఢిల్లీ)ని ఏర్పాటు చేయలేదని, ఐదు నెలలుగా అసెంబ్లీ సమావేశాలు పెట్టలేదని, 11 కాగ్ రిపోర్టులను అసెంబ్లీలో పెట్టకుండా తొక్కిపెట్టారని.. ఢిల్లీలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని బీజేపీ ఆరోపించింది. వీరి వినతిని రాష్ట్రపతి కార్యాలయం సోమవారం కేంద్ర హోంశాఖకు పంపింది. ఈ నేపథ్యంలో ఆతిశి మంగళవారం స్పందించారు. ''కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కూల్చితే ఢిల్లీ ప్రజలు బీజేపీకి బుద్ధి చెబుతారు. 2025 మొదట్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 సీట్లనూ ఆప్‌యే గెలుస్తుంది'' అన్నారు.

ఇక 20 కి.మీ. దాకా టోల్ లేదు

న్యూఢిల్లీ: జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై తొలి 20 కి.మీ. ప్రయాణానికి ఇకపై టోల్ ఫీజు వసూలు చేయబోరు. గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) ఉన్న వాహనాలకే ఇది వర్తిస్తుంది. 20 కి.మీ. మించి తిరిగితే మొత్తం దూరానికీ టోల్ వసూలు చేస్తారు. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ (ఫాస్టాగ్)తో పాటు ఇకపై జీఎన్ఎస్ఎస్ ఆధారిత టోల్ వసూలు కూడా కొనసాగుతుంది. ఒకప్పుడు టోల్ గేట్ల వద్ద మాన్యువల్ చెల్లింపు విధానం ఉండగా తర్వాత ఫాస్టాగ్ రావడం తెలిసిందే. ఫాస్టాగ్ వాహనాలు టోల్‌ప్లాజా వద్ద కాసేపు ఆగి ఆటోమేటిక్‌గా చార్జి చెల్లింపు జరిగాక వెళ్లిపోతాయి. పైగా జీఎన్ఎస్ఎస్ ఉన్న వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేదు. పైగా జీఎన్ఎస్ఎస్ విధానంలో వాహనం హైవేపై ఎంత దూరం వెళ్లిందో స్పష్టంగా తెలుస్తుంది. ఆ దూరానికే టోల్ వసూలుచేస్తారు.

నిర్నిరోధంగా పరిశోధనలు

అనుసంధాన్ ఫౌండేషన్ భేటీలో మోదీ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ సమస్యలకు స్థానికంగా పరిష్కారాలు కనిపెట్టడంలో ప్రపంచానికి భారత్ మార్గదర్శకంగా నిలవాలని ప్రధాని నరేంద్ర మోదీ అభిలషించారు. ''ఇది సాకారం కావాలంటే పరిశోధనల రంగం ఇతోధికంగా పుంజుకోవాలి. ఆ దారిలో ఉన్న అడ్డంకులన్నింటినీ గుర్తించి తొలగించాలి'' అని పిలుపునిచ్చారు. కొత్తగా ఏర్పాటైన అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ పాలకవర్గ తొలి భేటీ ప్రధాని సారథ్యంలో మంగళవారం జరిగింది. ఫౌండేషన్ ఏర్పాటు భారత శాస్త్ర సాంకేతిక రంగంలో నూతనాధ్యాయానికి నాంది పలికిందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ''ఇది విద్యా రంగ పరిశోధనలకు, పరిశ్రమలకు మధ్య వారధిగా మారుతుంది. దేశ పరిశోధనల రంగం ముఖచిత్రాన్నే మార్చేస్తుంది'' అని ఆశాభావం వెలిబుచ్చారు. ''మన దేశం లెక్కలేనంతమంది యువ ఇన్నోవేటర్లతో అలరారుతోంది. వారంతా భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. అవి సాకారమయ్యేదాకా విశ్రమించొద్దు'' అంటూ పిలుపునిచ్చారు. వర్సిటీలు, అత్యుత్తమ సంస్థల పరస్పర భాగస్వామ్యంతో వినూత్న పరిశోధనల దిశగా 'హబ్–అండ్–స్పోక్' పేరిట పథకాన్ని అమలు చేయాలని భేటీలో నిర్ణయించారు.



సైబర్ నేరాల కట్టడికి ఏఐని వాడండి

దర్యాప్తు సంస్థలకు అమిత్ షా సూచన

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికను వినియోగించుకుంటూ సైబర్ నేరాల కట్టడికి కృషి చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా దర్యాప్తు సంస్థలను కోరారు. ఆన్‌లైన్‌లో చిన్నారులు, మహిళలపై వేధింపులకు పాల్పడటం, తప్పుడు వార్తలను ప్రచారం చేయడం, మాయమాటలతో జనం కష్టార్జితాన్ని దోచుకునే నేరగాళ్లను ఏఐ ద్వారా గుర్తించొచ్చని మంత్రి తెలిపారు. ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో దాదాపు సగం, 46 శాతం వరకు భారత్ వాటా ఉందని, ఇలాంటి సమయంలో నేరాలను నివారించడం అత్యంత కీలకమని అన్నారు. అయితే, దర్యాప్తు విభాగాలకు ఇది పెద్ద సవాల్‌తో కూడుకున్న వ్యవహారమని చెప్పారు. మంగళవారం ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) మొట్టమొదటి వ్యవస్థాపక దినోత్సవంలో మంత్రి అమిత్ షా కీలకోపన్యాసం చేశారు. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో 2018లో ఐ4సీ ఏర్పాటైంది. సైబర్ నేరాల కట్టడికి జాతీయ స్థాయిలో సమన్వయ కేంద్రంగా ఐ4సీ పనిచేస్తుంది. ఈ సందర్భంగా సైబర్ ఫ్రాడ్ మిటిగేషన్ సెంటర్(సీఎఫ్ఎంసీ), సమన్వయ వేదిక, సైబర్ కమాండోస్ ప్రోగ్రాం, సస్పెక్ట్ రిజిస్ట్రీ అనే నాలుగు విభాగాలను ఐ4సీలో అమిత్ షా ప్రారంభించారు.సైబర్ నేరాలపై సమర్థవంత పోరాటం కోసం పాతకాలపు 'అవసరమైన విషయం మాత్రమే చెప్పడం'అనే పద్ధతిని విడనాడి, 'బాధ్యతలను పంచుకోవడం'అనే విధానాన్ని అనుసరించాలని సూచించారు.

అప్పుడే రిజర్వేషన్లు తీసేయాలి: రాహుల్



వాషింగ్టన్: పారదర్శకతతో భారతీయ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు లభించిన పరిస్థితుల్లో దేశంలో రిజర్వేషన్లను తొలగించడంపై కాంగ్రెస్ పార్టీ ఆలోచిస్తుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ అక్కడి జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. '' ఆర్థిక ప్రయోజనాలు గిరిజనులు, ఓబీసీలు, దళితులకు సరిగా దక్కట్లేవు. ప్రతి 100 రూపాయల్లో గిరిజనులు పొందేది కేవలం 10 పైసలు. దళితులు, ఓబీసీలకు చెరో ఐదు పైసలు దక్కుతున్నాయి. అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కిన పరిస్థితుల్లో రిజర్వేషన్ల రద్దు అంశాన్ని కాంగ్రెస్ ఆలోచిస్తుంది. అయితే అలాంటి నిష్పక్షపాత పరిస్థితులు భారత్‌లో చాలా కష్టం. ఎందుకంటే భారత్‌లో 90 శాతం జనాభాకు ఎలాంటి ప్రాధాన్యత దక్కట్లేదు. బడా పారిశ్రామికవేత్తల్లో గిరిజనులు, దళితులు, ఓబీసీలు దాదాపు లేరు. మీరు టాప్ 200 భారతీయ వాణిజ్యవేత్తల జాబితా చూడండి. అందులో ఒక్కరు కూడా గిరిజనులు, దళితులు ఉండరు. ఉంటే ఒకే ఒక్క ఓబీసీ వ్యాపారి ఉండొచ్చేమో'' అని అన్నారు. '' ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) తెస్తామని బీజేపీ ప్రభుత్వం చెబుతోంది. అసలు బీజేపీ ఏ రకంగా యూసీసీని అమలుచేయాలనుకుంటోంది. వాళ్ల ప్రాధాన్యాలేమిటో చెప్పమనండి. తర్వాత మేం స్పందిస్తాం'' అన్నారు.

మోదీ భయం మటుమాయం

''జనాల్లో మోదీ సృష్టించిన భయం లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో పోయింది. మోదీని ఢీకొట్టలేరన్న భయాన్ని జనాల్లో కల్పించేందుకు ఎంతో ధనం ధారపోశారు. ప్రణాళికలు వేశారు. కానీ రాజ్యాంగంపైనే దాడి చేస్తున్న బీజేపీకి మెజారిటీ రాకుండా ఓటర్లు వాత పెట్టారు. దాంతో మోదీ భయం ఒక్క సెకన్‌లో మటుమాయమైంది. 56 అంగుళాల ఛాతీ, దైవంతో అనుసంధానం వంటివన్నీ ఇప్పుడు ఒట్టిమాటలు. మోదీని నేను శత్రువులా చూడను. ద్వేషించను. కానీ ఆయన దృక్పథంతో ఏకీభవించను'' అని రాహుల్ అన్నారు.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



.. ఇక జన్‌పోషణ్ కేంద్రాలు
ప్రభుత్వ చౌకధరల దుకాణాలు జన్ పోషణ్ కేంద్రాలుగా మారనున్నాయి. నెలవారీ సబ్సిడీ సరుకుల పంపిణీతో పాటు నిత్యావసరాల ఉత్పత్తులు కూడా అందుబాటులోకి రానున్నాయి. -10లో



స్టార్ బ్రాండ్స్
నగరం సెలబ్రిటీ బ్రాండ్లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. క్రేజ్ పొందుతున్న వారిలో టాలీవుడ్, బాలీవుడ్ తారలు, భారతీయ క్రికెటర్లు ఉన్నారు. - సిటీ ప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 29.0/24.0
నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 29, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



పోరాటమే ఊపిరిగా..

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర నృత్య రూపకం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. ఐలమ్మ వీరోచిత పోరాట ఘట్టాలు.. బోనాలు, బతుకమ్మ ఉత్సవ దృశ్యాలు ఆనాటి తెలంగాణ బతుకు చిత్రాన్ని కళ్లకు కట్టాయి. ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మంగళవారం రవీంద్రభారతిలో డాక్టర్ అలేఖ్య పుంజాల ఆధ్వర్యంలో కళాకారులు నృత్య రూపక ప్రదర్శనతో నివాళులు అర్పించారు.

రామకృష్ణ మఠం సేవలు ఎనలేనివి: గవర్నర్


సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కవాడిగూడ: యువత వ్యక్తిత్వ వికాసానికి రామకృష్ణ మఠం అందిస్తున్న సేవలు ఎనలేనివని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక జ్యోతి వెలిగించేందుకు రామకృష్ణ మఠం దశాబ్దాలుగా చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. మంగళవారం రామకృష్ణమఠంలో అంతర్భాగమైన వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెంట్ రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ.. నిరంతర అభ్యాసనతోనే పరిపూర్ణత సాధ్యమవుతుందని విద్యార్థులకు సూచించారు. 1893 సెప్టెంబర్ 11న చికాగో విశ్వవేదిక సాక్షిగా స్వామి వివేకానంద హిందూ ధర్మ గొప్పదనాన్ని చాటి చెప్పారని గవర్నర్ గుర్తు చేశారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం రామకృష్ణ మఠంలో నాటి రామకృష్ణ మఠం, మిషన్ జాతీయ సర్వాధ్యక్షుడు స్వామి రంగనాథానంద వివేకానంద ఇనిస్టిట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెంట్ విభాగాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇప్పటివరకు 20 లక్షల మంది యువతకు వ్యక్తిత్వ వికాసం, యోగా, ధ్యానం, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్, మఠం జాతీయ ఉపాధ్యక్షుడు స్వామి సుహితానంద, డెక్స్‌పెరిటి గ్లోబల్ వ్యవస్థాపకుడు శరద్ సాగర్ పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలు నిషేధం

ఆంక్షలు విధించిన నగర పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తున్న నగర పోలీసులు ఈ ఏడాది కూడా ట్యాంక్ బండ్‌పై నిమజ్జనాలను నిషేధించారు. ఆ మార్గంలో ఆంక్షలు విధించిన అధికారులు స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. హుస్సేన్‌సాగర్‌లో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి వచ్చే వాహనాలను పీవీ నర్సింహారావు మార్గ్, ఎన్టీఆర్ మార్గ్‌ల్లోకి మళ్లిస్తున్నారు. కేవలం ఈ రెండు ప్రాంతాల్లోనే నిమజ్జనానికి అనుమతిస్తున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పీవీఎన్ఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొలనుల వద్ద అదనంగా క్రేన్లు ఏర్పాటు చేయాని నిర్ణయించారు. మంగళవారం నుంచి నిమజ్జనాలు ఊపందుకోనున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని కొత్వాల్ సీవీ ఆనంద్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

వినాయక నిమజ్జనానికి 'వి' వాహనాలు



సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణహితంగా వినాయక నిమజ్జనాన్ని జరుపుకోవాలని వోడాఫోన్ ఐడియా క్లస్టర్ బిజినెస్ హెడ్ (ఏపీ, తెలంగాణ, కర్ణాటక) ఆనంద్ దాని పిలుపునిచ్చారు. నిమజ్జనం కోసం ప్రత్యేకమైన ట్యాంకుతో 'వి' (వీఐ) వాహనాలు నగరంలోని వివిధ హౌసింగ్ సొసైటీలను సందర్శిస్తాయని తెలిపారు. కూకట్‌పల్లి, కుషాయిగూడ, ఏఎస్‌రావు నగర్, సనత్‌నగర్, మూసాపేట్, కొండాపూర్, మదీనాగూడ, చందానగర్, నిజాంపేట్, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట్, కొంపల్లి, హయత్‌నగర్, సుచిత్ర, ఎల్‌బీ నగర్, మియాపూర్, తిరుమలగిరి తదితర ప్రాంతాలు 'వి' జాబితాలో ఉన్నాయని తెలిపారు. స్థానికులు తమ ఇంటి వద్దే సురక్షితంగా నిమజ్జనాన్ని నిర్వహించేందుకు ఈ వాహనాలు ప్రత్యేకంగా డిజైన్ చేశామన్నారు. విషపూరితమైన పెయింట్స్, మట్టి మొదలైనవి పేరుకుపోయి నీటి వనరులు కలుషితం కాకుండా, చెరువుల్లోని జీవరాశులకు హాని కలగకుండా ఉండేలా చూసేందుకు, నిమజ్జనం కోసం రద్దీగా ఉండే ప్రాంతాలకు వెళ్లే అవసరాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నామని వివరించారు.

పోలీస్ అకాడమీలో పాసింగ్ అవుట్ పరేడ్ నేడు

హాజరు కానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బండ్లగూడ: హిమాయత్‌సాగర్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో బుధవారం కంబైన్డ్ పాసింగ్ అవుట్ పరేడ్‌ను నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ అభిషేక్ బిష్టా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి సాయంత్రం నిర్వహించే ఈ పరేడ్‌లో 547 ఎస్‌సీటిఎస్ఐ (సివిల్), ఎస్‌సీటీఆర్ఎస్ఐ (ఏఆర్) కంబైన్డ్ పాసింగ్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారని చెప్పారు. సీనియర్ అధికారులు, ప్రత్యేక సేవలందిస్తున్న, పదవీ విరమణ పొందిన అధికారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు: అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: మాతృ మరణాలను అరికట్టేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గత సంవత్సరంలో సంభవించిన మాతృ మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులకు సరైన వైద్యం అందించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య సేవలు అందించే సమయంలో ప్రొటోకాల్ పాటించాలని ఆయన సూచించారు. రక్తహీనత ముందస్తుగానే గుర్తించి అవగాహన కల్పించాలని, శిశు మరణాలపైనా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రులలో డెలివరీ పాయింట్స్ వద్ద అవసరమైన చోట బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకట్, డీసీహెచ్ఎస్ రాజేంద్రనాథ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అనుదీప్ దురిశెట్టి

ఆకాశ మార్గం.. ఆనంద విహారం



10 కిలోమీటర్ల మార్గంలో నిర్మాణం
- రూ.200 కోట్లతో అంచనాలు
- డీపీఆర్ కోసం త్వరలో కన్సల్టెన్సీ ఎంపిక
- ప్రణాళికలను సిద్ధం చేసిన హుమ్టా

హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్, సైకిల్ ట్రాక్



సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక హుస్సేన్ సాగర్ చుట్టూ ఆకాశయానానికి హెచ్ఎండీఏ అనుబంధ హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (హుమ్టా) ప్రణాళికలను సిద్ధం చేసింది. దేశవిదేశాలకు చెందిన పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్న హుస్సేన్ సాగర్ అందాలను ఆకాశంలోంచి వీక్షించేందుకు అనుగుణంగా సుమారు 10 కిలోమీటర్ల మార్గంలో స్కైవాక్, సైకిల్ ట్రాక్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు కోసం త్వరలో కన్సల్టెన్సీని ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కన్సల్టెన్సీల ఎంపిక కోసం టెండర్‌లను ఆహ్వానించనున్నారు. సాగరానికి అన్ని వైపులా రాకపోకలు సాగించేలా ట్రాక్‌ను నిర్మిస్తారు. స్కైవాక్ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు అధికారులు కార్యాచరణ చేపట్టారు.

సంజీవయ్యపార్కు, పీపుల్స్‌ప్లాజా, జలవిహార్, ఎంఎంటీఎస్ స్టేషన్, లేక్‌వ్యూ పార్కు, ఎన్టీఆర్ పార్కు, లుంబిని పార్కు, సెక్రటేరియట్, అంబేడ్కర్ విగ్రహం తదితర సందర్శనీయ స్థలాలను చేరుకొనేలా స్కైవాక్‌ను నిర్మించనున్నారు. దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా ఇలాంటి స్కైవాక్‌లు లేవని, హైదరాబాద్‌లో హుస్సేన్‌సాగర్‌పై ఏర్పాటు చేయనున్నదే మొదటి స్కైవాక్ కానుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్ నగరానికి ప్రపంచవ్యాప్తంగా గొప్ప గుర్తింపు లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. నగరాన్ని గ్లోబల్‌సిటీగా అభివృద్ధి చేసేందుకు సుమారు 55 కిలోమీటర్ల మార్గంలో ఉన్న మూసీనదిని శుద్ధి చేసి రెండు వైపులా అభివృద్ధి చేసేందుకు అతి పెద్ద ప్రాజెక్టును చేపట్టిన సంగతి తెలిసిందే. హుస్సేన్‌సాగర్‌పై స్కైవాక్‌తోనూ నగరం పర్యాటకంగా మరింత పురోగమించనుంది.

వాకింగ్‌తో పాటు సైక్లింగ్..
- సాగర్ చుట్టూ సుమారు 10 కిలోమీటర్ల మార్గంలో నిర్మించనున్న స్కైవాక్ పైకి చేరుకొనేందుకు, కిందకు దిగేందుకు వివిధ ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ దారులు ఉంటాయి. స్కైవాక్ మొత్తం 5.5 మీటర్ల వెడల్పు ఉంటుంది.
- ఇందులో 3 మీటర్లు సైకిల్ ట్రాక్ కోసం కేటాయిస్తారు. సైక్లిస్టులు ఈ మార్గంలో రాకపోకలు సాగించవచ్చు.
- 0.5 మీటర్ల వెడల్పుతో ఆహ్లాదకరమైన పచ్చదనంతో కూడిన సెంట్రల్ మీడియన్ ఉంటుంది. దానిని ఆనుకొని 2 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేస్తారు. దీంతో సందర్శకులు ఒకే ట్రాక్‌పై నడిచేందుకు, సైక్లింగ్ చేసేందుకు అవకాశం ఉంటుంది.
- ట్రాక్‌కు రెండు వైపులా గ్రీనరీని ఏర్పాటు చేయనున్నారు. కేవలం పర్యాటకులు, సందర్శకులతో పాటు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేందుకు కూడా స్కైవాక్‌ను వినియోగించుకోవచ్చు. అందం, ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని అందజేసేలా ట్రాక్ సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

పర్యాటకుల స్వర్గధామం..
- ఒకవైపు అందమైన శ్వేతసౌధం సచివాలయం, మరోవైపు అంతర్జాతీయ హంగులతో నిర్మించిన అమరుల స్మారకం, 125 అడుగుల ఎత్తు అంబేడ్కర్ భారీ విగ్రహం దేశవిదేశాలకు చెందిన పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హుస్సేన్ సాగర్‌లో కొలువైన బుద్ధుడిని సందర్శించుకోవడంతో పాటు నెక్లెస్ రోడ్డు, పీపుల్స్‌ప్లాజా తదితర ప్రాంతాలను సందర్శించేందుకు ప్రతిరోజూ సుమారు 5 వేల మందికి పైగా పర్యాటకులు తరలివస్తున్నారు. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో 10 వేల మందికి పైగా సందర్శిస్తున్నట్లు అంచనా. వినాయక నవరాత్రి ఉత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో లక్షలాది మంది సందర్శకులు హుస్సేన్‌సాగర్, ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాలను సందర్శిస్తున్నారు.
- స్కైవాక్, సైకిల్ ట్రాక్ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే పర్యాటకుల సంఖ్య రెట్టింపవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సుమారు రూ.200 కోట్లతో అంచనాలు..
- హుస్సేన్‌సాగర్ చుట్టూ నిర్మించనున్న స్కైవాక్‌కు కిలోమీటర్‌కు రూ.20 కోట్ల చొప్పున మొత్తం 10 కిలోమీటర్ల మార్గానికి రూ.200 కోట్లు ఖర్చవుతాయని అంచనా.
- సిటీబస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లలో వచ్చిన సందర్శకులు ఒకచోట నుంచి మరో చోటకు వెళ్లేందుకు స్కైవాక్‌ను వినియోగించుకోవచ్చు. రోడ్డు మార్గంలో వెళ్లాల్సిన అవసరం లేకుండా తిరిగేందుకు అవకాశం ఉంటుంది. ఉదాహరణకు లుంబినీపార్కును సందర్శించిన అనంతరం జలవిహార్‌కు వెళ్లాలనుకుంటే చక్కగా ఆకాశమార్గంలో వెళ్లిపోవచ్చు. అటు సంజీవయ్యపార్కు ఎంఎంటీఎస్ స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు ఈ మార్గంలో ఎన్టీఆర్ పార్కుకు చేరుకోవచ్చు.

కొత్వాల్‌గా మళ్లీ వస్తానని అనుకోలేదు

గణపతి అనుగ్రహంతో చవితి నాడు వచ్చా
- నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్
- ఖైరతాబాద్ వినాయకుడికి పూజలు


మహాగణపతిని దర్శించుకున్న కొత్వాల్ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: తాను మరోసారి హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా వస్తానని అనుకోలేదని, గణనాథుడి అనుగ్రహంతోనే రెండోసారి కొత్వాల్‌గా పని చేసే అవకాశం వచ్చిందని సిటీ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఆయనను హైదరాబాద్ సీపీగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడగా.. సోమవారం బాధ్యతలు తీసుకున్న విషయం విదితమే. ప్రస్తుతం నగరంలో గణేష్ ఉత్సవాలు జరుగుతుండటంతో ఆ బందోబస్తు, భద్రత ఏర్పాట్లపై ఆయన దృష్టి పెట్టారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని 70 అడుగుల బడా గణేషుడిని దర్శనం చేసుకున్న సీవీ ఆనంద్.. మధ్య మండల పోలీసులు చేపట్టిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'నన్ను సీపీగా నియమిస్తూ గణేష్ చతుర్థి రోజు ఉత్తర్వులు రావడం సంతోషంగా ఉంది. మధ్య మండల డీసీపీగా ఉన్నప్పటి నుంచి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సుదర్శన్‌తో కలిసి పని చేస్తున్నా. ప్రతి ఏడాదీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా గణేష్ ఉత్సవాలను పూర్తి చేస్తున్నారు. ఖైరతాబాద్ గణేషుడి వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ పోలీసు బందోబస్తు ఉంది. ఇక్కడ దర్శనానికి వచ్చే ప్రజలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ నిర్వహిస్తూ అవసరమైన స్థాయిలో బందోబస్తు పెంచుతున్నాం. సామూహిక నిమజ్జనం రోజు ఈ వినాయకుడి నిమజ్జనం అయ్యే వరకు మిగిలిన నిమజ్జనాలు సజావుగా సాగవు. ఈ నేపథ్యంలో ఆ రోజు ఉదయం త్వరగా పూజ పూర్తి చేసి, ఉదయం 6.30 గంటలకే గణనాథుడిని నిమజ్జనానికి తీసుకువెళ్లాలని ఉత్సవ కమిటీని కోరుతున్నాం. మధ్యాహ్నం 1.30 గంటలకు నిమజ్జనం పూర్తి చేయాలన్నది లక్ష్యంగా నిర్దేశించుకుందాం. ఈ నిమర్జనం కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఒక భక్తుడిగా, హైదరాబాదీగా ఉన్న నన్ను వినాయకుడే రెండోసారి సీపీగా రప్పించారు' అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

వర్సిటీల సమస్యలపై గవర్నర్‌కు పోస్టుకార్డులు



ఉస్మానియా యూనివర్సిటీ: వీసీల నియామకంతో పాటు వర్సిటీల సమస్యల పరిష్కరించాలని గవర్నర్‌కు విద్యార్థులు పోస్టుకార్డులు రాశారు. మంగళవారం విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు టీకే శివ, విద్యార్థులు కార్డులు రాసి ఓయూ పోస్టు బాక్స్‌లో వేశారు. కార్యక్రమంలో భాస్కర్, నరేంద్ర, శ్రీనివాస్, సాయితేజ, మోహన్‌రెడ్డి, సంధ్య, సుజాత, శ్యామల పాల్గొన్నారు.

ఎస్టీపీలను సందర్శించిన జలమండలి ఈడీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మీరాలం, నాగోల్‌లో నిర్మిస్తున్న ఎస్టీపీలను మంగళవారం జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ సందర్శించారు. ఎస్టీపీల నిర్మాణం, పనితీరు, అందులో ఉపయోగించే సాంకేతికతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి అడ్మిన్ బిల్డింగ్, లాబొరేటరీని పరిశీలించారు. సైట్‌లోని టెక్నీషియన్లతో మాట్లాడారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఎస్టీపీ జీఎం, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

స్మార్ట్‌గా 'చెత్త' పర్యవేక్షణ



నిర్వహణకు కమాండ్ కంట్రోల్ సెంటర్
- ఆధునిక సాంకేతికతతో నగర పరిశుభ్రత
- త్వరలో ఏర్పాటుకు జీహెచ్ఎంసీ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో చెత్త సమస్య పరిష్కారానికి ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని స్మార్ట్‌గా పర్యవేక్షించే కార్యక్రమాలకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. గతంలోనూ ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటామన్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. మళ్లీ ఇప్పుడు అందుకు సిద్ధమవుతోంది. ఏటా రూ.వందల కోట్లు వ్యయం చేస్తున్నప్పటికీ జీహెచ్ఎంసీలో చెత్త సమస్యలు తీరడం లేదు. ఇంటింటి చెత్త సేకరణ నుంచి మొదలు పెడితే డంపింగ్ కేంద్రానికి తరలించేంతవరకూ ఎన్ని పనులు చేపట్టినా సమస్య సమసిపోవడం లేదు. ఈ నేపథ్యంలో అత్యంత ఆధునిక సాంకేతికతతో కూడిన ఐటీ ఆధారిత కంట్రోల్ కమాండ్ సెంటర్ ఏర్పాటుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. కేవలం చెత్త నిర్వహణ కోసమే ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసే కార్యాచరణకు సిద్ధమైంది. ఈ సెంటర్ పని ప్రారంభించాక ఇళ్ల నుంచి చెత్త తరలించే స్వచ్ఛ ఆటోల కదలికల నుంచి హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు తదితర సంస్థల నుంచి బల్క్ గార్బేజ్ తరలించే ట్రక్కుల కదలికల దాకా అన్ని వాహనాలు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నదీ జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచే సంబంధిత అధికారులు పర్యవేక్షించవచ్చు.

– చెత్త తరలించే వాహనాలకు జీపీఎస్ ఉపకరణాలు అమర్చుతారు. తద్వారా వాటి ప్రయాణాల్ని జీహెచ్ఎంసీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసే భారీ స్క్రీన్ ద్వారా వీక్షిస్తూ ఏ వాహనం ఎప్పుడు బయలుదేరింది.. ఎటువైపు ప్రయాణిస్తోంది.. ఎంత చెత్త తరలిస్తోంది తదితర వివరాలన్నీ తెలుసుకోవచ్చు. క్షేత్రస్థాయిలోని వారికి తగిన ఆదేశాలు జారీ చేయవచ్చు. ఈ విధానం వల్ల ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని సైతం తక్షణం పరిష్కరించవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఇందుకుగాను అవసరమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లతో పాటు సుశిక్షితులైన సిబ్బందిని నియమించేందుకు ఆసక్తిగల ఏజెన్సీలను జీహెచ్ఎంసీ ఆహ్వానించింది. ఏర్పాటయ్యే కమాండ్ కంట్రోల్ సెంటర్ 24 గంటల పాటు పని చేయాల్సి ఉంటుంది. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసే ఏజెన్సీయే మూడేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు కూడా చేపట్టాల్సి ఉంది.

రియల్ టైమ్ ట్రాకింగ్
ఈ విధానంలో చెత్త తరలించే వాహనాల్ని రియల్ టైమ్‌లో ట్రాకింగ్ చేయడంతో పాటు చెత్త పరిమాణాల్లోనూ గోల్‌మాల్ జరగకుండా అరికట్టవచ్చునని అధికారులు తెలిపారు. రోజురోజూకు పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరంలో చెత్త సమస్యలు మరింత పెరగకుండా ఉండేందుకు ఈ విధానం ద్వారా పర్యవేక్షణతో చెత్త సమస్యలకు పరిష్కారం దొరకగలదని భావిస్తున్నారు. చెత్త తరలించేవాహనాలతో పాటు రోడ్లు ఊడ్చే స్వీపింగ్ యంత్రాల వాహనాల కదలికల్నీ ఈ విధానంలో పర్యవేక్షిస్తారు. ప్రస్తుతం పేరుకు స్వీపింగ్ మెషిన్లున్నా, నేలను తాకకుండా, రోడ్లను ఊడ్చకుండానే ఏటా కోట్లాది రూపాయల దుబారా జరుగుతోందనే విమర్శలున్నాయి. ఈ ఆధునిక సాంకేతికతతో దానికీ అడ్డుకట్ట పడుతుందని చెబుతున్నారు.

అమలు చేస్తారా?
గతంలోనూ పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక యాప్ ద్వారా స్వచ్ఛ ఆటోలు ఏయే ఇళ్లకు వెళ్లాలి.. ఎక్కడ తిరుగుతున్నాయి.. అన్నది పరిశీలించడమే కాక అవి దారి మళ్లితే ఆటోమేటిక్‌గానే సంబంధిత అధికారికి అలర్ట్ వెళ్తుందని, ఇతరత్రా ఎన్నెన్నో చెప్పిన జీహెచ్ఎంసీ అధికారులు ఏళ్ల గడుస్తున్నా ఆ విధానాన్ని అమలు చేయలేదు. మళ్లీ ఇప్పుడు తాజాగా కమాండ్ కంట్రోల్ సెంటర్ పేరిట సిద్ధమయ్యారు. ఇంతకీ దీన్నయినా అమలు చేస్తారో.. లేదో వేచి చూడాల్సిందే!

హిందీ భాష ప్రాధాన్యం పెరగాలి

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్క్‌షాప్



సమావేశంలో పాల్గొన్న బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ జీఎం వీవీ రావు

సనత్‌నగర్: హిందీ భాష ప్రాధాన్యత పెరగాలని కేంద్రఅధికార భాషా విభాగం, హిందీ బోధనా పథకం మాజీ డిప్యూటీ డైరెక్టర్ కమాలుద్దీన్ అన్నారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం బేగంపేట విమానాశ్రయంలో హిందీ భాషపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన కమాలుద్దీన్ హిందీ పదజాలాన్ని ఉదాహరణలతో వివరించి వాటిని ఆచరణలో పెట్టాలన్నారు. ఎయిర్‌పోర్ట్ జనరల్ మేనేజర్, కో–ఆర్డినేషన్ ఇన్‌చార్జి వీవీ రావు మాట్లాడుతూ హిందీలో మాట్లాడేలా అధికారులు, ఉద్యోగులను చైతన్యం చేయడమే వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశమన్నారు. అధికార భాషకు సంబంధించిన నిబంధనల అమలులో శాఖాధిపతుల పాత్ర కీలకమన్నారు. ఈ వర్క్‌షాప్ అనంతరం శిక్షణ పొందిన అధికారులు తమ రోజువారీ కార్యాలయ పనుల్లో హిందీని ఉపయోగిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జాయింట్ జనరల్ మేనేజర్ రీసెర్చ్ అపూర్వజైన్, కమ్యూనికేషన్స్ జాయింట్ జనరల్ మేనేజర్ రవిబాబు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ నీతాసురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాలన షురూ..

- మున్సిపల్ శాఖ ఆదేశాలతో బాధ్యతల స్వీకరణ
- ఎంపీఓలు, కార్యదర్శులు, సిబ్బందిని మున్సిపల్ లేదా పీఆర్ శాఖలో కలిపేందుకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో/మేడ్చల్: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 13 పురపాలక సంఘాల్లో విలీనమైన 51 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 51 గ్రామ పంచాయతీలకు పట్టణ హోదా దక్కిన నేపథ్యంలో స్పెషల్ ఆఫీసర్ నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కొనసాగేలా సంబంధిత శాఖ చర్యలు తీసుకుంటోంది. రంగారెడ్డి జిల్లాలో 12 పంచాయతీలు 4 పురపాలికల్లో విలీనం కాగా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 28 పంచాయతీలు 7 పురపాలక సంఘాల్లో ,సంగారెడ్డి జిల్లాలో 11 పంచాయతీలను 2 పురపాలికల్లో విలీనమైన సంగతి తెలిసిందే. అయితే సదరు పంచాయతీలతో విలీనమైన పురపాలక సంఘాలను కూడా ...వాటి పాలక వర్గం పదవీకాలం ముగిసిన వెంటనే జీహెచ్ఎంసీ విలీనం చేయనున్నట్లు సమాచారం. అందులో భాగంగానే ఇప్పటికీ పాలకవర్గాల గడువు ముగిసిన 51 పంచాయతీలను సమీప పురపాలక సంఘాల్లో విలీనం చేయటంతోపాటు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

విలీన పంచాయతీలకు.. పట్టణ హోదా

స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన అధికారులు మంగళవారం ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు చేపట్టారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యాలయాల బోర్డులను తొలగించి...ఆయా మున్సిపాలిటీల పేర్లతో ఉన్న కొత్త బోర్డులను ఏర్పాటు చేశారు. విలీనమైన 51 పంచాయతీలు మంగళవారం నుంచి మున్సిపల్ శాఖ పరిధిలోకి రావటంతో ...వాటికి సంబంధించిన రికార్డు పుస్తకాలు తదితరాలను ప్రత్యేక అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పురపాలికల్లో విలీనమైన పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లు



ప్రతాపసింగారంలో మున్సిపల్ బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్

స్పెషల్ ఆఫీసర్లు వీరే..

- మేడ్చల్,దమ్మాయిగూడ, నాగారం పురపాలక సంఘంలో విలీనమైన పూడూరు, రాయిలాపూర్, యాద్గార్‌పల్లి, భోగారం, గోధుమకుంట, కరీంగూడ, రాంపల్లిదాయార, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాలకు ప్రత్యేక అధికారిగా మున్సిపల్ శాఖ జేడీ బి.శ్రీనివాస్ రావును నియమించారు.
- పోచారం పురపాలక సంఘంలో విలీనమైన వెంకటాపూర్, ప్రతాపసింగారం,కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడలకు ప్రత్యేక అధికారిగా మున్సిపల్ శాఖ జేడీ కె.నారాయణరావును నియమించారు.
- ఘట్కేసర్ పురపాలక సంఘంలో విలీనమైన అంకుషాపూర్, అవుషాపూర్, మాదారం, ఎదులాబాద్, ఘన్‌పూర్, మార్పల్లిగూడలకు ప్రత్యేక అధికారిగా మున్సిపల్ శాఖ జేడీ శ్రీ పాద రామేశ్వర్‌ను నియమించారు.
- గుండ్లపోచంపల్లి పురపాలక సంఘంలో విలీనమైన మునీరాబాద్,గౌడవెల్లిలకు ప్రత్యేక అధికారిగా మున్సిపల్ శాఖ జేడీ బి.సంధ్యను నియమించారు.
- తూముకుంట పురపాలక సంఘంలో విలీనమైన బొమ్మరాశిపేట్, శామీర్‌పేట్, బాబాగూడలకు ప్రత్యేక అధికారిగా మున్సిపల్ శాఖ ఏడీ జ్యోత్స్నను నియమించారు.
- పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘంలో విలీనమైన బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట లకు స్పెషలాఫీసర్‌గా మున్సిపల్ శాఖ జేడీ శ్రీ పాదరామేశ్వర్ నియమితులయ్యారు.
- శంషాబాద్ ,తుక్కుగూడ,నార్సింగ్ పురపాలక సంఘాల్లో విలీనమైన బహదూర్‌గూడ, పెద్ద గొల్లోండ, చిన్న గొల్లోండ, హమీల్లానగర్, రశీద్‌గూడ, ఘన్సీమియాగూడ, హర్షగూడ, మిర్జాగూడలకు స్పెషల్ ఆఫీసర్‌గా మున్సిపల్ శాఖ జేడీ శ్రీధర్ నియమితులయ్యారు.
- తెల్లాపూర్ పురపాలక సంఘంలో విలీనమైన కర్దానూర్, ముత్తంగి, పోచారం, పాటి, ఘనపూర్‌లకు స్పెషల్ ఆఫీసర్‌గా మున్సిపల్ శాఖ డీడీ వి.సాయినాథ్ నియమితులయ్యారు.
- అమీన్‌పూర్ పురపాలక సంఘంలో విలీనమైన ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్‌గూడ, దాయార, కిష్టారెడ్డిపేట్, సుల్తాన్‌పూర్‌లకు స్పెషల్ ఆఫీసర్‌గా మున్సిపల్ శాఖ జేడీ కె. పాల్గుణకుమార్ నియమిలయ్యారు.



గోధుమకుంట గ్రామంలో పంచాయతీ కార్యాలయం పేరును తొలగిస్తున్న సిబ్బంది

వారి అనుమతితోనే కేటాయింపులు

నగర శివారుల్లోని పంచాయతీలు పురపాలక సంఘాల్లో విలీనమైన నేపథ్యంలో అక్కడ పని చేస్తున్న ఎంపీఓలు ,గ్రామ కార్యదర్శులు, సిబ్బందిని పంచాయతీ రాజ్ శాఖలోనే కొనసాగిస్తారా...లేక మున్సిపల్ శాఖ పరిధిలోకి తీసుకుంటారానన్న సందిగ్ధత నెలకొంది. విలీనమైన 51 పంచాయతీల పరిధిలో దాదాపు ఐదు వేల మంది ఉద్యోగులు ,సిబ్బంది విధులు నిర్వహిస్తుండటంతో ..వారిని ఏ శాఖ పరిధిలో కొనసాగిస్తారన్న పలు ఊహాగానాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం వారి విధులు స్థానికంగా అవసరమని అధికార యంత్రాంగం భావిస్తున్నట్లు సమాచారం. అయితే .. ఉద్యోగులు, సిబ్బంది అభిప్రాయాలకు అనుగుణంగా వారిని పంచాయతీ రాజ్ శాఖ లేదా మున్సిపల్ శాఖలో కొనసాగించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయా జిల్లాల అధికార యంత్రాంగం వారి విధుల నిర్వహణ కేటాయింపులకు సంబంధించి కసరత్తు చేపట్టారు. త్వరలోనే ఉద్యోగులు, సిబ్బంది కేటాయింపులు కూడా పూర్తికానున్నట్లు తెలుస్తోంది.

సైబర్ బాధితులకు ఊరట

- నగదు రీఫండ్‌కు అధికారుల ప్రాధాన్యం
- రూ.1.54 కోట్లు కోల్పోయిన ఇరువురు
- బ్యాంకు అధికారుల సాయంతో ఫ్రీజింగ్
- రూ.1.09 కోట్లు బాధితులకు అప్పగింత

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల బారినపడి మోసపోవడం ఎంత తేలికో.. ఈ కేసులు కొలిక్కిరావడం, నిందితులు చిక్కడం అంత కష్టం. వీటన్నింటికీ మించి వారి నుంచి నగదు రికవరీ చేయడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. బాధితులు ఎవరైనా మోసపోయిన తక్షణమే 'గోల్డెన్ అవర్'లో పోలీసుల వద్దకు వస్తారో వాళ్లే సేఫ్ జోన్‌లో ఉంటున్నారు. సైబర్ క్రైమ్ అధికారులు సైతం నిందితుల బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయడానికి, వాటిలో ఉన్న నగదు రికవరీ చేసి బాధితులకు అప్పగించడానికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండు కేసుల్లో రూ.1.54 కోట్లు పోగొట్టుకున్న బాధితులు హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. తక్షణం స్పందించిన అధికారులు వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.1.09 కోట్లు ఫ్రీజ్ చేయించారు. న్యాయస్థానం అనుమతితో ఈ మొత్తాలను మంగళవారం బాధితులకు అప్పగించినట్లు నగర కొత్వాల్ సీవీ ఆనంద్ వెల్లడించారు. బేగంపేటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి ట్రేడింగ్ స్కామ్‌లో చిక్కుకున్నారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి రూ.1,22,26,205 పెట్టుబడి పెట్టి నిండా మునిగారు. మరో ఉదంతంలో నగరానికి చెందిన మరో వ్యక్తి గోల్డ్‌మేన్ సాచెస్ సెక్యూరిటీస్ అనే సంస్థ విసిరిన ఆన్‌లైన్ వలలో చిక్కుకుని పెట్టుబడిగా రూ.32,10,000 పెట్టి మోసపోయాడు. వీళ్లిద్దరూ వేర్వేరుగా సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన ఇన్‌స్పెక్టర్ కె.మధుసూదన్‌రావు, ఎస్సై పి.సురేష్ బాధితుల నగదు రికవరీపై దృష్టి పెట్టారు. వీరు ఏఏ ఖాతాల్లో డిపాజిట్ చేశారు? అక్కడ నుంచి ఏఏ బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయి? తదితర వివరాలను తక్షణం తెలుసుకున్నారు. ఆ బ్యాంకు అధికారులకు లేఖ రాయడం ద్వారా ఒకరికి సంబంధించిన రూ.80 లక్షలు, మరొకరికి చెందిన రూ.29,10,000 ఫ్రీజ్ చేయించారు. ఆపై చట్ట పరమైన అంశాలు పూర్తి చేసి న్యాయస్థానం దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లడంతో పాటు బాధితులకు నగదు అందించడానికి అనుమతి కోరారు. కోర్టు అనుమతివ్వడంతో మంగళవారం బాధితులకు ఆయా మొత్తాలు అందించారు. సైబర్ నేరాల బారినపడి వారు వీలైనంత త్వరగా 1930 నెంబర్‌కు ఫోన్ చేసి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ (cybercrime.gov.in)లో ఫిర్యాదు చేయాలని కొత్వాల్ ఆనంద్ కోరారు.

చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా ప్రకటించాలి



ఉస్మానియా యూనివర్సిటీ: చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా ప్రకటించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక (టీవీయూవీ) ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమానికి టీవీయూవీ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల బద్రి అధ్యక్షత వహించగా ఓయూ అధ్యాపకులు, వివిధ విద్యార్థి సంఘాల నేతలు, రజక సంఘాల నాయకులు పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలని, వర్సిటీ స్థాయిలో ఐలమ్మ పోరాట చరిత్రను ప్రవేశపెట్టాలని, రజకులను ఎస్సీ జాబితాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులు కొండ నాగేశ్వర్‌రావు, రామయ్య షఫర్డ్, నలిగంటి.శరత్, అమంచి నాగేశ్వర్ రావు, విద్యార్థి నేతలు కేతూరి వెంకటేష్, బీసీ నేత సంజయ్, ఎల్చాల దత్తాత్రేయ, దుర్గం భాస్కర్, పీడీఎస్‌యూ నాగేశ్వర్‌రావు, సుమంత్ పాల్గొన్నారు.

జంట పండుగలు సాఫీగా జరగాలి



మాట్లాడుతున్న సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

చార్మినార్: వినాయక చవితి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ వేడుకలు సాఫీగా జరిగేలా పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. ఓ వైపు నిమజ్జనోత్సవం సందర్భంగా సామూహిక ఊరేగింపులు, మరోవైపు మిలాద్ ఉన్ నబీ సామూహిక ఊరేగింపులు వెనువెంటనే జరగనున్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జంట పండగలను పురస్కరించుకుని మంగళవారం ఆయన పురానీ హవేలీ లోని డీసీపీ కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీ ఏ.శ్రీనివాస్ తో పాటు ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు. సీపీ మాట్లాడుతూ గత ఏడాది ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే..వాటిని సరిచేసుకుని ఈసారి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలాపూర్ నుంచి ప్రారంభమయ్యే సామూహిక నిమజ్జన ఊరేగింపు రూట్‌ను పరిశీలించారు.

పేరు మాత్రమే 'ఇనోసెంట్'!

- అక్రమంగా నివసిస్తున్న విదేశీయుడి పట్టివేత
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నట్లు అనుమానం
- అరెస్టుకు బదులు తిప్పి పంపేసిన హెచ్–న్యూ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయుల డిపోర్టేషన్ (బలవంతంగా తిప్పి పంపడం) ప్రక్రియ అధికారులు కొనసాగిస్తున్నారు. ఫారెనర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) సాయంతో అవసరమైన అనుమతులు పొంది వారి దేశాలకు తిప్పిపంపుతున్నారు. కొన్నేళ్లుగా నగరంలో అక్రమంగా నివసిస్తున్న నైజీరియన్‌ను హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులు ముంబై విమానాశ్రయం నుంచి డిపోర్టేషన్ చేసినట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర మంగళవారం వెల్లడించారు. నగరంతో పాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో జరుగుతున్న మాదకద్రవ్యాల దందాలో నల్లజాతీయులే కీలకపాత్ర పోషిస్తుండటం గమనార్హం. నైజీరియాకు చెందిన ఐకేజీ ఇనోసెంట్ ఎండుక 2009లో టూరిస్ట్ వీసాపై ముంబై వచ్చాడు. తొలినాళ్లలో దాదాపు ఏడాది పాటు స్కార్ఫ్‌ల వ్యాపారం చేశాడు. గుజరాత్‌లోని సూరత్‌నుంచి వీటిని ఖరీదు చేసుకుని వచ్చి ముంబైలో అమ్మేవాడు. ఆపై తమిళనాడులోని త్రిపూర్‌కు మకాం మార్చిన ఇనోసెంట్ నాలుగేళ్ల పాటు టీ–షర్టుల వ్యాపారం చేశాడు. గత ఏడాది బెంగళూరుకు వెళ్లిన అతను తాజాగా ఈ ఏడాది మేలో హైదరాబాద్‌కు వచ్చి పంజగుట్ట ప్రాంతంలో స్థిరపడ్డాడు. వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉంటున్న ఇనోసెంట్ అసాంఘిక కార్యకలాపాలు కూడా పాల్పడుతున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఇతడి వ్యవహారంపై సమాచారం అందుకున్న హెచ్–న్యూ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్, జీఎస్ డానియేల్ వలపన్ని పట్టుకున్నారు. తనిఖీ చేయగా నకిలీ గుర్తింపుకార్డులు, బోగస్ పత్రాలతో నివసిస్తున్నట్లు తేలింది. దీంతో ఇనోసెంట్ వివరాలు ఎఫ్ఆర్ఆర్ఓకు పంపిన హెచ్–న్యూ మూవ్‌మెంట్ రిస్ట్రిక్షన్ ఆర్డర్ పొంది సీసీఎస్‌లోని డిపోర్టేషన్ సెంటర్‌లో ఉంచింది. ఇతడి కార్యకలాపాలు, నిర్బంధంపై నైజీరియా ఎంబసీకి సమాచారం ఇచ్చిన అధికారులు అవసరమైన గుర్తింపు పత్రాలు, ఢిల్లీ కార్యాలయం నుంచి టెంపరరీ ట్రావెల్ డాక్యుమెంట్లు పొందారు. వీటి ఆధారంగా ఇనోసెంట్‌కు విమాన టిక్కెట్ ఖరీదు చేసిన సిటీ పోలీసులు సెక్యూరిటీ క్లియరెన్స్, ఎఫ్ఆర్ఆర్ఓ నుంచి ఎగ్జిట్ పర్మిట్ తీసుకున్నారు. వీటి ఆధారంగా ముంబై విమానాశ్రయం నుంచి డిపోర్ట్ చేశారు. దీంతో ఇతడు మరోసారి భారత్‌లో అడుగుపెట్టడానికి ఆస్కారం లేకుండాపోయింది.



అంతర్రాష్ట్ర గంజాయి ముఠాకు చెక్

- ఐదుగురి అరెస్ట్. పరారీలో మరో ఇద్దరు
- 254 కిలోల గంజాయి, కంట్రీమేడ్ పిస్టల్, 11 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం





స్వాధీనం చేసుకున్న గంజాయి, పిస్టల్, బుల్లెట్లు

గచ్చిబౌలి: గంజాయి రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ 17 ఎగ్జిట్ వద్ద సర్వీస్ రోడ్డులో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సైబరాబాద్ ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఠాకూర్ సచిన్ సింగ్, మహ్మద్ నదీం, మహ్మద్ సక్లైన్, మహ్మద్ సలీం, ప్రశాంత్ సింగ్‌లను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి 254 కిలోల గంజాయి, కంట్రీ మేడ్ పిస్టల్, 11 బుల్లెట్లు , రెండు కార్లు, స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న ఇద్దరి కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అరకు టూ ముంబై..

ఈ నెల 7న ముంబైకి చెందిన క్యాబ్ డ్రైవర్లు మహ్మద్ నదీం, సక్లైన్, సలీం, యూపీకి చెందిన సచిన్ ఠాకూర్ సింగ్, ప్రశాంత్ సింగ్, రవీందర్ యాదవ్, వినోద్ కుమార్‌యాదవ్ అరకు ప్రాంతంలోని రాజు అనే వ్యక్తి వద్ద 254 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. మహారాష్ట్రకు చెందిన కారులో ఇద్దరు పైలటింగ్ చేస్తుండగా ఒడిశా నెంబర్ ప్లేట్‌తో ఉన్న మరో కారులో గంజాయి ప్యాకెట్లు లోడ్ చేసి బయలుదేరారు. మంగళవారం ఉదయం రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ 17 ఎగ్జిట్ వద్ద సర్వీస్ రోడ్డులో రెండు కార్లలోకి గంజాయి మార్చే ప్రయత్నం చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు గంజాయితో ఉన్న కారును పట్టుకున్నారు. మరో కారులో ఉన్న వినోద్ కుమార్‌యాదవ్, రవీందర్ పరారయ్యారు. ఠాకూర్ సచిన్ సింగ్, నదీం,సక్లైన్, సలీం, ప్రశాంత్ సింగ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

ఐదేళ్లుగా గంజాయి దందా

ఠాకూర్ సచిన్ సింగ్ వినోద్ కుమార్ యాదవ్‌తో కలిసి ఐదేళ్లుగా అరుకులో రాజు వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ ఉత్తరప్రదేశ్, ముంబైలకు సరఫరా చేస్తున్నారు. ప్రతాప్‌ఘడ్‌లో అమిత్ సింగ్ పెడ్లర్ ద్వారా సరుకు విక్రయించేవాడు. మూడు నెలలో పలు దఫాలుగా గంజాయిని ఉత్తరప్రదేశ్, ముంబై ప్రాంతాలకు సరఫరా చేసినట్లు తెలిపారు. వీరు ప్రతాప్‌ఘడ్‌కు చెందిన సునీల్ సింగ్ అనే వ్యక్తి వద్ద కంట్రీమేడ్ పిస్టల్, 11 రౌండ్ల బుల్లెట్లు కొనుగోలు చేశారని, గంజాయి రవాణాలో ఆటంకాలు ఎదురైతే ఎదుర్కొనేందుకు ఠాకూర్ సిద్ధంగా ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. సమావేశంలో సైబరాబాద్ ఎస్ఓటీ డీసీపీ డి.శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు రమణారెడ్డి, క్యాస్ట్రో, సిబ్బంది పాల్గొన్నారు.

నా బంగారం చోరీ జరిగింది

- పోలీసులకు ఫిర్యాదు చేశా
- 'మా' అసోసియేషన్ ఎదుట ధర్నా చేస్తా
- రాజ్‌తరుణ్ మాజీ ప్రియురాలు లావణ్య



మీడియాతో మాట్లాడుతున్న లావణ్య

మణికొండ: తాను గతంలో డ్రగ్స్ కేసులో జైలుకు వెళ్లే సమయంలో ఇంట్లో దాచిన రూ. 12 లక్షల విలువైన బంగారు నగలు చోరీకి గురయ్యాయని వాటిని కనిపెట్టాలని సినీహీరో రాజ్ తరుణ్ మాజీ ప్రియురాలు లావణ్య నార్సింగి పోలీసులను కోరింది. ఈ మేరకు ఆమె మంగళవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన ఇంట్లోని లాకర్ తాళాలు తన వద్ద, రాజ్ తరుణ్ వద్ద ఉంటాయన్నారు. జైలుకు వెళ్లే సమయంలో తన కీస్ కూడా అతడికే ఇచ్చానని, తన ఒంటిపై ఉన్న నగలను తన సోదరుడికి అప్పగించగా అతను లాకర్‌లో భద్రపరిచాడని తెలిపింది. రెండు రోజుల క్రితం ముంబై వెళ్లి రాజ్‌తరుణ్‌ను కలవగా తన కీస్ ఇచ్చాడన్నారు. దీంతో సోమవారం లాకర్ తెరచి చూడగా తన బ్రాస్‌లెట్, పుస్తెలతాడు, కమ్మలు, చైన్‌లు కనిపించలేదన్నారు. తాను జైలుకు వెళ్లిన సమయంలో రెండు, మూడు సార్లు తమ ఇంటికి సినీ హీరోయిన్ మాల్వీ మల్హోత్రా వచ్చి వెళ్లిందని, ఆమే తన బంగారం తీసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేసింది. తాను 'మా' సభ్యురాలినని, తనకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించాలని, తనను, రాజ్‌తరుణ్‌ను కలపాలని మా అసోసియేషన్ కార్యాలయం ఎదుట త్వరలో ధర్నా చేయనున్నట్లు తెలిపింది. లావణ్య తన బంగారం పోయిందని ఫిర్యాదు ఇచ్చిందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి తెలిపారు.

వ్యభిచారం చేసైనా డబ్బులు తెమ్మన్నాడు..

- వేధింపులు తాళలేక హత్య చేశా
- లంగర్‌హౌస్ హత్య కేసులో వీడిన మిస్టరీ
- అంగీకరించిన మృతుడి భార్య, నిందితురాలి అరెస్ట్

లంగర్‌హౌస్: వ్యభిచారం చేసైనా సరే మద్యం తాగేందుకు డబ్బులు తేవాలని వేధిస్తున్నందునే స్వయంగా భార్యే భర్తను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 7న జరిగిన హత్య కేసును ఛేదించిన పోలీసులు నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, పెద్దమందడి గ్రామానికి చెందిన ముక్తార్ అహ్మద్, నసీంబేగం దంపతులకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మూడేళ్ల క్రితం ముక్తార్ లంగర్‌హౌస్ డ్రీమ్ కాలనీలో నిర్మిస్తున్న భవనానికి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. పేకాటతో పాటు తాగుడుకు బానిసైనన ముక్తార్ తరచూ భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ఈ నెల 7న సాయంత్రం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన ముక్తార్ తనకు ఇంకా మద్యం కావాలని అందుకు డబ్బులు కావాలని భార్యను వేధిచాడు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడా వ్యభిచారం చేసైనా డబ్బులు తేవాలని రోడ్డుపైకి తోసేశాడు. దీంతో తలకు గాయమైన నసీంబేగం భర్తను అంతమొందించాలని నిర్ణయించుకుంది. షేక్‌పేట్ కల్లు కంపౌండ్‌కు వెళ్లి కల్లు తాగి వచ్చిన ఆమె భవనంలో నిద్రిస్తున్న ముక్తార్‌పై బండరాళ్లతో దాడి చేసింది. అనంతరం అక్కడి నుంచి లంగర్‌హౌస్‌లోని దర్గాకు వెళ్లి దాక్కుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నసీం బేగంను అదుపులోకి తీసుకోగా తానే హత్య చేసినట్లు తెలిపింది. నిందితురాలిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

నకిలీ వైద్యుడి అరెస్ట్

అంబర్‌పేట: అర్హత లేకపోయినా వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మంగళవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంబర్‌పేట తిరుమల నగర్‌లో రాజ్‌కుమార్ అనే వ్యక్తి మిత్ర ఆసుపత్రి ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నాడు. మరో ఇద్దరు అర్హులైన డాక్టర్లతో కలిసి రాజ్‌కుమార్ నేరుగా వైద్యం చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి తదుపరి విచారణ నిమిత్తం అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్


సమావేశంలో బాబా ఫసియుద్దీన్, డీఎంసీ జకీయా సుల్తానా

రహమత్‌నగర్ (బోరబండ): గణపతి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం యాత్రలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీలోని అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సూచించారు. అలాగే మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. డివిజన్‌లోని సైట్-1 కాలనీలో షహీద్ తుర్రేబాజ్ ఖాన్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన మండపాల నిర్వాహకుల సమావేశంలో ఆయన అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం పూర్తి అయ్యే వరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు. మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ జకీయా సుల్తానా మాట్లాడుతూ ఏదైనా ఇబ్బంది ఎదురైతే తమ దృష్టికి తీసురావాలని సూచించారు. బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీర శేఖర్, జీహెచ్ఎంసీ వివిధ శాఖలకు చెందిన అధికారులు, మండపాల నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ వద్ద సున్నం చెరువు బాధితుల ధర్నా


ప్రెస్‌క్లబ్ వద్ద నిరసనకు దిగిన సున్నం చెరువు బాధితులు

బంజారాహిల్స్: చిన్నాచితకా ఉద్యోగాలు చేసుకుంటూ సున్నం చెరువు సమీపంలో నిర్మించుకున్న ఇళ్లను ప్రభుత్వమే నేలమట్టం చేయడం ఏమిటని సున్నం చెరువు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో విద్యార్థుల రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక హైడ్రా పేరుతో రాష్ట్రంలో హైడ్రామా ఆడుతోందని మండిపడ్డారు. సమావేశం అనంతరం పార్టీ అధ్యక్షులు సునీల్, రమణ, కమలాకర్, మహేష్, అనిల్ తదితరులు నిరసనకు దిగారు. ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న తమ ఇళ్లను ఎలా కూల్చివేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రెస్‌క్లబ్ ముందు ధర్నాకు దిగారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించి ఉన్న పోలీసులు విద్యార్థి, రాజకీయ పార్టీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ


నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఫిలింనగర్: అణగారిన వర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల కోసం పోరాడిన పోరాట యోధురాలి వీరనారి చాకలి ఐలమ్మ అని ఫిలింనగర్ బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత మామిడి నర్సింగ్‌రావు అన్నారు. మంగళవారం కొత్త చెరువు వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, అణగారిని వర్గాల అభ్యున్నతి కోసం నిరంతర పోరాటం చేసిన వీర వనిత అని కొనియాడారు. సీనియర్ కాంగ్రెస్ నేత కాటూరి రమేష్, శ్యాం నాయుడు, ఆకుల రాజు, దయ్యాల దాసు, మంగమ్మ, ఆంజనేయులు, నాగార్జున పాల్గొన్నారు.

బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దటమే లక్ష్యం

బీబీజీ సీఎండీ మల్లికార్జున్



బంజారాహిల్స్: బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దడమే లక్ష్యమని బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ (బీబీజీ) సీఎండీ మల్లికార్జున్ తెలిపారు. బాలికా సాధికారతపై బంజారాహిల్స్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికా సాధికారత కోసం బంగారు తల్లి కార్యక్రమంతో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. మెరుగైన భవిష్యత్తును సృష్టించే లక్ష్యంతో ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో 1,70,000 మంది బాలికలకు సాధికారత కల్పించామన్నారు. రాబోయే కాలంలో మరింతగా విస్తరించేలా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రెండు నెలలుగా బంగారు తల్లిలో భాగంగా నాలుగు వేల మంది విద్యార్థులతో నిమగ్నమై పాఠశాలలకు చేరుకోవడంపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రకృతి వైపరీత్యాలు, సామాజిక బాధ్యత, మానసిక పరిపక్వత, క్రమశిక్షణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పట్ల గౌరవం, స్నేహబంధం, బాధ్యత, దేశభక్తి తదితర అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు.

గుంతల రోడ్లపై ఊగుతూ.. తూలుతూ..!

- నిమజ్జనాలకు వెళ్లే సమయంలో నిర్వాహకుల అష్టకష్టాలు
- రోడ్లపై గుంతల మరమ్మతులు మరిచిన ఇంజినీర్లు
- కరువైన కార్యాచరణ ప్రణాళిక
- మంత్రి ఆదేశించినా ఫలితం శూన్యం

గణేష్ నిమజ్జనాలకు వెళ్లే సమయానికి కల్లా రోడ్లపై గుంతలను పూడ్చాలని స్వయంగా నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించినా అవి వారి చెవికి ఎక్కలేదు. దీంతో వినాయక విగ్రహాలను నిమజ్జనాలకు తీసుకెళ్లే సమయంలో రోడ్లపై పడ్డ గుంతలలో వాహనాలు వెళ్లడంతో విగ్రహాలు ఊగుతూ.. తూలుతూ.. ఎక్కడ పడిపోతాయోనని మండపాల నిర్వాహకులు భయం..భయంగా విగ్రహాలను తరలిస్తున్నారు. వేడుకలకు ముందస్తుగానే ఉన్నతాధికారులు సరైన ఏర్పాట్లు చేస్తామని చెప్పిన కార్యాచరణలో మాత్రం కొన్ని చోట్ల పూర్తిస్థాయిలో అమలు కాలేదని నిర్వాహకులు విమర్శిస్తున్నారు.




జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 10బీ గాయత్రీహిల్స్‌కు వెళ్లే రోడ్డులో అడ్డంగా తవ్వకాలు

బంజారాహిల్స్: వినాయక చవితి పర్వదినానికి ముందే గుంతల పడ్డ రహదారులకు బీటీ లేదా సిమెంట్‌తో గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని పండుగకు ముందే మూడుసార్లు జరిగిన గణేష్ ఉత్సవ సన్నాహక సమావేశాల్లో హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. అయితే జీహెచ్ఎంసీ అధికారులకు ఇది ఏమాత్రం పట్టడం లేదు. దీంతో ఎక్కడి గోతులు అక్కడే ఉండటం వల్ల స్థానికులకు నరకాన్ని చూపిస్తుండగా, సోమవారం నుంచి ప్రారంభమైన వినాయక నిమజ్జనానికి తరలివెళ్లే విగ్రహాల వాహనాలు ఈ గుంతల్లో పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. విగ్రహం ఎక్కడ కింద పడిపోతుందోనని మండప నిర్వాహకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన వారం రోజుల నుంచి వరద సాకు చూపి జీహెచ్ఎంసీ ఇంజినీర్లు రోడ్ల మరమ్మతులు చేయటాన్ని తప్పించుకున్నారు. అయితే మూడు రోజుల నుంచి వర్షాలు లేకున్నా గుంతలు పూడ్చే పనులు ఏ మాత్రం చేపట్టలేదు. దీంతో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, హిమాయత్‌నగర్, సోమాజీగూడ, ఖైరతాబాద్ డివిజన్ల పరిధిలో నిమజ్జన శోభాయాత్ర జరిగే రూట్లలో రోడ్లపై గుంతలు జీహెచ్ఎంసీ నిర్వాకాన్ని ఎత్తిచూపుతున్నాయి. ప్రజా ప్రతినిధులు కూడా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండగా జీహెచ్ఎంసీ ఇంజినీర్లు చేతులెత్తేశారు. ఫలితంగా ఎక్కడికక్కడ గుంతలు ప్రత్యక్ష నరకాన్ని చూపుతున్నాయి. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 10 (బి) ప్లాట్ నెంబర్ 281ఎన్ శ్రీకిషన్‌కుంజ్ ఇంటి ముందు రెండు వారాల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం రోడ్డును అడ్డంగా తవ్వారు. ఇంతవరకు తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. ఈ రూట్‌లో 20కి పైగా విగ్రహాలు బుధవారం నుంచి నిమజ్జనానికి తరలనున్నాయి. అధికారులు మాత్రం రోడ్ల మరమ్మతులు చేపట్టడం లేదు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో బస్తీలు, కాలనీల నుంచి నిమజ్జన శోభాయాత్రలకు తరలివెళ్లే 43 రోడ్లలో 70కి పైగా గుంతలు ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులు సమస్యను తేటతెల్లం చేస్తున్నాయి. బుధవారం నుంచి గణేష్ నిమజ్జనాలు జోరుగా సాగనుండగా ఇప్పటి దాకా గుంతలు పడ్డ రోడ్లను మరమ్మతులు చేపట్టడంలో జీహెచ్ఎంసీకి కార్యాచరణ లేకుండా పోయింది.

దారి కాచి నగదు దోపిడీ

ఫిలింనగర్: పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ మేస్త్రీని గుర్తు తెలియని యువకుడు దారి కాచి బెదిరించి నగదుతో పాటు మొబైల్ ఫోన్, ఏటీఎం కార్డు ఎత్తుకెళ్లిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మధ్యప్రదేశ్‌కు చెందిన జంఖాలాల్ షేక్‌పేట నాలా వద్ద ఓ భవనంలో మేస్త్రీగా పని చేస్తున్నాడు. పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా యాక్టివా బైక్‌పై వచ్చిన ఓ యువకుడు అడ్డగించి బృందావన్ కాలనీ సమీంపలోకి తీసుకువెళ్లి బెదిరించి నగదు, ఏటీఎం కార్డు, మొబైల్ ఫోన్ లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ బస్తీలో పోచమ్మగుడి సమీపంలో ఓ ఇంటి పెంట్‌హౌస్‌పై పోలీసుల కళ్లుగప్పి గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న పేకాట శిబిరంపై బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేసి నలుగురిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... ఎన్‌బీటీనగర్‌లోని ఓ ఇంటి పెంట్‌హౌస్‌లో కొంతకాలంగా కొండే బాబురావు, ఎస్.జగదీశ్, టి.నగేష్, జి.రాజు లు పేకాట ఆడుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ కె. నౌషాద్ తన టీమ్‌తో కలిసి ఇక్కడ దాడులు నిర్వహించి నలుగురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని వీరి నుంచి రూ.33,250తోపాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాగణపతికి కొనసాగుతున్న భక్తుల రద్దీ


ఖైరతాబాద్ మహాగణపతి సమక్షంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్ సంఘ్ ఘోష్ ప్రదర్శన

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని మంగళవారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భాగ్యనగర్ విభాగ్ ఆధ్వర్యంలో మహాగణపతి ముందు భారతీయ రాగాలతో కూడిన రణ సంగీత వాయిద్యాలతో నిర్వహించిన ఘోష్ ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖులు కృష్ణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మహాగణపతిని దర్శించుకున్న నేపథ్యంలో ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అదే విధంగా మహాగణపతి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రతి రోజు ప్రసాద పంపిణీ చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం దానం నాగేందర్ స్వయంగా ప్రసాదం పంపిణీ చేశారు.

మానసిక ఒత్తిడితోనే ఎక్కువగా ఆత్మహత్యలు


పోస్టర్లను ప్రదర్శిస్తున్న డాక్టర్లు

శ్రీనగర్‌కాలనీ: మానసిక ఒత్తిడిలతోనే ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మానసిక స్థైర్యాన్ని పెంచుకోవాలని యాంటీ నార్కోటిక్స్ డీఎస్పీ నర్సింగరావు సూచించారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డలోని మానసిక ఆసుపత్రిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ 70 నుంచి 80 శాతం ఆత్మహత్యలు డిప్రెషన్ నుంచే మొదలవుతున్నాయని, వాటిని అదుపులో పెట్టుకోవాలని అన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అనిత మాట్లాడుతూ డిప్రెషన్‌కు లోనుకాకుండా చాలా థెరపీలు, కౌన్సెలింగ్స్ ఉన్నాయని, ప్రశాంతమైన జీవితాన్ని ప్రతి ఒక్కరూ గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ డాక్టర్ శివరాం, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ సుధారాణి, వైద్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్: షాపు ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌కు చెందిన ఆర్.శ్రీకాంత్ ఈనెల 1వ తేదీన యూసుఫ్‌గూడలోని తన షామియానా షాపు ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. సాయంత్రం వేరే వాహనంలో ఇంటికి వెళ్ళాడు. మరుసటి రోజు వచ్చి చూడగా షాపుముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం కనిపించలేదు. తన షాపులో పనిచేసే వర్కర్లు కూడా తీసుకెళ్ళలేదని తెలియజేశారు. పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొట్టాడు

ఫిలింనగర్: మద్యం మత్తులో కారు నడుపుతూ డివైడర్‌ను ఢీకొట్టిన డ్రైవర్‌పై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..కొండాపూర్‌కు చెందిన టి.అనిల్‌రెడ్డి (26) బెంజ్‌కారు (టీఎస్ 07 ఎఫ్ఎక్స్ 8998)లో జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-92 ఏషియాన్ స్పైన్ హాస్పిటల్ మీదుగా వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న కారణంగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో బెంజ్‌కారు ముందుభాగం ధ్వంసం కాగా వేగానికి డివైడర్ పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన అనిల్‌రెడ్డికి బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేయగా మద్యాన్ని సేవించినట్లుగా తేలింది. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుల్కాపూర్ నాలాను పరిశీలించిన అధికారులు

బంజారాహిల్స్: ఆక్రమణలకు గురైన బుల్కాపూర్ నాలాను మంగళవారం హైడ్రా, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా బుల్కాపూర్ నాలాను ఆనుకుని ఆక్రమణలు జరిగినట్లు గుర్తించారు. షేక్‌పేట ఓయూ కాలనీ సమీప బుల్కాపూర్ నాలా పక్కన నిర్మించిన, నిర్మాణంలో ఉన్న నిర్మాణాలతోపాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణంలో ఉన్న వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా ఏసీపీ సుదర్శన్, డిప్యూటీ కలెక్టర్ సుధ, షేక్‌పేట మండల తహశీల్దార్ అనితారెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ మోహన్‌కుమార్ తదితరులు ఉన్నారు. అంతకుముందు ఎక్కడెక్కడ ఆక్రమణలకు గురయ్యాయో వాటి వివరాలను నమోదు చేసుకున్నారు.

ఆకట్టుకున్న డిజైనర్స్ హాత్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: ఇండియన్ డిజైనర్స్ హాత్ (ఐడీహెచ్) పేరుతో బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. మంగళవారం ఈ ఎగ్జిబిషన్‌ను సినీ నటి సిరిపాపతో పాటు పలువురు మోడల్స్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలతో పాటు దుస్తులు ధరించి సందడి చేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ రెండు రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల డిజైనర్లు ఇక్కడ తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని తెలిపారు.

విద్యారంగ సేవలకు గుర్తింపు

ఫిలింనగర్: పేద విద్యార్థులకు, చూపులేనివారికి, బధిరులకు ఉచితంగా చదువులు అందిస్తూ విద్యా రంగంలో చేస్తున్న సేవలకు గాను జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 10సీలోని గాయత్రీహిల్స్‌లో ఉన్న లిటిల్‌స్టార్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసాకు లలితా కళా సమాఖ్య సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సువర్ణ కంకణ అవార్డును అందజేసింది. లలిత కళా సమాఖ్య నిర్వాహకులు డాక్టర్ మహేంద్రవాడ వెంకటేశ్వరరావు ఈ అవార్డును ఆమెకు అందజేశారు. తన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసినందుకు గాను ఉపాధ్యాయులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.

చిరు వ్యాపారులను ఆదుకోవాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

వెంగళరావునగర్: ఎస్‌పీఆర్‌హిల్స్‌లో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్న నిరుపేదలను ఆదుకోవాలని సీపీఎం నేతలు డీఎంసీని కోరారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ జకీయా సుల్తానాను కలిసి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిరోజు చిన్న వ్యాపారాలు చేసుకుంటేనే కుటుంబం గడుస్తుందని తెలిపారు. రోడ్డుపక్కన ఉన్న చిన్న దుకాణాలను తొలగించడం అన్యాయమన్నారు. వాస్తవంగా పుట్‌పాత్ వ్యాపారులందరికీ జీహెచ్ఎంసీ ఇచ్చిన ఐడీకార్డులు కూడా ఉన్నాయని, వాటిని పరిశీలించి న్యాయం చేయాలన్నారు. డీఎంసీని కలిసిన వారిలో సీపీఎం నేతలు టి. సాయిశేషగిరిరావు, స్వామి, లక్ష్మణ్, భాగ్యరాజ్, దేవదాస్, బాలయ్య, గాబ్రియేల్, చిట్టి, సత్యనారాయణ ఉన్నారు.

గణపయ్య సెలవికా..!


గంగమ్మ ఒడికి తరలేముందు గణనాథుడికి మొక్కుతున్న చిన్నారి

బంజారాహిల్స్: భక్తుల చేత అశేష పూజలందుకున్న గణనాథులు మెల్లిమెల్లిగా గంగమ్మ ఒడికి చేరుతున్న దృశ్యాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ బస్తీలో తమ ఇంట్లో ఏర్పాటు చేసుకున్న వినాయకుడిని నిమ్జనానికి తరలించే క్రమంలో ఓ చిన్నారి మొక్కులు తీర్చుకుంటూ వీడ్కోలు పలుకుతున్న అపురూప దృశ్యం అందరినీ ఆకట్టుకుంటుంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఖైరతాబాద్ : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి టెలిఫోన్ భవన్ సమీపంలో పడి ఉన్నాడన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించిన పోలీసులు అప్పటికే మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని ఒంటిపై బ్లూ కలర్ జీన్స్, వైట్ కలర్ షర్ట్ ఉందని తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు.

లంబోదరుడికి ప్రత్యేక పూజలు

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో కొలువైన గణనాథులు ఘనమైన పూజలు అందుకుంటున్నాడు. దీనిలో భాగంగా నాల్గోరోజైన మంగళవారం భక్తులు గణనాథులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కేన్సర్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విజయగణపతికి లక్ష పుష్పార్చన చేశారు.
– జూబ్లీహిల్స్, బంజారాహిల్స్


లక్ష పుష్పార్చనలో శ్రీ విజయగణపతి


ప్రేమ్‌నగర్‌లో శ్రీ దుర్గా వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


బంజారాహిల్స్‌లో గణపతి హోమంలో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి పి. విజయారెడ్డి...


ఫిలింనగర్ ఎమ్మార్సీ కాలనీలో ఫైర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...


బంజారాహిల్స్ రోడ్ నెం.12లో బంజారాహిల్స్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో...


విజయగణపతి ఆలయంలో పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ కార్పొరేటర్ కవితారెడ్డి


డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు


సితారహోటల్‌లో వినాయకచవితి వేడుకలు


గణనాథుని వద్ద ఫ్యాన్సీ డ్రస్ పోటీల్లో విజేతలు


జిహెచ్ఎంసి కార్యాలయంలో అన్నదానం చేస్తున్న సిబ్బంది...


సంతోష్ రెసిడెన్సి మధురానగర్‌లో..

ప్రైవేటు ఆస్పత్రుల్లోని డెంగీ కేసుల వివరాలూ సేకరించాలి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆస్పత్రులే కాకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లోని డెంగీ, మలేరియా కేసుల వివరాలను కూడా సేకరించి డెంగీ పాజిటివ్ కేసులున్న ఇంటితో పాటు చుట్టుపక్కల దాదాపు 50 ఇళ్లలో కూడా యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్, పైరిత్రమ్ స్ప్రే వంటి కార్యక్రమాలు నిర్వహించాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్(హెల్త్) పంకజ సంబంధిత అధికారులను ఆదేశించారు. తద్వారా వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధించవచ్చని అన్నారు. దోమలవ్యాప్తి నివారణపై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని అన్ని ఏరియాల్లోని స్ట్రీట్ డాగ్స్, వైల్డ్‌డాగ్స్, పెట్‌డాగ్స్ వివరాలు ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. తద్వారా స్టెరిలైజేషన్ కార్యక్రమాలకు వీలుంటుందన్నారు. కుక్క కాటు నివారణకు నగరంలో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు.

పద్మారావునగర్‌లో హస్తకళల ఎగ్జిబిషన్



పద్మారావునగర్: పద్మారావునగర్ కౌతా కామకోటి కల్యాణ మండపంలో స్వదేశీ సేల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వదేశీ హస్తకళల ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ప్రజలను ఎంతో ఆకట్టుకుంటోంది. అన్ని వయస్సులు, అన్ని వర్గాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా అన్ని రకాల హస్తకళలు అక్కడ ఏర్పాటు చేశారు. జమ్మూకశ్మీర్, అస్సాం, బీహార్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన కళాకారుల చేత రూపుదిద్దుకున్న కళా వస్తువులను ఈ ప్రదర్శనలో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్న పిల్లలు, యువతీ, యువకులు, మహిళలు, పురుషులు ధరించే అనేక రకాల వస్త్రాలు ఇక్కడ కొలువుదీరాయి. ప్రతిరోజూ 10 నుంచి రాత్రి 10 వరకు ఈ ప్రదర్శన ఉంటుందని, ఈ నెల 16వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ఆధునిక ఫ్యాషన్ వస్త్రాలతో పాటు కంచి, ధర్మవరం, గద్వాల చీరలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.

మహారాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకురాలిగా కోట నీలిమ



కోట నీలిమ

సనత్‌నగర్: మహారాష్ట్రలోని అమరావతి జిల్లా లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏఐసీసీ పరిశీలకురాలిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ నియమితులయ్యారు. హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల విజయంలో ప్రధాన భూమిక పోషించిన నీలిమను ఏఐసీసీ మహారాష్ట్రలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల పరిశీలకురాలిగా నియమించడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ మహారాష్ట్రలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయ పతాకం ఎగురవేసేందుకు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం శక్తివంచన లేకుండా పాటుపడతానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విధులు బహిష్కరించి రైల్వే కాంట్రాక్టు కార్మికుల ధర్నా



కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కాచిగూడ: రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కాచిగూడ రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించి స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు ఎం.వెంకటేష్, ప్రధానకార్యదర్శి ఎ.శాంతి మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఇంటి కిరాయి కట్టలేక, నిత్యావసర వస్తువులు కొనలేక, పిల్లలను స్కూళ్లకు పంపలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. చట్టప్రకారం ప్రతినెలా 7వ తేదీలోగా కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉన్నా కింగ్స్ సెక్యూరిటీ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికులకు చట్టప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, ప్లే స్లిప్పులు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో కాంట్రాక్టు కార్మికులు ధర్నా విరమించారు.

రాష్ట్రంలో బాడీ బిల్డర్లను ప్రోత్సహిస్తాం



ముషీరాబాద్: రాష్ట్రంలో బాడీ బిల్డర్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పరంగా తగిన సహకారం అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలల చైర్మన్ ఖురేషీ, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. తెలంగాణ అమెచ్యూర్ బాడీ బిల్డర్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆల్ అహ్మద్ ఎండీ అండ్ చైర్మన్ సయ్యద్ హకీం హుస్సేన్ సౌజన్యంతో సయ్యద్ హకీం హుస్సేన్ క్లాసిక్ పేరిట 38వ మిస్టర్ అండ్ మిసెస్ సౌత్ ఇండియా సెలెక్షన్స్ ట్రయల్ ఓపెన్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలను మంగళవారం ముషీరాబాద్‌లోని అయేషా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ బషీర్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 200 మంది బాడీ బిల్డర్స్ పాల్గొన్నారు. మొత్తం 15 కేటగిరీల్లో పోటీలు జరిగాయి. విజేతలకు నగదుతో పాటు మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ అమెచ్యూర్ బాడీ బిల్డర్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షులు బెన్ని ఫ్రాన్సిస్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.సలీం, కార్యనిర్వాహక కార్యదర్శి సయ్యద్ ఏజాజ్ హుస్సేన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, నాయకులు సయ్యద్ ముక్తార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులు.. ఇక జన్‌పోషణ్ కేంద్రాలు

- ప్రయోగాత్మకంగా హైదరాబాద్‌లో అమలు
- నగరంలో 15 రేషన్ షాపుల్లో కేంద్రాల ఏర్పాటు
- నిత్యావసర సరుకులు సహా చిరుధాన్యాలు, పప్పుల విక్రయం
- ప్రయోగం సత్ఫలితాలిస్తే మరిన్ని రేషన్ షాపులకు విస్తరణ



సాక్షి, సిటీబ్యూరో: ఇక ప్రజా పంపిణీ వ్యవస్థలోని ప్రభుత్వ చౌకధరల దుకాణాలు జన్‌పోషణ్ కేంద్రాలుగా మారనున్నాయి. నెలసరి సబ్సిడీ సరుకుల పంపిణీతో పాటు నిత్యావసరాల ఉత్పత్తులు కూడా అందుబాటులో రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా మరిన్ని ఉత్పత్తులను ప్రజలకు చేరవేసేందుకు చర్యలు చేపట్టింది. దేశంలోనే పైలట్ ప్రాజెక్టుగా తెలంగాణతో పాటు ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని సుమారు 60 రేషన్ షాపులను ఎంపిక చేసింది. అందులో భాగంగా హైదరాబాద్ పౌరసరఫరాల శాఖ పరిధిలోని 15 రేషన్ షాపుల్లో జన్‌పోషణ్ కేంద్రాలను ప్రారంభించింది. ఈ కేంద్రాల్లో తృణధాన్యాలు, పప్పులు, పాల ఉత్పత్తులు, రోజువారీ నిత్యావసర సరుకులు సహా వివిధ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇప్పటికే సరుకుల అమ్మకాలు, నిల్వల తీరుపై ఆయా దుకాణాల డీలర్లకు ఢిల్లీలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఇది విజయవంతమైతే దశలవారీగా రేషన్ షాపులను పూర్తిగా ఆధునీకరించి నిత్యవసర సరుకులను అందుబాటులోకి తీసుకురానున్నారు.

తక్కువ ధరకు సరుకులు

జన్ పోషణ్ కేంద్రాల్లో సరసమైన ధరకు సరుకులు అందేవిధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బహిరంగ మార్కెట్లో లభించే ధర కంటే తక్కువ ధరకు వినియోగదారులకు అందించే విధంగా నిత్యావసర సరుకుల సరఫరా చేయనుంది. ప్రజాపంపిణీ పథకం కింద ప్రస్తుతం అందిస్తున్న సబ్సిడీ బియ్యం, గోధుమలు, పామాయిల్ వంటివి మినహాయించి, కందిపప్పు, శెనగపప్పు, పెసరపప్పు, కొర్రలు, సజ్జలు తదితర పోషకాహార సరుకులను తక్కువ ధరకు విక్రయించనున్నారు. సబ్బు, అగ్గిపెట్టె, పప్పులు, పాలు, నూనెలు, ఉప్పు, బెల్లం, ఉల్లిగడ్డలు వంటివి కూడా విక్రయించేందుకు డీలర్లకు వెసులుబాటు కల్పించారు.

జన్ పోషణ్ కేంద్రాలకు స్పందన

రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా హైదరాబాద్‌లోని 15 ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ఏర్పాటు చేసిన జన్ పోషణ్ కేంద్రాలకు స్పందన లభిస్తోంది. ఇరవై రోజులుగా కేంద్రాలు పనిచేస్తున్నాయి. నిత్యావసర సరుకులు కూడా బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకు లభిస్తున్నాయి. ప్రజలు కూడా ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. పైలెట్ ప్రాజెక్టు సత్ఫలితాలు ఇస్తే కేంద్ర ప్రభుత్వం మరిన్ని రేషన్ షాపులకు కేంద్రాలను విస్తరించే అవకాశాలు ఉన్నాయి.
– రమేష్, జిల్లా పౌరసరఫరాల అధికారి, హైదరాబాద్

డీలర్లకు చేయూత

జన్ పోషణ్ కేంద్రాలతో ప్రజలకు పోషక పదార్థాలు అందించడంతో పాటు రేషన్ డీలర్ల ఆదాయాన్ని పెంచేవిధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాస్తవంగా ప్రభుత్వ చౌకధరల దుకాణాలు కేవలం పీడీఎస్ బియ్యంతో పాటు సబ్సిడీ సరుకుల పంపిణీకే పరిమితమయ్యాయి. ప్రతినెలా మొదటి వారం తర్వాత ఒక వారం పది రోజులు మాత్రమే, అది కూడా నిర్ణీత సమయంలోనే రేషన్ దుకాణాలు పనిచేస్తుంటాయి. మిగిలిన రోజుల్లో సరుకుల పంపిణీ గడవు ముగియడంతో దుకాణాలను మూసివేయడం సర్వసాధారణమైంది. దీంతో రేషన్ డీలర్లకు సబ్సిడీ సరుకుల పంపిణీపై వస్తున్న కమీషన్లు మొక్కుబడిగా మారింది. దీంతో దుకాణాల నిర్వహణ కష్ట సాధ్యమైందని డీలర్లు పేర్కొంటున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో డీలర్లకు ఆర్థిక వెసులుబాటు లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

హైదరాబాద్‌లో జన్ పోషణ్ కేంద్రాలు		
సర్కిల్	రేషన్ షాపు నంబర్	కార్డులు
మలక్‌పేట	1671149	1196
మలక్‌పేట	1671194	1080
యాకుత్‌పురా	1672223	1608
చార్మినార్	1673393	1250
అంబర్‌పేట	1676673	708
అంబర్‌పేట	1676675	1071
అంబర్‌పేట	1676611	1167
ఖైరతాబాద్	1677750	1242
ఖైరతాబాద్	1677724	1225
ఖైరతాబాద్	16777813	937
ఖైరతాబాద్	1677819	1069
బేగంపేట	1678873	832
బేగంపేట	1678872	749
సికింద్రాబాద్	1679903	1386
సికింద్రాబాద్	1679986	1132



నగరంలో నేడు

- యువకళావాహిని ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ 30వ ఉభయ తెలుగు రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు–2024 రవీంద్రభారతిలో సాయంత్రం 5.45 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుంది.
- బహదూర్‌పురలోని నెహ్రూ జూపార్క్‌లో ఉదయం 9 గంటలకు జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నిలకడగా మిజోరం గవర్నర్ ఆరోగ్యం

సాక్షి, సిటీబ్యూరో: అనారోగ్యంతో నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. ఆయనకు చికిత్స అందిస్తున్న స్టార్ ఆస్పత్రి మంగళవారం సాయంత్రం వెల్లడించిన మెడికల్ బులెటిన్ ప్రకారం.. జ్వరంతో బాధపడుతున్న మిజోరం గవర్నర్ సోమవారం స్టార్ ఆస్పత్రిలో చేరారు. ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. నిశితంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని పరిశీలించేందుకు ఐసీయులో చేర్చారు. ప్రస్తుతం యాంటిబయాటిక్స్ తదితర అవసరమైన మందులు, వైద్య సేవలు అందిస్తున్నామని, నిపుణులతో కూడిన వైద్యుల బృందం ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తోందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

జలమండలిని సందర్శించిన చెన్నై వాటర్ బోర్డు బృందం



సాక్షి, సిటీబ్యూరో: చెన్నై వాటర్ బోర్డు అధికారుల బృందం జలమండలిని సందర్శించింది. చెన్నై వాటర్ బోర్డు ఎండి డాక్టర్ టీజీ వినయ్ సారథ్యంలో 8 మంది ప్రతినిధులతో కూడిన బృందం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయానికి మంగళవారం చేరుకొని ఎండీ అశోక్‌రెడ్డి, అధికారులతో సమావేశమైంది. హైదరాబాద్ నగర ప్రజలకు జలమండలి అందిస్తున్న సేవలు, నీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణలో అవలంబిస్తున్న పద్ధతులు, సాంకేతిక వినియోగం, రెవెన్యూ తదితర అంశాలపై ఆరా తీసింది. జలమండలి అందిస్తున్న సేవలు, చేపట్టిన సంస్కరణలను ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్.. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చెన్నై బృందానికి వివరించారు. నగరంతో పాటు ఓఆర్ఆర్ వరకు జలమండలి అందిస్తున్న తాగునీరు, మురుగు నీటి నిర్వహణ, ఉపయోగిస్తున్న అధునిక సాంకేతికత, సామగ్రి, జెట్టింగ్ మిషన్, సీవరేజ్ క్రాక్ మిషన్ వంటి వివిధ యంత్రాల పనితీరును వివరించారు. ఐటీ విభాగంలో తీసుకువచ్చిన డిజిటల్ మానిటరింగ్, యాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టం(ఏఎంఎస్), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్స్ (ఎస్పీటీ), జలమండలి రూపొందించిన యాప్‌ల పనితీరు గురించి చెప్పారు.

కార్మికుల భద్రతపై..

జలమండలి కార్మికుల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలు, వీటిపై వారికి అవగాహన కల్పించడానికి ఏటా నిర్వహిస్తున్న భద్రతా పక్షోత్సవాలు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం అవలంబిస్తున్న పద్ధతులు, పనిచేసే సమయంలో కార్మికులకు అందజేసే పరికరాలు, వారి రక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన బీమా సౌకర్యం తదితర వివరాలను అధికారులు చెన్నై బృందానికి వివరించారు. చెన్నై వాటర్ బోర్డు బృందంలో అక్కడి సూపరింటెండింగ్ ఇంజినీర్ శివకుమార్, ఏరియా ఇంజినీర్ విజయ్ కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాధవి, అసిస్టెంట్ ఇంజినీర్ శివ శంకరి ఉన్నారు.

బోధనాస్పత్రుల్లో డైట్ బకాయిలు చెల్లించండి



టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: తెలంగాణ బోధనాసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు, సేవలు అందిస్తున్న వైద్యులకు ఆహారపదార్థాలు సరఫరా చేసే డైట్ క్యాంటీన్‌కు సంబంధించి బకాయి బిల్లులను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ హాస్పిటల్స్ డైట్ క్యాంటీన్ సప్లయర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆయా ఆస్పత్రుల డైట్ క్యాంటీన్ నిర్వహణ కాంట్రాక్టు యాజమానులు మంగళవారం సంబంధిత వైద్య ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం డైట్ బిల్లుల బకాయిలు కేవలం మూడు నెలలకు మాత్రమే పరిమితమని, పలు ఆస్పత్రుల్లో ఆరు నెలల నుంచి ఏడాది వరకు కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి డైట్ క్యాంటీన్‌కు రూ.3.40 కోట్లు, ఉస్మానియాకు రూ.2.50 కోట్లు, నీలోఫర్ డైట్‌కు రూ.1.50 కోట్లు, మెహబూబ్‌నగర్ జీజీహెచ్‌కు రూ.46 లక్షలు, కరీంనగర్ జీజీహెచ్‌కు రూ.62 లక్షలు, వనపర్తి జీజీహెచ్, టీబీకి రూ.97 లక్షలు, పేట్లబురుజు, సంగారెడ్డి, సూర్యాపేట డైట్ క్యాంటీన్లకు కోట్లాది రూపాయల డైట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత వైద్య ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే పెండింగ్ బిల్లులకు నిధులు విడుదల చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శులకు వినతి పత్రాలు పంపినట్లు తెలిపారు. బకాయిలు చెల్లించకుంటే కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని తెలంగాణ హాస్పిటల్స్ డైట్ క్యాంటిన్ సప్లయిర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి

- విలువైన జీవితాన్ని అర్ధంతరంగా ముగించొద్దు
- ఆత్మహత్యల నివారణపై గాంధీ ఆస్పత్రిలో అవగాహన



ఆత్మహత్యల నివారణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తూ..

గాంధీఆస్పత్రి: మానసిక, ఆర్థిక సమస్యలతో క్షణికావేశానికి లోనై ఆత్మహత్యలకు పాల్పడి విలువైన జీవితాన్ని అర్ధాంతరంగా ముగించి కుటుంబ సభ్యులకు తీరని మనోవేదన కలిగించొద్దని పలువురు వైద్య నిపుణులు సూచించారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ వారోత్సవాలను పురస్కరించుకొని గాంధీ సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో ఓపీ విభాగం వద్ద మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యనిపుణులు మాట్లాడుతూ ఒంటరితనం, ఒత్తిడి, ఆర్థిక, మానసిక, మత్తు పదార్థాల అలవాటు వంటి సమస్యలు క్షోభకు గురిచేస్తాయని, అటువంటి లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి అండగా నిలవాలని సూచించారు. వ్యక్తిగత, వృత్తి పరమైన సమస్యలు, ఇబ్బందులను మిత్రులు, కుటుంబసభ్యులతో పంచుకుంటే పరిష్కారం సులభంగా లభిస్తుందన్నారు. 2021 గణాంకాల ప్రకారం దేశంలో ప్రతిఏటా సుమారు 2 లక్షల మంది వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మహిళల కంటే పురుషులే ఎక్కువగా సూసైడ్ చేసుకున్నట్లు తేలిందన్నారు. విలువైన జీవితాన్ని విద్యార్థి దశ నుంచే ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గాంధీ ఆస్పత్రిలో మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో వైద్యసేవలతో పాటు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు వివరించారు. ఆత్మహత్యల నివారణపై నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, గాంధీ సైకియాట్రి ఇన్‌చార్జి హెచ్ఓడీ డాక్టర్ అనుపమ, సంగారెడ్డి మెడికల్ కాలేజీ సైకియాట్రి హెచ్ఓడీ ప్రొఫెసర్ పింగళి శ్రీలక్ష్మీ, గాంధీ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ విద్యుల్లత, డాక్టర్ అప్సియా, శ్రీజ, కౌషిక, గాంధీ నర్సింగ్ సూపరింటెండెంట్ దయానిధితోపాటు వైద్యులు, వైద్య విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

టీజీసెట్ పరీక్షలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ సెట్-2024 పరీక్షలు ప్రశాంతగా ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఓయూలోని టీజీసెట్ కార్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి పరీక్ష ప్రశ్నపత్రం కీ పాస్‌వర్డ్‌ను మంగళవారం ఆన్‌లైన్‌లో ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 12 వరకు జరిగే టీజీసెట్‌కు 33,764 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా తొలిరోజు 75.5 శాతం మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

చాగంటి కోటేశ్వరరావుకు జీవీఎస్ సాహితీ పురస్కారం



చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

నాంపల్లి: ధ్రువం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఆచార్య జీవీఎస్ సాహితీ పురస్కారం, సుశీలా సుబ్రహ్మణ్యం సారస్వత పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు జీవీఎస్ సాహితీ పురస్కారాన్ని, విశ్రాంత తెలుగు ఆచార్యులు ఆచార్య సి.మృణాళిని సుశీలా సుబ్రహ్మణ్యం సారస్వత పురస్కారాన్ని స్వీకరించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి, పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాదరెడ్డి ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముక్తేవి భారతి ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా సీఈఓ వెంకట్ చంగవల్లి హాజరై పురస్కార గ్రహీతలను సన్మానించారు. ధృవం వ్యవస్థాపకులు సౌమ్య వారణాసి నిర్వహణలో తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య యాదవ్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

అతిథి అధ్యాపక దరఖాస్తులకు నేడు ఆఖరు

– రేపు ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కాలేజీలో నియామక ప్రక్రియ

లక్డీకాపూల్: హుస్సేని ఆలంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కాలేజీలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ అపియ చిన్నమ్మ తెలిపారు. దరఖాస్తు పత్రాలను ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో అందజేయాలన్నారు. జువాలజీలో రెండు, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్‌లో మూడు పోస్టులు ఖాళీ ఉన్నాయని చెప్పారు. ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బయోటెక్నాలజీల్లో ఒక్కో పోస్టు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 12వ తేదీన జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు పీజీలో సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు ఉండాలన్నారు. అదే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం ఉండాలన్నారు. నీట్, సెట్, పీహెచ్‌డీ అర్హతతో పాటు బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు.

భారత్ ఒకప్పుడు విశ్వగురు



భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

- మళ్లీ అది సాధ్యమయ్యేలా యువతరం కృషి చేయాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన
- హెచ్‌సీయూలో ప్రొఫెసర్ సీఆర్ రావు విగ్రహావిష్కరణ

రాయదుర్గం: ఒకప్పుడు భారత్ విశ్వగురుగా ఉండేదని, నేడు మళ్లీ అది సాధించేలా యువతరం కృషి చేయాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని సీఆర్ రావు అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్(ఏఐఎంఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో పద్మవిభూషన్ ప్రొఫెసర్ సీఆర్‌రావు 104 జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహాన్ని వెంకయ్యనాయుడు చేతులమీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో మొక్క నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచం ఎంతో వేగంగా అభివృద్ధి వైపు దూసుకెళ్తోందని, ఆ దిశగా భారత్ ప్రయాణించేలా యువతరం కీలక పాత్ర పోషించాలన్నారు. దేశంలోని మహనీయులను నేటి తరం స్మరిస్తూ వారి బాటలో నడుస్తూ, వారిపై అధ్యయనం చేసి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ కాకుండా ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ గణాంకవేత్తల్లో ఒకరైన ప్రొఫెసర్ సీఆర్‌రావు విశేష రచనలు, గణిత శాస్త్రజ్ఞులు, వీరి పని గణాంక సిద్ధాంతం, అభ్యాసంపై శాశ్వత ప్రభావాన్ని చూపుతుందన్నారు. గణాంకాల ప్రపంచంలో మహోన్నతమైన వ్యక్తిగా సీఆర్‌రావు పేరొందని గుర్తు చేశారు. ఆయన అద్భుతమైన సామర్థ్యం, ఆచరణాత్మకమైన భావనలు నేటి తరంలోని బహుళ విభాగాల్లో శాశ్వత ప్రభావాన్ని చూపుతాయన్నారు. సీఆర్‌రావును గుర్తించేలా ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయం అన్నారు. ఆయన జీవితకాలం, సంక్లిష్ట ఆలోచనా విధానం, విద్య, పరిశోధనలను అభివృద్ధి చేయడం, భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లోని ప్రొఫెసర్ బ్రెయిన్ హోల్డెన్ ఐ రీసెర్చ్ సెంటర్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.బాలసుబ్రహ్మణియన్, మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజాకిరణ్, ఐఎస్‌బీ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎంఆర్ రావు, ఏఐఎంఎస్‌సీఎస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటరమణ్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ బిజినెస్ డెవలప్‌మెంట్ డాక్టర్ యూ.యుగంధర్, పలువురు అధికారులు, ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి మనుషులే.. ఉక్కు మనుషులవలే..



- నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు..
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి
- ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుల ఫొటో ఎగ్జిబిషన్

కవాడిగూడ: నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మట్టి మనుషులే ఉక్కుమనుషులై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్వహించారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. అంతటి మహోత్తరమైన పోరాటాన్ని బీజేపీ హిందూ, ముస్లిం గొడవలుగా చిత్రీకరించేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల చిత్రాలతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్ మంగళవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చాడ వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజాం, భూస్వామ్య పెత్తందారులు, దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందన్నారు. 1931లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మట్టి మనుషులే ఉక్కు మనుషులవలే పోరాటం చేశారని గుర్తు చేశారు. రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మోహినొద్దీన్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సాయుధ పోరాటానికి నాయకత్వం వహించినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంపై రాసిన పుస్తకాలను చూస్తే సిగ్గు పడాల్సి వస్తోందని, 10ఏళ్ల కాలంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని కనుమరుగు చేసేందుకు కుట్ర చేశారని విమర్శించారు. చరిత్రను వక్రీకరించి రాసిన వారికి కనువిప్పు కలిగేలా వాస్తవాలను తెలియజేస్తూ చరిత్రను తిరిగి రాసే కార్యక్రమాన్ని తామే ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్, ఈటి నర్సింహ, సీనియర్ ప్రాతికేయులు పాశం యాదగిరి, సామాజిక వేత్తలు వినాయక రెడ్డి, మోటూరి కృష్ణ ప్రసాద్, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు బి.స్టాలిన్, కె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 11, సెప్టెంబర్, 2024

ప్రముఖ సినీతారలు, క్రీడాకారులు, ఫ్యాషన్ ఐకాన్స్, సింగర్స్, డ్యాన్సర్స్.. ఇలా విభిన్న రంగాల్లో సెలబ్రిటీలు తమ కళ, నైపుణ్యాలతో అభిమానులను అలరిస్తుంటారు. ఈ క్రమంలో ప్రేక్షకులతో, అభిమానులతో ఏర్పడిన ప్రత్యేక అనుబంధం వారిని సెలబ్రిటీలుగా మారుస్తుంది. ఇలా వారి వారి రంగాల్లో తారలుగా వెలుగొందుతూనే, వారికున్న ఇమేజ్, ప్రశస్తిని వ్యాపారంగానూ మార్చుకునే ట్రెండ్ గతంలోనే మొదలైంది. చాలా వరకూ సెలబ్రిటీలు వివిధ బ్రాండ్‌లకు, ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తుంటారు. అయితే కొందరు మాత్రం సొంత బ్రాండ్‌లను ఆవిష్కరిస్తుండడం విధితమే. ఇందులో టాలీవుడ్ స్టార్లు మొదలు బాలీవుడ్ తారలు, భారతీయ క్రికెటర్లు తదితర సెలబ్రిటీలు ఉన్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం. -సాక్షి, సిటీబ్యూరో

స్టార్ బ్రాండ్స్..

సొంత బ్రాండ్స్‌వైపు సెలబ్రిటీలు

నగర యువతలో పెరుగుతున్న క్రేజ్

ఫ్యాషన్ ఐకాన్స్‌గా హీరోలు, క్రికెటర్లు

విరాట్ నుంచి విజయ్ దేవరకొండ వరకూ..

సెలబ్ బ్రాండ్స్‌కి గ్రాండ్ బిజినెస్

మార్కెట్ ట్రెండ్ సెట్ చేస్తున్న తారలు



హైదరాబాద్ వైబ్స్

మోడ్రన్ ట్రెండ్స్, అధునాతన ఫ్యాషన్ హంగులకు ఎల్లప్పుడూ వేదికగా నిలిచే హైదరాబాద్ నగరం ఈ సెలబ్రిటీ బ్రాండ్లకు సైతం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో నగర వేదికగా క్రేజ్ పొందుతోన్న కొందరు సెలబ్ బ్రాండ్స్ గురించి తెలుసుకుందామా..

'రాన్'.. రన్

అంతర్జాతీయ క్రికెట్‌లో విరాట్ కోహ్లికి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. అటు ఆటలో దూకుడుతోనూ.. ఇటు మోస్ట్ ఫ్యాషనబుల్ పర్సనాలిటీతోనూ ఎప్పుడూ మోస్ట్ వాంటెడ్ సెలబ్రిటీగా అలరిస్తుంటాడు. అయితే విరాట్ కోహ్లికి సైతం 'రాన్' అనే సొంత క్లాతింగ్ బ్రాండ్ ఉంది. ఈ బ్రాండ్‌కు దేశవ్యాప్తంగానే కాకుండా నగరంలోనూ విపరీతమైన క్రేజ్ ఉంది. ఇక్కడి ఆదరణ గమనించిన కోహ్లి.. తన బ్రాండ్ అంబాసిడర్ ఏబీ డివీలియర్స్‌తో ప్రత్యేక కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించాడు. ఏబీ డివీలియర్స్ తనతో ఆర్‌సీబీ టీమ్ మేట్‌మాత్రమే కాదు, తన బ్రాండ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నాడు. మోడ్రన్, క్లాసీ లుక్స్ ఈ బ్రాండ్ ప్రత్యేకత.

ఏ 'ఊకో కాక'..

సింగర్‌గా గల్లీ నుంచి ప్రయాణం ప్రారంభించి ఆస్కార్ వేదిక వరకూ ఎదిగిన లోకల్ బాయ్ రాహుల్ సిప్లిగంజ్ సైతం ఈ వ్యాపారంలోకి వచ్చారు. తన వ్యక్తిత్వానికి తగ్గట్టే 'ఊకో కాక' అనే పేరుతో క్లాతింగ్ స్టోర్లు ప్రారంభించాడు. మధ్య తరగతి కుటుంబాలు మొదలు రిచ్ పీపుల్ వరకూ ఈ బ్రాండ్‌కు ఫ్యాన్స్ ఉన్నారు. లోకల్ ఫ్లేవర్‌తో, మాస్, ట్రెండీ లుక్స్‌తో ఈ బ్రాండ్ దూసుకుపోతోంది.



సచిన్ సైతం..

ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ఒక మతమైతే సచిన్ టెండులకర్‌ని దేవుడిలా కొలుస్తారు. అలాంటి సచిన్ సైతం ఫ్యాషన్ రంగంలో సొంత బ్రాండ్‌తో బిజినెస్ చేస్తున్నాడు. అరవింద్ ఫ్యాషన్‌తో సంయుక్తంగా జతకట్టి మగవారికి సంబంధించిన నాణ్యమైన కలెక్షన్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వారసత్వ వైభవాన్ని ప్రదర్శించేలా అధునాతన హంగులనూ అవసోపన పట్టిన ఈ డిజైన్స్‌కు మంచి ఆదరణ ఉంది. దీంతో పాటు సచిన్ టెండుల్కర్ స్పిన్నీ, బూస్ట్, బీఎండబ్ల్యూ వంటి వ్యాపారాల్లోనూ భాగస్వామిగా ఉన్నారు.

'అల్లు'రిస్తూ...

తెలుగు సినిమాల్లోనే కాకుండా ప్రస్తుతం పాన ఇండియా స్థాయిలో స్టైలిష్ స్టార్‌గా ప్రత్యేక గుర్తింపున్న అల్లు అర్జున్ సైతం 'ఏఏ' బ్రాండ్ ఆవిష్కరిస్తున్నారని పలుమార్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. కానీ ఇప్పటి వరకూ అధికారిక ప్రకటన వెలువడలేదు. కానీ 'ఏఏ' పేరుతో కొన్ని లోకల్ బ్రాండ్స్ అందుబాటులో ఉన్నాయి.

ఫ్యాషన్ డిజైనర్..

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రాకు సైతం నగరంలో ప్రత్యేకంగా స్టోర్ ఉండటం విశేషం. తన డిజైన్స్‌ను నగరంలో ప్రమోట్ చేయడం కోసం కరీనా కపూర్ వంటి బాలీవుడ్ తారలతో నగరంలో అతిపెద్ద ఫ్యాషన్ షోలను సైతం ఈ ఫ్యాషన్ ఐకాన్ నిర్వహించాడు.

'రౌడీ' బాయ్స్..

టాలీవుడ్ టు బాలీవుడ్ వరకూ ప్రముఖ హీరో విజయ్ దేవరకొండ క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వినూత్న కథాంశాలు, మెస్మరైజింగ్ పెర్ఫార్మెన్స్‌తో అతి తక్కువ సమయంలో టాప్ హీరోల స్థాయిలో నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించాడు. అదే హవాను కొనసాగిస్తూ 'రౌడీ' అనే ఇండియన్ స్ట్రీట్ కల్చర్ టాప్, బాటమ్ వేర్ బ్రాండ్‌ను ప్రారంభించారు. సరికొత్త ట్రెండ్స్‌ను ఇష్టపడే యూత్ ఈ రౌడీ బ్రాండ్‌ను బాగా ఆదరిస్తున్నారు. ఈ బ్రాండ్ యాడ్స్‌లో కూడా అప్పుడప్పుడు మెరుస్తూ సొంత బ్రాండ్‌ను ప్రమోట్ చేసుకుంటున్నాడు విజయ్. సినిమా ఫంక్షన్లు, టీవీ షోలలో విజయ్ తన బ్రాండ్ దుస్తులనే ధరిస్తూ హ్యాండ్సమ్ లుక్స్‌తో అలరిస్తుంటారు. ఈ బ్రాండ్ ఆన్‌లైన్ రౌడీ క్లబ్‌లో లభ్యమవుతాయి.

మేము సైతం..

టాలీవుడ్ సూపర్‌స్టార్‌గా వెలుగొందుతున్న మహేష్ బాబు కూడా ఈ ఓన్ బ్రాండ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టి కొన్ని సంవత్సరాలు కొనసాగించారు. 'ది హంబుల్ కో' అనే క్లాతింగ్ బ్రాండ్‌తో మహేష్ అలరించి మధ్యలో ఆపేశారు. తన బ్రాండ్ పేరు మధ్యలో 'ఎమ్‌బి' అనే ఇంగ్లిష్ అక్షరాలు వచ్చేలా చూసుకున్నాడు. ఇదే కోవలో ప్రముఖ స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ సైతం ఉన్నారు. ఇస్మార్ట్ శంకర్ పార్ట్ 1 విడుదలై, విజయవంతమైన సమయంలో 'బీ ఇస్మార్ట్' అనే బ్రాండ్‌ను ఆవిష్కరించారు. ప్రస్తుతం అది అందుబాటులో లేదని సమాచారం.

యూ వి కెన్..



క్యాన్సర్ నుంచి బయట పడిన అనంతరం తనలాంటి క్యాన్సర్ బాధితులకు సహకారం అందించడమే లక్ష్యంగా ప్రముఖ ఇండియన్ క్రికెటర్ యువరాజ్ సింగ్ 'యూ వి కెన్(You We Can-...)' అనే ఎన్‌జీవోను ప్రారంభించారు. ఈ సంస్థకు ఆర్థిక వనరుల కోసం అదే పేరుతో అథ్లెటిక్ వేర్, క్యాజువల్ వేర్‌ను ఆవిష్కరించారు. క్రీడాకారులు, క్రీడా రంగానికి చెందిన వివిధ వ్యక్తులు ఈ బ్రాండ్‌ను బాగా ఆదరిస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం యువీ ఇదే సంస్థ తరపున నగరంలో ఓ కార్యక్రమం నిర్వహించారు.



టాప్‌లో..

వీరితో పాటే ధోనీ సెవెన్ బ్రాండ్, విరేంద్ర సెహ్వాగ్ వీఎస్ బ్రాండ్లకు సైతం ఇక్కడ మంచి ఆదరణ ఉంది. ఈ కామర్స్ పెరిగిపోవడంతో అందిరి సెలబ్రిటీల బ్రాండ్స్ అభిమానులు ఆర్డర్ చేస్తున్నారు.

గ్లామర్ క్వీన్స్..

ప్రియాంక చోప్రా అనోమ్లీ బ్యాటీ ఉత్పత్తులు, దీపికా పదుకొనె ఆల్ అబౌట్ యూ, సమంత సాకి, అనుష్క శర్మ నుష్ వంటి బ్రాండ్లు కూడా ఇక్కడ లాభాల్లో అమ్ముడవుతున్నాయి. గ్లామర్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తున్న ఈ తారల సొంత బ్రాండ్లు ఫ్లిప్‌కార్ట్, మింత్ర లాంటి ఆన్‌లైన్ పోర్టల్స్‌లో లభ్యమవుతుండగా.. సమంత మాత్రం సాకి.కామ్ పేరుతో సొంత ఈకామర్స్ పోర్టల్ నడుపుతోంది.

బీయింగ్ హైదరాబాదీ..

దేశ వ్యాప్తంగా ఫ్యాషన్ మార్కెట్‌లో బీయింగ్ హ్యూమన్‌ది ప్రత్యేక స్థానం. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ సొంత బ్రాండ్ కావడంతో దీనికి మంచి ఆదరణ ఉంది. 2007 నుండి సల్మాన్‌ఖాన్ బీయింగ్ హ్యూమన్ అనే ఒక స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి బీదవారి ప్రాథమిక విద్య, వైద్యానికి ఆర్థిక సహాయం అందిస్తున్నాడు. 2009 నుండి బీయింగ్ హ్యూమన్ పేరుతో ఫ్యాషన్ ఉత్పత్తులను ప్రారంభించాడు. వచ్చే ఆదాయాన్ని తన స్వచ్ఛంద సంస్థ తరపున సేవా కార్యక్రమాలకే ఖర్చుపెడుతున్నాడు. హైదరాబాద్‌లో సల్మాన్ ఖాన్‌కు అధిక సంఖ్యలో అభిమానులు ఉన్నారు. సల్మాన్‌కు నగరంతో ప్రత్యేక అనుబంధముంది. తన చెల్లి పెళ్లిని సైతం ఇక్కడే చేయడం తెలిసిందే.



ఐటీ నుంచి డైరెక్షన్ దాకా..

'ఇక్కడకు డైరెక్టర్ అవుదామనే వచ్చాను. ఎస్.. ముందు ఊహించిన దానికన్నా ప్రాక్టికాలిటీలో భిన్నంగానే ఉంది. అయినాసరే అనుకున్నది సాధిస్తాననే నమ్మకం ఏర్పడింది' అంటున్నారు మానసశర్మ. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళానికి చెందిన మానస.. సోనీలివ్‌లో గురువారం నుంచి అందుబాటులోకి రానున్న బెంచ్‌లైఫ్ వెబ్‌సిరీస్ ద్వారా దర్శకురాలిగా మారుతున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

– సాక్షి, సిటీబ్యూరో

'మాది ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం. చిన్నప్పటి నుంచి కథలు చదవడం ఇష్టం. అలాగే ఏఎన్ఆర్, ఎన్‌టీఆర్ విఠలాచార్య వంటి గొప్ప నటుల, దర్శకుల చిత్రాలు బాగా చూశాను. వాటి ద్వారా ఫిల్మ్ మేకింగ్‌పై ఇష్టం ఏర్పడింది. వైజాగ్‌లో ఇంజనీరింగ్ చదివే సమయంలో మల్టీమీడియా ప్రాజెక్ట్ సబ్మిట్ చేయమంటే నా క్లాస్‌మేట్స్‌కు భిన్నంగా నేను షార్ట్ ఫిల్మ్ చేశా. చదువు పూర్తయ్యాక ఐటీ కంపెనీలో ఉద్యోగిగా ఏడాది పాటు పనిచేసినా.. సినిమాలపై ఉన్న ఇష్టం నన్ను అక్కడ ఉండనివ్వలేదు. రిజైన్ చేసి డైరెక్టర్ కావాలనే లక్ష్యంతోనే సినీరంగంలోకి ప్రవేశించాను.

రైటర్ టూ డైరెక్టర్..

తొలుత రచయితగా 3 వెబ్‌సిరీస్‌లకు పనిచేశాను. మెగా డాటర్ నిహారిక బెంచ్‌లైఫ్ ద్వారా నాకు డైరెక్టర్‌గా తొలి అవకాశం ఇచ్చారు. తొలిసారి రాజేంద్రప్రసాద్, తనికెళ్లభరణి లాంటి గ్రేట్ యాక్టర్స్‌ని డైరెక్ట్ చేశాను. వారు కూడా నన్ను ప్రోత్సహించారు. షూటింగ్‌లో 40 రోజులు ఎలా గడిచిపోయాయో తెలియలేదు. క్లైమాక్స్ సీన్ చేశాక.. 'ఆ నలుగురూ సినిమా తర్వాత గ్లిజరిన్ అవసరం లేకుండా కన్నీళ్లు పెట్టించిన సీన్ మళ్లీ ఇదే' అని రాజేంద్రప్రసాద్ అనడం .. నా ఫస్ట్ అండ్ బెస్ట్ కాంప్లిమెంట్ అని చెప్పాలి.

ఒక్క ఛాన్స్.. చాలు..

మొదటి నుంచీ డైరెక్టర్ అవుదామనే నా లక్ష్యం నెరవేరుతున్నందుకు హ్యాపీ. రాసుకున్న కథ సరైన రీతిలో అందించాలని వచ్చిన అవకాశాన్ని ఎలాగైనా సద్వినియోగం చేసుకోవాలని తప్ప వేరే విషయాలు ఆలోచించడం లేదు. త్వరలో పూర్తిస్థాయి ఫీచర్ ఫిల్మ్ డైరెక్ట్ చేయనున్నా. యువన్‌శంకర్ రాజా మ్యూజిక్.. మిగతా వివరాలు త్వరలో తెలుస్తాయి' అంటూ ముగించారు మానసశర్మ. ఏదేమైనా విజయనిర్మల, నందినీరెడ్డిల తర్వాత భూతద్ధంలో పెట్టి వెదికినా లేడీ డైరెక్టర్ కనిపించని పరిస్థితుల్లో పూర్తి ఆత్మవిశ్వాసంతో మన ముందుకు వస్తున్న తెలుగమ్మాయి మానస శర్మ దర్శకురాలిగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ..చెప్పేద్దాం.. ఆల్ ద బెస్ట్...





కెరీర్ ఎంపికలో నగర యువత సృజనాత్మకత

హాస్పిటాలిటీ రంగంవైపు ఆసక్తి

అందుబాటులో
16 రకాల కాఫీలు | 8 రకాల టీలు

మైజ్ అండ్ బీన్స్.. బెర్రీ టీ..

సాక్షి, సిటీబ్యూరో : నగర యువత కెరీర్ ఎంపికలో సృజనాత్మకంగా వ్యవహరిస్తోంది. అమ్మాయిలు అబ్బాయిలను సవాల్ చేస్తూ హెవీ వెహికల్స్ నడుపుతూ, బైక్ రైడింగ్ చేస్తోంటే.. అబ్బాయిలు కిచెన్‌లోకి ఎంటర్ అయ్యి ప్రపంచ రుచులతో పోటీ పడుతున్నారు. అలా.. ఒక మంచి కాఫీ, మరో చక్కటి టీతో మనసు దోచేయొచ్చంటున్నాడు మైజ్ అండ్ బీన్స్ కాఫీ బార్ క్రియేటివ్ డైరెక్టర్ మీత్ షా. యూఎస్‌లో ఉన్నత విద్యనభ్యసించిన మీత్ షా దృష్టి హాస్పిటాలిటీరంగం వైపు మళ్లింది. తనకు మానసిక సంతృప్తి నిచ్చే వృత్తి ఇదేనంటున్నాడు మీత్ షా.

మోకాపాట్ గయ్..

కాఫీ ప్రియులకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉన్న పదం మోకా పాట్. ప్రపంచంలో అద్భుతమైన కాఫీకి ప్రసిద్ధి చెందిన మోకా నగరం పేరే దీనికి వచ్చింది. ఈ నగరం ఎమెన్‌లో ఉంది. కాఫీ గింజల ఎంపిక నుంచి వాటి గ్రేడింగ్, రోస్టింగ్, గ్రైండింగ్ వరకూ ప్రతి దశలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, ఆ తర్వాత కాఫీ టేబుల్ మీద కాఫీ పాట్‌లో వేయాల్సి కాఫీ పౌడర్ కొలత, నీటి కొలత, నీటి వేడి అన్నింటికీ ఒక ప్రామాణిక శాస్త్రం ఉంటుంది. ఇందుకోసం ఎస్‌సీఏ బరిస్టా కాఫీ మేకింగ్ కోర్సులే ఉన్నాయి.

జూబ్లీహిల్స్‌లో..

కాఫీ మేకింగ్‌లో కోర్సులు చేసిన ఇద్దరు యువకులు శ్రవణ్, మీత్ షా నగరంలోని జూబ్లీహిల్స్‌లో మైజ్ అండ్ బీన్స్ పేరుతో కాఫీ బార్ ప్రారంభించారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పదహారు రకాల కాఫీలు, ఎనిమిది రకాల టీలను హైదరాబాద్‌కి రుచి చూపిస్తున్నాడు మీత్ షా. 'మూడు గ్రాములు డ్రై బెర్రీ గ్రాన్యూల్స్‌లో 150 మిల్లీ లీటర్ల వేడి నీరు పోసి, మూత పెట్టి, మూడు నిమిషాల తర్వాత వడపోస్తే బెర్రీ టీ రెడీ. ఎర్రగా పండ్ల రసాన్ని తలపించే ఈ బెర్రీ టీ చక్కటి రుచితోపాటు బరువు తగ్గిస్తుంది. 'కాఫీ, టీలకు చక్కెర కలపాల్సిన అవసరమే లేదు. కాఫీ రుచిగా చేయడం రానప్పుడే ఆ లోటును చక్కెరతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తారు. నేను కాఫీ, టీలలో చక్కెర వాడను. వాటి సహజ రుచిని అందిస్తాను' అని వివరిస్తున్నాడు మీత్ షా.





నవ్వుతూ.. నవ్విస్తూ..

నలుగురితో నారాయణ అని కాకుండా నలుగురిలో నేను వేరయా అన్నట్లు ఆర్‌జేలలో ఆర్‌జే స్వాతి వేరయా అని నిరూపిస్తున్నారు. డిఫరెంట్ కంటెంట్‌తో అటు ఆర్‌జేగా ఇటు సోషల్‌మీడియా సెలబ్రిటీగా మరోవైపు ఇంట్లో ఇల్లాలిగా, పిల్లల ఆలనాపాలనతో పాటు పలు షోలను చేస్తూ తన సత్తా చాటుతోంది. ఆర్‌జేగా చేశామా అనేది కాకుండా కొంగొత్త థీమ్స్‌తో ఇంటర్వ్యూలు చేస్తూనే ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ రీల్స్ చేస్తూ.. తన గెటప్స్‌తో అదరగొడుతున్నారు.

- శ్రీనగర్‌కాలనీ

- సోషల్ మీడియా, ఇన్‌స్టాలో ట్రెండ్ అవుతూ..
- డిఫరెంట్ కంటెంట్‌తో ఆకట్టుకుంటున్న ఆర్‌జే స్వాతి..
- లక్షల్లో వ్యూస్ సొంతం చేసుకుంటూ గుర్తింపు..
- రీక్రియేషన్ రీల్స్, ఇంటర్వ్యూలే కంటెంట్
- లేడీ కమెడియన్ అవ్వాలనేదే కోరిక : స్వాతి

నవ్వించడం చాలా కష్టం.. అందులో ఎదుటువారిమీద జోక్‌వేసి నవ్వించడం ఒకతీరైతే.. తనమీద తానే జోక్స్ వేసుకొని డిఫరెంట్ గెటప్స్‌తో నవ్వించడం మరో తీరు. ఈ కోవకే చెందుతారు ఆర్‌జే స్వాతి. పేరడీ, రీమిక్స్‌తో లక్షల్లో వ్యూస్ సంపాదిస్తూ.. సోషల్ మీడియాలో సంచలనాలను సృష్టిస్తున్న ఆర్‌జే స్వాతి తన అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు..

టిపికల్ మిడిల్‌క్లాస్ ఫ్యామిలీ..

టిపికల్ మిడిల్‌క్లాస్, స్ట్రిక్ట్ ఫ్యామిలీ.. మాది. పుట్టింది వరంగల్.. అక్కడే స్కూలింగ్ చేశాను. హైదరాబాద్ రామాంతపూర్‌లో డిగ్రీ చేసి బీపీఓలో ఉద్యోగం చేసేదానిని. మొదట్లో హైదరాబాద్ కల్చర్‌ను అలవాటు చేసుకోవడానికి చాలా టైం పట్టింది. కానీ త్వరగా మేలుకొని అలవాటయ్యాను. నాకు మాట్లాడటం అలవాటు.. ఎదుటివారితో కలిసిపోవడం, నవ్వించడం చాలా ఇష్టం. బీపీఓలో గడగడా మాట్లాడుతూ కస్టమర్ కేర్‌లో గడసరిగా పేరుతెచ్చుకున్నాను. అలా 2013లో ఆర్‌జేగా మీరు కూడా అవ్వొచ్చు అనే అడ్వర్‌టైజ్‌మెంట్ రావడంతో ఇంట్లో చెప్పకుండా ఆర్‌జే ఆడిషన్స్‌కి వెళ్లి ఆడిషన్ ఇచ్చాను. నా ఆడిషన్ రేడియో మిర్చి వారికి నచ్చి నన్ను ఆర్‌జేగా తీసుకున్నారు.



ఇమిటేషన్, కొత్త థీమ్స్ ఇంటర్వ్యూలు..

అందరిలా ఆర్‌జే చేయడం కన్నా కొద్దిగా సరికొత్తగా చేయడం ఇష్టం. అలా గురు సినిమా హీరో వెంకటేష్‌తో హీరోయిన్ మాదిరి ఇమిటేషన్ ఇంటర్వ్యూ చేయడం ఆయనకు నచ్చింది. సందర్భానుసారం మట్లాడుతూ, మిమిక్రీ చేస్తూ, సినిమా ఇంటర్వ్యూలలో ఆ సినిమా తాలూకూ థీంని తీసుకొని ఇంటర్వ్యూ చేసేదానిని. అలా ఆర్‌జేగా నాకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు లభించింది.

ఇన్‌స్టాగ్రామ్ వీడియోలకు స్పందన..

సోషల్ మీడియా వచ్చాక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నవ్వించే వీడియోలు చేశాను. కానీ సరికొత్తగా చేయాలనే తపనతో రీమిక్స్ గెటప్‌ల వైపు మొగ్గాను. ట్రెండింగ్‌లోని వీడియోలకు అచ్చం అలాగే గెటప్స్ వేసి రీమిక్స్ వీడియోలు చేయడం ప్రారంభించాను. నెటిజన్ల నుండి అనూహ్య స్పందన లభించింది. ట్రెండింగ్ వీడియోస్‌లోని వారిని అనుకరించడానికి వారి గెటప్స్‌కి పేరడీగా ఇంట్లో వంట వస్తువులు, కూరగాయలు, నూడిల్స్, మా కుంటుబసభ్యుల దుస్తులు వాడతాను. అలా చేయడం నెటిజన్లను మరింత ఆకర్షించింది. దీంతో రీమిక్స్‌కి లక్షల్లో వ్యూస్ వచ్చాయి. ఇన్‌స్టాలో లక్షాపదివేల మంది ఫాలోవర్స్ వచ్చారు. కొంగొత్త కంటెంట్‌తో నవ్వించడం నా కర్తవ్యం. ఓ రోజు మా స్టూడియోకి మాజీ మంత్రి కేటీఆర్ వచ్చినపుడు ర్యాప్ సాంగ్ పాడాను. ఆయనకు చాలా నచ్చి మీరు ర్యాపరా కూడానా అని మెచ్చుకున్నారు.



లేడీ కమెడియన్ అవ్వాలి..

నేటితరంలో లేడీ కమెడియన్లు చాలా అరుదుగా ఉన్నారు. కోవై సరళలాగా తన మీద తనే జోకులు వేసుకుంటూ చేసే కామెడీని చేయాలన్నది నా కోరిక. లేడీ కమెడియన్‌గా అడుగులు వేస్తున్నాను. పలు టీవీ షోల వారితో సంప్రదింపులు జరుగుతున్నాయి. త్వరలో ఆర్‌జేగా, సోషల్ మీడియాతో పాటు బుల్లితెర, వెండితెరలలో నవ్వులు పూయించాలన్నదే నా ఆకాంక్ష.. నవ్వుతూ బ్రతకాలిరా.. నవ్వుతూ చావాలిరా.. నా చివరి శ్వాస వరకూ ప్రేక్షకులను నవ్వించడానికి ప్రయత్నిస్తూనే ఉంటాను.. ఇట్లు.. మీ ఆర్‌జే స్వాతి.

క్లుప్తంగా...

తెలంగాణ మహిళా శక్తికి ప్రతీక ఐలమ్మ: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ మహిళాశక్తికి, బహుజన ధీరత్వానికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన ఉద్యమంలో ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఇమిడిఉందని తెలిపారు. ప్రజావ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన చాకలి ఐలమ్మ ప్రతిఘటనా తత్వం ఎల్లవేళలా ఆదర్శమని కేసీఆర్ తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించే దిశగా ఆమె జయంతిని ఏటా అధికారికంగా నిర్వహించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

రేవంత్‌రెడ్డి పెద్ద నియంత

బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పెద్ద నియంతలా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరును అడ్డుకొని తీరుతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, ఆయన్ను పీఏసీ చైర్మన్‌గా ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే గాంధీని అడ్డుపెట్టుకొని రేవంత్ శిఖండి రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. స్పీకర్ భుజం మీద తుపాకీ పెట్టి బీఆర్ఎస్‌ను కాల్చేందుకు సీఎం ప్రయత్నం చేస్తున్నారన్నారు. పీఏసీ చైర్మన్‌గా గాంధీ నియామకంపై స్పీకర్ పునరాలోచించకపోతే, గవర్నర్‌ను కలవడం సహా ఇతర మార్గాలను అన్వేషిస్తామన్నారు. బీఆర్ఎస్ తరఫున తనతోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ నామినేషన్లు వేశామన్నారు. అయితే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన గాంధీ పేరు జాబితాలోకి ఎలా వచ్చిందో చెప్పాలన్నారు.

ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు చరిత్రాత్మకం

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్యేల అనర్హతపై బీజేపీ వేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ధర్మాసనం నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్ కార్యాలయ కార్యదర్శిని ఆదేశించిందని చెప్పారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని గతంలో కూడా కోర్టులో పిటిషన్ వేసినట్లు చెప్పారు. హైకోర్టు తీర్పును మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించడం మంచి పరిణామం అని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే దృష్టికి తీసుకెళ్లి తీర్పును గౌరవించేలా నిర్ణయం తీసుకోవాలన్నారు.

ఫిరాయింపులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

ఎమ్మెల్యే కడియం



స్టేషన్‌ఘన్‌పూర్: పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకి, ఆ పార్టీ నేతలకు లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రతిపక్ష పార్టీల శాసనసభా పక్షాలను విలీనం చేసుకున్న నీచ చరిత్ర బీఆర్ఎస్‌దని మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు వివిధ రాజకీయ పార్టీల నుంచి 32 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని, అందులో ఏ ఒక్కరూ అనర్హతకు గురికాలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏకంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కట్టబెట్టారని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి హైకోర్టు తీర్పుపై ఒరిజినల్‌కాపీ అందాక ఈ విషయమై న్యాయ నిపుణులతో చర్చించాక భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. కోర్టులను గౌరవించే బాధ్యత మనకుందని, డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని తెలిపారు.

జీఆర్‌టీ జ్యువెల్లర్స్ డైమండ్ ఇయర్ రింగ్స్ మేళా

వైఫల్యం జంకుతోనే బోట్లపై బొంకు!

వరద నియంత్రణ, సహాయ చర్యల్లో సీఎం చంద్రబాబు దారుణ వైఫల్యం

ఆ నిర్వాకాలను కప్పిపుచ్చేందుకే 'బోటు' రాజకీయం

బోట్ల యజమాని.. టీడీపీ వర్గీయుడు...
ఆ బోట్లకు అనుమతులిచ్చింది టీడీపీ ప్రభుత్వమే..
టీడీపీ విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్నవి అవే బోట్లు...
అయినా సరే ఆ బోట్లు ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టడం వైఎస్సార్ సీపీ కుట్రే...!
వైఎస్సార్ సీపీ నేతలే లక్ష్యంగా అక్రమ కేసులు నమోదు చేయండి.. ఇదీ సర్కారు ఆదేశం! ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కు రాజకీయ కుట్ర ఇదీ!!

- సాక్షి, అమరావతి



ఏపీ సీఎం చంద్రబాబుతో నిందితుడు రామ్మోహన్

అతి భారీ వర్షాలపై వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలను పెడచెవిన పెట్టడంతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలకు అప్పటికే శ్రీశైలం, నాగార్జున సాగర్ నిండుకుండలను తలపిస్తున్నా దిగువకు ప్రవాహాన్ని విడుదల చేసేందుకు ఫ్లడ్ కుషన్ నిబంధనను పాటించకుండా సీఎం చంద్రబాబు లక్షల మంది ప్రజల జీవితాలతో చెలగాటమాడారు. వరద ముంపు ముంచుకొస్తున్నా రెవెన్యూ, పోలీస్, జలవనరుల శాఖలతో కనీసం సమీక్ష నిర్వహించకుండా.. ప్రజలను అప్రమత్తం చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. మానవ తప్పిదంతో విజయవాడను వరదలు ముంచెత్తేందుకు కారణమయ్యారు. వరద నియంత్రణ, సహాయ, పునరావాస చర్యల్లో ఘోర వైఫల్యం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'బోట్ల' రాజకీయానికి తెర తీశారు. ఏకంగా రాజద్రోహం లాంటి కఠిన సెక్షన్ల కింద అక్రమ కేసులు బనాయించాలని ఆదేశించడం ఈ కుతంత్రానికి పరాకాష్ట. అయితే ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న బోట్ల యజమాని కొక్కిలగడ్డ ఉషాద్రి టీడీపీ వర్గీయుడన్న విషయం ఆధారాలతో సహా బట్టబయలైంది. ఆ బోట్లను కోమటి రామ్మోహన్ అనే వ్యక్తికి విక్రయించారన్న ప్రభుత్వ ఆరోపణలు అవాస్తవమని తేలిపోయింది. ఇక ఆ బోట్లకు అనుమతులిచ్చింది కూడా టీడీపీ హయాంలోనే కావడం గమనార్హం.

అక్రమ కేసు కుట్రదారు బాబే.. వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే

ఓ వైపు విజయవాడలో ఏకంగా 7 లక్షల మందికిపైగా వరదలో చిక్కుకుని అల్లాడుతుంటే సీఎం చంద్రబాబు మాత్రం వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకు బోట్ల ఉదంతానికి ఉద్దేశపూర్వకంగా ప్రాధాన్యమిచ్చారు. తద్వారా అక్రమ కేసు నమోదు చేయాల్సిందేనని పోలీసులకు స్పష్టమైన సంకేతాలిచ్చారు. దీంతో బోట్లు ఢీకొనడం యాదృచ్ఛికమేనని అప్పటివరకు చెబుతూ వచ్చిన నీటిపారుదల శాఖ, పోలీసు శాఖ అధికారులకు ప్రభుత్వ పెద్దల ఆంతర్యం బోధపడింది. ఇక చేసేదిలేక ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఇదే అదనుగా అధికార పార్టీ నేతలు వైఎస్సార్‌సీపీపై బురద జల్లుతూ టీడీపీ అనుకూల మీడియాలో చర్చలతో హడావుడి చేస్తున్నారు.

ఉషాద్రి టీడీపీ వర్గీయుడే
ఆ బోట్లకు అనుమతులిచ్చింది టీడీపీ ప్రభుత్వమే

బ్యారేజీని ఢీకొట్టిన బోట్ల యజమాని కొక్కిలగడ్డ ఉషాద్రి టీడీపీ వర్గీయుడే. చంద్రబాబు, లోకేశ్, దేవినేని ఉమామహేశ్వరరావుకు ఆయన అత్యంత సన్నిహితుడు. ఉషాద్రి వారితో కలసి టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 2014–19 మధ్య టీడీపీ హయాంలోనే ఉషాద్రి బోట్లకు లైసెన్స్‌లు మంజూరయ్యాయి. ఆయన బోట్లకు మారిటైమ్ బోర్డ్ అనుమతులతోపాటు అమరావతి బోటింగ్ క్లబ్‌లో సభ్యత్వం కూడా ఇచ్చారు. దాంతో కృష్ణా నదిలో ఇసుక తవ్వి విక్రయించేవారు. ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన తరువాత నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో ఉషాద్రి బోట్లు కూడా ఉన్నాయి. ఆ బోట్లకు టీడీపీ జెండాలు కట్టి పార్టీ నేతలు వాటిపై కృష్ణా నదిలో విహరిస్తూ బాణసంచా కాల్చారు. ఆ ఫొటోలు, వీడియోలు తాజాగా వైరల్ అయ్యాయి. టీడీపీలో అత్యంత క్రియాశీల సభ్యుడైన ఉషాద్రి బోట్లు ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీకొంటే అందుకు ఆ పార్టీనే బాధ్యత వహించాలి కదా? వైఎస్సార్‌సీపీపై రాజకీయ కక్షతోనే ఆరోపణలు చేస్తున్నట్లు పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

గోప్యత వెనుక గుట్టు ఇదీ..!

పోలీసులు అరెస్ట్ చేసిన రెండో నిందితుడు కోమటి రామ్మోహన్‌కూ టీడీపీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆయన వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం మేనల్లుడు అని మాత్రమే పోలీసులు పేర్కొన్నారు. అయితే రామ్మోహన్ టీడీపీ ఎన్ఆర్ఐ విభాగంలో కీలక నేత కోమటి జయరాం సోదరుడి కుమారుడు అనే విషయాన్ని ప్రభుత్వం కప్పిపుచ్చుతోంది. 2019 వరకు టీడీపీలోనే కొనసాగిన రామ్మోహన్ 2020 ఎంపీటీసీ ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అయితే ఇప్పటికీ టీడీపీ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, బొమ్మసాని సుబ్బారావుకు అత్యంత సన్నిహితుడుగా ఉన్నారు. ఆ విషయాలను కూడా ప్రభుత్వం గోప్యంగా ఉంచుతోంది. అంతేకాదు.. ఉషాద్రి, రామ్మోహన్‌లకు మరో వ్యాపార భాగస్వామి ఉన్నారు. ఆయనే టీడీపీ నేత అలూరి చిన్న. ఈ ఉదంతంలో టీడీపీకి సంబంధాలున్నాయనే విషయాన్ని కప్పిపుచ్చేందుకే పోలీసులు ఆలూరి చిన్న పేరును తప్పించారన్న విషయం కీలకంగా మారింది.

టీడీపీ ప్రభుత్వ రాజకీయ కుట్రే

వాస్తవానికి బోట్లు వరద ధాటికి తాళ్లు తెగి కొట్టుకొచ్చి ప్రకాశం బ్యారేజీని ఢీకొన్నట్లు నీటిపారుదల శాఖ, పోలీసు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ విషయాన్ని వెల్లడించకుండా వైఎస్సార్‌సీపీపై బురద చల్లేందుకు ప్రభుత్వం వ్యూహం సిద్ధం చేసింది. బ్యారేజీని దెబ్బతీసేందుకే బోట్లను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టేలా చేశారని కేసు నమోదు చేసి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు తెరతీసింది. వైఎస్సార్‌సీపీ నేతలు నందిగం సురేశ్, తలశిల రఘురాంను ఈ అక్రమ కేసులో ఇరికించాలన్నదే ప్రభుత్వ కుతంత్రం.

తేలిపోయిన ప్రభుత్వ కుట్ర...

- ప్రకాశం బ్యారేజీకి తీవ్ర నష్టం కలిగించేందుకే కృష్ణా నదికి అటువైపు ఉన్న బోట్లను కొద్ది రోజుల ముందు ఇటువైపు తెచ్చారని మంత్రి రామానాయుడు చెబుతున్నారు. కానీ ఆ అభియోగాలు పూర్తిగా అవాస్తవమని ఆధారాలతో వెల్లడైంది. ఆ బోట్లను నాలుగు నెలలుగా గొల్లపూడి సమీపంలో కృష్ణా నదిని ఆనుకుని ఉన్న శ్మశానం సమీపంలోనే లంగరు వేసి ఉంచారు. గూగుల్ శాటిలైట్ ఫొటోలు అదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.
- బోట్లను ఉద్దేశపూర్వకంగానే ప్లాస్టిక్ తాళ్లతో కట్టారని, నిర్లక్ష్యంగా వ్యవహరించారని కేసులో ప్రస్తావించారు. కానీ ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న ఆ బోట్లే కాదు.. కృష్ణా నదిలో అన్ని బోట్లను అవే బలమైన ప్లాస్టిక్ తాళ్లతో లంగరు వేసి ఉంచుతున్నారు. అందుకోసమే తయారు చేసిన ప్లాస్టిక్ తాళ్లను అమరావతి బోటింగ్ క్లబ్ తమ సభ్యులకు సరఫరా చేస్తోంది.
- ప్రకాశం బ్యారేజీ గేట్ల వద్ద ఉన్న స్లూయిజ్ చైన్లను తెంపేశారని ప్రభుత్వం ఆరోపించడం విడ్డూరంగా ఉంది. 'అవేమీ చిన్నా చితకా తాళ్లు కాదు తెంపేయడానికి. బలమైన ఇనుప గొలుసులు. వాటిని తెంపడం అసాధ్యం' అని నీటిపారుదల శాఖ అధికారులే వ్యాఖ్యానించడం గమనార్హం.
- 2024లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ నేతలే కృష్ణా నది వద్ద ఇసుక వ్యాపారం చేస్తున్నారు. విజయవాడలో అన్ని బోట్లు ఆ పార్టీ నేతల ఆధీనంలోనే ఉన్నాయి. అవి బ్యారేజీని ఢీకొంటే అందుకు బాధ్యత టీడీపీ వర్గీయులదే అవుతుంది కానీ వైఎస్సార్ సీపీకి ఏం సంబంధం?

మరిన్ని వివరాలు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సుప్రీం మార్గదర్శకాల మేరకు..

బీసీ రిజర్వేషన్లను నిర్ధారించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. 3 నెలల సమయం కోరిన అడ్వొకేట్ జనరల్

సాక్షి, హైదరాబాద్: వికాస్ కిషన్‌రావ్ గవాలీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు బీసీ రిజర్వేషన్లను నిర్ధారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 'స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలుపై అధ్యయనానికి రాజ్యాంగబద్ధమైన కమిషన్ ఏర్పాటు చేయాలి.. సామాజిక, రాజకీయ అంశాలు, వెనుకబాటుతనం లాంటి అంశాలను పరిశీలించి జనాభా నిష్పత్తికి అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు నిర్ధారించాలి.. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లన్నీ 50 శాతానికి మించకూడదు' అని వికాస్ కిషన్‌రావ్ గవాలీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో పేర్కొన్న ఈ మూడు సూత్రాలను తప్పకుండా పాటించాలని స్పష్టం చేసింది. దీన్ని అమలు చేసేందుకు మూడు నెలల సమయం కావాలని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి కోరారు. దీంతో తదుపరి విచారణను 3 నెలలకు వాయిదా వేస్తూ, అప్పటిలోగా నివేదిక అందజేయాలని తేల్చిచెప్పింది. రాష్ట్రంలో బీసీల జనాభా వివరాలను సేకరించడానికి, సర్వేల నిర్వహణకు తెలంగాణ బీసీ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను అధీకృత సంస్థగా ప్రభుత్వం గుర్తించడం రాజ్యాంగ వ్యతిరేకమని.. రాజ్యాంగబద్ధమైన బీసీ కమిషన్ ఏర్పాటు చేసి రిజర్వేషన్లను నిర్ణయించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సహా మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయాలని కోరారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ధర్మేశ్ డీకే జైస్వాల్, శ్రీనివాస్ యాదవ్, కొటూరు పవన్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్, కేంద్రం తరఫున డీఎస్‌జీ గాడి ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. వికాస్ కిషన్‌రావ్ గవాలీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల్లోని పేరా 13 అమలుపై వివరాలు తెలుసుకుని చెబుతామని గత విచారణ సందర్భంగా ఏజీ వెల్లడించారు. మంగళవారం విచారణ సందర్భంగా మూడు అంశాలు అమలు చేయడానికి ఎంత సమయం కావాలని ఏజీని ధర్మాసనం ప్రశ్నించింది. పూర్తి అధ్యయనానికి 3 నెలల సమయం కావాలని కోరడంతో అనుమతించిన ధర్మాసనం తదుపరి విచారణను వాయిదా వేసింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలను

నాశనం చేసిన బీఆర్ఎస్

- భట్టి విక్రమార్కను ప్రతిపక్షనేత కాకుండా కుట్ర చేశారు
- తాను బీఆర్ఎస్ సభ్యుడిని అని పీఏసీ చైర్మన్ స్వయంగా ప్రకటించారు
- మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేసిందే బీఆర్ఎస్ అని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తితోనే పాలన సాగిస్తుందని, న్యాయస్థానాలను గౌరవిస్తుందని చెప్పారు. మంగళవారం ఆయన శాసనసభ ఆవరణలోని సీఎల్‌పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సభాపతి నియమించిన పీఏసీ కమిటీపై బీఆర్ఎస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదన్నారు. సభాపతి కుర్చీని అవమానించేలా ప్రతిపక్షాలు మాట్లాడటం శోచనీయమన్నారు. స్పీకర్ ఒక ప్రక్రియ ప్రకారం అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేస్తారని చెప్పారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలను తారుమారు చేసి అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు ఆ హోదా లేకుండా చేసి భట్టి విక్రమార్కను ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు కాకుండా పీఏసీ పదవి ఎవరికి ఇచ్చారో అందరూ చూశారని అన్నారు. స్వయంగా పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ తాను బీఆర్ఎస్ సభ్యుడినని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ పార్టీ అంతర్గత కుమ్ములాటలు ఏమైనా ఉంటే తమకేం సంబంధమని, స్పీకర్ ప్రతిపక్ష ఎమ్మెల్యేను పీఏసీ చైర్మన్‌గా నియమించారన్నారు.

కోర్టు తీర్పుపై అధ్యయనం చేస్తున్నాం

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విషయంలో న్యాయస్థానం శాసనసభ కార్యదర్శికి సూచనలు చేసిందే తప్ప తుదితీర్పు ఇవ్వలేదని శ్రీధర్‌బాబు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తాము కోర్టు తీర్పును ఇంకా పూర్తిగా అధ్యయనం చేయలేదని, న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాత మాట్లాడుతామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకున్నారో అందరూ చూశారని చెప్పారు. వ్యవస్థలను కాలరాసింది... ఫిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్ పార్టీనే అని విమర్శించారు. సీపీఐ ఇండియా కూటమిలో భాగమని, వారు కాంగ్రెస్‌తోనే ఉన్నారని భావిస్తున్నట్టు చెప్పారు.

'రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం'



మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును స్వాగతిస్తున్నామని, అదే విధంగా క్రీమీలేయర్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని బహుజన మహాసభ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర సదస్సులో పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, ప్రొఫెసర్ కాశీం, భారత్ బచావో రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ తదితరులు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా వీధి పోరాటాల నుంచి అత్యున్నత న్యాయస్థానాల వరకు ఎస్సీ రిజర్వేషన్ల పోరాటం కొనసాగిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యమానికి సంఘీభావాన్ని ప్రకటించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని చెప్పారు. ఎంఆర్‌పీఎస్ లేవనెత్తిన ఈ సమస్యలో ఉన్న సహేతుకత ఈ ఉద్యమాన్ని తారస్థాయికి తీసుకువెళ్లిందని గుర్తు చేశారు. అందుకే సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని వారు తెలిపారు. జనగణనలో కులగణన చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. బహుజన మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకన్న అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

కొత్తగా 400 ఎంబీబీఎస్ సీట్లు

▶ మొదటి పేజీ తరువాయి

నాలుగింటికి గత నెలలో అనుమతులు రాగా, తాజాగా మిగిలిన నాలుగింటి అనుమతులపై స్పష్టత ఇచ్చింది. గత నెలలో ములుగు, నర్సంపేట, గద్వాల, నారాయణపేట కాలేజీలకు అనుమతులు ఇచ్చిన సంగతి తెలిసిందే. కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇవ్వడం పట్ల మంత్రి దామోదర రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది వీటిల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని తెలిపారు. మొత్తం 8 కాలేజీల్లో కలిపి 400 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రభుత్వ కాలేజీల్లోని మొత్తం సీట్ల సంఖ్య 4,090కి పెరిగినట్టు మంత్రి వెల్లడించారు.

ముమ్మర ప్రయత్నాలు...

ఈ ఏడాది మొత్తం 8 కాలేజీలకు ప్రభుత్వం దరఖాస్తు చేసింది. జూన్‌లో ఈ కాలేజీల పరిశీలనకు వచ్చిన ఎన్ఎంసీ అధికారులు, ఇక్కడ కాలేజీల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. టీచింగ్ స్టాఫ్, సౌకర్యాలు లేకుండా అనుమతులు ఇవ్వలేమన్నారు. అధికారులు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకురావడంతో అవసరమైన నిధులను కొత్త సర్కార్ కేటాయించింది. ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను సవరించి ఫస్ట్ అప్పీల్‌కు వెళ్లింది. ఈ అప్పీల్ తర్వాత ములుగు, నర్సంపేట, గద్వాల నారాయణపేట కాలేజీలకు పర్మిషన్ ఇచ్చిన ఎన్ఎంసీ, మిగిలిన 4 కాలేజీలకు అనుమతి ఇవ్వలేదు. ఈ కాలేజీల అనుమతులపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రెగ్యులర్‌గా పర్యవేక్షించారు. యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ కాలేజీలకు సిబ్బందిని నియమించారు. ఇటీవల జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్లలో తొలుత ఆ 4 కాలేజీల్లోని ఖాళీలను నింపిన తర్వాతే, మిగిలిన కాలేజీల్లోకి స్టాఫ్‌ను బదిలీ చేశారు. ప్రొఫెసర్ల కొరతను అధిగమించేందుకు ఎలిజిబిలిటీ ఉన్న వారికి ప్రమోషన్లు ఇప్పించారు. కాలేజీ, హాస్పిటల్‌లో ఉండాల్సిన లేబొరేటరీ, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించారు. ఇలా ఎన్ఎంసీ లేవనెత్తిన అన్ని లోపాలను సవరించి కేంద్ర ఆరోగ్యశాఖకు సెకండ్ అప్పీల్ చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, డీఎంఈ డాక్టర్ వాణి ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఆరోగ్యశాఖ, ఎన్ఎంసీ అధికారులను కలిశారు. కాలేజీ ఏర్పాటుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, ఇంకేమైనా అవసరం ఉంటే అవి కూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలోనే మొత్తం అన్ని కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయించింది. లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీ చేయాలని ఎన్ఎంసీని ఆదేశించింది. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రయత్నాలు సఫలం అయ్యాయి. ఆయన కృషి ఫలితంగా కొత్తగా మెడికల్ కాలేజీలకు అనుమతులు వచ్చాయి. కాలేజీలకు అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి, సకాలంలో అవసరమైన నిధులు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి దామోదర రాజనర్సింహ కృతజ్ఞతలు తెలిపారు.

'ఎంఈఐఎల్' రూ.5 కోట్ల విరాళం

- సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రేస్ క్లబ్ తరఫున ఎంపీ రఘురాంరెడ్డి రూ.2 కోట్లు..
- 'లలిత', సైయెంట్, మైత్రా సంస్థలు రూ.కోటి చొప్పున..



సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎంలకు చెక్కును అందజేస్తున్న ఎంఈఐఎల్ సంస్థ ఎండీ పీవీ కృష్ణారెడ్డి. చిత్రంలో మంత్రి పొన్నం, జగ్గారెడ్డి





విరాళం అందిస్తున్న మైత్రా ఎనర్జీ గ్రూప్ అండ్ అక్షత్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్లు విక్రం కైలాస్, రవికైలాస్, లలితా జ్యువెల్లర్స్ అధినేత కిరణ్





చెక్కును అందజేస్తున్న సైయెంట్ కంపెనీ యాజమాన్యం, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి. చిత్రంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ఖమ్మంవన్‌టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఎంఈఐఎల్ సంస్థ రూ.5 కోట్ల విరాళంఅందజేసింది. సంస్థ ఎండీ పి.వి.కృష్ణారెడ్డి, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని కలిసి ఈ మేరకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి, సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్టీ రావు పాల్గొన్నారు. ఏపీకి కూడా రూ.5 కోట్ల విరాళాన్ని అందించినట్టు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

రేస్ క్లబ్ తరఫున రూ.2 కోట్లు

హైదరాబాద్‌లోని రేస్ క్లబ్ డైరెక్టర్ అయిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి.. మరో డైరెక్టర్ నరసింహరెడ్డితో కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.2 కోట్ల చెక్కును మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.కోటి చొప్పున..

సీఎం సహాయ నిధికి సైయెంట్ కంపెనీ యాజమాన్యం రూ.కోటి విరాళాన్ని అందజేసింది. అలాగే లలితా జ్యువెల్లర్స్ అధినేత కిరణ్ రూ.కోటి, మైత్రా ఎనర్జీ గ్రూప్ అండ్ అక్షత్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్లు విక్రం కైలాస్, రవికైలాస్ రూ.కోటి విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలో కలిసి చెక్కులను అందజేశారు. సినీ నిర్మాత దిల్ రాజు రూ.25 లక్షల విరాళాన్ని అందజేశారు.

నటేశ్వర శర్మ కన్నుమూత

- గత ఏడాది దాశరథి పురస్కారం
- ఉమ్మడి రాష్ట్రంలో పేరున్న సాహితీవేత్త
- 'సౌందర్యలహరి'పై పరిశోధనకు ఓయూ నుంచి డాక్టరేట్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ముత్యాల్లాంటి ఆయన చేతిరాత అక్షరాలకే వన్నెలద్దుతాయి. ఆయన కలం నుంచి జాలువారిన కవితలు, గ్రంథాలు ఎందరినో మేల్కొల్పాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ కవిగా, రచయితగా, సంస్కృతాంధ్ర పండితులుగా, అష్టావధానిగా పేరున్న డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ (68) అనారోగ్యంతో మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో తనువు చాలించారు. గత కొంతకాలంగా ఊపిరితిత్తుల్లో సమస్యతో చికిత్స పొందారు. గత ఏడాది దాశరథి కృష్ణమాచార్య పురస్కారాన్ని అందుకున్న పండితులు నటేశ్వరశర్మ. ఆయనకు భార్య అరుణకుమారి, ముగ్గురు కుమార్తెలు కౌముది, జాహ్నవి, యామిని ఉన్నారు.

పలు శతకాలు, గేయ సంకలనాలు..

1956 జూలై 17న కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో జన్మించిన నటేశ్వరశర్మ ఉస్మానియా యూనివర్సిటీలో ప్రాచ్యభాషా పీఠాధిపతిగా, కామారెడ్డిలోని ప్రాచ్య విద్యా పరిషత్తు సాయం ప్రాచ్య కళాశాలలో సంస్కృత విభాగ ఆచార్యులుగా, అనంతరం ప్రధాన ఆచార్యులుగా పనిచేసి 2014 జూలైలో పదవీ విరమణ పొందారు. ఆయన సాహిత్య వ్యాసాలు, కవితలు ఎన్నో పత్రికల్లో దశాబ్దాల తరబడి ముద్రించబడ్డాయి. అంతర్యామి శీర్షికతో ఆయన చేసిన రచనలు ఎందరినో కదిలించాయి. సంస్కృతాంధ్ర భాషల్లో ఆయన 50కి పైగా రచనలు చేశారు. 1970లో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి తిరుమల శ్రీ వేంకటేశ్వర వేద సంస్కృత పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థిగా ఉన్న నటేశ్వరశర్మ సంస్కృత శ్లోకాలతో స్వాగతం పలకడంతో ఆయన ఆశ్చర్యపోయారు. నటేశ్వరశర్మ ఎన్నో వచన, గేయ, పద్య సంకలనాలు, శతకాలు రచించారు. 2011 నుంచి 2013 వరకు ఉస్మానియా విశ్వ విద్యాలయంలోని ప్రాచ్య భాషా విభాగానికి పీఠాధిపతిగా (డీన్)గా కూడా సేవలందించారు. ఆది శంకరాచార్యులు రచించిన సౌందర్యలహరిపై పరిశోధనలకు 1994లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా, స్వర్ణ పతకం అందుకున్నారు. కామారెడ్డి ప్రాచ్య కళాశాలలో ఆచార్యునిగా, ప్రధాన ఆచార్యునిగా సుదీర్ఘకాలం పనిచేసిన నటేశ్వరశర్మ శిష్యులు వందలాది మంది తెలుగు పండితులుగా ఉద్యోగాలు పొందారు. నటేశ్వరశర్మ మృతిపట్ల సాహితీరంగ ప్రముఖులు, రచయితలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి సాహితీరంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

ఔటర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు

గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

మొత్తం 41.5 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ రోడ్డు 15 గ్రామాల మీదుగా సాగనుంది. మహేశ్వరం మండలంలోని కొంగరఖుర్ద్, ఇబ్రహీంపట్నంలోని కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ, కందుకూరులోని లేమూర్, తిమ్మాపూర్, రాచులూర్, గుమ్మడవెల్లి, పంజగూడ, మీర్‌ఖాన్‌పేట్, ముచ్చెర్ల, యాచారంలోని కుర్మిద్ద, కడ్తాల్ మండలంలోని కడ్తాల్, ముద్విన్, ఆమన్‌గల్ మండలంలోని ఆమన్‌గల్, ఆకుతోటపల్లి గ్రామాల గుండా ఈ రోడ్డు వెళ్లనుంది.

916 ఎకరాల భూసమీకరణ..

గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి 916 ఎకరాల భూమిని ప్రభుత్వం సమీకరించాల్సి ఉంది. ఇందులో 8 కిలోమీటర్ల మేర 169 ఎకరాల అటవీ శాఖ భూములు ఉండగా 7 కిలోమీటర్లలో 156 ఎకరాలు టీజీఐఐసీ భూములు, కిలోమీటరులో 23 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. 25.5 కిలో మీటర్ల మేర పట్టా భూములు ఉన్నాయి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం సంగారెడ్డి–తూప్రాన్–గజ్వేల్–చౌటుప్పల్ మీదుగా కిలోమీటర్లు, దక్షిణ భాగం చౌటుప్పల్–షాద్‌నగర్–సంగారెడ్డి మీదుగా 194 కిలోమీటర్ల మేర నిర్మాణం కానుండటం తెలిసిందే.

హైకోర్టు తీర్పును గౌరవించి తక్షణమే కులగణన ప్రారంభించాలి: జాజుల

సాక్షి, హైదరాబాద్: బీసీ కులగణనపై గౌరవ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణనపై రోడ్ మ్యాప్ ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గౌరవ ఉన్నత న్యాయస్థానం కులగణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 11-9-2024

సక్సెస్ స్టోరీ

పూలు రోడ్డు మీద దొరుకుతాయి. కాని వాటిని స్విగ్గీలో తెప్పించుకునే కస్టమర్లు కూడా ఉంటారు అని గ్రహించారు యశోద, రియా కారుటూరి. ఈ ఇద్దరూ కలిసి 'హూవూ ఫ్రెష్' పేరుతో మొదలెట్టిన బ్రాండ్ ఇంతింతై ఇంతి ఇంతై అన్నట్టు సాగుతోంది. తాజాగా వీరు అగరు బత్తీల రంగంలో అడుగు పెట్టారు. బంతి, నిమ్మ, మందారం... వీరి అగర్‌బత్తీల పేర్లు. పూలతో 50 కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించిన వీరి ఆలోచనలు...


యశోద, రియా కారుటూరి

పుష్ప సిస్టర్స్ తగ్గేదేలే...

ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది. ఐడియా రావడమే సగం విజయం. మిగిలింది ఆచరణ మాత్రమే. ఐడియాలు అందరికీ ఎందుకు రావు? ఎవరో అన్నట్టు బుర్ర పారాచూట్ లాంటిది. తెరిచి పెడితే పని చేస్తుంది. లేదంటే ఏం ఉపయోగం. బెంగళూరులో నివాసం ఉండే ఇద్దరు అక్కచెల్లెళ్లు 2019లో తల్లి తరచూ చేసే ఫిర్యాదును వినేవారు. 'బెంగళూరులో ఉన్నామన్న మాటే గాని పూజ చేద్దామంటే తాజా పూలే దొరకవు' అని. ఆ అక్కచెల్లెళ్ల పేర్లు యశోద కారుటూరి, రియా కారుటూరి. యశోద వాషింగ్టన్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదివితే రియా స్టాన్‌ఫోర్డ్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ చదివింది. అంటే వీళ్లకు టెక్నాలజీ తెలుసు. బిజినెస్ తెలుసు. ఐడియా వెలగకుండా ఉంటుందా?


ప్యాకింగ్ చేస్తూ...

పూలు తెలుసు

రియ, యశోదల తండ్రి వాళ్ల బాల్యంలో కెన్యా వెళ్లి గులాబీ పంట వేసి పండించేవాడు. ఒకప్పుడు కెన్యా గులాబీలకు పెద్ద మార్కెట్ ఉండేది. ఆ తర్వాత పోయింది. చిన్నప్పుడు ఆ తోటల్లో తిరిగిన రియ, యశోదలు అందరూ ఏవేవో వ్యాపారాలు చేస్తారు... మనం పూలతో ఎందుకు చేయకూడదు అనుకున్నారు. ఆలోచన వస్తే వెంటనే పని మొదలెట్టాలి. 2019 పూలకు ప్రాధాన్యం ఉండే ప్రేమికుల దినోత్సవం నాడు 'హూవూ ఫ్రెష్' అనే ఆన్‌లైన్ రిటైల్ బ్రాండ్ మొదలెట్టారు. 'హూవూ' అంటే కన్నడలో పువ్వు. తాజాపూలను కస్టమర్లకు అందించడమే లక్ష్యం.

ఇంటికి చేరాలి

భారతీయలకు భక్తి జాస్తి. పూలతోనే దైవారాధన చేస్తారు. కాని గుడికి పూలు తీసుకెళ్లాలంటే గుడి చుట్టూ ఉన్న అంగళ్లలో కొనాలి. లేదా రోడ్డు మీద కొనాలి. అవి ఫ్రెష్‌గా ఉండొచ్చు... లేకపోవచ్చు. అప్పుడు మాత్రమే కాదు శుభకార్యాలకు, అలంకరణలకు, స్త్రీలు జడల్లో ముడుచుకోవడానికి, సన్మానాలకు.. సంస్మరణలకు... ఇళ్లల్లో పెద్దల పటాలకు పూలే కావాలి. కాని ఆ పూలు పాల ప్యాకెట్టు అందినట్టు న్యూస్‌పేపర్ అందినట్టు ఇంటికి ఎందుకు అందవు అనుకున్నారు అక్కచెల్లెళ్లు. అందేలా చేశారు. విజయం సాధించారు.

చందాదారులుగా...

న్యూస్‌పేపర్ చందాదారుల్లానే 'హూవూ ఫ్రెష్'కు కూడా చందాదారులుగా చేరితే రోజంతా పూలు ఇంటికే వస్తాయి. మరి ఇవి ఫ్రెష్‌గా ఎలా ఉంటాయి. దీనికోసం ప్రత్యేకమైన ప్యాకింగ్ తయారు చేశారు. 3 రోజుల నుంచి 15 రోజుల వరకూ వాడకుండా ఉంటాయి. చేయి తగిలితే పూలు నలిగిపోతాయి కదా. అందుకే 'జీరో టచ్' ప్యాకింగ్ కూడా ఉంది. డబ్బాల్లో పెట్టి పంపుతారు. స్విగ్గి, జొమాటో, అమేజాన్ ద్వారా కూడా అందే ఏర్పాటు చేశారు. పండగల్లో పబ్బాల్లో ఆ పండగలకు తగ్గ పూలు, హారాలు, పత్రి, దళాలు కలిపిన ప్రత్యేక బాక్సులు అమ్ముతారు. అవి హాట్‌కేకుల్లా అమ్ముడుపోతున్నాయి.

రైతులతో కలిసి

బెంగళూరులో కేంద్రస్థానంగా ఉంటూ ఇతర ముఖ్య నగరాల్లో విస్తరించుకుంటూ పూల సరఫరా చైన్లను రియా, యశోదలు స్థాపించారు. 500 మంది పూల రైతులతో ఒడంబడిక చేసుకుని కోసిన పూలను వీలైనంత త్వరగా ప్యాకింగ్ కేంద్రానికి పంపే ఏర్పాటు చేశారు. ఆర్డర్లకు తగ్గ ప్యాకింగ్ కోసం మహిళా ఉద్యోగులను నియమించారు. ప్రస్తుతం 300 ఆలయాలలో దేవుళ్లు రోజూ వీరు పంపే పూలతోనే పూజలు, హారతులు అందుకుంటున్నారు. 2023 షార్క్ ట్యాంక్ షోలో రియా, యశోదాల బిజినెస్ గురించి విని అందరూ ఆశ్చర్యపోయారు. సంవత్సరానికి దాదాపు 8 నుంచి 10 కోట్ల వ్యాపారం జరుగుతోంది. వీరి బ్రాండ్ విలువ 50 కోట్లకు చేరింది. వాడిపోయిన పూలతో అగర్ బత్తీలు తయారు చేస్తూ ఆ రంగంలోనూ విజయం సాధించారు ఈ బెంగళూరు సిస్టర్స్. ఐడియా వీరిని గెలిపిస్తూనే ఉంది.

తెల్లదనం సాధ్యమే!

బ్యూటిప్



టీ స్పూన్ తేనెలో టేబుల్ స్పూన్ నిమ్మరం. టేబుల్ స్పూన్ పాలు కలపాలి. ముఖాన్ని శుభ్రంగా కడిగిన తర్వాత ఈ మిశ్రమాన్ని అప్లై చేయాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. నిమ్మరసం కారణంగా ఈ ప్యాక్‌ను వేసిన కొద్ది సేపటికి చర్మం కొద్దిగా మంటగా అనిపిస్తుంది. కానీ రెండు నిమిషాల్లోనే తగ్గిపోతుంది. నిమ్మరసం సహజసిద్ధమైన బ్లీచ్. బ్యూటీ పార్లర్లలో కెమికల్ బ్లీచ్‌తో తెచ్చుకునే తెల్లదనం కంటే వారానికి రెండు లేదా మూడుసార్లు నిమ్మరసంతో ప్యాక్ అప్లయ్ చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. స్కిన్ డ్యామేజ్ కాదు.

* ఫ్రోజెన్ షోల్డర్

భాగ్యశ్రీ భుజశక్తి




భాగ్యశ్రీ

ఏమాత్రం కదల్చడానికి వీలులేనంత తీవ్రంగా భుజం నొప్పి రావడం ఇంటి పనులు, కంప్యూటర్ల ముందు కూర్చుని పనిచేసేవారికి తెలిసిందే. కారణాలు ఎన్ని ఉన్నా భుజాల నొప్పులు ఇటీవల చాలా సాధారణమయ్యాయి. ఇది దాదాపు అన్ని వయసుల వారికీ ఉండచ్చు. నొప్పిని భరిస్తూ అలాగే ఉండిపోతే భుజాల కదలికలు తగ్గిపోతాయి. సమయానికి చికిత్స చేయకపోతే సమస్య దీర్ఘకాలికంగా మారుతుంది. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందడానికి రోజూ పది నిమిషాలు చేయదగిన వ్యాయామాలను నటి భాగ్యశ్రీ ఇటీవల సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.





వ్యాయామ బ్యాండ్

- రెండు చేతులతో వ్యాయామ బ్యాండ్ రెండు చివర్లను పట్టుకోవాలి.
- బ్యాండ్ సాయంతో వ్యాయామం చేయడానికి చేతులను ముందుకు చాచాలి.
- తిరిగి యథాస్థానానికి తీసుకురావాలి.
- ఇలాంటప్పుడు మోచేతులు తుంటిపక్కన నిటారుగా ఉండేలా చూసుకోవాలి.

ఈ వ్యాయామాన్ని 8 సార్లు చేయాలి.

ఫ్రెంచ్ ప్రెస్

- చేతులను ఎంత వీలైతే అంత వెనకకు కదల్చాలి.
- తర్వాత ఒక చేతిని ముందు వైపుకు తీసుకోవాలి.
- తిరిగి ప్రారంభ స్థానానికి 3 దశలుగా రావాలి.

ఈ వ్యాయామం 10-15 సార్లు చేయాలి. తర్వాత కొన్ని నిమిషాలు విరామం తీసుకోవాలి.

ఓవర్ హెడ్

- నిటారుగా నిలబడి,. చేతులను తుంటి భాగానికి 90 డిగ్రీల కోణంలో ఉంచాలి. • వీలైనంత వరకు చేతులను తలమీదుగా పైకి ఎత్తాలి.
- వెన్నెముక వంపు రాకుండా నిటారుగా ఉంచాలి.

తిరిగి మెల్లగా యథాస్థానంలోకి రావాలి. ఈ విధంగా 10-12 సార్లు చేయాలి.

ఈ వ్యాయామాల గురించి డాక్టర్ కపూర్ మాట్లాడుతూ – 'ఫ్రోజెన్ షోల్డర్ కోసం చేసే వ్యాయామాల కదిలికల పరిధిని పెంచడానికి వీటిని రూపొందించారు. ఫ్రెంచ్ ప్రెస్, బ్యాండ్ పుల్ రెండూ వేరు వేరు పద్ధతుల్లో ఉండటం వల్ల భుజాలకు మంచి ప్రయోజనకరంగా ఉంటుంది' అని తెలియజేశారు. దీంతోపాటు మరో రెండు వ్యాయామాల గురించి వివరించారు.

లోలకం మాదిరి..

గడియారంలోని లోలకం కదలికలు ఉన్నట్టు ఈ వ్యాయామం ఉంటుంది.
- ఫ్రోజెన్ షోల్డర్ చేయి కిందికి వేలాడదీయడానికి వీలుగా కొద్దిగా వంగాలి.
- ఒక అడుగు వ్యాసంతో చేతిని చిన్న వృత్తంలా తిప్పాలి. రోజుకు ఒకసారి ఈ విధంగా చేస్తే చాలు.

టవల్‌తో సాగదీయడం..

- రెండు చేతులతో వీపు వెనక నుంచి ఒక టవల్‌ను సమాంతరంగా పట్టుకోవాలి.
- నొప్పి ఉన్న భుజం వైపుకు టవల్‌ను లాగడానికి మరో చేతిని ఉపయోగించాలి.

లోపలి వైపుకు...

- మూసి ఉన్న తలుపు పక్కన నిలబడి, డోర్ నాబ్ చుట్టూ వ్యాయామ బ్యాండ్ ఒక చివర కట్టాలి. • మోచేతిని 90 డిగ్రీల కోణంలో ఉంచి, నొప్పి ఉన్న చేతితో వ్యాయామ బ్యాండ్ మరొక చివరన పట్టుకోవాలి.
- బ్యాండ్‌ని మీ శరీరం వైపు రెండు లేదా మూడు అంగుళాలు లాగి కొన్ని సెకన్లపాటు పట్టుకోవాలి.

ఇలా 10 నుంచి 15 సార్లు పునరావృతం చేయాలి.

● కొత్త దారి

ఈమె.. డ్రోనాచార్యులే

'నేను బాగుండాలి' అని ఎంతో మంది అనుకుంటారు. కొందరు మాత్రం 'అందరూ బాగుండాలి... అందులో నేనుండాలి' అనుకుంటారు. ప్రీత్ సంధూ రెండో కోవకు చెందిన మహిళ. అగ్రీ–డ్రోన్ స్టార్టప్ 'ఏవీపీఎల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా తన కలను నెరవేర్చుకోవడమే కాదు వందలాదిమందికి ఉద్యోగావకాశాలను కల్పించింది. ఎంతోమందికి మైక్రో–ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా కొత్త జీవితాన్ని ఇచ్చింది.


ప్రీత్ సంధూ

హరియాణాలోని హిస్సార్‌కు చెందిన జ్యోతి మాలిక్ ఆదర్శవాద భావాలతో పెరిగింది. స్వతంత్రంగా ఉన్నతస్థాయికి ఎదగాలనేది ఆమె కల. ముంబైలో చదువుకోవడంతో ఆమె కలలకు రెక్కలు వచ్చాయి. ఉద్యోగంలో చేరింది. అయితే తన సంతోషం ఎంతో కాలం లేదు. వ్యక్తిగత కారణాల వల్ల ఉద్యోగం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. రెండేళ్ల తరువాత ఉద్యోగం కోసం వస్తే నిరాశే ఎదురైంది. 'ఈ జీవితం ఇంతేనా!' అనే నిరాశామయ కాలంలో 'ఏవీపీఎల్' జ్యోతి మాలిక్‌కు మైక్రో–ఎంటర్‌ప్రెన్యూర్‌గా కొత్త జీవితాన్ని ఇచ్చింది.

'ఇప్పుడు నేను ఇండిపెండెంట్. ఎవరైనా సరే, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా సరే తమ కలను నిజం చేసుకోవచ్చు' అంటుంది ఆత్మవిశ్వాసం నిండిన గొంతుతో జ్యోతిమాలిక్.

అమృత్‌సర్‌లోని ఖాల్సా కాలేజీలో చదువుకున్న ప్రీత్ సంధూకు కల్పనా చావ్ల రోల్ మోడల్. రాకెట్‌లు అంటే ఆసక్తి. కాలేజీ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని అగ్రి–డ్రోన్ స్టార్టప్ 'ఏవీపీఎల్'ను మొదలుపెట్టింది.

వ్యాపార, వ్యవసాయ రంగాలకు అవసరమైన డ్రోన్ ఆపరేషన్‌లలో నైపుణ్యం కోసం గ్రామీణ ప్రాంతాలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించింది ఏవీపీఎల్. ది రిమోట్ పైలట్ సర్టిఫికెట్(ఆర్‌పీసీ), అగ్రికల్చర్ స్ప్రే కోర్సులు గ్రామీణ ప్రాంతాలలో ఎంతోమందికి ఉపకరించాయి. ఈ కోర్సులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడానికే పరిమితం కాలేదు. విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చేలా చేశాయి. మైక్రో–ఎంటర్‌ప్రెన్యూర్‌గా అడుగు వేయడానికి ఉపకరించాయి. 'ఫీట్ ఆన్ ది స్ట్రీట్' నినాదంతో 'ఏవీపీఎల్' 12 రాష్ట్రాల్లో ఎన్నో ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాలు ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపాయి.

ప్రీత్ సంధూ నాయకత్వంలో 'ఏవీపీఎల్' అగ్రికల్చరల్ ఇన్నోవేషన్, స్కిల్ డెవలప్‌మెంట్‌లో కొత్త ప్రమాణాలు నెలకొల్పింది. 'ఏవీపీఎల్' శిక్షణా కార్యక్రమాల వల్ల ఒక్క హరియాణాలోనే 800 మంది డ్రోన్ ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారారు.

'ఆశావాదమే కాదు అవసరమైన సమయంలో ఆత్మవిశ్లేషణ కూడా అవసరం' అంటుంది ప్రీత్.

ప్రయాణం మొదలుపెట్టిన కొత్తలో తమ స్కిల్లింగ్ వెంచర్‌లోని లోపాలను విశ్లేషించింది.

'మా కంపెనీ తరపున ఎంతోమందికి శిక్షణ ఇచ్చాం. ఇక అంతకుమించి ఆలోచించలేదు. అయితే చాలామందికి గ్రామీణ నేపథ్యం ఉండడం వల్ల పట్టణాల్లో ఉండలేక తిరిగి సొంత ఊళ్లకు వెళ్లిపోయేవారు. ఈ నేపథ్యంలో అసలు వారు పట్టణం ఎందుకు రావాలి? గ్రామాల్లోనే ఉద్యోగావకాశాలు సృష్టించవచ్చు కదా అనే ఆలోచన వచ్చింది' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంది ప్రీత్.

'మన దేశంలో పట్టణాల్లోనే కాదు ఎక్కడైనా సరే ఉద్యోగావకాశాలు సృష్టించవచ్చు' అనే ఆమె నమ్మకం నిజమైంది. వ్యవసాయ రంగానికి సంబంధించిన నవీన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన శిక్షణ కార్యక్రమాలు, రిమోట్ పైలట్ సర్టిఫికెట్, అగ్రికల్చర్ స్ప్రే కోర్సుల ద్వారా యువతరం ఊరు దాటి పట్టణం వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది.

'1.5 లక్షల విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లను తయారు చేయాలనేది మా లక్ష్యం. డ్రోన్‌లు వారి జీవితాలను మార్చివేస్తాయి అనే నమ్మకం నాకు ఉంది' అంటుంది 'ఏవీపీఎల్' కో–ఫౌండర్, సీయీవో ప్రీత్ సంధూ.

కిచెన్ టిప్స్



- పంచదార జార్‌లో రెండు లవంగాలు వేస్తే చీమల బారి నుండి కాపాడుకోవచ్చు.
- చపాతీగాని, పరోటాగాని, మెత్తగా ఉండాలంటే 1 స్పూన్ మైదా, 1 స్పూన్ పెరుగుని గోధుమ పిండిలో వేసి తడిపితే మెత్తగా వస్తాయి.
- చిటికెడు సోడా వేసి గోధుమ పిండిని తడిపితే పూరి మెత్తగా, రుచిగా ఉంటుంది.
- పచ్చకూరలు వండేటప్పుడు చిటికెడు సోడా వేసి వండితే చూడ్డానికి కంటికి మంచి ఇంపుగా కనబడ్డమే కాకుండా రుచిగా ఉంటాయి.

లీగల్

మీరు విడిపోయినా మీ పిల్లలకు తండ్రి ఆస్తిలో వాటా వస్తుంది

పెళ్లయినప్పటి నుంచి భర్త వేధింపులు తప్పడం లేదు. పిల్లలు పుట్టి వాళ్లు కాస్త పెద్దవాళ్లయినా మారలేదు సరి కదా, ఇంకా ఎక్కువైంది. ఇంక భరించలేక విడిపోతున్నాను. నాకు, నా పిల్లలకు ఆస్తిలో వాటా వస్తుందా?

– పి. అనిత, నెల్లూరు

సాధారణంగా స్థిరాస్తులు ఎవరి పేరుతో అయితే ఉంటాయో వారికి మాత్రమే చెందుతాయి – వారి స్వార్జితం కిందనే పరిగణించబడతాయి. కానీ అన్నివేళలా అదే నియమం వర్తించదు. భార్యకు భర్త ఆస్తిలో హక్కు ఉందా లేదా అనే అంశం భర్త మతాచారంపై ఆధారపడి ఉంటుంది. హిందువులకు వర్తించే చట్టాల ప్రకారం మీ భర్త పేరిట ఉన్న ఆస్తి వారసత్వం ద్వారా సంక్రమించింది అయితే గనక అందులో మీ పిల్లలకు పూర్తి హక్కు ఉంటుంది. మీ పిల్లలు మైనర్లు అయితే వారి తరపున మీరు సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చు. మీ పిల్లలకి వారి వాటా వారికి దక్కుతుంది. అదే మీ భర్త స్వార్జితం అయితే మాత్రం తన తదనంతరం వీలునామా ప్రకారం, వీలునామా లేని పక్షంలో హిందూ వారసత్వ చట్టం ప్రకారం లేదా భర్త జీవితకాలంలో స్వయంగా ఇవ్వాలి అని తలిస్తే మాత్రమే భార్యకి హక్కులు ఉంటాయి.

మరో విషయం... భార్యకు తన జీవితకాలం మొత్తం భర్త ఇంట్లో ఉండే హక్కు ఉంటుంది. అలాగే మెయింటెనెన్స్ లేదా విడాకులు తీసుకునే సమయంలో భర్త ఆస్తిలో భార్యకు వాటా వచ్చే అవకాశం ఉంది. ఎంత శాతం వాటా ఇవ్వాలి అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. హిందూ లా, ముస్లిం లా, క్రిష్టియన్ లా, ఇలా వేర్వేరు మతస్తులకు వేరే విధమైన హక్కులు ఉంటాయి.

మీరు భర్త వేధింపులు తట్టుకోలేక విడిపోతున్నాను అని చెప్పారు కాబట్టి, డీ.వీ.సీ. చట్టం (గృహ హింస నుంచి మహిళల రక్షణ చట్టం, 2005) కింద కేసు వేసినట్లయితే, అందులో అనేక రకాల హక్కులను, ఉపశమనాలను పొందవచ్చు. కేసు తేలేంతవరకు మీ భర్త ఆస్తులను అమ్మకుండా కోర్టు వారు స్టే విధించే అవకాశం కూడా ఉంది. డీ.వీ.సీ. చట్టం సెక్షన్ 22 ప్రకారం అదనపు దరఖాస్తు చేసుకుంటే, మీరు కోరిన ఉపశమనాలతో పాటు మానసిక హింస, మానసిక క్షోభతో సహా మీకు కలిగిన గాయాలకు కూడా నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించవచ్చు. డీ.వీ.సీ. చట్టం ప్రకారం భర్త ఆస్తి పై కేసు వేసే వీలుందా లేదా అన్నది ప్రతి కేసులోనూ విభిన్నంగా ఉంటుంది. కాబట్టి మీ దగ్గరలో ఉన్న లాయర్‌ని సంప్రదిస్తే మంచిది.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

● ప్రాణం... పణం

అక్షర సమరం

ప్రమాదపు అంచున పనిచేసిన, ప్రాణాలు పణంగా పెట్టి యుద్ధవార్తలను రిపోర్ట్ చేసిన సాహసికులైన ఎంతో మంది జర్నలిస్ట్‌ల గురించి తెలుసుకుంది పాలస్తీనా అమ్మాయి ప్లెస్తియ.

వారి గురించి విన్నప్పుడల్లా....

'ఎంత కష్టం. ఎంత సాహసం!' అనుకునేది.

ఆ కష్టం, సాహసం తన స్వీయానుభవంలోకి రావడానికి ఎంతోకాలం పట్టలేదు.

జర్నలిజంలో పట్టా పుచ్చుకున్న తరువాత హమాస్–ఇజ్రాయెల్‌ల మధ్య యుద్ధం ఆమెని ఆహ్వానించింది.

హమాస్–ఇజ్రాయెల్ వార్‌ను రిపోర్ట్ చేసిన జర్నలిస్ట్‌గా ప్రపంచానికి పరిచితం అయిన ప్లెస్తియ యుద్ధభూమిలో కత్తి అంచున నడక అంటే ఏమిటో తెలుసుకుంది. యుద్ధ బీభత్సాన్ని దగ్గరి నుంచి చూసింది.

తాజాగా...

'అలాకాద్ అమెరికన్ యూనివర్శిటీ ఆఫ్ బీరుట్'లో మీడియా స్టడీస్‌లో మాస్టర్స్ డిగ్రీ చేయడానికి లెబనాన్‌కు వెళ్లింది. దాంతో ప్రముఖ జర్నలిస్ట్ కాస్తా మళ్లీ విద్యార్థిగా మారింది.




హమాస్–ఇజ్రాయెల్ వార్‌ను రిపోర్టింగ్‌లో పాలస్తీనా జర్నలిస్ట్ ప్లెస్తియ

'యుద్ధకాలంలో భావోద్వేగాలకు అవకాశం లేదు. ఏడ్వడానికి కూడా టైమ్ దొరకనంతగా ఉరుకులు పరుగులు. ఎప్పుడూ ఏం జరుగుతుందో తెలియదు. యుద్ధం ఆగిపోతుందని మనసులో చిన్న ఆశ. అంతలోనే మరో పెద్ద విషాదాన్ని రిపోర్ట్ చేయాల్సి వచ్చేది. పూర్తిగా నష్టపోయాం. ఇంతకంటే ఎక్కువగా నష్టపోయేది ఏమిటి అనిపించేది కొన్నిసార్లు' గతాన్ని గుర్తు చేసుకుంది ప్లెస్తియ.

గాజాలో యుద్ధవార్తలు కవర్ చేస్తున్న రోజుల్లో ప్లెస్తియకు నిద్ర పోవడానికి కూడా టైమ్ దొరికేది కాదు. తిండి సరిగా ఉండేది కాదు. పెట్రోల్ కొరత వల్ల మీడియా వాహనం ఒక చోటు నుంచి మరోచోటుకి వెళ్లడం కష్టంగా ఉండేది. కొన్నిసార్లు టీమ్‌తో సంబంధాలు తెగిపోయేవి. కరెంట్ కష్టాలు, ఫోన్ కష్టాలు సరే సరి.

'ఈ రోజు సరే, రేపు బతికి ఉంటానా అని ఎప్పటికప్పుడు అనుకునేదాన్ని' అంటూ గత రోజులను గుర్తు చేసుకుంది ప్లెస్తియ. వార్తలను కవర్ చేసేందుకు మొదట్లో మెడలో ఐడీ ట్యాగ్ వేసుకునేది. ప్రెస్ హెల్మెట్ తప్పనిసరిగా ధరించేది. అయితే వీటివల్లే ఎక్కువ ప్రమాదం ఉందని గ్రహించి వాటికి దూరంగా ఉంది.

'ఈ రోజు ఏం కవర్ చేయాలి...అని ఎప్పుడూ ప్లాన్ చేసుకోలేదు. కొన్నిసార్లు స్టోరీ కోసం వెదికేదాన్ని. మరికొన్ని సార్లు స్టోరీ నన్ను వెదుక్కుంటూ వచ్చేది' అంటున్న ప్లెస్తియ రిపోర్టింగ్‌కు వెళుతున్నప్పుడు ఎన్నో ప్రమాదాలు ఎదురొచ్చేవి. ఆ గండాల నుంచి అదృష్టకొద్దీ బయటపడింది.

గాజాలో రిపోర్టింగ్ చేస్తున్నప్పుడు తనకు ప్రజల నుంచి రకరకాల స్పందనలు ఎదురయ్యేవి. కొందరు ఆప్యాయంగా పలకరించి బ్రెడ్, టీ ఇచ్చేవారు. 'ఈ ప్రమాదకరమైన పరిస్థితుల్లో ప్రాణాలకు వెరవకుండా మీ జర్నలిస్ట్‌లు పనిచేస్తున్నారు. మీ వల్లే మా బాధలు ప్రపంచానికి తెలుస్తున్నాయి' అని ప్రశంసించేవాళ్లు.

కొందరు మాత్రం...'నేను జర్నలిస్ట్' అని పరిచయం చేసుకోగానే భయపడేవారు.

'ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్ట్‌లు చనిపోయారు. మా గురించి తరువాత మాట్లాడుకుందాం. ముందు మీరు జాగ్రత్తగా ఉండండి' అనేవాళ్లు.

'నిజానికి నేను వారి దగ్గరికి జర్నలిస్ట్‌గా కంటే సాటి మనిషిగా వెళ్లాను. వారి బాధలను పంచుకున్నాను. ధైర్యం చెప్పాను' అంటున్న ప్లెస్తియ ఆశావాది.

యుద్ధం లేని రోజులు, గుండెల మీద చేయి వేసుకొని హాయిగా నిద్రపోయే రోజులు వస్తాయని, మాయమై పోయిన నవ్వుల పువ్వులు మళ్లీ వికసిస్తాయని, 'యుద్ధం గతం మాత్రమే. వర్తమానం కాదు' అని బలంగా నమ్మే రోజులు వస్తాయనే ఆశిస్తోంది ప్లెస్తియ.

ఇజ్రాయెల్ సైనిక దాడి గురించి రిపోర్టింగ్ చేస్తూ మరణించిన జర్నలిస్ట్ షిరీన్ అబూ స్మారక స్కాలర్‌షిప్ పొందిన ప్లెస్తియ లెబనాన్‌లో స్టూడెంట్‌గా మరో ప్రయాణం మొదలుపెట్టింది. ఈ యువ జర్నలిస్ట్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 4.5 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు.

డైమండ్ లీగ్ ఫైనల్‌కు భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లే



భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ అవినాశ్ సాబ్లే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నాడు. 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్ ఈవెంట్‌లో తొలిసారి బరిలోకి దిగబోతున్నాడు. శుక్రవారం బ్రసెల్స్‌లో జరిగే ఈ మెగా ఫైనల్ రేస్ కోసం ప్రకటించిన 12 మంది అథ్లెట్ల జాబితాలో అవినాశ్ పేరు కూడా ఉంది. డైమండ్ లీగ్ పోటీల్లో భాగంగా జరిగిన ఐదు స్టీపుల్‌చేజ్ ఈవెంట్లలో రెండింటిలో సాబ్లే పాల్గొన్నాడు. పారిస్ అంచెలో 6వ స్థానంలో నిలిచిన అతను సిలేసియా అంచెలో 14వ స్థానంలో నిలిచాడు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో యూకీ బాంబ్రీ



అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్ యూకీ బాంబ్రీ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో 32 ఏళ్ల యూకీ ఐదు స్థానాలు ఎగబాకి 43వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫ్రాన్స్‌కు చెందిన డబుల్స్ భాగస్వామి అల్బానో ఒలివెట్టితో కలిసి యూకీ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. ఈ ప్రదర్శనతో యూకీ ర్యాంక్ మెరుగైంది. భారత స్టార్ రోహన్ బోపన్న రెండు స్థానాలు పడిపోయి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు.



కోర్టుకెక్కిన బజరంగ్

న్యూఢిల్లీ: జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తనపై విధించిన నిషేధాన్ని సవాల్ చేస్తూ సీనియర్ రెజ్లర్ బజరంగ్ పూనియా కోర్టుకెక్కాడు. నిషేధాన్ని ఎత్తివేయాలంటూ అతను ఢిల్లీ హైకోర్టుకు విజ్ఞప్తి చేశాడు. సోనేపట్‌లో మార్చిలో జరిగిన ట్రయల్స్ సందర్భంగా శాంపిల్స్ ఇచ్చేందుకు బజరంగ్ నిరాకరించడంతో ఏప్రిల్‌లో అతనిపై 'నాడా' నిషేధం విధించింది. అంతర్జాతీయ రెజ్లింగ్ సమాఖ్య కూడా బజరంగ్‌పై నిషేధానికి మద్దతు పలికింది. అయితే ఈ విషయంలో 'నాడా' కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని అభ్యంతరం రావడంతో ఈ నిషేధాన్ని ఎత్తివేసింది. కానీ ఆ తర్వాత మూడు వారాలకు నోటీసు ఇవ్వడంతో సహా అన్ని రకాల లాంఛనాలు పూర్తి చేసిన తర్వాత జూన్‌లో బజరంగ్‌ను మళ్లీ సస్పెండ్ చేస్తున్నట్లు 'నాడా' ఉత్తర్వులు జారీ చేసింది. కనీసం ప్రాథమికాంశాలను పరిగణనలోకి తీసుకోకుండా తనకు వివరణ కూడా ఇచ్చే అవకాశం లేకుండా నిషేధం విధించడం సరైంది కాదంటూ బజరంగ్ తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఇలాంటి నిషేధం వల్ల తన కెరీర్ ముగిసిపోతుందని, త్వరలో జరిగే వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం లేదని అతను పేర్కొన్నాడు. ఇది తన జీవనాధారాన్ని లాక్కొని ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని బజరంగ్ పేర్కొన్నాడు.

పతకాలే లక్ష్యంగా ఎత్తులు



నేటి నుంచి చెస్ ఒలింపియాడ్

- ఓపెన్, మహిళల విభాగాల్లో ఫేవరెట్స్‌గా భారత జట్లు
- బరిలో అర్జున్, హరికృష్ణ, హారిక

5 చెస్ ఒలింపియాడ్‌లో భారత్‌కు లభించిన పతకాలు. ఓపెన్ విభాగంలో రెండు కాంస్యాలు (2014, 2022) ... మహిళల విభాగంలో ఒక కాంస్యం (2022) లభించింది. కరోనా సమయంలో 2020లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఒలింపియాడ్‌లో భారత జట్టు సంయుక్త విజేతగా నిలువగా... 2021లో కాంస్యం దక్కింది.

బుడాపెస్ట్ (హంగేరి): రెండేళ్ల క్రితం స్వదేశంలో తొలిసారి జరిగిన ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్లు అద్భుత ప్రదర్శన చేశాయి. ఓపెన్ విభాగంతోపాటు మహిళల విభాగంలోనూ భారత జట్లు కాంస్య పతకాలు గెల్చుకున్నాయి. నేటి నుంచి హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో జరిగే 45వ చెస్ ఒలింపియాడ్‌లో గతం కంటే ఘనమైన ప్రదర్శన ఇచ్చేందుకు భారత జట్లు సిద్ధమయ్యాయి. గత రెండేళ్ల కాలంలో భారత చెస్ క్రీడాకారులు అంతర్జాతీయస్థాయిలో మరింతగా రాటుదేలారు. తమిళనాడు యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచి ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో నవంబర్‌లో తలపడనున్నాడు. ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతి, పెంటేల హరికృష్ణ కూడా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్నారు. మహిళల విభాగంలో కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక తర్వాత తమిళనాడు అమ్మాయి వైశాలి భారత్ తరఫున మూడో గ్రాండ్‌మాస్టర్‌గా అవతరించింది. జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 15వ ర్యాంక్‌కు చేరుకోగా... సీనియర్ స్టార్ తానియా సచ్‌దేవ్, వంతిక అగర్వాల్ కూడా తమదైన రోజున మేటి క్రీడాకారిణులను ఓడించగల సమర్థులే. ఈ నేపథ్యంలో చెస్ ఒలింపియాడ్‌లో భారత ఓపెన్, మహిళల జట్లు ఫేవరెట్స్‌గా బరిలోకి దిగుతున్నాయి. ఓపెన్ విభాగంలో ప్రపంచ నాలుగో ర్యాంకర్, భారత నంబర్‌వన్ ఇరిగేశి అర్జున్‌తోపాటు గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతి, పెంటేల హరికృష్ణ... మహిళల విభాగంలో ద్రోణవల్లి హారిక, వైశాలి, దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్, తానియా సచ్‌దేవ్ భారత జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మొత్తం 11 రౌండ్లపాటు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో ఓపెన్ విభాగంలో 197 జట్లు... మహిళల విభాగంలో 184 జట్లు పోటీపడుతున్నాయి. ఓపెన్ విభాగంలో భారత్‌తోపాటు అమెరికా, చైనా, ఉజ్బెకిస్తాన్, నార్వే, నెదర్లాండ్స్ జట్లు... మహిళల విభాగంలో జార్జియా, పోలాండ్, ఉక్రెయిన్, బల్గేరియా జట్లు ఫేవరెట్స్‌గా ఉన్నాయి.



పారాలింపిక్స్ పతక విజేతలకు సన్మానం

స్వర్ణ, రజత, కాంస్యాలు నెగ్గిన వారికి వరుసగా రూ. 75, 50, 30 లక్షల నజరానా

న్యూఢిల్లీ: పారిస్ పారాలింపిక్స్‌లో పాల్గొన్న భారత బృందాన్ని కేంద్ర క్రీడా శాఖ మంగళవారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ప్రోత్సాహకాల్ని అందించింది. స్వర్ణ పతక విజేతకు రూ. 75 లక్షలు... రజత పతకం నెగ్గిన వారికి రూ. 50 లక్షలు... కాంస్య పతకం గెలిచిన వారికి రూ. 30 లక్షలు నజరానా ఇచ్చినట్లు క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. లాస్ ఏంజెలిస్ 2028 పారాలింపిక్స్ లక్ష్యంగా అథ్లెట్లు సన్నద్ధమయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తుందని ఆయన చెప్పారు. 'పారాలింపిక్స్‌లో భారత్ దూసుకెళుతోంది. రియో (2016)లో 4 పతకాలు, టోక్యో (2020)లో 19 పతకాలు సాధించిన మన అథ్లెట్లు పారిస్‌లో అత్యధికంగా 29 పతకాలు గెలిచి పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచారు. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగేందుకు అథ్లెట్లకు అధునాతన సదుపాయాలు, కిట్లు అందజేస్తాం' అని కేంద్ర మంత్రి తెలిపారు. ఆదివారం ముగిసిన పారిస్ పారాలింపిక్స్ క్రీడల్లో భారత పారా అథ్లెట్లు 29 పతకాలు నెగ్గారు. ఇందులో 7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలున్నాయి.



జావెలిన్ త్రోలో స్వర్ణం గెలిచిన సుమిత్‌కు రూ. 75 లక్షల చెక్‌ను అందజేస్తున్న కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, భారత పారాలింపిక్ కమిటీ అధ్యక్షుడు జాజరియా

రెండో రోజూ అదే పరిస్థితి

మొదలుకాని అఫ్గానిస్తాన్, న్యూజిలాండ్ తొలి టెస్టు

గ్రేటర్ నోయిడా: అఫ్గానిస్తాన్, న్యూజిలాండ్‌ల మధ్య జరగాల్సిన ఏకైక టెస్టుకు వింత పరిస్థితి ఎదురవుతోంది. ఇరుజట్ల మధ్య సోమవారం నుంచి టెస్టు మ్యాచ్ జరగాలి. కానీ ఆటగాళ్లు మైదానంలో దిగడం లేదు. ఆట ముందుకు సాగడమే లేదు. రెండు రోజులుగా ఇదే జరుగుతోంది. అలాగని ఈ రెండు రోజులుగా వర్షమేమీ కురవడం లేదు. వాన చినుకు జాడ లేకపోయినా... మైదానం మాత్రం ఆడేందుకు సిద్ధంగా లేదు. కొన్ని రోజుల క్రితం కురిసిన కుండపోత వర్షాల వల్ల మైదానం చిత్తడిగా మారింది. గ్రేటర్ నోయిడా స్పోర్ట్స్ కాంప్లెక్స్ గ్రౌండ్‌లో కురిసిన నీరు బయటకు వెళ్లేందుకు అసలు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, మైదానాన్ని సన్నద్ధం చేసే పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ఒక అంతర్జాతీయ టెస్టు మ్యాచ్ అపహాస్యం అవుతోంది. కేవలం ప్రతికూల పరిస్థితుల వల్లే మొదలవడం లేదు. మంగళవారం రెండోరోజు ఆట జరిపించేందుకు మైదానంలో పదుల సంఖ్యలో గ్రౌండ్ సిబ్బంది తెగ శ్రమించారు. ల్యాండ్‌స్కేప్ గడ్డి గదుల్ని తెచ్చి మైదానమంతా పరిచేందుకు చెమటోడ్చారు. ఫ్యాన్‌లు అమర్చి మైదానం ఎండేలా కృషి చేశారు. అయినాకూడా అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం గ్రౌండ్ సిద్ధంగా లేకపోవడంతో ఫీల్డ్ అంపైర్లు కుమార ధర్మసేన, షర్ఫుద్దౌలా రెండో రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.



భారత ఫుట్‌బాలర్ అన్వర్ అలీపై నిషేధం

నిబంధనలకు విరుద్ధంగా మరో జట్టుతో ఒప్పందం చేసుకోవడంతో చర్య

కోల్‌కతా: ఆటగాళ్ల బదిలీకి సంబంధించి ఉన్న నిబంధనలను ఉల్లంఘించిన భారత ఫుట్‌బాల్ ప్లేయర్ అన్వర్ అలీపై అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) చర్యలు తీసుకుంది. అతనిపై నాలుగు నెలల నిషేధాన్ని విధిస్తున్నట్లు ప్రకటించింది. మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టుతో కాంట్రాక్టు కుదుర్చుకున్న తర్వాత అన్వర్ ఆ కాంట్రాక్ట్‌ను పాటించకుండా అనూహ్యంగా ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు మారాడు. మరోవైపు వచ్చే ఏడాది వరకు కొత్త ఆటగాళ్లను తీసుకోవడంపై నిషేధం ఉన్నా సరే... దానిని ధిక్కరించి ఢిల్లీ ఎఫ్‌సీ కూడా అన్వర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అంశం తీవ్ర వివాదం రేకెత్తించింది. దాంతో విచారణ జరిపిన ఏఐఎఫ్‌ఎఫ్ అన్వర్‌పై నిషేధంతో పాటు భారీ జరిమానా విధించింది. అన్వర్ అలీ నుంచి రూ.12 కోట్ల 90 లక్షలు నష్టపరిహారం పొందేందుకు మోహన్ బగాన్ క్లబ్ జట్టుకు అర్హత ఉందని స్పష్టం చేసింది. జరిమానా మొత్తాన్ని ఈస్ట్ బెంగాల్ క్లబ్, ఢిల్లీ ఎఫ్‌సీ, అన్వర్ కలిసి చెల్లించాలని ఏఐఎఫ్‌ఎఫ్ ఆదేశించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



సినిమా



● తాప్సీ

యాక్షన్ గాంధారి

తాప్సీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా హిందీ చిత్రానికి 'గాంధారి' టైటిల్ ఖరారు చేశారు మేకర్స్. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్నారు. 'గాంధారి' సినిమాకు కనికా ధిల్లాన్ కథ అందించడంతో పాటు నిర్మిస్తున్నారు. తల్లీకూతుళ్ల అనుబంధం, ఓ తల్లి ప్రతీకారం అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని బాలీవుడ్ సమాచారం. కాగా తాప్సీ ఓ ప్రధాన పాత్రలో నటించి, కనికా ధిల్లాన్ కథ అందించిన 'హసీనా దిల్‌రుబా', 'ఫిర్ ఆయీ హసీనా దిల్ రుబా'లకు వీక్షకుల నుంచి మంచి పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. దీంతో వీరి కాంబినేషన్‌లో రూపొందుతున్న 'గాంధారి'పై బాలీవుడ్‌లో అంచనాలున్నాయి. ఇదిలా ఉంటే 'గాంధారి' చిత్రం నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో త్వరలో స్ట్రీమింగ్ కానుంది.



● ఎన్టీఆర్

ఆ ధైర్యాన్ని సంపే భయాన్ని ఐతా!

'అసలు ఎవరు వాళ్లంతా..' అనే డైలాగ్‌తో 'దేవర పార్ట్1' సినిమా ట్రైలర్ రిలీజ్ అయింది. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర పార్ట్ 1'. జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సైఫ్ అలీఖాన్, ప్రకాశ్ రాజ్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటించారు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె నిర్మించిన 'దేవర పార్ట్ 1' ఈ నెల 27న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో 'దేవర పార్ట్ 1' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను మంగళవారం ముంబైలో ఘనంగా నిర్వహించారు. నిర్మాత కరణ్ జోహార్, డిస్ట్రిబ్యూటర్ అనిల్ తడాని(నటి రవీనా టాండన్ భర్త) సహా పలువురు బాలీవుడ్ ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. 'మనిషికి బతికేంత ధైర్యం చాలు.. చంపేంత ధైర్యం కాదు.... కాదు కూడదు అని మీరు మళ్లీ ఆ ధైర్యాన్ని కూడగడితే ఆ ధైర్యాన్ని సంపే భయాన్ని ఐతా',

'పనిమీద పొయ్యెనోడైతే పని అవ్వంగానే తిరిగొస్తాడు.. పంతం పట్టి పోయిండాడు నీ కొడుకు' అంటూ ఎన్టీఆర్ చెప్పే పవర్‌ఫుల్ డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.



● కాజల్ అగర్వాల్

సికందర్‌కు సాయం

'సికందర్'కు సాయం చేయనున్నారట హీరోయిన్ కాజల్ అగర్వాల్. సల్మాన్‌ఖాన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ సినిమా 'సికందర్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్. సత్యరాజ్, ప్రతీక్ బబ్బర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఈ సినిమాలో కాజల్ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నారట. త్వరలోనే 'సికందర్' షూటింగ్‌లో ఆమె పాల్గొంటారని బాలీవుడ్ టాక్. కథ రీత్యా ఈ చిత్రంలో సల్మాన్‌కు సాయం చేసే పాత్రలో కాజల్ నటిస్తారట. మరి.. 'సికందర్'లో కాజల్ భాగమైనట్లేనా? అంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి. ఇదిలా ఉంటే.. ముంబైలోని ఓ స్టూడియోలో నిర్మించిన భారీ సెట్‌లో ప్రస్తుతం 'సికందర్' చిత్రీకరణ జరుగుతోంది. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే రంజాన్ సందర్భంగా రిలీజ్ కానుంది.

ఆ కల నిజం కాబోతోంది - టోవినో థామస్



● కృతీ శెట్టి, టోవినో థామస్, శశి, ఐశ్వర్యా రాజేశ్

''దర్శకుడు జితిన్ 'ఏఆర్ఎమ్' (అజాయంతే రండం మోషణం) సినిమా కథ చెప్పినప్పుడు మూడు పాత్రలు నేను చేయగలనా? అనిపించింది. అయితే ఈ మూడు పాత్రలను నేనే ఎందుకు చేయాలో దర్శకుడు చెప్పిన తర్వాత కన్విన్స్ అయ్యాను. అక్కడి నుంచి ఈ సినిమా ఓ కలలా జరిగిపోయింది. ఇప్పుడు ఆ కల నిజం కాబోతోంది'' అని హీరో టోవినో థామస్ అన్నారు. జితిన్‌లాల్ దర్శకత్వంలో టోవినో థామస్ నటించిన మలయాళ చిత్రం 'ఏఆర్ఎమ్'. ఈ మూవీలో కృతీ శెట్టి, ఐశ్వర్యా రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్లుగా నటించారు. డాక్టర్ జకారియా థామస్‌తో కలిసి మ్యాజిక్ ఫ్రేమ్స్, యూజీఎమ్ మోషన్ పిక్చర్స్‌పై లిస్టిన్ స్టీఫెన్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 12న రిలీజ్ అవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో టోవినో థామస్ మాట్లాడుతూ– ''మైత్రీ మూవీ మేకర్స్ మా చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు. ''ఏఆర్ఎమ్' మూవీ ప్రేక్షకులను మెప్పిస్తుంది''అని కృతీశెట్టి తెలిపారు. ''మంచి కథలో భాగమైనందుకు హ్యాపీ'' అన్నారు ఐశ్వర్యా రాజేష్. ''ఈ మూవీతో టోవినో మరింతగా తెలుగు ప్రేక్షకులకు దగ్గరవుతారు'' అని పేర్కొన్నారు మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ శశి.

ప్రేక్షకుల మనసుని హత్తుకుంటాయి - రెజీనా కసాండ్రా



''నాకు చిన్నప్పటి నుంచి స్టేజ్ నాటకాలంటే ఇష్టం. స్కూల్, కాలేజ్ డేస్‌లో వేశాను. నాటక రంగంపై పరిశోధన చేసి 'ఉత్సవం' కథని రాసుకున్నారు అర్జున్ సాయిగారు. ఈ సినిమాలో రంగస్థలం నటుల గురించి చాలా అద్భుతమైన సన్నివేశాలున్నాయి. అవన్నీ ప్రేక్షకుల మనసుని హత్తుకునేలా ఉంటాయి" అని హీరోయిన్ రెజీనా కసాండ్రా అన్నారు. దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా జంటగా అర్జున్ సాయి దర్శకత్వం వహించిన చిత్రం 'ఉత్సవం'. హార్న్‌బిల్ పిక్చర్స్‌పై సురేష్ పాటిల్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న తెలుగు, కన్నడ, హిందీలో విడుదలవుతోంది. తెలుగులో మైత్రీ మూవీస్ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా రెజీనా కసాండ్రా మాట్లాడుతూ–"ఉత్సవం'లో కార్పొరేట్ ఎంప్లాయ్ పాత్ర చేశా. చాలా స్వతంత్ర భావాలున్న క్యారెక్టర్. ఈ క్యారెక్టర్ చేయడం చాలా రిఫ్రెషింగ్‌గా అనిపించింది. స్వతంత్ర భావాలున్న మహిళలకు నా పాత్ర నచ్చుతుంది. అలాగని ఇది సందేశాత్మక చిత్రం కాదు.. అన్ని వాణిజ్య అంశాలున్న కథ. దిలీప్ ప్రకాష్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ప్రకాష్ రాజ్‌గారు, నాజర్ గారు థియేటర్ ఆర్ట్స్ నుంచే వచ్చారు. వారితో వర్క్ చేయడం వల్ల చాలా నేర్చుకున్నాను. రసూల్‌గారి అద్భుతమైన విజువల్స్, అనూప్ రూబెన్స్‌గారి చక్కని సంగీతం ఈ సినిమాకి ప్లస్ అవుతుంది. నాకంటూ ప్రత్యేకమైన లక్ష్యాలు పెట్టుకోలేదు. నా మొదటి సినిమా 'ఎస్ఎంఎస్' చేసినప్పుడే వెర్సటైల్ నటిగా ఉండాలని భావించాను. అది దూరం కాకుండా ఇన్నాళ్లు వైవిధ్యమైన పాత్రలు చేసుకుంటూ వచ్చాను. ప్రస్తుతం సన్నీ డియోల్‌గారు హీరోగా డైరెక్టర్ గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న ఓ హిందీ సినిమా చేస్తున్నాను. అలాగే మరో రెండు హిందీ చిత్రాలు ఒప్పుకున్నాను" అన్నారు.

వరద బాధితులకు విరాళం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని వరద బాధితుల సహాయార్థం తమిళ హీరో శింబు విరాళం ప్రకటించారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి తన వంతు సహాయంగా ఆరు లక్షల రూపాయలు విరాళం ఇవ్వనున్నట్లు చెప్పారాయన. కాగా తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు హీరోలు, హీరోయిన్లు ఏపీ, తెలంగాణ వరద బాధితుల సహాయార్థం తమవంతు ఆర్థిక సాయాన్ని ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ''వరదల వల్ల ఆయా ప్రాంతాల తెలుగు ప్రజలు తీవ్రంగా నష్టపోవడం నాకు ఎంతో బాధ కలిగించింది. అందరూ త్వరితగతిన ఈ విపత్తు నుండి బయటపడాలని ఆ దేవుణ్ని కోరుకుంటున్నాను'' అని తెలిపారు శింబు.




● శింబు

హాలీవుడ్ నటుడు జేమ్స్ ఎర్ల్ జోన్స్ కన్నుమూత



హాలీవుడ్ ప్రముఖ నటుడు జేమ్స్ ఎర్ల్ జోన్స్ (93) కన్నుమూశారు. అమెరికాలోని గొప్ప నటుల్లో ఒకరిగా పేరుగాంచిన జేమ్స్ న్యూయార్క్‌లోని స్వగృహంలో సోమవారం తుదిశ్వాస విడిచారు. జేమ్స్ వ్యక్తిగత సిబ్బందిలో ఒకరైన బారీ మెక్ ఫెర్సెన్ ఆయన మరణాన్ని ధ్రువీకరించినట్లు హాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. 1931లో మిస్సిస్సిప్పిలో జన్మించారు జోన్స్. ఆయన ఐదేళ్ల వయసులో తల్లిదండ్రులు విడిపోవడంతో తాతయ్య–అమ్మమ్మల దగ్గర పెరిగారు. జోన్స్‌కు చిన్నతనం నుంచే నత్తి కూడా ఉండేది. అయితే ఓ టీచర్ సాయంతో పద్యాలు బాగా చదవడం, ఆ తర్వాత యాక్టింగ్ వల్ల ఈ సమస్యను అధిగమించినట్లుగా ఆయన ఓ సందర్భంగా వెల్లడించారనే వార్తలు ఉన్నాయి. అమెరికా ఆర్మీలో సేవలందించిన (కొరియన్ వార్ సమయంలో) తర్వాత పూర్తి స్థాయిలో యాక్టర్‌గా రాణించడం కోసం న్యూయార్క్ వెళ్లారు జోన్స్. 'ది గ్రేట్ వైట్ హోప్' (1967) సినిమా ఆయన కెరీర్‌కు మంచి బ్రేక్ ఇచ్చింది. ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు నామినేషన్ కూడా దక్కింది. 'ది లయన్ కింగ్' (1994)లోని ముఫాసా పాత్ర, 'స్టార్‌వార్స్' ఫ్రాంచైజీలోని కల్పిత పాత్ర డార్త్ వాడర్‌కు జోన్స్ వాయిస్ ఓవర్‌ని హాలీవుడ్ ప్రేక్షకులు ఇంకా మర్చిపోలేదు. 2011లో ఆస్కార్ గౌరవ పురస్కారంతో పాటుగా రెండు ఎమ్మీ అవార్డులు, రెండు టోనీ అవార్డులు, ఒక గోల్డెన్ గ్లోబ్, ఒక గ్రామీ అవార్డుతో పాటుగా మరెన్నో పురస్కారాలు జోన్స్‌కి దక్కాయి.

టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా ప్రతాని ఏకగ్రీవం



● రామకృష్ణ గౌడ్

'తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్'(టీఎఫ్‌సీసీ) అధ్యక్షుడిగా నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన 'టీఎఫ్‌సీసీ' ఎన్నికల్లో ఆయన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 'టీఎఫ్‌సీసీ' అధ్యక్షుడిగా వరుసగా ఆరోసారి ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అదేవిధంగా 'తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఉపాధ్యక్షులుగా ఎత్తరి గురురాజ్, డి.కోటేశ్వరరావు, జి.వరప్రసాద్ ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీలుగా జేవీఆర్, విద్యాసాగర్, కాచం సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పినిశెట్టి అశోక్ కుమార్, పి. వరప్రసాద్ రావ్, వై.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా సోమిరెడ్డి, ఎం.బిందు, ట్రెజరర్‌గా పి. ప్రకాష్ నియమితులయ్యారు. అలాగే 12 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ని (ఈసీ) కూడా ఎన్నుకున్నారు. త్వరలోనే నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు.

థ్రిల్లర్ నేపథ్యంలో...

'మనసంతా నువ్వే, నేనున్నాను' వంటి పలు హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన డైరెక్టర్ వీఎన్ ఆదిత్య థ్రిల్లర్ నేపథ్యంలో ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీలో హీరోయిన్ కేథరిన్ ట్రెసా ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. ఏయు– ఐ సమర్పణలో ఓఎంజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. కాగా సెప్టెంబర్ 10న కేథరిన్ ట్రెసా పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు బర్త్ డే శుభాకాంక్షలు చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలతో బలమైన కథతో ఈ సినిమాను వీఎన్ ఆదిత్య రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో తెలుగుతో పాటు అమెరికన్స్, స్పానిష్, ఆఫ్రికన్స్, యూరోపియన్స్, ఏషియన్స్, తమిళ, కన్నడ ఆర్టిస్టులు కీలక పాత్రల్లో నటించనున్నారు. ఈ మూవీ చిత్రీకరణ అంతా అమెరికాలోని డల్లాస్‌లో జరుగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● కేథరిన్ ట్రెసా

సాక్షి బిజినెస్
బుధవారం
11-9-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	362	81,921
నిఫ్టీ ▲	105	25,041

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,948	▲	65
డోజోన్స్	40,661	▽	169
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,206	▽	65
డాక్స్	18,266	▽	178
షాంఘై	2,736	▲	8
నికాయ్	36,216	▽	60

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	71,090
బంగారం (22 క్యారట్)	67,700
వెండి (కిలో)	90,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.57	84.59
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.25	111.86
€	యూరో	ఎస్‌బీఐ	91.95	94.34
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.81	59.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.56	57.52
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.23	66.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.98	23.76
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.97	12.79

ఈవీ విక్రయాలు.. ఏటా కోటి!



టాటా ఈవీల రేట్లు రూ. 3 లక్షల వరకు తగ్గింపు

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల ధరలను రూ. 3 లక్షల వరకు తగ్గిస్తున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. దీని ప్రకారం టియాగో ఈవీ రేటు రూ. 40,000, పంచ్ ఈవీ ధర రూ. 1.2 లక్షలు, నెక్సాన్ ఈవీ ధరను రూ. 3 లక్షల వరకు తగ్గించినట్లు వెల్లడించింది. పరిమిత కాలం పాటు ఇవి వర్తిస్తాయని పేర్కొంది. ఈవీల కొనుగోలుకు అధిక ధర అవరోధంగా ఉంటున్న నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల రేట్లను పెట్రోల్, డీజిల్ వాహనాల స్థాయికి దరిదాపుల్లోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించింది. టాటా మోటార్స్ ఇప్పటికే తమ టియాగో, హ్యారియర్, సఫారీ తదితర ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ వాహనాల ధరలను రూ. 65,000 నుంచి రూ. 1.8 లక్షల వరకు తగ్గించింది.

- 5 కోట్ల ఉద్యోగాల కల్పన.. 2030 నాటికి అంచనాలు
- సియామ్ సదస్సులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మార్కెట్ 2030 నాటికి ఏటా ఒక కోటి యూనిట్ల స్థాయికి చేరగలదన్న అంచనాలు నెలకొన్నాయని కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అలాగే 5 కోట్ల ఉద్యోగాల కల్పన కూడా జరగగలదని వాహనాల తయారీ సంస్థల సమాఖ్య సియామ్ 64వ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. ఆటోమోటివ్‌లకు సంబంధించి భవిష్యత్తులో భారత్ నంబర్‌వన్ తయారీ హబ్‌గా ఎదగగలదని తెలిపారు. 2030 నాటికి దేశీయంగా మొత్తం ఈవీ వ్యవస్థ రూ. 20 లక్షల కోట్ల స్థాయికి, ఈవీ ఫైనాన్స్ మార్కెట్ రూ. 4 లక్షల కోట్ల స్థాయికి చేరే అవకాశాలు ఉన్నాయని గడ్కరీ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో లిథియం అయాన్ బ్యాటరీల ఖరీదు మరింత తగ్గి ఎలక్ట్రిక్ వాహనాల ధరలు దిగి వస్తాయని, ఈవీల వినియోగం గణనీయంగా పెరిగేందుకు ఇది దోహదపడగలదని ఆయన చెప్పారు. 2023-24లో ఈవీల అమ్మకాలు 45 శాతం పెరిగాయని, 400 స్టార్టప్‌లు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ఉత్పత్తి ప్రారంభించాయని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయంగా సుమారు 30 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్టర్ అయి ఉన్నాయని, మొత్తం అమ్మకాల్లో టూ-వీలర్ల వాటా 56 శాతంగా ఉందని పేర్కొన్నారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకంతో (పీఎల్ఐ) బ్యాటరీ సెల్ తయారీకి ఊతం లభించగలదని ధీమా వ్యక్తం చేశారు.



ప్రపంచ స్థాయి పరిశ్రమగా ఎదిగేందుకు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై ఆటోమొబైల్ సంస్థలు మరింత ఇన్వెస్ట్ చేయాలని ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ సూచించారు. ఎగుమతులను పెంచుకునే దిశగా తమ ఉత్పత్తులకు గ్లోబల్ ఎన్‌క్యాప్ (న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రాం) రేటింగ్స్‌ను మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టాలని చెప్పారు.

పీఎల్ఐ కింద రూ. 75 వేల కోట్ల ప్రతిపాదనలు..

పీఎల్ఐ కింద రూ. 75,000 కోట్ల మేర పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చినట్లు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. కంపెనీలు ఇప్పటికే సుమారు రూ. 18,000 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు ఆయన చెప్పారు. సుమారు 30,000 ఉద్యోగాల కల్పనకు స్కీము తోడ్పడిందని మంత్రి వివరించారు. మరోవైపు, వాహనాల వయస్సును బట్టి కాకుండా వాటి నుంచి వచ్చే కాలుష్యాన్ని బట్టి స్క్రాపేజీ విధానం ఉండేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని కేంద్ర రహదారి రవాణా, హైవేస్ శాఖ కార్యదర్శి తెలిపారు. 'విశ్వసనీయమైన' పొల్యూషన్ పరీక్షల విధానాన్ని రూపొందించడంలో ప్రభుత్వానికి వాహన పరిశ్రమ దన్నుగా నిలవాలన్నారు.

ఆర్థిక వృద్ధికి ఆటోమోటివ్ దన్ను



భారత్ అధిక స్థాయిలో వృద్ధిని సాధించేందుకు ఆటోమోటివ్ రంగం చోదకంగా ఉంటుంది. ఇందుకు కొత్త ఆవిష్కరణలు తదితర అంశాలు తోడ్పడతాయి. ఈ క్రమంలో పెరిగే డిమాండ్‌తో పరిశ్రమ కూడా లబ్ధి పొందుతుంది. దేశీయ ఆటోమోటివ్ పరిశ్రమ గత దశాబ్దకాలంలో గణనీయమైన స్థాయిలో, గతంలో ఎన్నడూ చూడనంత వృద్ధిని సాధించింది. రాబోయే రోజుల్లో దేశ పురోగతి వేగవంతంగా మాత్రమే కాకుండా పర్యావరణహితంగా కూడా ఉండాలి.

– ప్రధాని మోదీ



మళ్లీ 25 వేలపైకి నిఫ్టీ

సెన్సెక్స్ లాభం 362 పాయింట్లు

ముంబై: ఐటీ, ఫార్మా, టెలికం షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ లాభాలు ఆర్జించాయి. అమెరికా మార్కెట్లు తిరిగి పుంజుకోవడం, దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 362 పాయింట్లు పెరిగి 81,921 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 105 పాయింట్లు బలపడి 25 వేల స్థాయిపైన 25,041 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 637 పాయింట్లు ఎగసి 82,197 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు బలపడి 25,131 వద్ద ఇంట్రాడే గరిష్టాలు నమోదు చేశాయి. బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు వరుసగా 1.53%, అరశాతం లాభపడ్డాయి. రంగాల వారీగా టెలికమ్యూనికేషన్, యుటిలిటీ పవర్ ఇండెక్సులు 2% పెరిగాయి. ఐటీ, ఇండస్ట్రీయల్, సర్వీసెస్, ఫార్మా రియల్టీ సూచీలు ఒకశాతం చొప్పున లాభపడ్డాయి. అమెరికా వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు, డాలర్ ఇండెక్స్ పుంజుకోవడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల బాటపట్టాయి.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

- రుణాలు పీక్ డిపాజిట్లు వీక్: ఫిక్కీ-ఐబీఏ
- ఈయూ కోర్టులో గూగుల్‌కు ఎదురు దెబ్బ

మారుతీ ఈవీ రేంజ్ 500 కిలోమీటర్లు



న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా తొలి ఎలక్ట్రిక్ మిడ్‌సైజ్ ఎస్‌యూవీ వచ్చే ఏడాది ప్రారంభంలో రోడ్లపై పరుగుతీయనుంది. ఒకసారి చార్జింగ్‌తో 500 కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యంతో ఈ కారును రూపొందిస్తున్నట్లు సంస్థ ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ వెల్లడించారు. 60 కిలోవాట్ అవర్ బ్యాటరీని పొందుపరుస్తున్నట్లు సియామ్ సమావేశంలో చెప్పారు. ఇలాంటి పలు ఈవీ మోడళ్లను ప్రవేశపెడతామని తెలిపారు. యూరప్, జపాన్ తదితర దేశాలకు ఈ ఈవీని ఎగుమతి చేయనున్నట్లు పేర్కొన్నారు. దేశీయ విపణిలో కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి ఎలక్ట్రిక్, బలమైన హైబ్రిడ్ కార్లతోపాటు మారుతీ తన కార్లలో అన్ని రకాల సాంకేతికతలను ఉపయోగించాలని భావిస్తోంది. 2030 నాటికి ఎగుమతులను మూడు రెట్లు పెంచుకునే యోచనలో ఉన్నట్లు టాకేయూచీ తెలిపారు. కంపెనీ ఇప్పటికే కొన్ని వాహనాలను జపాన్‌కి కూడా ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. 2025 జనవరిలో జరిగే భారత్ మొబిలిటీ షో సందర్భంగా తొలి ఈవీని ఆవిష్కరిస్తామని మారుతీ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. దేశవ్యాప్తంగా చార్జింగ్ మౌలిక వసతుల ఏర్పాటు, రీసేల్ మార్గాలను కలిగి ఉండటం వంటి ఇతర కీలక అంశాలపై కూడా దృష్టి సారించామన్నారు.



సియామ్ కొత్త ప్రెసిడెంట్‌గా టాటా మోటార్స్ శైలేష్



శైలేష్ చంద్ర, శేణు అగర్వాల్

టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ విభాగం ఎండీ శైలేష్ చంద్ర 2024-25కి గాను సియామ్ కొత్త ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఆయన గతంలో వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. తాజాగా అశోక్ లేల్యాండ్ ఎండీ శేణు అగర్వాల్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.

హోండా ఈ-టూ వీలర్ వస్తోంది..

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా ఎలక్ట్రిక్ విభాగంలోకి ఎంట్రీ ఇస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఎలక్ట్రిక్ టూ వీలర్‌ను ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ సేల్స్, మార్కెటింగ్ డైరెక్టర్ యోగేశ్ మాథుర్ సియామ్ సదస్సు సందర్భంగా వెల్లడించారు. ఈ-టూ వీలర్ల వినియోగం దేశంలో క్రమంగా పెరుగుతోందని చెప్పారు. 2030 నాటికి ఈవీలవైపు మార్కెట్ మళ్లుతుందని వివరించారు. కంపెనీ అమ్మకాల్లో మూడింట ఒకవంతు ఈ విభాగం నుంచే సమకూరుతుందని భావిస్తున్నామని చెప్పారు. హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా, హోండా టీమ్స్ సంయుక్తంగా ఈవీని అభివృద్ధి చేస్తున్నాయన్నారు. కొత్త ప్లాంటు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రపంచంలో తొలి ట్రై-ఫోల్డ్ ఫోన్

- ఆవిష్కరించిన హువావే
- ప్రారంభ ధర రూ.2.35 లక్షలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్మార్ట్‌ఫోన్స్ చరిత్రలో కొత్త అధ్యాయానికి చైనా దిగ్గజం హువావే తెరలేపింది. మేట్ ఎక్స్‌టీ పేరుతో ప్రపంచంలో తొలి ట్రై-ఫోల్డ్ స్మార్ట్ ఫోన్‌ను ఆవిష్కరించింది. రెండు దశల్లో ఫోల్డ్ చేసేలా 3కే రిజొల్యూషన్, ఓఎల్ఈడీ స్క్రీన్‌తో ఇది రూపుదిద్దుకుంది. పూర్తిగా ఫోల్డ్ చేస్తే 6.4 అంగుళాల స్మార్ట్ ఫోన్‌గా వాడుకోవచ్చు. కొంత భాగం ఓపెన్ చేస్తే 7.9 అంగుళాలు, పూర్తిగా తెరిస్తే 10.2 అంగుళాల ట్యాబ్లెట్ పీసీ మాదిరి సింగిల్ స్క్రీన్‌గా మారిపోతుంది. 27 లక్షల పైచిలుకు యూనిట్లకు ప్రీ ఆర్డర్లు ఉన్నాయి. ఇప్పటి వరకు మార్కెట్లో ఉన్న ఫోల్డబుల్ ఫోన్లకు ప్రైమరీ స్క్రీన్, కవర్ డిస్‌ప్లే మాత్రమే ఉన్నాయి. ట్రై-ఫోల్డ్ స్మార్ట్ ఫోన్ ప్రారంభ ధర రూ. 2.35 లక్షలు. ప్రస్తుతానికి చైనాకే పరిమితం. సెప్టెంబర్ 20 నుంచి కస్టమర్ల చేతుల్లోకి రానుంది. బరువు 298 గ్రాములు. పూర్తిగా ఫోల్డ్ చేసినప్పుడు 3.6 మిల్లీమీటర్ల మందం ఉంటుంది. 16 జీబీ ర్యామ్, 50 ఎంపీ మెయిన్ కెమెరా, 12 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ లెన్స్, 12 ఎంపీ టెలిఫోటో లెన్స్, 8 ఎంపీ సెల్ఫీ కెమెరా ఏర్పాటు ఉంది.



భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సీఐఎస్‌ఎఫ్‌లో ఉద్యోగాలు

సైన్స్ సబ్జెక్ట్‌తో ఇంటర్మీడియెట్ పూర్తి చేశారా! ప్రభుత్వ ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నారా.. అది కూడా యూనిఫామ్ సర్వీస్ అయితే బాగుంటుందని భావిస్తున్నారా?! అయితే.. మీలాంటి వారికి స్వాగతం పలుకుతోంది సీఐఎస్‌ఎఫ్!! కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) మొత్తం 1,130 కానిస్టేబుల్(ఫైర్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. సీఐఎస్ఎఫ్ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

యూనిఫామ్ సర్వీస్ ముఖ్యంగా పోలీస్ ఉద్యోగాలంటే యువతలో ఎంతో క్రేజ్. పదో తరగతి నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణుల వరకు పోలీస్ కొలువుల కోసం పోటీ పడుతున్నారు. అలాంటి అభ్యర్థులు సీఐఎస్ఎఫ్ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను సద్వినియోగం చేసుకుంటే కేంద్ర హోంశాఖ పరిధిలో పని చేసే అవకాశం లభిస్తుంది.

మొత్తం 1,130 పోస్టులు

సీఐఎస్ఎఫ్ తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1,130 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఆయా పోస్టుల సంఖ్యను పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి.. ఆంధ్రప్రదేశ్‌లో 32, తెలంగాణలో 26 పోస్టులు ఉన్నాయి. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా పోస్టుల సంఖ్యను ప్రకటించినప్పటికీ.. దేశ వ్యాప్తంగా ఎక్కడైనా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

అర్హతలు

- 2024,సెప్టెంబర్ 30 నాటికి సైన్స్(ఎంపీసీ/బైపీసీ) ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులవ్వాలి.

» మొత్తం 1,130 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» ఇంటర్ అర్హతతో పోటీ పడే అవకాశం
» వేతన శ్రేణి రూ.21,700-రూ.69,100

- **వయసు:** 2024, సెప్టెంబర్ 30 నాటికి 18-23 ఏళ్ల ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.


నాలుగు దశల్లో ఎంపిక ప్రక్రియ

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్(ఫైర్) పోస్టుల భర్తీకి మొత్తం నాలుగు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. అవి..

- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, కంప్యూటర్ బేస్డ్ రాత పరీక్ష.

తొలి దశ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్

ఎంపిక ప్రక్రియలో తొలి దశగా ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థులు అయిదు కిలో మీటర్ల దూరాన్ని 24 నిమిషాల్లో పరుగెత్తాలి.



ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో, అదే విధంగా ఎత్తు ప్రామాణిక పరీక్షలో విజయం సాధించిన వారికి తర్వాత దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఎత్తు 170 సెంటీ మీటర్లు, ఛాతి విస్తీర్ణం 80-85 సెంటీ మీటర్లు ఉండాలి. శ్వాస పీల్చినప్పుడు అయిదు సెంటీ మీటర్లు విస్తరించాలి.

డాక్యుమెంట్ వెరిఫికేషన్

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఇందులో అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. ఇవి కూడా నిబంధనల మేరకు ఉంటే చివరగా రాత పరీక్ష నిర్వహిస్తారు.

వంద మార్కులకు రాత పరీక్ష

తొలి మూడు దశల ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించిన వారికి చివరగా రాత పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్/హిందీ విభాగాలపై ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి ఒక గంట.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, సెప్టెంబర్ 30.
- **దరఖాస్తు సవరణకు అవకాశం:** 2024, అక్టోబర్ 10 నుంచి 12 వరకు;
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cisfrectt.cisf.gov.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఇందులో రాణించేందుకు వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్ అండ్ జనరల్ నాలెడ్జ్

అభ్యర్థుల్లోని సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. దీని కోసం భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్

ఈ విభాగంలో రాణించాలంటే.. ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

నాలుగో విభాగంలో ఉండే ఇంగ్లిష్/హిందీ సబ్జెక్ట్‌కు సంబంధించి అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న భాషను ఎంచుకోవచ్చు. అధిక శాతం మంది ఇంగ్లిష్‌నే ఎంచుకుంటున్నారు. ఈ విభాగంలో స్కోర్ కోసం బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్-స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి.

ఇతర పరీక్షలతో అనుసంధానం

అభ్యర్థులు ప్రిపరేషన్‌లో భాగంగా ఇతర పరీక్షల ప్రిపరేషన్‌తో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ పరీక్షను అనుసంధానం చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ నియామక పరీక్షలు, అదే విధంగా ఇటీవల స్టాఫ్ సెలక్షన్ కమిషన్ విడుదల చేసిన ఆర్మ్‌డ్ ఫోర్సెస్ కానిస్టేబుల్ పరీక్షలకు పోటీ పడుతున్న అభ్యర్థులు.. ఆ ప్రిపరేషన్‌నే సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఎగ్జామినేషన్‌కు కూడా ఉపయుక్తంగా ఉండేలా చూసుకోవాలి. ఫలితంగా.. ఒకే సమయంలో పలు పరీక్షలకు పోటీ పడే సన్నద్ధత లభిస్తుంది. సిలబస్‌లోని అంశాలు కూడా దాదాపు ఒకే విధంగా ఉన్న నేపథ్యంలో దీన్ని సద్వినియోగం చేసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది.

జాబ్ పాయింట్

ఆర్ఆర్‌బీలో 11,558 గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ).. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే జోన్లలో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ(ఎన్‌టీపీసీ)లో గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్‌లకు సంబంధించి వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11,558.

గ్రాడ్యుయేట్ పోస్టులు

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 8,113(కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్-1736, స్టేషన్ మాస్టర్-994, గూడ్స్ రైలు మేనేజర్-3,144, జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్-1507, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్-732).
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.01.2025 నాటికి 18 నుంచి 36 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపు ఉంటంది.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.29,200 నుంచి రూ.35,400 వరకు

అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 3,445 (కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్-2,022, అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్-361, జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్-990, ట్రైన్స్ క్లర్క్-72).
» **అర్హత:** 12వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.01.2025 నాటికి 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపు ఉంటంది.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.19,900 నుంచి రూ.21,700 వరకు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(టైర్-1, టైర్-2), స్కిల్ టెస్ట్,డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు సమాచారం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

గ్రాడ్యుయేట్ కోర్సులకు:
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 14.09.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.10.2024.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు:
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.09.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.10.2024.
» **వెబ్‌సైట్:** https://www.rrbapply.gov.in

పంజాబ్-సింధ్ బ్యాంక్‌లో 213 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

పంజాబ్-సింధ్ బ్యాంక్ దేశవ్యాప్తంగా ఉన్న పీఎస్‌బీ శాఖల్లో రిక్రూట్‌మెంట్ విధానంలో.. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



» **మొత్తం పోస్టుల సంఖ్య:** 213.
» **పోస్టుల వివరాలు:** ఆఫీసర్-56, మేనేజర్-117, సీనియర్ మేనేజర్-33, చీఫ్ మేనేజర్-07.
» **విభాగాలు:** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రాజ్‌భాష, హ్యూమన్ రిసోర్స్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, సైబర్ సెక్యూరిటీ, అకౌంట్స్, ఫారెక్స్, పబ్లిక్ రిలేషన్ అండ్ పబ్లిసిటీ, కార్పొరేట్, ఐఎస్ ఆడిటర్, సైబర్ ఫోరెన్సిక్స్, వెబ్ డెవలపర్, ఎస్‌క్యూఎల్ డెవలపర్, చార్టర్డ్ అకౌంటెంట్, లా మొదలైనవి.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంసీఏ, పీజీ, ఐసీడబ్ల్యూఏ, సీఎఫ్ఏ, ఎఫ్ఆర్ఎం, సీఐఐబీ, పీజీడీబీఏ, పీజీడీబీఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు ఆఫీసర్‌కు రూ.48,480 నుంచి రూ.85,920, మేనేజర్‌కు రూ.64,820 నుంచి రూ.93,960, సీనియర్ మేనేజర్‌కు రూ.85,920 నుంచి రూ.1,05,280, చీఫ్ మేనేజర్‌కు రూ. 1,02,300 నుంచి రూ.1,20,940 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.09.2024.
» **వెబ్‌సైట్:** https://punjabandsind-bank.co.in

డీఆర్‌డీవో-ఐటీఆర్‌లో 54 అప్రెంటిస్‌లు

చాందీపూర్(ఒడిశా)లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)కు చెందిన ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్(ఐటీఆర్)లోని వివిధ విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 54.
» **అప్రెంటిస్‌షిప్ కాలం:** ఒక సంవత్సరం.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-30, టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్-24.
» **విభాగాలు:** మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎంబెడెడ్ సిస్టమ్, అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్ఆర్, సేఫ్టీ తదితరాలు.
» **అర్హత:** ఖాళీలను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, బీబీఏ/బీకాం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ.8000.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్(ఐటీఆర్), చాందీపూర్, బాలాసోర్, ఒడిశా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.10.2024.
» **వెబ్‌సైట్:** https://www.drdo.gov.in

విద్యార్థి ప్రాణం కాపాడి.. తాను అస్వస్థతకు గురై..

పాము కాటు గాయం నుంచి రక్తాన్ని నోటితో పీల్చిన ఉపాధ్యాయుడు ఇంటికి వెళ్లి సన్మానించిన డీఈవో



తాంసి: ఓ విద్యార్థిని పాముకాటు వేయగా.. ఏమాత్రం ఆలోచించకుండా కాటు వేసిన గాయం నుంచి నోటితో రక్తాన్ని పీల్చాడో ఉపాధ్యాయుడు. విషం పైకి ఎక్కకుండా దారంతో కట్టుకట్టాడు. వెంటనే బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందేలా చూశారు. అనంతరం ఆయన అస్వస్థతకు గురికాగా సోమవారం రాత్రి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని ధనోర ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థి యశ్వంత్ సోమవారం పాముకాటుకు గురికావడంతో ఉపాధ్యాయుడు సురేశ్ తక్షణమే ప్రథమ చికిత్స అందించారు. ప్రథమ చికిత్స సమయంలో పాముకాటు వేసిన చోట రక్తాన్ని నోటితో పీల్చడంతో సురేశ్ సోమవారం రాత్రి ఆదిలాబాద్‌లోని తన ఇంటి వద్ద తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు ఆయనను రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి మెరుగుపడటంతో మంగళవారం సాయంత్రం డిశ్చార్జ్ చేశారు. ఈ విషయం తెలియడంతో డీఈవో ప్రణీత.. సురేశ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. విద్యార్థిని కాపాడినందుకు అభినందించారు. సురేశ్ దంపతులను శాలువాతో సన్మానించారు. అనంతరం విద్యార్థి చికిత్స పొందుతున్న ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

మూడు గుళ్లు.. ఇంటికో వెయ్యి

ఎన్నికలకు ముందే హామీలు.. ఏకగ్రీవంగా సర్పంచ్ ఎన్నిక ఉదంతంపై విచారణ జరిపిన ఎంపీడీఓ




తండావాసులతో మాట్లాడుతున్న అధికారులు

పర్వతగిరి: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ రాకముందే ఏకగ్రీవంగా ఓ సర్పంచ్‌ను ఎన్నుకున్నారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చెరువుకొమ్ముతండాలో కొంతమంది ధారావత్ బాలాజీని సోమవారం ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. తండాలో మూడు గుళ్లు కట్టించడం, ఇంటికి రూ.వెయ్యి చొప్పున ఇవ్వడం, ఒక వేళ గుళ్లు కట్టించకుండా, ఇంటికి రూ.వెయ్యి చొప్పున ఇవ్వకుంటే తన ఎన్నిక చెల్లదని ఒప్పంద పత్రం రాసి, ముందస్తుగా ఏకగ్రీవ సర్పంచ్ తీర్మానం చేశాడు. ఈ తీర్మానాన్ని ఎవరైనా విస్మరించి ఎన్నికల సమయంలో నామినేషన్ వేస్తే రూ.50 లక్షల జరిమానా విధించనున్నట్లు ఒప్పందపత్రంలో పేర్కొన్నాడు. అందుకు కొంత మంది తండావాసులు అంగీకరించి సంతకాలు చేశారు.

తండావాసులకు బెదిరింపులు..

→ చెరువుకొమ్ముతండాలో 700 మంది ఓటర్లు ఉన్నారు. అయితే ఏకగ్రీవ సర్పంచ్ ఎన్నికకు కొంతమంది సహకరించలేదు. అయితే తీర్మానాన్ని ఎవరైనా విస్మరిస్తే రూ.50 లక్షల జరిమానా లేదా తండా బహిష్కరణ ఉంటుందని బాలాజీ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలియడంతో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తండాలో విచారణ చేపట్టగా, తండావాసులు వాంగ్మూలం ఇచ్చారు. బాలాజీతో కూడా మాట్లాడారు.

ప్రపంచంలో అత్యంత ఎత్తైన భవనాలు టాప్-10



ప్రపంచంలో ఎత్తైన భవనాల విషయానికొస్తే.. ఆ రేసులో ఎప్పుడూ ఆసియా, మధ్యప్రాచ్య దేశాలే ముందుంటున్నాయి. ఓసారి టాప్–10 జాబితా చూడండి.. అగ్ర రాజ్యమైన అమెరికాలో ఒక్కటి మాత్రమే ఉంది. భవిష్యత్తు ప్రణాళికల సంగతి చూసినా.. ఆయా దేశాలే ముందంజలో ఉండే అవకాశముంది. ఎందుకంటే.. బుర్జ్ ఖలీఫాను తలదన్నేలా వస్తున్న ప్రాజెక్టును కూడా కువైట్‌లోనే నిర్మిస్తున్నారు. అక్కడ 234 అంతస్తులతో 3,284 అడుగుల ఎత్తైన ఆకాశహర్మ్యం నిర్మించనున్నారు. ఇక సౌదీ అరేబియా అయితే రియాద్‌లో అన్నిటినీ తలదన్నేలా ఏకంగా రెండు కిలోమీటర్ల ఎత్తున్న(6,561 అడుగులు) భవనం నిర్మించాలని ప్రణాళికలు రచిస్తోంది. అంటే ఆ భవనం మేఘాలను టచ్ చేసేలా ఉంటుంది. క్రేజీ కదూ..

- సాక్షి సెంట్రల్ డెస్క్

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అవార్డు

అమిత్‌షా చేతుల మీదుగా అవార్డు అందుకున్న శిఖా గోయల్



అమిత్‌షా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శిఖా గోయల్. చిత్రంలో బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: సైబర్ నేరాల అనాలసిస్, క్రిమినల్ నెట్‌వర్క్ గుర్తించడంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను కేంద్ర హోం శాఖ సత్కరించింది. ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సహాయ మంత్రి బండి సంజయ్‌తో కలిసి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఎస్పీ దేవేందర్ సింగ్‌లకు అవార్డును ప్రదానం చేశారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేస్తున్న సేవలను కేంద్ర హోంశాఖ అభినందించింది. కోవిడ్ సమయంలో వివిధ రాష్ట్రాలకు చెందిన సైబర్ నేరగాళ్లు రాష్ట్ర ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. ఈ సైబర్ నేరాలను అరికట్టేందుకు 2022లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ దేవేందర్‌సింగ్ నేతృత్వంలో 'సైబర్ క్రైం ఎనాలసిస్ అండ్ ప్రొఫైలింగ్ సిస్టం' (సై క్యాప్స్)ను రూపొందించారు. ఏదైనా క్రైంలో ఫోన్ నంబర్ లభిస్తే.. ఆ ఫోన్ నంబర్ ద్వారా గతంలో చేసిన నేరాలను గుర్తించడం సై క్యాప్స్ పని. దీనిద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 700–800 కేసులను ఛేదించిన తెలంగాణ సెక్యూరిటీ బ్యూరో దాదాపు 450కి పైగా కేసుల్లో పాత నేరస్తులు ఉన్నట్లు గుర్తించడంలో సై క్యాప్స్‌కు సహాయపడింది. ఈ సైక్యాప్స్ ఐడియా ను గుర్తించిన ఐ4సీ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నుంచి మరిన్ని వివరాలు సేకరించి, సైక్యాప్స్ ప్రేరణతో 'సమన్వయ' అనే ప్లాట్‌ఫాంను ఆవిష్కరించారు. ఈ 'సమన్వయ' ద్వారా దేశవ్యాప్తంగా లక్షల సైబర్ నేరా లను ఐ4సీ గుర్తించగలిగింది. ఈ సేవలు ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించాయి. 'సమన్వయ' ప్లాట్‌ఫాం ద్వారా అనేక కేసులను ఛేదిస్తూ నేరాలను అరి కట్టడంలో సత్ఫలితాలు సాధిస్తున్న నేపథ్యంలో.. ఆ సేవలను గుర్తిస్తూ డైరెక్టర్ శిఖా గోయల్, ఎస్పీ దేవేందర్ సింగ్‌లను అవార్డుతో సత్కరించింది.

బ్యాటరీ బస్సులే తిప్పండి

హైదరాబాద్‌లో క్రమంగా డీజిల్ బస్సులు తొలగించండి
కొత్త బస్సుల కొనుగోలుకు ఏర్పాట్లు చేసుకోండి
ఆర్టీసీ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



ఆర్టీసీ సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొన్నం, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో డీజిల్ బస్సులకు బదులు అన్నీ బ్యాటరీ బస్సులే తిరగాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు చెప్పారు. నగరంలో 2,700 బస్సులు తిరుగుతున్నాయని అధికారులు చెప్పగా.. వాటిల్లో డీజిల్ బస్సులను తొలగించి అన్నింటినీ క్రమంగా బ్యాటరీ సర్వీసుల్లోకి మార్చే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఒక సంవత్సరంలో ఎన్ని బస్సులు సమకూర్చుకునే అవకాశం ఉందో తేల్చాలని, దీని సాధ్యాసాధ్యా లను పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన ఆర్టీసీపై ఉన్నత స్థాయిలో సమీక్షించారు. బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంపై ఆరా తీశారు. ప్రస్తుతం 7,292 బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి అమలవుతోందని, ఇప్పటివరకు ఈ పథకాన్ని 83.42 కోట్ల మంది వినియోగించుకుని, రూ.2,840.71 కోట్లు ఆదా చేసుకున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ పథకం ప్రారంభమైన తర్వాత వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు వచ్చే మహిళల సంఖ్య పెరుగుతోందని అధికారులు తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణంతో పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో, ప్రభుత్వం చెల్లిస్తున్న రీయింబర్స్‌మెంట్‌తో సంస్థ లాభాల్లోకి వస్తోందని చెప్పారు.

బ్యాటరీల దిగుమతి ఇబ్బందిగా ఉంది

నగరంలో తిప్పేందుకు 500 ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్డర్ ఇస్తే, ఇప్పటికీ అన్నీ సరఫరా కాలేదని, విదేశాల నుంచి బ్యాటరీలను దిగుమతి చేసుకోవాల్సి రావటం బస్సు తయారీ సంస్థలకు ఇబ్బందిగా ఉందని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులు కొనాలంటే భారీ వ్యయం అవుతుందని, ఒక్కో బస్సు రూ.1.85 కోట్ల వరకు ధర పలుకుతోందని చెప్పారు. సంస్థ ప్రస్తుతం అద్దె ప్రాతిపదికన బస్సులు తీసుకుని నిర్వహిస్తోందని వివరించారు. దీంతో ఆయా కంపెనీల ప్రతినిధులను పిలిపించి చర్చించాలని, కావల్సినన్ని బస్సుల సరఫరాకు ఉన్న సమస్యను అధిగమించేందుకు ఉన్న మార్గాలపై చర్చించేందుకు మరో సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని సీఎం చెప్పారు. ఆ సమావేశంలో ఈ బస్సుల అంశంతో పాటు, బ్యాంకు అప్పులపై వడ్డీని తగ్గించుకునేందుకు ఉన్న మార్గాలపై చర్చిద్దామని చెప్పారు.

అప్పుల రీస్ట్రక్చర్‌కు మార్గాలు పరిశీలించండి

ఆర్టీసీకి లాభాలు వస్తున్నా, వివిధ బ్యాంకుల నుంచి తెచ్చిన రూ.వేల కోట్ల రుణాలపై చెల్లిస్తున్న వడ్డీ ఎక్కువగా ఉండటం సంస్థకు ఇబ్బందిగా మారినందున.. ఆ అప్పులను రీస్ట్రక్చర్ చేసుకునేందుకు ఉన్న మార్గాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వడ్డీ తగ్గించుకునేందుకు ఉన్న అన్ని అవకాశాలు పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్సుల్లో పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య దృష్ట్యా కొత్త బస్సుల కొనుగోలుకు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. కాగా వివిధ బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులు, ఉద్యోగుల భవిష్య నిధి నుంచి వాడుకున్న నిధులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కలిపి రూ.6,322 కోట్లు ఉన్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద సంస్థ అప్పులను ప్రభుత్వం క్లియర్ చేస్తే బాగుంటుందన్నారు. సమీక్షలో సీఎస్ శాంతికుమారి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, సీఎం కార్యద ర్శులు షానవాజ్ ఖాసిం, చంద్రశేఖరరెడ్డి, టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఈడీలు పాల్గొన్నారు.

మల్లమ్మతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



అవ్వకు ఆసరా దొరికింది

సాక్షి కథనంతో చిగురాల్‌పల్లికి తరలిన యంత్రాంగం
మల్లమ్మకు ఇల్లు కట్టిస్తామని కలెక్టర్ హామీ
'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపిన వృద్ధురాలు

సాక్షి ఎఫెక్ట్

పరిగి: 'ఓ అవ్వ వ్యథ'శీర్షికతో సాక్షి దినపత్రిక (ప్రధాన సంచిక)లో ప్రచురితమైన కథనం ప్రభుత్వం, యంత్రాంగాన్ని కదిలించింది. ఇటీవల సాక్షిలో వచ్చిన కథనాన్ని చూసిన పలు మీడియా చానళ్లు అవ్వ ఉంటున్న వికారాబాద్ జిల్లా చిగురాల్‌పల్లి గ్రామానికి చేరుకున్నాయి. సాక్షి ముందుగానే చెప్పిన విషయాలతో బాధితురాలు ఎర్రోళ్ల మల్లమ్మ దీనగాథపై వార్తలు ప్రసారం చేశాయి. పదేళ్లుగా మరుగుదొడ్డిలో ఉంటూ జీవనం సాగిస్తోందని వివరించాయి. ఈ విషయమై ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. తక్షణమే బాధితురాలి పరిస్థితిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టర్ ప్రతీక్‌జైన్ చిగురాల్‌పల్లి చేరుకుని, అవ్వతో మాట్లాడారు. ఓల్డేజ్ హోంలో ఉంటావా? అని అడగగా, ఉండను అంటూ మల్లవ్వ బదులిచ్చింది. 'ఇల్లు కట్టేందుకు బేస్‌మెంట్ నిర్మించి, ఆర్థిక స్తోమత సరిపోక మధ్యలో ఆపేశాను'అని తెలిపింది. బేస్‌మెంట్‌పై ఇల్లు నిర్మించేందుకు ఎంత ఖర్చు అవుతుందో పూర్తి నివేదిక ఇవ్వాలని అక్కడే ఉన్న తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం తరఫున ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. అవ్వ పరిస్థితిని చూసి చలించిపోయిన తహసీల్దార్ ఆనందరావు రూ.10 వేలు, ఎస్‌ఐ సంతోష్‌కుమార్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇదిలా ఉండగా తన సమస్యను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'కి మల్లమ్మ ధన్యవాదములు తెలిపారు.

సౌర విద్యుత్ గ్రామంగా సీఎం స్వగ్రామం

ప్రణాళిక సిద్ధం చేశామన్న టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ




గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ

కల్వకుర్తి/ వంగూరు: సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొండారెడ్డిపల్లిని పూర్తి సోలార్ విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ చెప్పారు. మంగళవారం కలెక్టర్ సంతోష్, ఇతర అధికారులతో కలిసి ఆయన గ్రామాన్ని సందర్శించారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో సోలార్ విద్యుత్‌పై విద్యుత్ అధికారులతో సమీక్షించారు. సీఎం చొరవ తీసుకొని తన సొంత గ్రామంలో సోలార్ వాడకాన్ని ప్రోత్సహించేలా ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కరెంట్ వాడకం తగ్గించడంతోపాటు మిగులు విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవడం ద్వారా ఉపాధి లభిస్తుందన్నారు. సోలార్ విద్యుత్ వినియోగించుకోవాలనుకునే వారి సందేహాలను విద్యుత్ సిబ్బంది నివృత్తి చేస్తారని చెప్పారు. రాష్ట్రంలోనే సోలార్ విద్యుత్‌ను పూర్తి గ్రామానికి అందించడంలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద కొండారెడ్డిపల్లి, ఖమ్మం జిల్లాలో ఓ గ్రామాన్ని గుర్తించామని తెలిపారు. దీనికోసం గ్రామంలో వారంరోజుల పాటు ప్రత్యేక బృందాలు పర్యటించి ప్రజల అభిప్రాయాలు సేకరిస్తాయని, వారికి సహకరించాలని కోరారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ సౌర విద్యుత్ వినియోగంలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన కొండారెడ్డిపల్లి గ్రామంలో భవిష్యత్‌లో రైతులు, ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో రెడ్‌కో మేనేజింగ్ డైరెక్టర్ అనిలా, సెర్ప్ డైరెక్టర్ కృష్ణ, డైరెక్టర్ రాములు, అడిషనల్ కలెక్టర్ దేవసహాయం, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాగుబడి
పుబ్బ కార్తె: సెప్టెంబర్ 12 వరకు
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 13 నుంచి



అర్క ఉదయ

బెంగళూరులోని భారతీయ ఉద్యాన పంటల పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్ – ఐఐహెచ్‌ఆర్) ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల రైతులకు అనువైన పండ్లు, పూలు, ఔషధ మొక్కలు, కూరగాయ పంటలకు సంబంధించిన అధునాతన వంగడాలను రూపొందిస్తోంది. గత 58 ఏళ్లలో ఐఐహెచ్‌ఆర్ 327 సూటి వంగడాలు/ హైబ్రిడ్ రకాలను, 154 టెక్నాలజీలను అందించింది.


అర్క ఉదయ



వాతావరణ ఆటుపోట్లను తట్టుకునే శక్తి కలిగిన, అధిక పోషక విలువలు కలిగిన 109 వంగడాలను గత నెల 11న ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. వీటిలో ఐఐహెచ్ ఆర్ రూపొందించిన అనేక వంగడాలు/ హైబ్రిడ్లు ఉన్నాయి. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అనువైనవి రెండు ఉన్నాయి. హైబ్రిడ్ వంగడం అర్క ఉదయ, అర్క కిరణ్ జామ అధిక దిగుబడినిస్తాయి. ఇవి అధిక సాంద్రత సాగుకు అనువైనవి కూడా.


అర్క కిరణ్


కొత్త పంట

అర్క ఉదయ మామిడి హైబ్రిడ్ రకం తెలుగు రాష్ట్రాలతో పాటు మామిడి సాగయ్యే ప్రధాన రాష్ట్రాలన్నిటికీ అనువైనది. ఆమ్రపాలి – అర్క అన్‌మోల్ రకాలను సంకరపరచి ఈ హైబ్రిడ్‌ను రూపొందించారు.

అధిక సాంద్రత సాగుకు అనువైనది. గుత్తులుగా కాయలు కాస్తుంది. కాయలు అధిక నాణ్యత కలిగి ఉంటాయి. కాయ 200–250 గ్రాముల బరువుంటుంది. గుజ్జు నారింజ పసుపు రంగులో ఉంటుంది.

తీపి 24 బ్రిక్స్ మేరకు ఉంటుంది. 13.55 ఎం.జి./ 100 గ్రా. కెరొటినాయిడ్స్ ఉంటాయి. చాలా రోజులు (12 -15 రోజులు) పాడవకుండా నిల్వ ఉంటుంది. ఆలస్యంగా కాపునకు రావటం ఈ రకం ప్రత్యేకత. 5 మీటర్లు × 5 మీటర్ల దూరంలో నాటుకుంటే హెక్టారుకు 18–20 టన్నుల దిగుబడినిస్తుందని ఐఐహెచ్‌ఆర్.

మొక్క రూ. 80

బెంగళూరులోని ఐఐహెచ్‌ఆర్ ఆవరణలోని నర్సరీలో అర్క ఉదయ, అర్క సుప్రభాత వంటి మామిడి మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మొక్క ఖరీదు రూ. 80. ఎత్తు 1.5 అడుగులు, కిలోన్నర బరువుంటుంది. రైతులు స్వయంగా వచ్చి కొనుక్కెళ్లవచ్చని ఐఐహెచ్‌ఆర్ నర్సరీ ఇన్‌చార్జ్ నాగరాజు (97436 44599) 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

అడవితో పంటకు పేగు బంధం!

అడవులు మానవాళికి మాత్రమే కాదు.. జీవరాశి మొత్తానికీ ప్రాణవాయువును అందించే ఊపిరితిత్తులు వంటివని మనకు తెలుసు. అయితే, అడవులు అడవి దట్టంగా, పచ్చగా, తగినంత విస్తీర్ణంలో అలరారుతూ ఉంటేనే పర్యావరణ సేవలు అందించగలవు. అవి బాగుంటేనే మనకు ఆహార, ఆరోగ్య భద్రత ఉంటుంది. అడవిని అతిగా నరికివేసినా, అడవి విస్తారంగా తగులబడినా మనకు కష్టాలు పెరుగుతున్నట్లే. మన పొలాల్లోని పంటల ఆరోగ్యంపైన, మన ఆరోగ్యంపైన కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని ఎందరికి తెలుసు?

అంతేకాదు.. అటవీ వ్యవస్థ అందించే పర్యావరణ సేవలు అన్నీ ఇన్నీ కాదు.. ఈ జాబితాను పరిశీలిస్తే ఆశ్చర్యం కలగక మానదు. ఉష్ణోగ్రతలు అదుపులో ఉండాలన్నా, వర్షాలు పుష్కలంగా కురవాలన్నా అడవి తల్లి చల్లగా ఉండటం అవశ్యం. అందుకే, అడవికి ఏ కష్టం వచ్చినా తొందర్లోనే మనుషులకు, ముఖ్యంగా రైతులకు కష్టాలు పెరుగుతాయన్న మాట. రెండు ఉదాహరణలు చూద్దాం..

బ్రెజిల్‌లోని అమెజాన్, సెర్రాడో ప్రాంతాల్లోని దట్టమైన పురాతన కీకారణ్యం నరికివేతకు గురవుతూ ఉంది. అడవి నరికిన తర్వాత అక్కడికి దగ్గర్లోని పొలాల్లో సోయా చిక్కుళ్ల పంట ఉత్పాదకత తగ్గిపోయింది. ఇది 2021 నాటి అధ్యయనం తేల్చి చెప్పిన నిజం. ఇండోనేషియాలోని బోర్నియోలో జరిపిన ఓ అధ్యయనం ప్రకారం.. అడవి నరికివేయటం వల్ల దగ్గర్లోని రైతుల పొలాల్లో పంటల ఉత్పాదకత తగ్గిపోయింది. ఎండలు తీవ్రమై పొలాల్లో మనుషులు ప్రశాంతంగా పనిచేసుకోగలిగే పని గంటలు తగ్గిపోయాయి. వ్యవసాయ కార్మికుల గ్రహణ శక్తి సైతం అధిక వేడి వల్ల క్షీణించిందని గుర్తించారు. వ్యాధిగ్రస్తుల మరణాల శాతం పెరిగింది. అడవి నశించిపోవటమే ఈ విపత్తులన్నిటికీ మూల కారణమని ఈ అధ్యయనం తేల్చింది.

భీకరమైన కుండపోత వర్షాలు.. కనీవినీ ఎరుగని వరదలు.. తెలంగాణలోని ములుగు, ఏటూరునాగారం ప్రాంతాల్లో ఇటీవల ఒక రోజు చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని అటవీ చెట్లన్నీ వేళ్లతో సహా కూలి, తేలిపోయాయి లేదా విరిగి పడిపోయాయి. అడవి విధ్వంసం వార్తలు పర్యావరణ వేత్తల వెన్నులో చలిపుట్టిస్తున్నాయి. మితిమీరిన భూతాపోన్నతి మున్ముందు కలిగించబోయే భీకర విపరిణామాల గురించి ఆలోచిస్తే ఎవరికైనా భీతి కలగక మానదు!

అడవి తల్లి అందించే పర్యావరణ సేవలెన్నో..!

1. వస్తు సేవలు
- 1ఎ. కలప/ (భవన నిర్మాణం, ఇంధనం)
- 1బి. ఆహారోత్పత్తి (పండ్లు, మూలికలు, తేనె)
- 1సి. మూలికలు
- 1డి. నీరు

2. ఉప సేవలు
- 2ఎ. పశుపక్ష్యాదుల జవవైవిధ్యం
- 2బి. కిరణజన్య సంయోగ క్రియ ద్వారా కర్బనాన్ని భూమిలో స్థిరీకరించటం
- 2సి. సారవంతమైన మట్టి నిర్మాణం
- 2డి. పోషకాల పునర్వినియోగం
- 2ఇ. విత్తన వ్యాప్తి

3. నియంత్రణ సేవలు
- 3ఎ. కర్బనాన్ని (మట్టిలో/ భూమి పైన చెట్లలో) నిల్వ చేస్తుంది
- 3బి. గాలిని శుద్ధి చేస్తుంది
- 3సి. నీటిని శుద్ధి చేస్తుంది
- 3డి. వాతావరణాన్ని నియంత్రిస్తుంది
- 3ఇ. నేలను కోతకు గురికానివ్వదు
- 3ఎఫ్. వరదలను నివారిస్తుంది
- 3జి. తుపాన్ల నుంచి రక్షణ కల్పిస్తుంది

4. సాంస్కృతిక సేవలు
- ఆహ్లాదం / సౌందర్యాధన
- ఆధ్యాత్మికత
- విద్య

మీకు తెలుసా?

మట్టి లేకపోతే మనకు మనుగడ లేదు..

భూమిపై పొర మట్టిలో 5 సెంటీ మీటర్ల (2 అంగుళాల) వరకు ఉండే

సారవంతమైన మట్టి మానవాళికి ప్రాణప్రదమైనది..



మన ఆహారంలో 95% వరకు ఈ మట్టే మనకు అందిస్తోంది. ఇది కోతకు గురై కొట్టుకుపోకుండా రక్షించుకుంటేనే భవితకు భరోసా!

మనం ఎంత సంపాదించినా మన ఆరోగ్య నిమిత్తం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌కి రూ. లక్షలు సమర్పిస్తున్నాం. ఏ రోజైనా ప్రకృతి మనకు ఉచితంగా ఇస్తున్న ఆక్సిజన్ గురించి ఆలోచించామా? కృతజ్ఞత చెప్పామా? లేదు. 40 ఏళ్ల వయసు రాగానే రోగాల బారిన పడుతున్నాం. ఇంత ఉపోద్ఘాతం ఎందుకు చెబుతున్నానంటే.. మనం అనుభవిస్తున్నదంతా ఆరోగ్యవంతమైన జీవితం కాదు. ఇప్పుడు మనం తింటున్న ఆహారం విషపూరితం. పీల్చుతున్న గాలి విషపూరితం. తింటున్న ఆహారం విషపూరితం. తాగుతున్న నీరు కలుషితం. తల్లి పాలు కూడా విషపూరితమే. ఈ వ్యవస్థను మనం ఎలాగూ మార్చలేం. కానీ, మనకు మనం మారవచ్చు కదా? ప్రభుత్వాలనో, రైతులనో నిందించనవసరం లేదు. కానీ, చిన్న ప్రయత్నంతో ఆరోగ్యదాయక జీవనం దిశగా ముందడుగు వేయవచ్చు.. అదే మిద్దెతోటల/ ఇంటిపంటల సాగు!

చిన్న కుండీలు.. మడులే మేలు!


ఇంటిపైన తోటలో ఉషారాణి దంపతులు
ఇంటి పంట

"మెడిసిన్లో సీటు వచ్చినా ప్రకృతి మీద ఉన్న ప్రేమతో మక్కువతో అగ్రికల్చర్ కోర్సులో చేరాను. సహాయ సంచాలకురాలిగా వ్యవసాయ శాఖలో పని చేస్తూ ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) చందానగర్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాను. పొలాల్లో రసాయనిక పురుగుమందులను, తెగుళ్ల మందులను, కలుపు మందులను విచక్షణారహితంగా వాడుతుండటం చూసి వ్యవసాయాధికారిగా చలించిపోయాను.

మనం రైతులను నిందించనవసరం లేదు. అది వారి జీవనాధారం. ఇటువంటి పరిస్థితుల్లో కనీసం నా కుటుంబాన్నయినా వినాశకరమైన, విషరహితమైన పంటల నుంచి నాకు చేతనైనంత వరకు కాపాడాలని నిర్ణయించుకొని ఇంటిపైన కూరగాయల తోటను ప్రారంభించాను.

మనం మన పిల్లలకి ఎంత ఆస్తి ఇచ్చాం అనేది కాదు ముఖ్యం. ఎంత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించామనేది ముఖ్యం. మన ముందు తరాల వారికి కూడా ఎంత ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించాం అనేది ముఖ్యం.

ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ఇంటిపైనే 2014లో కూరగాయల తోటను ప్రారంభించాను. అక్టోబర్లో తొలి బీజం అంకురించింది. నవంబర్లో పంట పురుడు పోసుకుంది. డిసెంబర్లో వజ్రాల్లాంటి పిల్లలను.. అదేనండి పంటని.. నా చేతికి అందించింది నా ఇంటి తోట. అప్పుడు






ఇవన్నీ ఒక్క రోజు ఇంటిపంటలే!

అరవై కుండీలతో మొదలైన మిద్దె తోట సాగు ఇప్పటివరకు ఆగలేదు. ఏ విధమైన అలుపు గానీ, విసుగు గానీ లేదు. అంతా ఆనందకరమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరిస్తున్నాం. ఇప్పుడు నా తోట 600 కుండీలతో ఇంటిలోని నాలుగు అంతస్తుల్లోనూ అలరారుతోంది!

మిద్దె తోటలను మనం స్టేటస్ సింబల్‌గా కాకుండా.. మనకు అన్ని విధాలా మన కుటుంబ అవసరాలు తీర్చే విధంగా తీర్చిదిద్దుకోవడం ఎంతైనా అవసరం. దీని కోసం 60 శాతం కుండీల్లో కూరగాయ మొక్కలను, 20 శాతం కుండీల్లో పండ్ల మొక్కలను, 10 శాతం కుండీల్లో పూల మొక్కలను, 10 శాతం కుండీల్లో ఔషధ మొక్కలను పెంచుతున్నా.

మట్టిలో కొంత ఆవు పేడ కలిపి విత్తనం నాటేవాళ్లం. ఇప్పుడు అలా కాదు. కాలక్రమంలో పెద్ద మడులు, ఫైబర్ టబ్స్ వచ్చేశాయి. చివరికి మన తోట పని మనం చేయలేక ఇంకొకరి మీద ఆధార పడవలసిన అగత్యం ఏర్పడింది. నా అభిప్రాయంలో మన మిద్దె తోట పని మనం చేసుకోగలిగేటట్లు, అవసరమైతే కుండీలు కూడా మనమే మోయగలిగేంత బరువైనవే పెట్టుకుంటే బాగుంటుంది. ఎందుకంటే మొక్కలు ఎప్పుడూ ఒకే స్థలంలో, ఒకే దిశలో ఉండటం సరికాదు. అలాగే, మనం తోటను కాలానుగుణంగా దశదిశలు మార్చవలసి వస్తూ ఉంటుంది. చిన్న మడులు, కుండీలు అయితేనే సౌలభ్యంగా ఉంటుంది. పెద్దవైతే తెగుళ్లు, పురుగులు సోకిన మొక్కల కుండీలను దూరంగా పెట్టడం వీలుకాదు. కొన్ని తెగుళ్ల వలన ఒక్కొక్కసారి మట్టిని మొత్తం తొలగించవలసి వస్తుంది.

ఇంతకీ నేను చెప్పేది ఏంటంటే.. మిద్దె తోట మన చేతిలో ఉండాలి గానీ.. తోట కోసం మనం ఇంకొకరి చేతిలోకి వెళ్లొద్దు.."

ప్రతి ఇల్లూ వ్యవసాయ క్షేత్రం కావాలి



సాధ్యమైనంత వరకు దేశ వాళీ/ నాటు రకాలను పెంచుతాను. విత్తనాలు కొనను. నా తోట నుంచే సేకరించుకుంటాను. నా తోటలో సుమారు 10 రకాల ఆకుకూరలు, 7,8 రకాల తీగజాతులు, 15–20 రకాల కూరగాయలు పండుతున్నాయి. టొమాటో 8 రకాలు, వంగ 10 రకాలు, చిక్కుడు 8 రకాలు, మిర్చి 5 రకాలు నా మిద్దె తోటలో పండిస్తున్నాను. దుంప జాతికి సంబంధించి అల్లం, మామిడి అల్లం, పసుపు, చేమదుంప, చిలకడ దుంప తదితరాలను పండిస్తున్నాను. పండ్ల మొక్కల్లో విదేశీ పండ్ల జాతులు కూడా ఉన్నాయి. ఒక్క ఉల్లిపాయ తప్పితే మిగతా ఏ కూరగాయల కోసమూ మార్కెట్‌కి వెళ్ళను. మీరు నమ్మినా నమ్మకున్నా 365 రోజుల్లో ఏనాడూ నేను కూరగాయలను బయట కొనటం లేదు. నా మిద్దె తోట మీకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను. నగరంలోని ప్రతి ఇల్లూ ఒక వ్యవసాయ క్షేత్రం కావాలన్నది నా ఆకాంక్ష.

- ఓ.వి.ఎస్.ఉషారాణి (81217 96299),
వ్యవసాయ సహాయ సంచాలకులు,
చందానగర్ సర్కిల్ ప్రాజెక్ట్ ఆఫీసర్,
జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్

మహిపాల్ ఆవిష్కరణలు సృజనకు నిలువుటద్దాలు

నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్


మినీ కల్టివేటర్


ఎలక్ట్రిక్ ట్రాలీ

పదో తరగతి ఫెయిలైన ఓ యువకుడు స్వయంకృషితో ఇంజనీరింగ్ వర్క్స్‌లో నైపుణ్యం సంపాయించారు. రైతులకు, ముఖ్యంగా చిన్న– సన్నకారు రైతులకు, వ్యవసాయంలో ఎంతగానో ఉపయోగపడే అనేక వినూత్న యంత్ర పరికరాలను తయారు చేసి అందిస్తూ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదిగారు. ఆయనే హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన కె. మహిపాల్ చారి. పల్లెసృజన స్వచ్ఛంద సంస్థ తోడ్పాటుతో తన ఆవిష్కరణలను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో విజయం సాధించిన ఆయన అనేక జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్నారు.

కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖకు అనుబంధంగా ఉన్న నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) 2015లో జాతీయ ఉత్తమ ఆవిష్కర్త పురస్కారాన్ని అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నారు. 2018లో కేంద్ర ప్రభుత్వం నుంచి నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డు (రూ. 5 లక్షల నగదు బహుమతి) అందుకున్నారు. తాజాగా 'టైమ్స్‌నౌ' మీడియా సంస్థ నుంచి అమేజింగ్ ఇండియన్స్ అవార్డ్స్–2024లో భాగంగా 'సోషల్ ఇన్నోవేషన్ యూజింగ్ టెక్నాలజీ' పురస్కారాన్ని ఇటీవల అందుకున్నారు.

2011లో మినీ కల్టివేటర్ ఆవిష్కరణతో మహిపాల్ చారి ప్రతిభ తొలిసారి వెలుగులోకి వచ్చింది. 5 హెచ్.పి. మోటారుతో నడిచే ఈ మినీ కల్టివేటర్‌తో 1 లీ. డీజిల్‌తో 3 గంటల్లో 2 ఎకరాల్లో ఒక సాలు దుక్కి/ పైపాటు చేయవచ్చు. మోటారు రకాన్ని బట్టి ధర రూ. 45 వేలు – 55 వేల వరకు ఉంటుంది. 2023 డిసెంబర్‌లో దీనిపై పేటెంట్ కూడా పొందారు. ఈ మినీ కల్టివేటర్‌ను ఇప్పటికి 4 వేల మంది రైతులకు అమ్మారు. చిన్న, సన్నకారు రైతులకు ఇది ఎంతగా ఉపయోగపడుతోందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చని మహిపాల్ చారి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. దీని ప్రాచుర్యాన్ని గురించి చెబుతూ.. దేశవ్యాప్తంగా ఈ నమూనా యంత్రాలను స్థానికంగానే రైతులు తయారు చేయించుకుంటున్నారని తెలిపారు.


మినీ ట్రాక్టర్


హైడ్రాలిక్ లిఫ్ట్

2017లో మినీ ట్రాక్టర్‌ను తయారు చేశారు. 9 హెచ్‌పి ఇండియన్ ఇంజిన్‌తో నడుస్తుంది. పండ్ల తోటల్లో పైపాటుకు, వర్షాధార భూముల్లో దుక్కికి ఇది ఉపకయోగపడుతుంది. ధర రూ. లక్ష. ఇదే వరుసలో.. ఇటీవలే ఎలక్ట్రిక్ బ్యాటరీతో నడిచే ట్రాలీని మహిపాల్ చారి రూపొందించారు. 100 వాల్టుల మోటరుతో నడిచే ఈ 3 గేర్ల ట్రాలీ 500 కిలోల బరువును తీసుకెళ్ల గలదు. 12 వాల్టుల నాలుగు బ్యాటరీలు అమర్చారు. 4 గంటలు చార్జ్ చేస్తే 100 కి.మీ. ప్రయాణించవచ్చు. 9 మంది కూలీలను తరలించటానికి.. గడ్డి మోపులు, పంట దిగుబడులు, ఎరువుల బస్తాలను తరలించడానికి రైతులకు ఉపయోగకరంగా ఉండటంతో దీనికి గిరాకీ బాగా ఉందని మహిపాల్ చారి తెలిపారు. దీని ఖరీదు రూ. లక్ష.


మహిపాల్

మరో వినూత్న ఆవిష్కరణ హైడ్రాలిక్ లిఫ్ట్. ట్రాక్టర్‌కు అనుసంధానం చేసి దీన్ని వాడాలి. 500 కిలోల బరువును ఎత్తి లారీలో పెట్టడానికి ఇది ఉపయోగపడతుంది. వ్యవసాయోత్పత్తుల బస్తాలు, రొటోవేటర్ వంటి యంత్ర పరికరాలను టాక్టర్/లారీలోకి లోడ్/అన్‌లోడ్ చేయటానికి , బోరులో మోటారును పైకి లాగడానికి రైతులు, రైస్ మిల్లుల యజమానులకు ఇది ఉపయోగపడుతుంది. దీని వెల రూ. పది వేలు. వరి పంటలో కలుపు తొలగించే వీడర్‌ను కూడా ఆయన తయారు చేశారు. ఈ యంత్ర పరికరాల తయారీకి పరిశ్రమను నెలకొల్పి 8 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. పల్లెసృజన సంస్థ తోడ్పాటు వల్లే చిన్న సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయగలిగానని, జాతీయ స్థాయి పురస్కారాలు అందుకునే స్థాయికి ఎదిగానని వినయంగా చెబుతున్న మహిపాల్ చారి(98669 22168).. చదువుతో నిమిత్తం లేకుండా గ్రామీణుల్లో దాగి ఉన్న సృజనాత్మకతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తారు.

బిజినెస్ రీల్

లాక్‌హీడ్ మార్టిన్, టాటా అడ్వాన్స్‌డ్ జట్టు

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన దిగ్గజ రక్షణ ఉత్పత్తుల సంస్థ లాక్‌హీడ్ మార్టిన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ మధ్య కీలక ఒప్పందం కుదరింది. ఇరు సంస్థలూ సీ–130జే సూపర్ హెర్క్యులస్ టాక్టికల్ ఎయిర్‌లిఫ్టర్ ప్రాజెక్టుపై కలసి పనిచేయనున్నాయి. దేశ సైనిక రవాణా అవసరాలకు సంబంధించి విమానాల ఆర్డర్లను దక్కించుకునే లక్ష్యంతో ఇవి జత కలసినట్టు తెలుస్తోంది. భారత వాయుసేన (ఐఏఎఫ్) 80 మధ్యశ్రేణి రవాణా విమానాలను సమకూర్చుకోవాలని చూస్తోంది. లాక్‌హీడ్ మార్టిన్ సీ–130జే, ఎంబ్రారర్ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీస్ సీ–390 మిలీనియం, ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్ ఏ–400ఎం ఎయిర్‌క్రాఫ్ట్ ఈ డీల్‌కు ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి.

ఒలెక్ట్రా 40 బస్సుల సరఫరా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్సుల తయారీలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ తాజాగా 40 బస్సులను సరఫరా చేసింది. మహారాష్ట్రలోని వసయీ విరార్ నగరపాలక సంస్థ నుంచి కంపెనీ ఈ ఆర్డర్‌ను అందుకుంది. డీజైన్ ఖరారు చేసిన నెలరోజుల్లోపే నగర పాలక సంస్థకు బస్‌లను సరఫరా చేశామని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సీఎండీ కె.వి.ప్రదీప్ తెలిపారు. అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్, ఎయిర్ సస్పెన్షన్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, డిస్క్ బ్రేక్స్ వంటి ఫీచర్లతో ఈ–బస్ తయారైంది. 90 నిమిషాల వేగవంతమైన ఛార్జింగ్‌తో 200 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. డ్రైవర్‌తో కలిపి 32 మంది కూర్చోవచ్చు.

అయిదేళ్లలో ప్లాన్‌ఫుల్ 120 మిలియన్ డాలర్ల పెట్టుబడులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆర్థిక పనితీరు నిర్వహణకు సంబంధించిన క్లౌడ్ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ప్లాన్‌ఫుల్ భారత్‌లో తమ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలకు ఉపయోగపడేలా హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. ఇప్పటికే భారత్‌లో 50 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయగా, వచ్చే అయిదేళ్లలో మరో 120 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసే యోచనలో ఉన్నట్లు సంస్థ సీఈవో గ్రాంట్ హాలోరాన్ తెలిపారు. కొత్త ఆవిష్కరణలను వేగవంతం చేసేందుకు సిబ్బంది సంఖ్యను రెట్టింపు చేసుకోనున్నట్లు పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-9-2024	
విశాఖ	530–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520–00
విజయవాడ	525–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	490–00
వరంగల్	492–00
రిటైల్ ధర	5.50

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DIVISLAB	5,444.00	5.23
LTIM	6,332.00	3.02
NTPC	399.15	2.39
BHARTIARTL	1,577.10	2.23
WIPRO	525.25	2.02

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	703.4	-4.4
SBILIFE	1,855.00	-2.46
SHRIRAMFIN	3,256.05	-1.8
BAJAJFINSV	1,827.90	-1.75
BAJFINANCE	7,244.00	-1.41

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,896
ఎన్ఎస్ఈ	1,07,403
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,95,295
ఎఫ్ఐఐ	+ 2,208
డీఐఐ	- 275

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.67	$ 68.71
బ్రెంట్	69.80	$ 71.84

సెమీకండక్టర్ సరఫరాలో భారత్‌కు ఉజ్వల భవిత



విభిన్న సెమీకండక్టర్ సరఫరాల వ్యవస్థలో విశ్వసనీయ భాగస్వామిగా అవతరించే సామర్థ్యం భారత్‌కు ఉందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన సెమీకండక్టర్ ఎగ్జిక్యూటివ్‌ల రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం– సాంకేతికతలు రెండూ మానవాళి సంక్షేమానికి విశేష సేవలు అందించగలవని పేర్కొన్నారు. సమావేశంలో కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి జితిన్ ప్రసాద కూడా పాల్గొన్నారు.

గూగుల్‌కు ఎదురుదెబ్బ

- 2.4 బిలియన్ యూరోలు చెల్లించాల్సిందే
- ఈయూ కోర్ట్ ఆఫ్ జస్టిస్ తీర్పు

Google

లండన్: యూరోపియన్ కమిషన్ విధించిన 2.4 బిలియన్ యూరోల జరిమానాను సవాల్ చేస్తూ గూగుల్ దాఖలు చేసిన కేసు వీగిపోయింది. గూగుల్ సెర్చ్‌లో గూగుల్ సొంతంగా షాపింగ్ సిఫారసులు చేయడం ద్వారా చట్టవిరుద్ధమైన ప్రయోజనం పొందిందంటూ.. 2.4 బిలియన్ యూరోల (2.7 బిలియన్ డాలర్లు) జరిమానా చెల్లించాలంటూ 2017లో యూరోపియన్ కమిషన్ ఆదేశించింది. విజిటర్లను అనుచితంగా తన సొంత షాపింగ్ సేవల వైపు మళ్లించడం పోటీదారులకు నష్టం కలిగించడమేనని పేర్కొంది. ఈ ఆదేశాలను యూరోపియన్ యూనియన్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ తాజాగా సమర్థించింది. గూగుల్ అప్పీల్‌ను తిరస్కరించింది. కోర్టు నిర్ణయం తమను నిరాశపరిచినట్టు, ఈ తీర్పు కేవలం కొన్ని వాస్తవాల ఆధారంగానే ఉన్నట్టు గూగుల్ ప్రకటన విడుదల చేసింది. పోటీదారులను సమానంగా చూడాలన్న యూరోపియన్ కమిషన్ నిర్ణయానికి అనుగుణంగా తాము 2017లో ఎన్నో మార్పులను అమల్లోకి తీసుకొచ్చినట్టు తెలిపింది. షాపింగ్ సెర్చ్ లిస్టింగ్‌లకు సంబంధించి వేలం నిర్వహించినట్టు వివరించింది. ఆండ్రాయిడ్ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్, యాడ్‌సెన్స్ అడ్వర్టైజింగ్ ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించి మరో రెండు ఈయూ యాంటీట్రస్ట్ కేసుల్లోనూ గూగుల్‌కు వ్యతిరేకంగా ఆదేశాలు రాగా, వీటిపై అప్పీల్‌కు గూగుల్‌కు ఇప్పటికీ అవకాశం మిగిలే ఉంది.

రుణాలు పీక్... డిపాజిట్లు వీక్

- బ్యాంకులకు ద్రవ్య సవాళ్లు
- ఫిక్కీ, ఐబీఏ నివేదిక



న్యూఢిల్లీ: రుణాల పెరుగుదల డిపాజిట్ వృద్ధిని మించిపోతోందని, ఇది బ్యాంకింగ్ వ్యవస్థ లిక్విడిటీ (ద్రవ్య లభ్యతా) సవాళ్లకు దారితీయవచ్చని ఫిక్కీ–ఐబీఏ నివేదిక ఒకటి పేర్కొంది. రుణ వృద్ధికి అనుగుణంగా డిపాజిట్లను పెంచడం అలాగే రుణ రేటును తక్కువగా ఉంచడం బ్యాంకుల ఎజెండాలో అగ్రస్థానంలో ఉందని నివేదిక పేర్కొంది. మొత్తం డిపాజిట్లలో కరెంట్ అకౌంట్ సేవింగ్స్ అకౌంట్ (కాసా) విభాగం వాటా తగ్గినట్లు సర్వేలో పాల్గొన్న బ్యాంకుల్లో మూడింట రెండొంతుల కంటే ఎక్కువ తెలియజేసినట్లు నివేదిక పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేట్, విదేశీ బ్యాంకులు సహా మొత్తం 22 బ్యాంకులు (మొత్తం అసెట్ పరిమాణంలో వీటి వాటా 67 శాతం) ఈ సర్వేలో పాల్గొన్నాయి. 2024 జనవరి నుంచి జూన్ మధ్య జరిగిన ఈ 19వ దఫా ఫిక్కీ–ఐబీఏ సర్వే నివేదికలో వ్యక్తమైన అభిప్రాయాల్లో కొన్ని...

- 2024 ప్రథమార్థంలో 80 శాతం ప్రభుత్వ రంగ బ్యాంకులు కాసా డిపాజిట్ల వాటా తగ్గుదలను నమోదుచేసుకోగా, సగానికి పైగా ప్రైవేట్ రంగ బ్యాంకులు ఇదే విషయాన్ని తెలిపాయి. అయితే అధిక, ఆకర్షణీయమైన రేట్ల కారణంగా టర్మ్ డిపాజిట్లు వేగం పుంజుకున్నాయి.
- సర్వేలో 71% బ్యాంకులు గత ఆరు నెలల్లో మొండిబకాయిల స్థాయిలు తగ్గిన్నట్లు పేర్కొన్నాయి. ఈ విషయంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల రేటు 90 శాతంగా ఉంటే, ప్రైవేటు రంగ బ్యాంకుల రేగు 67 శాతంగా ఉంది.
- మౌలిక సదుపాయాలు, లోహాలు, ఇనుము, ఉక్కు వంటి రంగాల్లో వృద్ధికి తగినట్లుగా దీర్ఘకాలిక రుణ డిమాండ్ కనబడుతోంది. ప్రత్యేకించి మౌలిక విభాగం పురోగతిపై కేంద్రం దృష్టి సారిస్తున్న నేపథ్యంలో– ఈ రంగానికి రుణ డిమాండ్ గణనీయంగా పెరిగినట్లు సర్వేలో 77% బ్యాంకులు వెల్లడించాయి.
- బ్యాంకులు– ఫిన్‌టెక్ కంపెనీల మధ్య భాగస్వామ్యం– నూతన ఆవిష్కరణలు, సేవల విస్తృతి, అందరికీ ఆర్థిక సేవలు అందుబాటులోకి తేవడం వంటి సానుకూల చర్యలకు దోహదపడుతుంది.
- ఏటీఎం చానెల్ నిర్వహణ విషయంలో వ్యయాలు తగ్గాలి. వ్యూహాత్మక స్థానాలను ఎంచుకోవడం, ఏటీఎం లావాదేవీల కోసం ఇంటర్‌ఛేంజ్ ఫీజులను పెంచడం, వ్యయాలు–ప్రయోజనాలను విశ్లేషించడం, సాంకేతికతను పెంచడం వంటి పలు కీలక సూచనలను బ్యాంకర్లు చేశారు.

రీ సస్టేనబిలిటీ రీసైకిల్డ్ పాలిమర్స్

- షార్ప్ వెంచర్స్‌తో కలిసి జేవీ
- తొలుత రూ.50 కోట్ల పెట్టుబడి



మీడియాతో హర్ష్ మారివాలా, మసూద్ మాలిక్ (కుడి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పర్యావరణ నిర్వహణ సేవల్లో ఉన్న రీ సస్టేనబిలిటీ అధిక నాణ్యత కలిగిన రీసైకిల్డ్ పాలిమర్స్ తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మ్యారికో వ్యవస్థాపక కుటుంబమైన హర్ష్ మారివాలా ఫ్యామిలీ యాజమాన్య మూలధనాన్ని నిర్వహిస్తున్న షార్ప్ వెంచర్స్‌తో కలిసి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తోంది. ఈ జేవీలో రీ సస్టేనబిలిటీకి 85 శాతం, మిగిలిన వాటా షార్ప్ వెంచర్స్‌కు ఉంటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేసేందుకు హైదరాబాద్‌తోపాటు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వద్ద ఏఐ సాంకేతికతతో కూడిన అత్యాధునిక ప్రాసెసింగ్ కేంద్రాలను నెలకొల్పుతామని రీ సస్టేనబిలిటీ ఎండీ, సీఈవో మసూద్ మాలిక్ తెలిపారు. మ్యారికో ఫౌండర్, చైర్మన్ హర్ష్ మారివాలాతో కలిసి మంగళవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. 'వచ్చే ఏడాది రెండు ప్లాంట్లు కార్యరూపంలోకి వస్తాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా ఏటా 32,000 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తాం' అని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

క్రెడిట్ కార్డుల్లో మోస్తరు వృద్ధికే పరిమితం

- ఆర్‌బీఎల్ బ్యాంక్ ప్రకటన
- ఐవోసీతో కలసి 'ఎక్స్‌ట్రా క్రెడిట్ కార్డ్'



ముంబై: క్రెడిట్ కార్డు పోర్ట్‌ఫోలియో పరంగా మోస్తరు వృద్ధికే పరిమితం కావాలని ఆర్‌బీఎల్ నిర్ణయించింది. కార్డుదారులకు ఇతర ఉత్పత్తుల విక్రయం ద్వారా లాభదాయకత పెంచుకోవాలని భావిస్తోంది. ఈ వివరాలను బ్యాంక్ క్రెడిట్ కార్డుల విభాగం హెడ్ విక్రమ్ యాదవ్ తెలిపారు. క్రెడిట్ కార్డు పరిశ్రమ 20–25 శాతం మేర వృద్ధి చెందితే తాము 15 శాతానికే పరిమితం కానున్నట్టు చెప్పారు. ''ఈ విభాగంలో మితంగానే వృద్ధి చెందాలని అనుకుంటున్నాం. అంతర్గతంగా యూనిట్ లాభదాయకతపై దృష్టి సారించి, కస్టమర్‌తో మెరుగైన అనుసంధానం ద్వారా ఇతర ఉత్పత్తులను విక్రయించాలని అనుకుంటున్నాం''అని విక్రమ్ యాదవ్ వివరించారు. ఇండియన్ ఆయిల్ భాగస్వామ్యంతో ఆర్‌బీఎల్ బ్యాంక్ 'ఎక్స్‌ట్రా క్రెడిట్ కార్డ్'ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా విక్రమ్ యాదవ్ మాట్లడారు. వృద్ధి కంటే ఇతర అంశాలకే ప్రాధాన్యమని చెప్పారు. మూలధనంపై సహేతుక రాబడుల పట్ల దృష్టి సారిస్తామని చెప్పారు. క్రెడిట్ కార్డులు అన్ సెక్యూర్డ్ (రక్షణ లేని) కావడంతో వీటి విషయంలో బ్యాంక్‌లు దూకుడుగా వెళ్లకుండా ఆర్‌బీఐ ఇటీవలే కొన్ని చర్యలు తీసుకోవడం గమనార్హం. వృద్ధిని నిదానింపజేసేందుకు ఆర్‌బీఐ అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నట్టు విక్రమ్ యాదవ్ తెలిపారు. క్రెడిట్ కార్డుల విభాగంలో ఆర్‌బీఎల్‌బ్యాంక్ వాటా 5 శాతంగా ఉండగా.. మార్కెట్ వాటా పెంచుకోవడం పట్ల తమకు ఆసక్తి లేదని విక్రమ్ యాదవ్ స్పష్టం చేశారు. అదే సమయంలో ఈ విభాగం నుంచి తప్పుకునే ఆలోచన కూడా లేదన్నారు.

ప్రస్తుత కస్టమర్లకే ప్రాధాన్యం..

వ్యక్తిగత రుణాల్లోనూ ఆఫర్లతో కొత్త కస్టమర్లను ఆకర్షించే ఉద్దేశ్యం లేదని విక్రమ్ యాదవ్ తెలిపారు. ప్రస్తుత కస్టమర్లకే ఈ రుణాల మంజూరుకు ప్రాధాన్యమిస్తామన్నారు. కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డుల విక్రయాలు పెంచుకోవడంపై దృష్టి సారించినట్టు చెప్పారు. ఐఆర్‌సీటీసీ, ఐవోసీఎల్ మాదిరే పతంజలి, నాన్ బ్యాంక్ రుణదాతలు, ఫిన్‌టెక్ సంస్థలతో కలసి క్రోబ్రాండెడ్ క్రెడిట్ కార్డులను తీసుకురావడానికి ఆసక్తిగా ఉన్నట్టు తెలిపారు.

ఎక్స్‌ట్రా క్రెడిట్ కార్డుపై ప్రయోజనాలు

ఐవోసీఎల్‌తో కలసి విడుదల చేసిన ఎక్స్‌ట్రా క్రెడిట్ కార్డ్‌తో ఐవోసీఎల్ వద్ద చేసే చెల్లింపులపై 7.5 శాతం మేర విలువను తిరిగి పొందొచ్చని విక్రమ్ యాదవ్ తెలిపారు. ఇతర చెల్లింపులపై 1 శాతం రివార్డులు లభిస్తాయని చెప్పారు.

పేరుకుపోతున్న వాహన నిల్వలు

డీలర్ల వద్ద పేరుకున్న 7.8 లక్షల కార్లు ● వీటి మొత్తం విలువ రూ.77,800 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎప్పటిలాగే ఈ ఏడాదీ పండుగల సీజన్ వచ్చింది. ప్యాసింజర్ వెహికిల్స్ విభాగంలో కొత్త మోడళ్లు వరుసకట్టాయి. నూతన కార్లను సొంతం చేసుకునేందుకు కస్టమర్లు రెడీ అవుతున్నారు. ఇదంతా నాణేనికి ఒకవైపు. మరోవైపు ప్యాసింజర్ వాహన మార్కెట్ గణనీయమైన ఒత్తిడిలో ఉంది. దీనికంతటికీ కారణం డీలర్‌షిప్ కేంద్రాల్లో వాహనాల నిల్వలు ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోవడమే. ఇన్వెంటరీ ఏకంగా 7.8 లక్షల యూనిట్లకు చేరుకోవడమే ఆటోమొబైల్ రిటైల్ పరిశ్రమకు ఆందోళన కలిగిస్తోంది. 70–75 రోజుల సరఫరాకు సరిపడ స్థాయిలో ఇవి విస్తరించాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఏడీఏ) వెల్లడించింది. డీలర్ల వద్ద నిల్వ ఉన్న ఈ వాహనాల విలువ రూ.77,800 కోట్లు ఉంటుందని ఎఫ్ఏడీఏ ప్రెసిడెంట్ మనీష్ రాజ్ సింఘానియా వెల్లడించారు.

అయినా ఆగని సరఫరా..

ప్రస్తుత పరిస్థితికి ప్రతిస్పందించడానికి బదులుగా ప్యాసింజర్ వెహికిల్స్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థలు నెలవారీగా డీలర్లకు డిస్పాచ్‌లను పెంచుతూనే ఉన్నాయి. ఇది సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందని సింఘానియా వెల్లడించారు. 'అధిక ఇన్వెంటరీ కలిగి ఉన్న డీలర్లకు నిధులను వెంటనే నియంత్రించాలని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని అన్ని బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలను ఫెడరేషన్ అత్యవసరంగా విన్నవిస్తోంది. డీలర్లు తమ ఆర్థిక స్థితిగతులను కాపాడుకోవడంలో భాగంగా అదనపు స్టాక్‌ను నిరాకరించేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలి. తయారీ సంస్థలు కూడా తమ సరఫరా వ్యూహాలను ఆలస్యం చేయకుండా మార్చుకోవాలి. లేదంటే ఈ ఇన్వెంటరీ ఓవర్‌లోడ్ నుండి పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం లేకపోలేదు. డీలర్ల వద్ద ఎంత పరిమాణంలో నిల్వలు ఉన్నాయో తనిఖీ లేకుండా అదనపు స్టాక్ కొనసాగితే.. ఆటో రిటైల్ పర్యావరణ వ్యవస్థ తీవ్ర అంతరాయాన్ని ఎదుర్కొంటుంది' అని హెచ్చరించారు.

తగ్గిన రిటైల్ విక్రయాలు..

ఆగస్ట్ నెలలో దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహనాల విక్రయాలు 3,09,053 యూనిట్లు నమోదయ్యాయి. 2023 ఆగస్టుతో పోలిస్తే ఈ సంఖ్య 5 శాతం తక్కువ. గత నెలలో వాణిజ్య వాహనాలు 6 శాతం, ట్రాక్టర్ల అమ్మకాలు 11 శాతం క్షీణించాయి. ద్విచక్ర వాహనాలు 6 శాతం అధికమై 13,38,237 యూనిట్లకు చేరుకున్నాయి. త్రీ వీలర్స్ విక్రయాలు 2 శాతం పెరిగి 1,05,478 యూనిట్లను తాకాయి. అన్ని వాహన విభాగాల్లో కలిపి ఆగస్టులో మొత్తం 18,91,499 యూనిట్లు రోడ్డెక్కాయి. 2023 ఆగస్టుతో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. సమీప కాలంలో వ్యాపార దృక్పథం ఆశాజనకంగా ఉందని ఫెడరేషన్ పేర్కొంది. పండుగల సీజన్, మెరుగైన గ్రామీణ డిమాండ్ వృద్ధికి ఆశాజనక అవకాశాలను అందిస్తున్నప్పటికీ.. కొనసాగుతున్న వాతావరణ అనిశ్చితులు, అధిక ఇన్వెంటరీ స్థాయిలు మొత్తం రికవరీని తగ్గించవచ్చని హెచ్చరించింది. ఈ సవాళ్లను అధిగమించడానికి, పండుగ విక్రయాలను పెంచడంలో, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుండి నష్టాలను తగ్గించడంలో వ్యూహాత్మక ఇన్వెంటరీ నిర్వహణ, మార్కెటింగ్ కార్యక్రమాలు కీలకంగా ఉంటాయని వివరించింది.

జీవిత బీమా ప్రీమియంలో 22 శాతం వృద్ధి

ఆగస్ట్‌లో రూ.32,644 కోట్లు

న్యూఢిల్లీ: జీవిత బీమా కంపెనీలకు ఆగస్ట్ నెలలో నూతన పాలసీల రూపంలో రూ.32,644 కోట్ల ప్రీమియం ఆదాయం లభించింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఆదాయం రూ.26,788 కోట్లతో పోల్చి చూస్తే 22 శాతం పెరిగింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో (ఏప్రిల్–ఆగస్ట్) జీవిత బీమా కంపెనీలకు నూతన పాలసీలపై 21 శాతం అధికంగా రూ.1,54,194 కోట్ల ప్రీమియం ఆదాయం లభించింది. క్రితం ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో ఇది రూ.1,27,661 కోట్లుగా ఉంది. ఈ మేరకు లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ఆగస్ట్ నెలకు సంబంధించి గణాంకాలను విడుదల చేసింది. వ్యక్తులు, కార్పొరేట్ క్లయింట్ల నుంచి బీమా రక్షణ పట్ల డిమాండ్ పెరిగినప్పటికీ.. నూతన పాలసీల జారీ 1.44 శాతం తగ్గింది. గత నెలలో 23,94,007 కొత్త పాలసీలను బీమా సంస్థలు విక్రయించాయి. క్రితం ఏడాది ఆగస్ట్‌లో 24,28,895 కొత్త పాలసీల అమ్మకాలు నమోదు కావడం గమనార్హం. ఇక గత నెలలో 1,08,147 కొత్త జీవిత బీమా ఏజెంట్ల నియామకం జరిగింది.



భారత్‌లో ఇన్‌కా సెంటర్స్ రూ.5,500 కోట్లు



న్యూఢిల్లీ: ఐకియా రిటైల్‌ను ప్రమోట్ చేస్తున్న ఇన్‌కా సెంటర్స్ భారత్‌లో మరో రూ.5,500 కోట్లు పెట్టుబడి పెడుతోంది. ఇందులో భాగంగా రెండవ లైక్లి మీటింగ్ ప్లేస్‌ను నోయిడా వద్ద ఏర్పాటు చేయనుంది. 2028లో ఈ కేంద్రం అందుబాటులోకి రానుంది. 240 భాగస్వాములకు చెందిన ఔట్‌లెట్స్ ఇక్కడ కొలువుదీరనున్నాయి. రెండు ఆఫీస్ టవర్స్, 267 గదులతో కూడిన హోటల్ సైతం కార్యరూపం దాల్చనుంది. లైక్లి గురుగ్రామ్‌ను వచ్చే ఏడాదికి బదులు 2026లో ప్రారంభించనున్నట్టు కంపెనీ గ్లోబల్ ఎక్స్‌పాన్షన్, డెవలప్‌మెంట్ డైరెక్టర్ సెబాస్టియన్ హిల్బ్రింగ్ వెల్లడించారు. రిటైల్, డైనింగ్, హాస్పిటాలిటీ, కో–వర్కింగ్ స్పేస్, ఎంటర్‌టైన్‌మెంట్, సాంస్కృతిక కార్యక్రమాలకు లైక్లి వేదిక కానుంది. లైక్లి గురుగ్రామ్‌లో 253 బ్రాండ్స్ తమ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. రెండు లైక్లి సెంటర్లకు కంపెనీ మొత్తం రూ.9,268 కోట్లు ఖర్చు చేస్తోంది. ఐకియాకు టాప్–3 మార్కెట్లలో భారత్ ఒకటిగా నిలిచిందని హిల్బ్రింగ్ తెలిపారు. 13 దేశాల్లో లైక్లి మీటింగ్ ప్లేసెస్ 35 ఉన్నాయి. కాగా, ఫర్నీచర్ రిటైల్‌లో ఉన్న ఐకియా 30–70 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో చిన్న కేంద్రాలను స్థాపించాలని నిర్ణయించింది. ప్రస్తుతం భారత్‌లో ఉన్న ఐకియా స్టోర్లు 4.6 లక్షలకుపైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొన్నాయి.

స్పైస్‌జెట్ పరిస్థితిని పరిశీలిస్తున్నాం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ: స్పైస్‌జెట్ ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలను పరిశీలిస్తున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమాన సేవలకు గణనీయంగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో దేశీయంగా మరిన్ని ఎయిర్‌లైన్స్ పనిచేయాల్సిన అవసరం ఉందని పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పేర్కొన్నారు. డిమాండ్, సరఫరా మధ్య సమతుల్యత పాటించేందుకు, సంస్థ సజావుగా నడిచేలా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన వివరించారు. విమాన టికెట్ల ధరలనేవి మార్కెట్ ఆధారితమైనవై ఉంటాయని, వాటిని తమ శాఖ పరిశీలిస్తూ ఉంటుందని మంత్రి చెప్పారు. ఒకవేళ ఛార్జీలు భారీగా పెరిగితే ఎయిర్‌లైన్స్‌కు తగు సూచనలు చేస్తుందని వివరించారు. స్పైస్‌జెట్ ఇటు ఆర్థికంగా అటు లీగల్‌గా సమస్యలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఇటీవలే కంపెనీని మరింత తరచుగా తనిఖీ చేయాలని నిర్ణయించింది.



చహల్‌కు 5 వికెట్లు

నార్తాంప్టన్‌: కౌంటీ క్రికెట్‌లో భారత లెగ్‌స్పిన్నర్‌ యజువేంద్ర చహల్‌ నిలకడగా రాణిస్తున్నాడు. కౌంటీ చాంపియన్‌షిప్‌ డివిజన్‌–లో భాగంగా జరుగుతున్న ఫస్ట్‌క్లాస్‌ మ్యాచ్‌లో చహల్‌ 5 వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. నార్తాంప్టన్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న చహల్‌ బౌలింగ్‌ (5/45) జోరుకు డెర్బీషైర్‌ తమ తొలి ఇన్నింగ్స్‌లో 165 పరుగులకు ఆలౌటైంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులు చేసిన నార్తాంప్టన్‌షైర్‌కు 54 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం మ్యాచ్‌ రెండో రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి నార్తాంప్టన్‌షైర్‌ తమ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 178 పరుగులు చేసి ఓవరాల్‌ ఆధిక్యాన్ని 232 పరుగులకు పెంచుకుంది. ఈ ఐదు వికెట్ల ప్రదర్శనతో చహల్‌ ఫస్ట్‌క్లాస్‌ క్రికెట్‌లో 100 వికెట్ల మైలురాయిని అందుకోవడం విశేషం. మరోవైపు నార్తాంప్టన్‌షైర్‌ తరఫునే ఆడుతున్న భారత ఆటగాడు పృథ్వీ షా రెండు ఇన్నింగ్స్‌లలో 4, 2 స్కోర్లతో నిరాశపరిచాడు.

స్టిమాక్‌ 'కాంట్రాక్ట్‌'పై ఏఐఎఫ్‌ఎఫ్‌ విచారణ



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్‌ కోచ్‌గా పని చేసిన ఐగర్‌ స్టిమాక్‌తో కాంట్రాక్ట్‌, ఆపై దాని పునరుద్ధరణ, అతనికి నష్టపరిహారం చెల్లించాల్సి రావడంపై అఖిల భారత ఫుట్‌బాల్‌ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్‌) తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో జరిగిన తప్పులు, స్టిమాక్‌కు అనుకూలంగా నిబంధనలు ఉండటంపై సమాఖ్య సర్వసభ్య సమావేశంలో చర్చ జరిగింది. అందుకే దీనికి సంబంధించి 'స్వతంత్ర విచారణ' జరపాలని ఏఐఎఫ్‌ఎఫ్‌ నిర్ణయం తీసుకుంది. ఎవరెవరు బాధ్యులు, ఎవరి కారణంగా స్టిమాక్‌కు భారీ మొత్తం ఇవ్వాల్సి వచ్చిందనే అంశం విచారణలో తేలుతుందని ఏజీఎంలో సభ్యులు అభిప్రాయపడ్డారు. భారత జట్టు కోచ్‌గా ఐగర్‌ స్టిమాక్‌ పదవీ కాలం 2023లో ముగిసింది. ఆ తర్వాత మళ్లీ దానిని జూన్‌ 2025 వరకు పదవీకాలం ఉండేలా పునరుద్ధరించారు. అయితే రెండోసారి కాంట్రాక్ట్‌పై సంతకం చేసినప్పుడు నిబంధనలు, షరతులు అన్నీ స్టిమాక్‌కే అనుకూలంగా తయారు చేశారని, ఇందులో ఏఐఎఫ్‌ఎఫ్‌లో కీలక పదవుల్లో పని చేసిన వారి పాత్ర ఉందని ఏజీఎంలో కొందరు సభ్యులు విమర్శించారు. ఈ ఏడాది జూన్‌లో 'ఫిఫా' వరల్డ్‌ కప్‌ క్వాలిఫయర్స్‌లో సులువైన 'డ్రా' ఉన్నా భారత జట్టు చెత్త ప్రదర్శనతో రెండో రౌండ్‌లోనే నిష్క్రమించింది. దాంతో వెంటనే స్టిమాక్‌ను కోచ్‌ పదవి నుంచి తొలగించారు. అయితే స్టిమాక్‌ ఊరుకోకుండా సుమారు 9 లక్షల 20 వేల డాలర్లు (రూ. 7 కోట్ల 72 లక్షలు) నష్టపరిహారం కోరుతూ ఫిఫా ఫుట్‌బాల్‌ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశాడు. మరో ఏడాది కాలం మిగిలి ఉన్నా తనను తీసేయడం నిబంధనలకు విరుద్ధమంటూ అతను సవాల్‌ చేశాడు. చివరకు మధ్యవర్తిత్వం ద్వారా ఏఐఎఫ్‌ఎఫ్‌ సమస్యను పరిష్కరించుకుంది. స్టిమాక్‌కు 4 లక్షల డాలర్లు (సుమారు రూ. 3.20 కోట్లు) నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించి గొడవను ముగించింది. అయితే దీనిపైనే ప్రస్తుతం ఏజీఎంలో తీవ్ర చర్చ సాగింది.


యానిక్ సినెర్

పైపైకి... ఇటలీ రాకెట్

అన్ని విభాగాల్లో దూసుకుపోతున్న ఇటలీ టెన్నిస్‌ ప్లేయర్లు

ఈ ఏడాది ఆరు టైటిల్స్‌తో జోరు మీదున్న యానిక్‌ సినెర్‌ | **మహిళల విభాగంలో జాస్మిన్‌ దూకుడు**

సుదీర్ఘకాలంగా గ్రాండ్‌స్లామ్‌ సింగిల్స్‌ టైటిల్‌ కోసం ఎదురుచూస్తున్న ఇటలీకి ఈ ఏడాది రెండు టైటిల్స్‌ దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్‌ యానిక్‌ సినెర్‌ ఆస్ట్రేలియా ఓపెన్‌, యూఎస్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టోర్నీలలో విజేతగా నిలిచాడు. వందేళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో ఇటలీ ఆటగాడు లొరెంజో ముసెట్టి కాంస్య పతకం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో జాస్మిన్‌ పావోలిని జోరు సాగిస్తుంటే... డబుల్స్‌లోనూ లెక్కకు మిక్కిలి జోడీలు టైటిల్స్‌తో సత్తా చాటుతున్నాయి. టెన్నిస్‌ కోర్టులో అడుగు పెడితే విజేతగా నిలవడమే లక్ష్యంగా ఇటలీ ప్లేయర్లు ముందుకు సాగుతున్నారు. –సాక్షి క్రీడా విభాగం

ఈ ఏడాది అంతర్జాతీయ టెన్నిస్‌ టోర్నీల్లో ఇటలీ ఆటగాళ్ల జోరు సాగుతోంది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్‌ ర్యాంకర్‌ యానిక్‌ సినెర్‌ రెండు గ్రాండ్‌స్లామ్‌ టైటిల్స్‌ను సొంతం చేసుకోవడంతో పాటు మరో నాలుగు ఏటీపీ టోర్నీల్లో విజేతగా నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో జాస్మిన్‌ పావోలిని వింబుల్డన్‌ ఓపెన్‌, ఫ్రెంచ్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది. ఫ్రెంచ్‌ ఓపెన్‌ పురుషుల డబుల్స్‌లో సిమోన్‌ బొలెలీ–ఆండ్రియా వవసోరి... మహిళల డబుల్స్‌లో సారా ఎరాని–జాస్మిన్‌ పావోలిని రన్నరప్‌గా నిలిచారు. ఆస్ట్రేలియా ఓపెన్‌ పురుషుల డబుల్స్‌లో సిమోన్‌ బొలెలీ–ఆండె వవసోరి రన్నరప్‌గా నిలిచారు. ఇక సీజన్‌ చివరి గ్రాండ్‌స్లామ్‌ టోర్నీ యూఎస్‌ ఓపెన్‌లో మిక్స్‌డ్‌ డబుల్స్‌లో సారా ఎరాని–వవసోరికి జోడీ చాంపియన్‌గా అవతరించింది. ప్రతిష్టాత్మక పారిస్‌ ఒలింపిక్స్‌ మహిళల డబుల్స్‌లో సారా ఎరాని–జాస్మిన్‌ పావోలిని జంట స్వర్ణ పతకం గెలుచుకోగా... పురుషుల సింగిల్స్‌లో లొరెంజో ముసెట్టి కాంస్య పతకంతో మెరిశాడు. విశ్వక్రీడల పురుషుల సింగిల్స్‌లో వందేళ్ల తర్వాత ఇటలీకి ఇదే తొలి పతకం కావడం విశేషం.


లొరెంజో ముసెట్టి

భవిష్యత్తు అతడిదేనా!

సీజన్‌ ఆరంభ గ్రాండ్‌స్లామ్‌ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్‌ టైటిల్‌ గెలవడంతో దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత గ్రాండ్‌స్లామ్‌ గెలిచిన ఇటలీ ప్లేయర్‌గా సినెర్‌ రికార్డుల్లోకి ఎక్కాడు. చివరిసారిగా 1976 ఫ్రెంచ్‌ ఓపెన్‌లో ఇటలీ నుంచి ఆండ్రియానో పనట్టా టైటిల్‌ గెలిచాడు. ఇక సీజన్‌ చివరి గ్రాండ్‌స్లామ్‌ టోర్నీ యూఎస్‌ ఓపెన్‌లో చాంపియన్‌గా నిలవడం ద్వారా ఈ ఘనత సాధించిన తొలి ఇటలీ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. గత కొంతకాలంగా నిలకడ సాగిస్తున్న 23 ఏళ్ల సినెర్‌ భవిష్యత్తు తనదే అని చెప్పకనే చెబుతున్నాడు. ఈ ఏడాది అతడు ఆడిన 60 మ్యాచ్‌ల్లో 55 విజయాలు సాధించాడంటే సినెర్‌ జోరు ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఆస్ట్రేలియన్‌ ఓపెన్‌, యూఎస్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్స్‌తో పాటు... రోటర్‌డామ్‌ ఓపెన్‌, మయామి మాస్టర్స్‌, హాలె ఓపెన్‌, సిన్సినాటి మాస్టర్స్‌లోనూ చాంపియన్‌గా నిలిచిన సినెర్‌ ఈ ఏడాది ఓవరాల్‌గా ఆరు టైటిల్స్‌ ఖాతాలో వేసుకున్నాడు. స్విట్జర్లాండ్‌ దిగ్గజం రోజర్‌ ఫెడరర్‌ ఆటకు వీడ్కోలు పలకగా... స్పెయిన్‌ బుల్‌ రాఫెల్‌ నాదల్‌ గాయాలతో సతమతమవుతున్నాడు. సెర్బియా వీరుడు నొవాక్‌ జొకోవిచ్‌ కూడా కెరీర్‌ చరమాంకానికి చేరుకోవడంతో సినెర్‌ ఇదే నిలకడ కొనసాగిస్తే... భవిష్యత్తులో గొప్ప ఆటగాడిగా పేరు తెచ్చుకునే అవకాశం ఉంది. ఇక మహిళల విభాగంలో జాస్మిన్‌ అనూహ్య ఆట తీరుతో దూసుకొస్తోంది.


సారా ఎరాని, జాస్మిన్

మంచి రోజులు ముందున్నాయి...

దిగ్గజ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా వెనుదిరిగుతున్న తరుణంలో భవిష్యత్తు తమ ప్లేయర్లదే అని ఇటలీ టెన్నిస్‌ సమాఖ్య అధ్యక్షుడు ఏంజెలో బినాఘి అంటున్నారు. 'కొత్త తరంలోకి అడుగు పెడుతున్నాం. అందుకు ఇటలీ సిద్ధంగా ఉంది. దిగ్గజ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా వెనుదిరుగుతున్నారు. ఇలాంటి సమయంలో అవకాశాలను వినియోగించుకుంటూ సత్తాచాటుతున్నాం. మహిళల విభాగంలోనూ మా పురోభివృద్ధి బాగుంది' అని బినాఘి అన్నారు. ప్రస్తుతం పురుషుల సింగిల్స్‌ ప్రపంచ ర్యాంకింగ్స్‌ టాప్‌–50లో ఏడుగురు ఇటలీ ప్లేయర్లు ఉన్నారు. కేవలం సింగిల్స్‌లోనే కాకుండా... డబుల్స్‌లోనూ ఇటలీ ప్లేయర్లు నిలకడ సాగిస్తున్నారు. ఈ ఏడాది గ్రాండ్‌స్లామ్‌ ఫలితాలే ఇందుకు నిదర్శనం. 'దాదాపు యాభై ఏళ్లుగా గ్రాండ్‌స్లామ్‌ టైటిల్‌ కోసం ఎదురుచూస్తుంటే... ఈ సంవత్సరం సినెర్‌ రెండు టైటిల్స్‌తో అదరగొట్టాడు. ఇతర టోర్నీల్లోనూ ఇటలీ ప్లేయర్ల ప్రదర్శన బాగుంది. డేవిస్‌కప్‌లో డిఫెండింగ్‌ చాంపియన్‌ టైటిల్‌ నిలబెట్టుకోవడంపై దృష్టి పెట్టాం. ఇదే జోరు సాగిస్తూ సొంతగడ్డపై పెద్ద టోర్నీలో విజయం సాధించడమే తదుపరి లక్ష్యంగా పెట్టుకున్నాం. విజయవంతంగా సాగుతున్న ఈ ప్రయాణాన్ని ఆస్వాదించేందుకు సిద్ధంగా ఉండండి' అని బినాఘి పేర్కొన్నారు.

ఏటీపీ ఫైనల్స్‌పై దృష్టి

విదేశాల్లో వరస విజయాలు సాధిస్తున్న ఇటలీ ప్లేయర్లు... స్వదేశంలో మాత్రం ఆకట్టుకోలేకపోతున్నారు. ఈ ఏడాది ఫుల్‌ జోష్‌ లో ఉన్న సినెర్‌ గాయం కారణంగా ఇటాలియన్‌ ఓపెన్‌ బరిలోకి దిగలేదు. 1976 ఇటాలియన్‌ ఓపెన్‌లో చివరిసారిగా స్థానిక ఆటగాడు పనట్టా పురుషుల సింగిల్స్‌ విజేతగా నిలవగా.. 1985లో మహిళల సింగిల్స్‌లో రఫ్పెల్లా రెగ్గీ టైటిల్‌ సాధించింది. అప్పటి నుంచి స్థానిక ఆటగాళ్లెవరూ ఇటాలియన్‌ ఓపెన్‌ గెలుచుకోలేదు. ఇకపై స్వదేశంలోనూ సత్తా చాటడంపై దృష్టి పెట్టనున్నట్లు బినాఘి తెలిపారు. ఈ ఏడాది నవంబర్‌లో వరసగా నాలుగోసారి ఇటలీలో ఏటీపీ ఫైనల్స్‌ టోర్నీ జరగనుంది. గత ఏడాది జొకోవిచ్‌ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన సినెర్‌ ఈసారి టైటిల్‌ సాధించాలని కసితో ఉన్నాడు. యూఎస్‌ ఓపెన్‌ ప్రారంభానికి ముందు డోపింగ్‌ వివాదంతో వార్తల్లోకి ఎక్కిన సినెర్‌ తన ఆటతీరుపై ఆ ప్రభావం పడలేదని నిరూపించుకున్నాడు. ఇటీవల యూఎస్‌ ఓపెన్‌ పురుషుల సింగిల్స్‌ ఫైనల్‌ను ఇటలీలో ప్రతి పది మందిలో ఒకరు వీక్షించారని బినాఘి తెలిపారు. మౌలిక వసతుల కల్పన వల్లే నైపుణ్యం గల ఆటగాళ్లను వెలికి తీయగలిగామని ఆయన పేర్కొన్నారు. సీనియర్‌ స్థాయిలోనే కాకుండా... జూనియర్‌ ఈవెంట్స్‌లోనూ ఇటలీ ప్లేయర్లు హవా సాగిస్తున్నారు. ఈ ఏడాది జూనియర్‌ సర్క్యూట్‌లో ఇటలీ ప్లేయర్లు 10 టైటిల్స్‌ సాధించారు.

భారత 'ఎ' జట్టులో షేక్‌ రషీద్‌

- దులీప్‌ ట్రోఫీ జట్లలో మార్పులు
- రేపటి నుంచి రెండు మ్యాచ్‌లు

ముంబై: దులీప్‌ ట్రోఫీలో రెండో దశ మ్యాచ్‌ల కోసం భారత్‌ 'ఎ', 'బి', 'సి', 'డి' జట్లలో పలు మార్పులు జరిగాయి. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు కోసం ఎంపికైన ఆటగాళ్లు టోర్నీ నుంచి తప్పుకోవడంతో బీసీసీఐ సెలక్టర్లు కొత్త ప్లేయర్ల పేర్లను ప్రకటించారు. టీమిండియాకు ఎంపికైన వారిలో ఒక్క సర్ఫరాజ్‌ ఖాన్‌ మాత్రమే దులీప్‌ ట్రోఫీ మ్యాచ్‌ కోసం అందుబాటులో ఉండగా... శుబ్‌మన్‌ గిల్‌, కేఎల్‌ రాహుల్‌, ధ్రువ్‌ జురేల్‌, కుల్దీప్‌ యాదవ్‌, ఆకాశ్‌దీప్‌, యశస్వి జైస్వాల్‌, రిషభ్‌ పంత్‌, యశ్‌ దయాళ్‌, అక్షర్‌ పటేల్‌ మాత్రం తమ జట్లను వీడారు. కొత్తగా ప్రకటించిన 'ఎ' జట్టులో ఆంధ్ర ఆటగాడు షేక్‌ రషీద్‌కు అవకాశం దక్కింది. గుంటూరు జిల్లాకు చెందిన 19 ఏళ్ల రషీద్‌ ఈ ఐపీఎల్‌ సీజన్‌లో చెన్నై సూపర్‌ కింగ్స్‌ జట్టుతో ఉన్నాడు. 2022లో అండర్‌–19 ప్రపంచకప్‌ టైటిల్‌ నెగ్గిన భారత జట్టులోనూ రషీద్‌ కీలక సభ్యుడిగా వ్యవహరించాడు. రషీద్‌తో పాటు ప్రథమ్‌ సింగ్‌, అక్షయ్‌ వాడ్కర్‌, షమ్స్‌ ములానీ, ఆకిబ్‌ ఖాన్‌ 'ఎ' టీమ్‌లోకి ఎంపికయ్యారు. 'ఎ' కెప్టెన్‌గా మయాంక్‌ అగర్వాల్‌ బాధ్యతలు నిర్వర్తిస్తాడు. 'బి' టీమ్‌లో రింకూ సింగ్‌, సుయశ్‌ ప్రభుదేశాయ్‌, హిమాన్షు మంత్రి ఎంపికవ్వగా...సర్ఫరాజ్‌ ఖాన్‌ టీమ్‌తో కొనసాగుతాడు. ఇండియా 'సి' టీమ్‌లో ఎలాంటి మార్పులు జరగలేదు కానీ 'డి' జట్టులో నిశాంత్‌ సంధు ఎంపికయ్యాడు. గత మ్యాచ్‌లో 'డి' టీమ్‌లో ఉండి గాయపడిన తుషార్‌ దేశ్‌పాండే స్థానంలో విద్వత్‌ కావేరప్పను తీసుకున్నారు. కావేరప్ప గత మ్యాచ్‌ 'ఎ' టీమ్‌లో సభ్యుడిగా ఉన్నాడు. దులీప్‌ ట్రోఫీ రెండో రౌండ్‌లో భాగంగా 'ఎ', 'డి' మధ్య...'బి', 'సి' మధ్య రెండు మ్యాచ్‌లు అనంతపురంలోనే జరుగుతాయి. ఈ 19 నుంచి భారత్‌, బంగ్లాదేశ్‌ తొలి టెస్టు చెన్నైలో జరగనుండగా...భారత జట్టు సభ్యులకు ఈ నెల 12 నుంచి బెంగళూరులో సన్నాహక శిబిరం మొదలవుతుంది.


షేక్‌ రషీద్‌

స్లొవేకియాపై జర్మనీ గెలుపు

వాలెన్సియా: డేవిస్‌ కప్‌ ఫైనల్స్‌ గ్రూప్‌ దశ మ్యాచ్‌ల్లో జర్మనీ, కెనడా శుభారంభం చేశాయి. ప్రపంచ నంబర్‌–2 ర్యాంకర్‌ అలెగ్జాండర్‌ జ్వెరెవ్‌ అందుబాటులో లేకపోయినా... జర్మనీ 3–0తో స్లొవేకియాను చిత్తు చేసింది. తొలి సింగిల్స్‌లో మ్యాక్సిమిలియన్‌ మార్టెరర్‌ 6–4, 7–5తో లుకాస్‌ క్లెయిన్‌ (స్లొవేకియా)పై గెలుపొందగా, రెండో పోరులో యానిక్‌ హన్ఫ్‌మన్‌ 3–6, 6–3, 7–6 (7/3)తో జోజెఫ్‌ కొవాలిక్‌ను ఓడించాడు. తర్వాత డబుల్స్‌లో యూఎస్‌ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన టిమ్‌ ప్యుట్జ్‌–కెవిన్‌ క్రావిట్జ్‌ జోడీ 7–5, 6–3తో క్లెయిన్‌–ఇగోర్‌ జెలెనె జంటపై గెలిచింది. గ్రూప్‌ దశ మ్యాచ్‌ల అనంతరం ఫైనల్‌ ఎనిమిది జట్ల మధ్య నాకౌట్‌ దశ నవంబర్లో జరుగుతుంది. గత రెండు సీజన్లుగా డేవిస్‌ కప్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకుంటున్న ఆస్ట్రేలియా గ్రూప్‌ 'బి'లో ఫ్రాన్స్‌తో తలపడుతుంది.

ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి–ట్రెసా జోడీ

హాంకాంగ్‌: భారత డబుల్స్‌ జోడీ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ హాంకాంగ్‌ ఓపెన్‌ వరల్డ్‌ టూర్‌ సూపర్‌–500 బ్యాడ్మింటన్‌ టోర్నీలో ప్రిక్వార్టర్‌ ఫైనల్లోకి ప్రవేశించింది. అయితే పురుషుల సింగిల్స్‌లో చిరాగ్‌ సేన్‌ క్వాలిఫయర్స్‌లోనే వెనుదిరిగాడు. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్‌ తొలి రౌండ్‌లో గాయత్రి–ట్రెసా జాలీ జంట 21–14, 21–13తో ఉక్రెయిన్‌కు చెందిన పొలినా బురొవా–యెహెనియా కాంటేమైర్‌ జోడీపై గెలిచింది. మరో భారత జంటకు తొలి రౌండ్లోనే నిరాశ ఎదురైంది. రుతపర్ణ–శ్వేతపర్ణ పాండా ద్వయం 11–21, 8–21తో సియె పే షాన్‌–హంగ్‌ ఎన్‌ జు (చైనీస్‌ తైపీ) జంట చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌ తొలి క్వాలిఫయర్స్‌లో చిరాగ్‌ సేన్‌ 21–12, 21–10తో కెనడాకు చెందిన లై యిన్‌ చంగ్‌ను ఓడించాడు. కానీ రెండో రౌండ్లో అతను 12–21, 21–13, 14–21తో కెనడాకే చెందిన షెంగ్‌ జియాడాంగ్‌ చేతిలో ఓడిపోయాడు. మానవ్‌ చౌధరీ కూడా తొలి మ్యాచ్‌లో శుభారంభం చేసి రెండో మ్యాచ్‌తో ఇంటిదారి పట్టాడు. మొదట 21–14, 21–19తో ఒలెక్సీ టికోవ్‌ (ఉక్రెయిన్‌)పై నెగ్గిన మానవ్‌.. రెండో మ్యాచ్‌లో 6–21, 10–21తో చన్‌ యిన్‌ చక్‌ (హాంకాంగ్‌) చేతిలో కంగుతిన్నాడు.

హో చి మిన్‌ సిటీలో జరుగుతున్న వియత్నాం సూపర్‌–100 టోర్నమెంట్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌ తొలి పోరులో ఆలాప్‌ మిశ్రా 21–15, 16–21, 21–12తో లియావో జువో (చైనీస్‌ తైపీ)పై, భరత్‌ రాఘవ్‌ 21–15, 21–17తో థాయ్‌లాండ్‌కు చెందిన కొరక్రిట్‌ లావొట్రకుల్‌పై గెలుపొందారు. భారత షట్లర్ల మధ్యే జరిగిన మరో మ్యాచ్‌లో రిత్విక్‌ సంజీవి సతీశ్‌ 26–24, 19–21, 10–21తో అభిషేక్‌ సైని చేతిలో ఓడాడు. కాటం తరుణ్‌ కుమార్‌ 15–21, 10–21తో ఒంగ్‌ జెన్‌ యి (మలేసియా) చేతిలో పరాజయం చవిచూశాడు.



హ్యాట్రిక్‌ విజయంపై భారత్‌ గురి

హులున్‌బుయిర్‌ (చైనా): ఆసియా చాంపియన్స్‌ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్‌ చాంపియన్‌ భారత జట్టు హ్యాట్రిక్‌ విజయంపై కన్నేసింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో వరుసగా చైనా, జపాన్‌ జట్లను చిత్తు చేసిన భారత్‌... బుధవారం మలేసియాతో తలపడనుంది. పారిస్‌ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన అనంతరం ఫీల్డ్‌ గోల్స్‌ ప్రాధాన్యత గుర్తించిన భారత ఆటగాళ్లు... తాజా టోర్నీలో పెనాల్టీ కార్నర్ల కంటే ఎక్కువ ఫీల్డ్‌ గోల్స్‌తో ఆకట్టుకుంటున్నారు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో భారత్‌ ఎనిమిది గోల్స్‌ కొట్టగా... అందులో ఏడు ఫీల్డ్‌ గోల్స్‌ ఉండటం విశేషం. ఇదే జోరు సాగిస్తూ మూడో మ్యాచ్‌లోనూ గెలిచి సెమీఫైనల్‌కు మరింత చేరువ కావాలని భారత్‌ ఆశిస్తోంది. కెప్టెన్‌ హర్మన్‌ప్రీత్‌ సింగ్‌తో పాటు యువ ఆటగాళ్లు సుఖ్‌జీత్‌ సింగ్‌, అభిషేక్‌, ఉత్తమ్‌ సింగ్‌ చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నారు. ఇప్పటి వరకు ఈ టోర్నీలో నాలుగుసార్లు విజేతగా నిలిచిన భారత్‌... పాంచ్‌ పటాకా మోగించాలని చూస్తోంది. మరోవైపు గత ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిచిన మలేసియా... ఈసారి లీగ్‌ దశలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒకదాంట్లో ఓడి మరో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. రౌండ్‌ రాబిన్‌ లీగ్‌ పద్ధతిలో జరగనున్న ఈ టోర్నీలో మొత్తం ఆరు జట్లు పాల్గొంటుండగా... తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించనున్నాయి.


హర్మన్‌ప్రీత్‌


రోహిత్‌ రాయుడు

పటిష్ట స్థితిలో హైదరాబాద్‌

చెన్నై: ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌ జట్టు తమ జోరు కొనసాగిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌ జట్టుతో జరుగుతున్న ఫైనల్లో హైదరాబాద్‌ ప్రత్యర్థి జట్టుకు 518 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. మ్యాచ్‌ మూడో రోజు హైదరాబాద్‌ తమ రెండో ఇన్నింగ్స్‌లో 70.2 ఓవర్లలో 281 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్‌ రాహుల్‌ సింగ్‌ (68; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్‌ రాధేశ్‌ (41; 4 ఫోర్లు, 1 సిక్స్‌) రాణించారు. ఛత్తీస్‌గఢ్‌ బౌలర్‌ జీవేశ్‌ ఆరు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఛత్తీస్‌గఢ్‌ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 70.2 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటవ్వడంతో హైదరాబాద్‌కు 236 పరుగుల తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం లభించింది. హైదరాబాద్‌ బౌలర్లలో అనికేత్‌ రెడ్డి నాలుగు వికెట్లు తీయగా... రోహిత్‌ రాయుడు, తనయ్‌ త్యాగరాజన్‌లకు మూడు వికెట్ల చొప్పున లభించాయి. హైదరాబాద్‌ తొలి ఇన్నింగ్స్‌లో 118.4 ఓవర్లలో 417 పరుగులు చేసింది. రోహిత్‌ రాయుడు (155; 8 ఫోర్లు, 8 సిక్స్‌లు) భారీ సెంచరీ సాధించాడు. అభిరత్‌ (85; 10 ఫోర్లు, 1 సిక్స్‌), రాహుల్‌ రాధేశ్‌ (48; 7 ఫోర్లు) ఆకట్టుకున్నారు.

హరియాణాలో బీజేపీ రెండో జాబితా

సాక్షి, న్యూఢిల్లీ: హరియాణా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు గాను మంగళవారం బీజేపీ అధిష్టానం 21 మంది పేర్లతో రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో ఇద్దరు రాష్ట్ర కేబినెట్ మంత్రులకు చోటుదక్కలేదు. విద్యా శాఖ మంత్రి సీమా త్రిఖా, ఆరోగ్య మంత్రి బన్వారీ లాల్‌లకు నిరాశ ఎదురయ్యింది. కొన్నాళ్లుగా రోహ్‌తక్ స్థానంలో అభ్యర్థిత్వంపై కొనసాగుతున్న ఉత్కంఠకు బీజేపీ తెరదించింది. పంజాబీల ప్రాబల్యం ఉన్న ఇక్కడి నుంచి సీనియర్ నేత, మాజీ మంత్రి మనీష్ గ్రోవర్‌ను రంగంలోకి దింపుతోంది. ఈయన రోహ్‌తక్ నుంచి ఆరోసారి పోటీ చేయనున్నారు. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే భరత్ భూషణ్ బత్రాను వరుసగా నాలుగోసారి మనీష్ గ్రోవర్ ఢీకొట్టనున్నారు. ఒలింపిక్ రెజ్లర్ వినేష్ ఫొగాట్ కాంగ్రెస్ అభ్యర్థిగా జులానా నుంచి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈమెకు ప్రత్యర్థిగా కెప్టెన్ యోగేష్ బైరాగిని బీజేపీ బరిలోకి దింపుతోంది. పిహోవా నియోజకవర్గం అభ్యర్థిని మార్చింది. తొలి జాబితాలో ఈ స్థానం నుంచి కవల్‌జీత్ సింగ్ అజరానా చోటు దక్కింది. పార్టీ శ్రేణుల నుంచి తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో కవల్‌జీత్ పోటీ నుంచి తప్పుకున్నారు. దీంతో రెండో జాబితాలో ఆయన స్థానంలో జై భగవాన్ శర్మ పేరును బీజేపీ ప్రకటించింది.

9 మందితో ఆప్ రెండో జాబితా

హరియాణా అసెంబ్లీ ఎన్నికల కోసం ఆమ్ ఆద్మీ పార్టీ మంగళవారం 9 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదల చేసింది. సోమవారమే బీజేపీకి రాజీనామా చేసి, పార్టీలో చేరిన ఛత్తర్ పాల్ సింగ్‌కు బర్వాలా టిక్కెట్టిచ్చింది. కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు కుదరకపోవడంతో సోమవారం ఆప్ 20 మంది అభ్యర్థులతో మొదటి జాబితాను ప్రకటించింది.



మంచుకొండలపై మబ్బుతునకలు

కొండకొమ్మల మీదికి దిగొచ్చి దట్టంగా పరుచుకున్న మేఘాలు మంగళవారం సిమ్లాలో ఇలా కనువిందు చేశాయి

పదేళ్ల విరామం తర్వాత జరుగుతున్న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులే కింగ్ మేకర్స్‌గా మారేలా కన్పిస్తున్నారు. సాధారణంగా ఎన్సీ, పీడీపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉండే ఇక్కడి ఎన్నికల్లో ఈసారి ఇండిపెండెంట్ల జోరు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి నుంచి స్వతంత్ర అభ్యర్థి ఇంజనీర్ రషీద్ విజయం సాధించడం తెలిసిందే. దానికి తోడు స్వతంత్రులకు జమాతే ఇస్లామీతో పాటు బీజేపీ కూడా మద్దతిస్తోంది... – సాక్షి, నేషనల్ డెస్క్

స్వతంత్రులే కింగ్ మేకర్స్!

కశ్మీర్ ఎన్నికల్లో వారిదే హవా

తొలి రెండు దశల్లో 44 శాతం!

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో సెప్టెంబర్ 18న తొలి విడత పోలింగ్ జరగనుంది. సెప్టెంబర్ 25, అక్టోబర్ 1వ తేదీల్లో మరో రెండు దశలతో పోలింగ్ ముగుస్తుంది. ఎన్నడూ లేనివిధంగా ఈసారి స్వతంత్రులు భారీగా బరిలో ఉన్నారు. తొలి, రెండో విడతలో 50 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. రెండు విడతల్లో 450 మంది బరిలో ఉండగా వారిలో ఏకంగా 44 శాతం, అంటే 214 మంది స్వతంత్ర అభ్యర్థులే! తొలి విడతలో 92 మంది, రెండో విడతలో 122 మంది ఇండిపెండెంట్లున్నారు. జమ్మూ కశ్మీర్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో 37 శాతం మంది స్వతంత్రులు పోటీ చేశారు.

'ఇంజనీర్ రషీద్' అభ్యర్థులు..

ప్రత్యక్షంగా పోటీ చేయని పార్టీల నుంచే స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. వీరిలో జైల్లో ఉన్న ఎంపీ ఇంజనీర్ అబ్దుల్ రషీద్ షేక్ నేతృత్వంలోని అవామీ ఇత్తెహాద్ పార్టీ (ఏఐపీ)కి చెందిన 26 మంది ఉన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో రషీద్‌ను సర్‌ప్రైజ్ ప్యాకేజీగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఉగ్రవాదానికి నిధులు అందజేసిన కేసులో 2019 ఆగస్టు నుంచి తిహార్ జైల్లో ఉన్న రషీద్ బారాముల్లా లోక్‌సభ స్థానం నుంచి ఘన విజయం సాధించారు. ఆ క్రమంలో మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా, పీపుల్స్ కాన్ఫరెన్స్ చైర్మన్, మాజీ మంత్రి సజ్జాద్ లోన్ రూపంలో ఏకంగా ఇద్దరు రాజకీయ దిగ్గజాలను ఓడించి సంచలనం సృష్టించారు. రషీద్ పార్టీ తరఫున అసెంబ్లీ ఎన్నికల ప్రచా రానికి కుమారుడు ఆయన అబ్రార్ రషీద్ నేతృత్వం వహిస్తున్నారు. ఇతర పార్టీల అసంతృప్త నాయకులు కూడా ఏఐపీలో చేరారు. కశ్మీర్ ప్రాంతంలోని 47 అసెంబ్లీ స్థానాలకు గాను కనీసం 40 నుంచి 42 చోట్ల అభ్యర్థులను నిలపాలని ఏఐపీ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే 43 అసెంబ్లీ స్థానాలున్న హిందూ ప్రాబల్య జమ్మూ ప్రాంతంలో ఎనిమిది స్థానాల్లో పోటీ చేయనుంది.

జమాతే ఫ్యాక్టర్...

అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు స్వతంత్ర అభ్యర్థులకు మద్దతిస్తామని నిషేధిత జమాతే ఇస్లామీ ఇటీవల ప్రకటించింది. కుల్గాం, పుల్వామా, దేవ్‌సర్, జైనపోరా వంటి దక్షిణ కశ్మీర్ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతు ప్రకటించింది. దేశ వ్యతిరేక కార్యకలాపాలు, ఉగ్రవాద సంబంధాల ఆరోపణలతో నిషేధముండటంతో జమాత్‌కు ఎన్నికల బరిలో దిగే అవకాశం లేకుండా పోయింది. కేడర్ ఆధారిత సంస్థ అయిన జమాతే దక్షిణ కశ్మీర్‌లో గట్టి ప్రభావమే చూపుతుందని, డజను స్థానాల్లో ఫలితాలను ప్రభావితం చేస్తుందని అంచనా.

స్వతంత్రుల వెనక బీజేపీ!

జమ్మూ కశ్మీర్‌లో చాలామంది స్వతంత్ర అభ్యర్థులకు బీజేపీ మద్దతుందని బలమైన ప్రచారముంది. ఒమర్ అబ్దుల్లా ఇటీవల నేరుగానే ఈ ఆరోపణ చేశారు. పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) చీఫ్, మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ కూడా ఈ విషయమై ఆందోళనలు లేవనెత్తారు. ప్రాంతీయ శక్తులను బలహీనపరచడానికే బీజేపీ ఇలా చిన్న పార్టీలు, స్వతంత్రులతో సమన్వయం చేసుకుంటోందని ఆరోపించారు. ''లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారులు విఫలమయ్యారు. దాంతో ఇప్పుడు రషీద్‌కు చెందిన ఏఐపీతో పాటు ఇతర ఇండిపెండెంట్లను కేంద్రమే ముందుండి నడిపిస్తోంది''అంటూ మండిపడ్డారు.

ఇంజనీర్ రషీద్‌కు బెయిల్

న్యూఢిల్లీ: ఉగ్ర నిధుల కేసులో లోక్‌సభ ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్‌కు ఢిల్లీ కోర్టు అక్టోబర్ 2వ తేదీ వరకు మధ్యంతర బెయిలిచ్చింది. త్వరలో జరిగే జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసుకునేందుకు గాను బెయిలివ్వాలంటూ ఎంపీ వేసిన పిటిషన్‌పై మంగళవారం అదనపు సెషన్స్ జడ్జి చందర్ జిత్ సింగ్ విచారణ జరిపారు. 'అక్టోబర్ 2వ తేదీ వరకు ఎంపీ రషీద్‌కు మధ్యంతర బెయిలిస్తున్నాను. అక్టోబర్ 3వ తేదీన ఆయన జైలు అధికారుల ఎదుట తిరిగి లొంగిపోవాల్సి ఉంటుంది'అని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇందుకు గాను రూ.2 లక్షల వ్యక్తిగత పూచీతోపాటు అదే మొత్తంలో ష్యూరిటీ ఆయన ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఉగ్ర నిధుల కేసులో సాక్ష్యాలను, విచారణను ఆయన ప్రభావితం చేయరాదనే షరతు కూడా విధించారు.

యాగి తుపాను ధాటికి.. 127 మంది మృతి

హనోయి: వియత్నాం ఉత్తరప్రాంతంలో సంభవించిన భీకర తుపాను 'యాగి'సంబంధిత ఘటనల్లో మృతుల సంఖ్య 127కు, గల్లంతైన వారి సంఖ్య 64కు చేరుకుంది. ఇళ్లు, చెట్లు కూలిన ఘటనల్లో 752 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలు మంగళవారం కూడా కొనసాగాయి. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు కరెంటు స్తంభాలు, ఇళ్లు, చెట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో 15 లక్షల మంది ప్రజలు చీకట్లలోనే గడుపుతున్నారు. నివాస ప్రాంతాల్లో భారీగా వరద చేరుకోవడంతో జనం ఇళ్లకప్పులపైకి చేరి సాయం కోసం ఆర్థిస్తున్నారు.

కెనడా విద్యార్థి వీసాల్లో భారీ కోత

ఒట్టావా: కెనడాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకుంటున్న భారతీయ విద్యార్థులకు కష్టాలు పెరిగాయి. కెనడా కఠిన ఇమిగ్రేషన్ నిబంధనలతోపాటు అధిక సొమ్ము డిపాజిట్లు తదితర నియమాల కారణంగా అనుమతి పొందుతున్న దరఖాస్తుల సంఖ్య సగానికి తగ్గిపోయిందని అప్లైబోర్డ్ అనే సంస్థ తాజాగా అధ్యయనంలో వెల్లడైంది. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో వీసాల అనుమతులు సగానికి తగ్గిపోయాయి. 2023లో 4,36,000 స్టడీ వీసాలు ఇస్తే ఈ సంవత్సరం ఆ సంఖ్య 2,31,000కు పడిపోవచ్చు అప్లైబోర్డ్ అనే సంస్థ అంచనావేసింది. ఒక్క భారత్ నుంచే కాదు ప్రపంచవ్యాప్తంగా కెనడాకు వస్తున్న వీసా దరఖాస్తుల్లో 39 శాతం క్షీణత కనిపించిందని వెల్లడించింది. కెనడాలో విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులు చూపాల్సిన కనీస నగదు నిల్వ/డిపాజిట్ మొత్తాలను 10,000 డాలర్ల నుంచి ఏకంగా 20,635 డాలర్లకు పెంచుతూ కెనడా ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ గత డిసెంబర్‌లో కొత్త నిబంధన తెచ్చారు.

వింగ్ కమాండర్‌పై రేప్ కేసు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని వైమానిక కేంద్రంలో పనిచేసే వింగ్ కమాండర్‌పై అత్యాచారం కేసు నమోదైంది. వింగ్ కమాండర్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ మహిళా ఫ్లయింగ్ ఆఫీసర్ ఒకరు బుద్గాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2023 డిసెంబర్ 31న రాత్రి ఆఫీసర్స్ మెస్‌లో నూతన సంవత్సర వేడుకలు జరిగాక, గదికి పిలిపించుకుని రేప్ చేశాడని అందులో పేర్కొన్నారు. మానసికంగా వేధిస్తున్నాడని కూడా ఆమె ఆరోపించారు. అధికార బాధ్యతల్లో ఉంటూ ఇటువంటి చర్యకు పాల్పడినందుకు ఐపీసీ 376(2) ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. సంబంధిత ఎయిర్ ఫోర్స్ కేంద్రాన్ని సంప్రదించారు. శ్రీనగర్‌లోని ఐఏఎఫ్ అధికారులు తమ దర్యాప్తునకు సహకరిస్తున్నారని పోలీసులు తెలిపారు.

కేరళ 9వ తరగతి పాఠంగా

ముంబై డబ్బావాలాలు

తిరువనంతపురం: అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన ముంబై డబ్బావాలాలకు మరో గౌరవం దక్కింది. తంచనుగా ఆహారాన్ని సమయానికి అందిస్తూ సమయపాలనకు చిరునామాగా మారిన ముంబై డబ్బావాలాల విజయగాథను కేరళలో 9వ తరగతి విద్యార్థులు ఇంగ్లిష్ పాఠ్యాంశంగా చదువుకోనున్నారు. డబ్బావాలాల గురించి హ్యూ, కొలీన్ గాంట్జర్‌లు రాసిన 'ది సాగా ఆఫ్ ది టిఫిన్ క్యారియర్స్'ను ఒక అధ్యాయంగా చేర్చారు. కేరళ రాష్ట్ర విద్యా పరిశోధనా, శిక్షణా మండలి(ఎస్సీఈఆర్టీ) 2024 కోసం పాఠ్యప్రణాళికలో కొన్ని మార్పులు చేర్పులు చేసింది. ఇందులో భాగంగా డబ్బావాలాల స్ఫూర్తిదాయక ప్రయాణంపై ఒక అధ్యాయాన్ని సిలబస్‌లో ప్రవేశపెట్టింది. 1890లో మహా హవాజీ బచే.. దాదర్ నుంచి ముంబైలోని ఒక కోటకు డెలివరీ చేసిన మొదటి లంచ్ బాక్స్ మొదలు ఇప్పటిదాకా డబ్బావాలాలు ముంబైకి అందించిన సేవలను ఈ అధ్యాయం వివరిస్తుంది. ''1890లో దాదర్ శివారులోని ఓ పార్శీ మహిళ బొంబాయి వాణిజ్య నడిబొడ్డున పని చేసే తన భర్తకు టిఫిన్ క్యారియర్ అందించడానికి సహాయం చేయమని మహాదు హవాజీ బచేని కోరింది. అది డబ్బావాలాల ఆరంభం''అని చాప్టర్ పేర్కొంది. ''ఆ వినయపూర్వక ప్రారంభం నుంచి, ఓ స్వయం-నిర్మిత భారతీయ సంస్థ ఒక గొప్ప నెట్‌వర్క్‌గా ఎదిగింది. వారి సేవ, అంకితభావం, కచ్చితత్వం అంతర్జాతీయంగా వ్యాపార పాఠశాలలకు ఓ మేనేజ్‌మెంట్ పాఠంగా మారింది. ప్రిన్స్ (ఇప్పుడు ఇంగ్లాండ్ రాజు) చార్లెస్ ప్రశంసలనూ అందుకుంది''అని పేర్కొంది.

చంద్రుడిపై 2035కల్లా చైనా బేస్

వాషింగ్టన్: చంద్రుడి ఉపరితలంపై ప్రయోగకేంద్రం నిర్మాణంపై చైనా ప్రణాళికలు సిద్ధంచేసింది. అంతర్జాతీయ చంద్రుని పరిశోధనా కేంద్రం(ఐఎల్ఆర్ఎస్)లో భాగంగా 2035 కల్లా మూన్‌బేస్‌ను ఏర్పాటుచేయాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. ఐఎల్ఆర్ఎస్ ఏర్పాటుకు తొలి దశలో రష్యా సహాయ సహకారాలు అందించనుంది. 2021 జూన్‌లోనే ఐఎల్ఆర్ఎస్ ప్రతిపాదనను చైనా తెచ్చింది. బేస్, రోబోటిక్ మూన్ బేస్ నిర్మాణాల కోసం కావాల్సిన భాగాలను చంద్రుని మీదకు తీసుకొచ్చేందుకు 2030–35 మధ్య చైనా ఐదు సార్లు భారీ బరువులను మోసుకొచ్చే రాకెట్లను ప్రయోగించనుంది. 2035కల్లా దక్షిణ ధృవం దగ్గర మూన్‌బేస్ నిర్మాణం పూర్తి చేస్తామని చైనా ఇటీవల ప్రకటించింది. మూన్‌బేస్‌ను విస్తరించి భారీ నెట్‌వర్క్‌గా మార్చడానికి 2050 దాకా ఆగక తప్పదని చైనా పేర్కొంది. అప్పటికల్లా చంద్రుని ఉత్తర, దక్షిణ ధృవాలకు సమదూరంలో ఉండే రేఖ వద్ద ఒక కేంద్రం, దక్షిణ ధృవం వద్ద మరో కేంద్రం, చంద్రుని కక్ష్యలో తిరిగే సెంట్రల్ హబ్ నెలకొల్పుతామని తెలిపింది. ఇవన్నీ సౌరశక్తి, అణు ఇంధన శక్తితో పనిచేస్తాయి. ఉపరితలంపై ప్రయోగాలకు రోవర్‌లు, దూరం ప్రయాణించే మానవరహిత వాహనాలను ఉపయోగించనుంది. అంగారకుడిపై ప్రయోగాలకు వీటిని వాడుకుంటామని చైనా డీప్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ప్రాజెక్ట్ చీఫ్ డిజైనర్ యన్‌హువా చెప్పారు.

- వయోపరిమితి విధించనున్న ఆస్ట్రేలియా
- చట్టం తెస్తామన్న ప్రధాని అల్బనీస్

16 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బంద్!

మెల్‌బోర్న్: 16 ఏళ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాల వినియోగంపై నిషేధం విధిస్తామని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. పిల్లలను ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి వేరు చేసి మైదానాల్లోకి తీసుకొస్తామని వ్యాఖ్యానించారు. పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడానికి ఫెడరల్ చట్టాన్ని ఈ సంవత్సరం ప్రవేశపెడతామని చెప్పారు. వచ్చే మేలోపు తాము గెలిస్తే 16 ఏళ్లలోపు చిన్నారులు సోషల్‌మీడియా వాడకుండా నిషేధం విధిస్తామని విపక్షపార్టీ వాగ్దానం చేయడంతో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. యువతపై వెబ్‌సైట్ల ప్రభావాన్ని 'విపత్తు'గా ప్రధాని అభివర్ణించారు. ''ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టిక్‌టాక్ వంటి సామాజిక మాధ్యమాల్లోకి లాగిన్ కావడానికి పిల్లలకు ప్రస్తుతానికైతే ఎలాంటి వయసు పరిమితి లేకపోయినప్పటికీ త్వరలోనే 16 ఏళ్లను పరిమితిగా విధించే వీలుంది. 16 ఏళ్లలోపు యూజర్లను బ్లాక్ చేస్తాం. త్వరలో వయస్సు నిర్ధారణ ట్రయల్స్ నిర్వహిస్తాం. గాడ్జెట్‌లు వదిలి పిల్లలు క్రీడా ప్రాంగణాల్లో పరుగులు తీయాలి. ఈతకొలనుల్లో ఈత కొట్టాలి. టెన్నిస్ కోర్టులకు వెళ్లాలి. వారు వర్చువల్‌గా కాకుండా నిజమైన వ్యక్తులతో నిజమైన అనుబంధాలను కలిగి ఉండాలి. సోషల్ మీడియా వల్ల వస్తున్న ఆన్‌లైన్ బెదిరింపులు, హానికరమైన విషయాల నుంచి పిల్లలను దూరం చేయొచ్చని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. సోషల్ మీడియా సంస్థలు తాము అందరికన్నా అతీతులమని భావిస్తున్నాయి. వారికి సామాజిక బాధ్యతను గుర్తుచేస్తాం''అని ప్రధాని అన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన వయోపరిమితికి తాము మద్దతిస్తామని ఆస్ట్రేలియా కన్జర్వేటివ్ ప్రతిపక్ష నేత పీటర్ డాటన్ తెలిపారు.

సరైన పరిష్కారం కాదంటున్న నిపుణులు..

సామాజిక మాధ్యమాల్లో వయో పరిమితి విధించడం సమస్యకు పరిష్కారం కాదేమోనంటున్నారు విశ్లేషకులు. ప్రభుత్వ ప్రణాళిక నిర్లక్ష్యపూరితంగా ఉందని క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డేనియల్ ఆంగస్ అన్నారు. ''ఈ చర్య ప్రజాస్వామ్య మూల సూత్రాలను బలహీనపరుస్తుంది. డిజిటల్ ప్రపంచంలో కొత్త తరం అర్థవంతమైన, ఆరోగ్యకరమైన భాగస్వామ్యాన్ని హరించడం హానికరం. వారిని సమాజంతో సంబంధాల నుంచి దూరం చేస్తుంది'' అని అన్నారు. ఇలాంటి నిషేధాలను పూర్తి పారదర్శకంగా అమలు చేయడానికి సాంకేతిక పరిజ్ఞానం ఉందో లేదో స్పష్టంగా తెలియదని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ టోబీ ముర్రే అన్నారు.

రష్యాకు బాలిస్టిక్ క్షిపణుల సరఫరానా!

ఆంక్షలు తప్పవంటూ ఇరాన్‌కు అమెరికా, యూకే, జర్మనీ హెచ్చరిక

లండన్: ఉక్రెయిన్‌పై యుద్ధంలో వాడేందుకుగాను రష్యాకు ఇరాన్ స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను సరఫరా చేస్తోందని అమెరికా ఆరోపించింది. ఇందుకు బాధ్యులపై తగు చర్యలుంటాయని హెచ్చరించింది. ఆంక్షల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ ల్యామీ మంగళవారం లండన్‌లో ప్రకటించారు. ఇటువంటి ఆయుధాలను రష్యాకు సరఫరా చేయడమంటే సంక్షోభాన్ని పెద్దది చేయడమేనని, దీనిపై తాము ఎప్పటి నుంచో హెచ్చరిస్తున్న ఇరాన్ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. 'బాలిస్టిక్ మిస్సైళ్ల షిప్‌మెంట్ రష్యాకు అందింది. మరికొద్ది రోజుల్లోనే వాటిని ఉక్రెయిన్‌పైకి, అక్కడి ప్రజలపైకి రష్యా ప్రయోగిస్తుంది. ఈ క్షిపణులను యుద్ధ క్షేత్రానికి దూరంగా ఉండే లక్ష్యాలపైనా రష్యా గురిపెడుతుంది'అని బ్లింకెన్ అన్నారు. ఇందుకు గాను ఇరాన్ వైమానిక దళంపై ఆంక్షలు విధిస్తామన్నారు. ఇరాన్‌తో ద్వైపాక్షిక వైమానిక సేవల ఒప్పందం రద్దుతోపాటు బాలిస్టిక్ క్షిపణులను ఉత్పత్తి చేసే సంస్థలు, సంబంధిత అధికారులపై ఆంక్షలు విధించనున్నట్లు అనంతరం అమెరికా, బ్రిటన్, జర్మనీ ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. బ్లింకెన్, ల్యామీ బుధవారం ఉక్రెయిన్‌ను సందర్శించనున్నట్లు సమాచారం.



ఐదో తోడేలు పట్టివేత

బహ్రెయిచ్ ప్రాంతంలో చివరి తోడేలు కోసం గాలింపు

బహ్రెయిచ్: ఉత్తరప్రదేశ్‌లోని బహ్రెయిచ్ పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న తోడేళ్లలో ఐదో దానిని అధికారులకు విజయవంతంగా బంధించారు. మహసీ తహసిల్ ప్రాంత గ్రామాల్లో తోడేళ్ల గుంపు నెలన్నర కాలంలో ఏడుగురు చిన్నారులతో సహా 8 మందిని పొట్టనబెట్టుకోవడం తెల్సిందే. తోడేళ్ల దాడిలో 36 మంది గ్రామస్తులు గాయపడ్డారు. గుంపులోని చివరిదైన ఆరో తోడేలు కోసం అటవీ అధికారులు వేట కొనసాగిస్తున్నారు. తోడేళ్లను పట్టుకునేందుకు అటవీశాఖ 'ఆపరేషన్ భేడియా'నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఘాఘ్రా నదీ తీరంలోని హర్‌బస్‌పూర్ గ్రామ సమీపంలో ఐదో తోడేలును పట్టుకున్నారు. దీనిని జంతు ప్రదర్శనశాలకు తరలించనున్నారు. కాలి గుర్తులను బట్టి ఈ ప్రాంతంలో తోడేలు తిరుగుతోందని గుర్తించి పగ్‌మార్క్ టెక్నిక్‌తో ఎట్టకేలకు బంధించారు. ఇదే ప్రాంతంలో గతంలోనూ ఒక తోడేలును బంధించడం గమనార్హం. తోడేళ్ల దాడులతో జిల్లాలోని 50 గ్రామాలు అప్రమత్తమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం దీనిని వన్యప్రాణి విపత్తుగా ప్రకటించింది. డీఎఫ్‌వో అజిత్ ప్రతాప్ సింగ్ నేతృత్వంలో 'ఆపరేషన్ భేడియా' మొదలుపెట్టారు. ''చిట్టచివరిదైన ఆరో తోడేలు ఇంకా చిక్కలేదు. ఇన్ని రోజులైనా దొరకట్లేదంటే అది బహుశా ఈ గుంపుకు లీడర్ అయి ఉంటుంది. త్వరలోనే దానిని బంధిస్తాం' అజిత్ చెప్పారు. ఆవాసాలు మారుస్తూ, వేర్వేరు గ్రామాల్లో దాడులు చేస్తున్న తోడేళ్లను తప్పనిసరైతే కాల్చివేయాల్సిందిగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గతంలో ఆదేశాలిచ్చారు. దాంతో మత్తుమందు తుపాకులతో షూటర్లను రంగంలోకి దిగారు. తోడేళ్లను గుర్తించడానికి, మట్టుపెట్టేందుకు డ్రోన్లను సైతం వినియోగిస్తున్నారు. పలు బృందాలను ఏర్పాటు చేసిన అటవీశాఖ రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తోంది.

ప్రతీకారం తీర్చుకుంటున్నాయా?

బహ్రెయిచ్‌లో తోడేలు దాడుల ఘటనలు నిపుణులను మరోలా విశ్లేషిస్తున్నారు. ''తోడేళ్లు సాధారణంగా సున్నితమైనవి. దృఢమైన స్వభావం కలవి. తమ ఆవాసాలకు లేదా తమ పిల్లలకు ఏదైనా ప్రమాదం వాటిల్లినప్పుడు మాత్రమే ప్రతీకారం తీర్చుకుంటాయి. మానవుల మీద దాడులు చేయడం అసాధారణం. వరుసబెట్టి చిన్నారులపైనే దాడి చేయడం చూస్తుంటే తోడేళ్ల ఆవాసాలకు ఏదైనా ముప్పు వాటిల్లి ఉంటుంది''అని ఉత్తరప్రదేశ్ అటవీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సంజయ్ పాఠక్ చెప్పారు. ఇక్కడి దగ్గర్లోని ఒక గ్రామంలోని చెరకుతోటలో తోడేళ్ల ఆవాసం ఉండేది. అది ఇటీవల వరదల్లో కొట్టుకుపోయింది. బహుశా ఆ ఘటనలో తోడేళ్ల కూనలు చనిపోయి ఉంటాయని గ్రామస్తులు చెబుతున్నారు''అని గ్రామాల్లో చక్కర్లు కొడుతున్న ఒక పుకారును సంజయ్ గుర్తుచేశారు.



ఈ రైతుపేరు కొణతం శ్రీనివాసరావు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం పెదపులిపాకకు చెందిన ఈ కౌలురైతు కృష్ణా కరకట్ట కింద 3 ఎకరాలు సాగు చేస్తున్నాడు. ఖరీఫ్‌లో 2 ఎకరాల్లో వరి.. 70 సెంట్లలో పసుపు సాగు చేశాడు. వరికి రూ. 20 వేలు, పసుపునకు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. సీసీఆర్సీ కార్డు లేని కారణంగా బ్యాంకుల నుంచి పంట రుణం దక్కలేదు. పెట్టుబడి సాయం అందలేదు. చేసేది లేక బంగారం కుదవపెట్టి రూ. 1.50 లక్షల రుణం తీసుకుని పంటలు వేశాడు. కృష్ణమ్మ వరదలకు పంట ఐదు రోజులకు పైగా ముంపునకు గురవడంతో పసుపు పంట పనికి రాకుండా పోయింది. వరి దుబ్బులు కుళ్లిపోయాయి. చేతికొస్తుందనుకున్న పంట వరద పాలైంది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ.. ప్రభుత్వమే ఆదుకోవాలని కుళ్లిపోయిన వరిదుబ్బులు చూపిస్తూ కన్నీరు మున్నీరవుతున్నాడు.



ఈ రైతు పేరు పరిసే శేషగిరి. పెనమలూరుకు చెందిన ఈయన 3 ఎకరాల్లో వరి వేసి రూ. 65 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. భారీ వర్షాలకు పంట ఆరు రోజుల పాటు ముంపులో ఉండిపోయింది. ముంపునీరు కాస్త దిగినప్పటికీ పంట చేతికొస్తుందన్న నమ్మకం లేదంటున్నాడు. మరో రూ. 30 వేలు, రూ. 40 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉందంటున్నాడు. వాతావరణం బాగుంటే ఎకరాకు 30 బస్తాల దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం 20 బస్తాలకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదని చెబుతున్నాడు. పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కన్పించడం లేదని శేషగిరి వాపోతున్నాడు.

రూ. 10,000 కోట్లకు పైనే నష్టం

రైతన్నల వెన్నువిరిచిన కృష్ణమ్మ, బుడమేరు వరద

- పెట్టుబడి రూపంలోనే రైతులకు రూ. 3,500 కోట్లు నష్టం
- లక్షల ఎకరాల వరి, వేల ఎకరాల ఉద్యాన పంటలు వరదార్పణం
- మళ్లీ పంటలు వేసుకునే పరిస్థితి లేదంటున్న అన్నదాతలు
- ముంపు నుంచి బయటపడ్డా.. తెగుళ్ల తప్పవంటున్న రైతులు
- చేసిన అప్పులు తీర్చే దారి లేదంటూ ఆవేదన
- ప్రభుత్వమే ఆదుకోవాలంటూ అభ్యర్థన

(పంపాన వరప్రసాదరావు, సాక్షి, అమరావతి)

భారీ వర్షానికి తోడు వరద ముంచెత్తడంతో రాష్ట్రంలో లక్షలాది మంది రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ ఖరీఫ్ సీజన్ ఆరంభంలో గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల రైతులు భారీ వర్షాలతో, రాయలసీమ జిల్లాల రైతులు తీవ్ర వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయారు. కొద్దోగొప్పో కాస్త కోలుకుంటున్న తరుణంలో కోస్తాంధ్ర రైతులను ఇటు కృష్ణమ్మ, అటు బుడమేరు కోలుకోలేని దెబ్బతీశాయి. వరదల కారణంగా ప్రాథమిక అంచనాల ప్రకారం 5 లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిలో 50 వేల ఎకరాలు పసుపు, కంద, అరటి, మిరప వంటి ఉద్యాన పంటలు ఉన్నాయి. అత్యధికంగా ఎన్టీఆర్, కృష్ణ, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 3.88 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, 46 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల మంది రైతులు నష్టపోగా, ఈ ఐదు జిల్లాల పరిధిలోనే 2 లక్షల మంది ఉన్నారు. పెట్టుబడి రూపంలో రైతులు రూ. 3,500 కోట్లకుపైగా నష్టపోయారు. ఉత్పత్తి రూపంలో రూ.10 వేల కోట్లకుపైగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

వరి రైతుల ఆశలు గల్లంతు

కోస్తా జిల్లాల్లో వరి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తారు. ముంపునకు గురైన పొలాల్లో నూటికి 70 శాతం వరి ఉంది. 3.50 లక్షల ఎకరాల్లో వరి పంట వర్షాలు, వరదల బారిన పడింది. వరికి ఎకరాకు సుమారు రూ. 38,700 వరకు పెట్టుబడి అవుతుంది. ఇప్పటికే ప్రాంతాన్ని బట్టి ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు పెట్టారు. ఇప్పటి వరకు వరి రైతులు ఏకంగా రూ.1,000 కోట్లకుపైగా పెట్టుబడులు కోల్పోయారు. దాదాపు 85 శాతం పంట ఎందుకూ పనికి రాకుండా పోయింది. కొద్దోగొప్పో ముంపు నీటి నుంచి తేరుకున్నప్పటికీ తెగుళ్ల ప్రభావంతో వచ్చే దిగుబడులు పెట్టుబడులకు కూడా సరిపోయే పరిస్థితి కన్పించడంలేదు.



కృష్ణాజిల్లా చోడవరం వద్ద పాడైపోయిన వరి పంట

ఎందుకూ పనికిరాదు..



గతేడాది పసుపు, మొక్కజొన్నలకు మంచి ధర వచ్చింది. ఈ ఏడాది కూడా మంచి ధర వస్తుందన్న ఆశతో 1.60 ఎకరాల్లో మొక్కజొన్న, 1.20 ఎకరాల్లో పసుపు సాగు చేశా. మొక్కజొన్నకు రూ. 30 వేలు, పసుపునకు రూ. 80 వేల వరకు పెట్టుబడి పెట్టాను. పంట చేతికొస్తున్న దశలో కృష్ణమ్మ ముంచేసింది. బంగారం కుదవపెట్టి రూ. 2 లక్షలు అప్పుచేశాను. పెట్టుబడులు పూర్తిగా నష్టపోయాను. ఏం చేయాలో పాలు పోవడం లేదు. అధికారులెవరూ మా వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– అన్నే నాగభూషణం, పెదపులిపాక, కృష్ణా జిల్లా.

పెట్టుబడి మొత్తం వరద పాలైంది



కష్టాన్ని నమ్ముకుని జీవించే మాకు వరద తీరని నష్టాన్ని మిగిల్చింది. ఎకరానికి రూ. 50 వేలు కౌలు చెల్లించి 1.25 ఎకరాలలో పసుపు, రెండు ఎకరాలలో కంద, 1.75 ఎకరాలలో అరటి సాగు చేశాను. రూ. 12 లక్షలకుపైగా పెట్టుబడిపెట్టాను. పెట్టుబడి మొత్తం వరదపాలైంది. ఇప్పటి వరకు దెబ్బతిన్న పంటను చూసేందుకు ఒక్కఅధికారీ రాలేదు. మా బాధలు తీర్చేదెవరు.

– రావుల గోవిందు, కౌలు రైతు, కిష్కిందపాలెం, బాపట్ల జిల్లా.

కందకు మంచి గిరాకీ ఉందని..



కార్తీక మాసంలో కందకు మంచి గిరాకీ ఉంటుందని అప్పులు చేసి మరీ 2.5 ఎకరాల్లో సాగు చేశా. మరో 1.10 ఎకరాలలో పసుపు పంట వేశాం. వరద దెబ్బకు రెండు పంటలు వరదల పాలవడంతో కన్నీరు కార్చడం తప్ప ఏమి చేయలేని పరిస్థితి. ఎకరానికి రూ.50వేలు కౌలుతో పాటు రూ.10లక్షల వరకు పెట్టుబడి పెట్టాము. ప్రభుత్వం ఆదుకోకపోతే కుటుంబం రోడ్డున పడాల్సిందే.

– కొక్కిలిగడ్డ రమేశ్, కిష్కిందపాలెం, బాపట్ల జిల్లా.

వరి దుబ్బులు కుళ్లిపోయాయి..

వరి పంట ఏపుగా పెరిగింది. దుబ్బుకట్టింది. మంచి దిగుబడి వస్తుందని ఆశించాం. ఇంతలో కృష్ణమ్మ వరద ముంపునీటిలో చిక్కుకుపోయింది. ఐదు రోజులకు పైగా పంట కన్పించలేదు. దుబ్బులు పూర్తిగా కుళ్లిపోయాయి. ఎకరాకు రూ. 23 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం ఆదుకోకపోతే పూర్తిగా నష్టపోతాం.

– కె.రాజశేఖర్, పెదపులిపాక, కృష్ణా జిల్లా.

మొక్కజొన్న, పత్తి రైతుల పరిస్థితి అంతే

వరి తర్వాత ఎక్కువగా దెబ్బతిన్న వ్యవసాయ పంటలు పత్తి, మొక్కజొన్న. 60 వేల ఎకరాల్లో పత్తి, 15 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. మొక్కజొన్నకు ఎకరాకు సుమారు రూ. 1.60 లక్షల వరకు పెట్టుబడులు పెడతారు. ఇప్పటికే రూ. 30 వేలకు పైగా పెట్టారు. ఇక పత్తికి ఎకరాకు రూ. 50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఇప్పటికే రూ. 25 వేలకుపైగా పెట్టారు. ఇలా పత్తి రైతులు రూ. 150 కోట్లు, మొక్కజొన్న రైతులు రూ. 100 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టారు. అపరాలకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు పెట్టుబడులవుతాయి. ఇప్పటికే ఎకరాకు రూ. 8 వేల నుంచి రూ. 10 వేల వరకు పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. పత్తి, మొక్కజొన్నతో పాటు దెబ్బతిన్న ఇతర పంటలకు పెట్టుబడి రూపంలోనే రూ. 500 కోట్లకు పైగా పెట్టిన పెట్టుబడి వరద పాలైంది.



కృష్ణా జిల్లా పెదపులిపాక వద్ద పాడైపోయిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు

ఉద్యాన పంటల పరిస్థితి మరీ దారుణం

ప్రాథమికంగా 50 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. వీటిలో అత్యధికంగా 15 వేల ఎకరాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లింది. మిరపకు ఎకరాకు రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుండగా ఇప్పటికే ఎకరాకు రూ. 80 వేల నుంచి రూ. లక్ష చొప్పున రూ. 125 కోట్లకు పైగా పెట్టుబడులు వరదనీటి పాలయ్యాయి. నాలుగు వేల ఎకరాల్లో కంద పంట దెబ్బతినగా ఇప్పటికే రూ. లక్షన్నర నుంచి రూ. 2 లక్షల వరకు వరకు పెట్టుబడి పెట్టారు. ముంపు నీటిలో కంద పూర్తిగా కుళ్లిపోయింది. ఫలితంగా పెట్టుబడిని పూర్తిగా కోల్పోయారు. పసుపునకు రూ.లక్ష, అరటికి రూ. 75 వేల వరకు, జామకు రూ. 50 వేల చొప్పున రైతులు పెట్టుబడులు కోల్పోయారు. తమలపాకు తోటలకు ఎకరాకు రూ. 2 లక్షలు, నిమ్మకు రూ. లక్ష వరకు పెట్టుబడులు నష్టపోయారు. ఉల్లి రైతులు రూ. 40 వేలు, పుచ్చకాయ రైతులు రూ. 75 వేలు, పూల రైతులు రూ. 75 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడులు నష్టపోయారు.



కృష్ణాజిల్లా చోడవరం వద్ద నీట మునిగి పాడైపోయిన పసుపు పంట

కూరగాయల రైతులు కుదేలు..

ప్రాథమికంగా ఐదు వేల ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. టమాటాకే ఎకరాకు రూ. 50 వేలకుపైగా పెట్టుబడి పెట్టగా, ఇతర కూరగాయలకు సైతం రూ. 20 వేల వరకు పెట్టిన పెట్టుబడులు నష్టపోయారు. ఎకరం పొలానికి ప్రాంతాన్ని బట్టి రూ. 45 వేల నుంచి రూ. 60 వేల వరకు కౌలు చెల్లించారు. మరో 2 నెలల్లో మంచి దిగుబడులు చేతికి వస్తాయని రైతులు పడ్డ ఆశలను వరదలు చిదిమేశాయి. ముంపు నుంచి బయటపడిన పంటలను కాపాడుకునేందుకు ప్రతి పంటకు ఎకరాకు రూ. 25 వేలు అదనంగా పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. అయినా పెట్టుబడులు దక్కుతాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఇలా మొత్తం వాణిజ్య పంటలకు రూ. 1,500 కోట్ల వరకు పెట్టుబడి నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం వ్యవసాయ పంటలకు రూ. 301.34 కోట్లు, ఉద్యాన పంటలకు రూ. 40.97 కోట్లు పంట నష్ట పరిహారం ఇవ్వాలని లెక్కతేల్చారు.



బాపట్ల జిల్లా కిష్కిందపాలెంలో వరద ముంపునకు గురై పాడైపోయిన కంద పంట

వైవీ సుబ్బారెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ హౌసింగ్ బోర్డు భూముల కేటాయింపు అంశంలో సీబీఐ తనని నిందితుడిగా చేర్చడంపై ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వైవీ పిటిషన్ మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు ప్రారంభిస్తుండగా వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కేసు విచారణ తర్వాత చేపడతామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాన్‌పిక్ కేసుకు సుబ్బారెడ్డి పిటిషన్ జత చేసిన విషయాన్ని రాజు ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. గత విచారణలో మరో ధర్మాసనం ఈ కేసులో సీబీఐను కౌంటరు దాఖలు చేయమని ఆదేశాలు ఇచ్చిందన్నారు. 4 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐను ఆదేశించిన ధర్మాసనం విచారణ నవంబరు 19కి వాయిదా వేసింది.

ఏపీ హైకోర్టు నిర్ణయం సబబే

'స్కిల్' కేసులో బెయిల్‌లపై సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో సీమెన్స్ మాజీ ఎండీ, మరో ఇద్దరికి ఏపీ హైకోర్టు బెయిలు ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఆదేశాల్ని సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌ల ధర్మాసనం విచారించింది. హైకోర్టు ఆదేశాల్ని సమర్థిస్తూ ఈడీ పిటిషన్‌పై విచారణకు తిరస్కరిస్తున్నట్లు పేర్కొంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో సీమెన్స్ మాజీ ఎండీ సౌమ్యాద్రి శేఖర్ బోస్, పీవీఎస్‌పీ ఐటీ స్కిల్స్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ముకుల్ చంద్ర అగర్వాల్, చార్టర్డ్ అకౌంటెంట్ సురేష్‌గోయల్‌లపై స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ నిమిత్తం నిధులను మోసపూరిత ఇన్‌వాయిస్‌ల ద్వారా వేర్వేరు షెల్ కంపెనీలకు మళ్లించారనే ఆరోపణలు నమోదయ్యాయి. మార్చి 2023లో అరెస్ట్ కాగా ఏపీ హైకోర్టు మే, 2023లో బెయిలు మంజూరు చేసింది. ఇదే కేసులో సీఎం చంద్రబాబు కూడా బెయిల్‌పై ఉన్న విషయం విదితమే. ఈ కేసులో ప్రధాన అప్పీలుపై విచారణ ఇంకా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది.

ముంపు రైతుల్ని ఆదుకోండి

సాక్షి, అమరావతి: ముంపు ప్రాంతాల్లోని రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి డిమాండ్ చేసింది. సీఎం చంద్రబాబును సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘాల నాయకులు వై.కేశవరావు, అక్కినేని భవానీప్రసాద్, డి.హరినాథ్, పి.జమలయ్య మంగళవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. కోస్తా జిల్లాల్లో ముంపుబారినపడి పంటలు నష్టపోయిన రైతులు పంట రుణాలన్నీ రద్దు చేసి వారికి అండగా నిలవాలన్నారు. నీట మునిగిన అన్ని పంటలను లెక్కించి పరిహారం చెల్లించాలన్నారు. సొసైటీ భూములు, లంక భూములు, ఆలయ భూములు సాగు చేసే వారందరికీ పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పాడి పశువులకు మేత, దాణా తక్షణమే అందించాలని, చనిపోయిన పశువులకు విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలన్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువులను బాగు చేయించండి

సాక్షి, అమరావతి: వరదల కారణంగా తడిసిపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులు, పరికరాలను బాగు చేయించాలని సీఎం చంద్రబాబు ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులను కోరారు. మంగళవారం విజయవాడ కలెక్టరేట్‌లో ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కంపెనీలు సామాజిక బాధ్యతతో ఎలక్ట్రానిక్ వస్తువులు బాగు చేసేందుకు ముందుకు రావాలని, స్పేర్ పార్టుల్ని డిస్కౌంట్‌లో అందించాలని విజ్ఞప్తి చేశారు. కంపెనీల వారీగా హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసి అదనంగా టెక్నీషియన్లను నియమించాలని సూచించారు. వరద ప్రాంతాల్లో ప్రత్యేక సర్వీస్ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి సేవలందిస్తామని కంపెనీల ప్రతినిధులు సీఎంకు హామీ ఇచ్చారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఇటీవల కృష్ణానది, బుడమేరు వరదల కారణంగా విజయవాడ నగరం, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ప్రజలకు జరిగిన అపార నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం ప్రతినిధి బృందం మంగళవారం సీఎం చంద్రబాబును కలిసి 39 అంశాలతో కూడిన వినతి పత్రం అందజేసింది. తక్షణ సాయంగా రూ.10 వేల కోట్లు విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని, వరద బాధిత ప్రాంతాల్లో సహాయం క్షేత్రస్థాయి వరకు అందించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేసింది. సీఎంను కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, సీహెచ్.బాబూరావు తదితరులు ఉన్నారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 67,030 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 23,476 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.60 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 8 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

సత్యదేవుని అంతరాలయ దర్శనం

అన్నవరం: అన్నవరంలోని సత్యదేవుడు, అమ్మవారు, శంకరుల అంతరాలయ దర్శనం మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. రూ.200 టికెట్‌తో స్వామివారి అంతరాలయంలో ఎడమవైపు ద్వారం నుంచి లోపలకు వెళ్లి స్వామి దర్శనానంతరం కుడి వైపు ద్వారం నుంచి వెలుపలకు వచ్చేలా పాత పద్ధతిని పునఃప్రారంభించారు. శని, ఆదివారాల్లో కూడా ఈ దర్శనం అమలు కానుంది.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వీరగణపతిగా సంపత్ వినాయగర్

సీతమ్మధార: విశాఖ నగరం ఆశీలమెట్టలోని శ్రీ సంపత్‌వినాయగర్ మంగళవారం వీర గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. ఉత్సవాలలో భాగంగా గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయ దాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

13 నుంచి సింహగిరిపై పవిత్రోత్సవాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 17 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఏడాదంతా స్వామివారికి జరిగే నిత్యపూజలు, వార్షిక ఉత్సవాల్లో వైదిక పరంగా ఎలాంటి దోషాలు ఉన్నా వాటిని నివృత్తి చేసుకునేందుకు పవిత్రోత్సవాలు ఏటా నిర్వహించడం పరిపాటి. పవిత్రోత్సవాల సందర్భంగా ఈనెల 13 నుంచి 17వరకు రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయని ఈవో తెలిపారు. అలాగే అన్ని ఆర్జిత సేవలు, నిత్యకల్యాణం రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

21 నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా, ఏడువారాల వెంకన్నగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 29 వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తునట్లు దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

నేటితో ముగియనున్న డిగ్రీ మూడో విడత రిజిస్ట్రేషన్

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలల్లో మూడవ విడత డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. ఈ మేరకు అన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు ఉన్నత విద్యామండలి సమాచారం అందించింది. ఈనెల 14 తేదీవరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పించి, 15న వెబ్ ఆప్షన్ల మార్పు చేసుకునేందుకు అభ్యర్థులకు వెసులుబాటు కల్పించింది. 18వతేదీన సీట్లు కేటాయింపు ప్రక్రియను చేపట్టి 21వ తేదీలోపు సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని అధికారులు సూచించారు.

జాబ్‌మేళాలో 34 మంది ఎంపిక

పుంగనూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరు జిల్లా పుంగనూరు ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. అందులో 34 మంది ఎంపికైనట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జాబ్‌మేళాకు 68 మంది హాజరుకాగా అందులో 34 మందిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీలో స్పాట్ అడ్మిషన్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాలలో ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీలో మిగులు సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్, అప్లైడ్ సైన్సెస్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.ప్రదీప్ తెలిపారు. జీవశాస్త్రం సబ్జెక్ట్‌తో డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 8555911961, 7702203953, 6301096643 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఐదేళ్ల నానో టెక్నాలజీ కోర్సులో అడ్మిషన్లకు ఆహ్వానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ నానో టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి ఆచార్య వి. రవి కుమార్ తెలిపారు. 3వ విడత వెబ్ ఆప్షన్లు, రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు www.OAMDC.AP.GOV.IN వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ/బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు రీ ఎంబర్స్‌మెంట్, యునివర్సిటీ నిబంధనల ప్రకారం హాస్టల్, లైబ్రరీ సౌకర్యాలు ఉంటాయని వివరించారు. వివరాలకు 94915 49853, 99661 19781 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.



ఐటీఐ పూర్తి చేసిన యువతకు ఉద్యోగావకాశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: అశోక్ లేలాండ్ కంపెనీ వారు నేరుగా నిర్వహించే ఉద్యోగ మేళాను ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఎచ్చెర్ల ఐటీఐలో ఆయన మంగళవారం మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని కంచరపాలెం ఐటీఐలో ఈ ఉద్యోగ మేళా ఉంటుందని, ఉదయం 9 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు.

స్కిల్ కాలేజీలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజీలో ఉపాధి శిక్షణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో ఈ శిక్షణలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడు నెలల పేషెంట్ రిలేషన్ అసోసియేట్ శిక్షణకు డిగ్రీ పూర్తిచేసిన యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. అర్హులైన వారు ఫోన్ నంబర్లు 8897252449, 8247656581లను సంప్రదించాలని సూచించారు.

22న సంగీత, నృత్య పోటీలు

నెల్లూరు(బృందావనం): నెల్లూరు నగరంలోని టౌన్ హాల్లో సంగీత, నృత్య పోటీలను ఈ నెల 22న నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. ఆసక్తి గల వారు తమ వివరాలను ఈ నెల 16లోపు నమోదు చేసుకోవాలని, సమాచారం కోసం 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



మహేశ్‌గౌడ్‌కు అభినందనల వెల్లువ

శుభాకాంక్షలు తెలిపిన మంత్రి రాజనర్సింహ, వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ బలరాం నాయక్

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ కొత్త అధ్యక్షుడు బొమ్మా మహేశ్‌కుమార్ గౌడ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నా యి. గత మూడు రోజులుగా హైదరాబాద్‌లోనే ఉంటున్న ఆయనను రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తు న్నారు. మంగళవారం హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయనను పలువురు ముఖ్యులు కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టూరిజం చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి తదితరులు కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించారు.

నేడు ఢిల్లీకి..

కాగా, మహేశ్‌కుమార్ గౌడ్ నేడు ఢిల్లీకి వెళ్లనున్నారు. తనను పీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు పలువురు ఢిల్లీ పెద్దలను కలిసి ఆయన కృతజ్ఞతలు తెలుపుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

తెలంగాణలో ఐదేళ్లుగా ఒకేరీతిలో వివాహ రిజిస్ట్రేషన్లు

2023-24లో అత్యధికంగా 1.09 లక్షల రిజిస్ట్రేషన్లు

గ్రేటర్ పరిధిలోనే 40 శాతం..

వరంగల్, కరీంనగర్‌లలో భారీగానే నమోదు

'కల్యాణలక్ష్మి'లబ్ధి కోసం ఏడాదికి 2 లక్షల వరకు దరఖాస్తులు

ఏటా జరిగే వివాహాలు 2.5 లక్షలు..

రిజిస్ట్రేషన్లు మాత్రం లక్షలోపే

సాక్షి, హైదరాబాద్: వివాహ రిజిస్ట్రేషన్లు ఓ మోస్తరుగానే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఏటా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.5 లక్షల పెళ్లిళ్లు జరుగుతాయనే అంచనా ఉండగా, రిజిస్ట్రేషన్లు మాత్రం లక్షలోపే ఉంటున్నాయని లెక్కలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా గత ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే వివాహాల రిజిస్ట్రేషన్ల సంఖ్యలో పెద్దగా మార్పు లేదు. 2019-20 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఏటా సుమారు 90 వేలకు పైగా మాత్రమే వివాహ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఐదేళ్ల కాలంలో కూడా ఈ సంఖ్యలో మార్పు లేకపోవడం విశేషం. అయితే..2023-24లో మాత్రం ఈ రిజిస్ట్రేషన్లు స్వల్పంగా పెరిగాయని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తాజా నివేదికలో వెల్లడైంది. ఈ ఏడాదిలో అత్యధికంగా 1.09 లక్షల వివాహ రిజిస్ట్రేషన్లు జరిగాయని తేలింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే గ్రేటర్ పరిధిలోనే 40 శాతం వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. 2023-24 సంవత్సర గణాంకాలను పరిశీలిస్తే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అత్యధికంగా 15,733 రిజిస్ట్రేషన్లు జరిగాయి. రంగారెడ్డిలో 13,502, హైదరాబాద్ జిల్లాలో 10,925 మంది తమ వివాహాలను రిజిస్టర్ చేసుకున్నారు. ఆ తర్వాత కరీంనగర్‌లో 14,027, వరంగల్ జిల్లాలో 11,565 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఈ ఐదు జిల్లాల్లోనే సగం రిజిస్ట్రేషన్లు జరగ్గా, మిగిలిన ఏడు రిజిస్ట్రేషన్ జిల్లాల్లో కలిపి మరో సగం జరగడం గమనార్హం.

ఏ డాక్యుమెంట్లు కావాలంటే...!

వివాహ రిజిస్ట్రేషన్ల విషయంలో అలసత్వం వద్దని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు పెద్దగా సమయం పట్టదని, స్లాట్ బుక్ అయిన రోజునే పూర్తవుతుందంటున్నారు. అయితే డాక్యుమెంట్లు పూర్తిస్థాయిలో సమర్పించాల్సి ఉంటుందని చెబుతున్నారు. పెళ్లి పత్రిక, 2 పెళ్లి ఫొటోలు, వధూవరుల ఆధార్ కార్డులు, వయసు ధ్రువీకరణ పత్రం, ముగ్గురు సాక్షులు, వారి ఆధార్ కార్డులు తప్పకుండా ఉండాలి. వివాహానికి చట్టబద్ధత కల్పించడంతోపాటు విదేశాలకు వెళ్లాలనుకునే దంపతులకు ఈ మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి కావడంతో ఇటీవలి కాలంలో వివాహాల రిజిస్ట్రేషన్లు పెరిగాయని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆధార్ కార్డులో చిరునామా మార్పు కావాలన్నా, కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఈ సర్టిఫికెట్ అవసరం. అయితే, కల్యాణలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు కూడా మ్యారేజ్ రిజిస్ట్రేషన్ అవసరమవుతోంది. కల్యాణలక్ష్మి పథకం కింద లబ్ధి కోసం ఏడాదికి 2 లక్షలకు పైగా దరఖాస్తులు వస్తుండగా, అందులో ఎక్కువగా స్థానిక సంస్థలు (గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు) ఇచ్చే వివాహ ధ్రువపత్రాలే ఎక్కువగా ఉంటున్నాయి. అయితే, స్థానిక సంస్థల్లో ధ్రువపత్రాలు ఒకసారి, వివాహాల రిజిస్ట్రేషన్లు మరోసారి కాకుండా నేరుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వివాహ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఇతర అవసరాలకు కూడా వినియోగించుకోవచ్చని అధికారవర్గాలు చెబుతున్నాయి. గతం కంటే అవగాహన పెరిగింది కానీ..అది సరిపోదని, ప్రజల్లో ఇంకా చైతన్యం రావాల్సి ఉంది. జరిగే ప్రతి వివాహం రిజిస్ట్రేషన్ అయితేనే అన్ని విధాలుగా మంచిదని సూచిస్తున్నాయి.

ఐదేళ్లలో జరిగిన వివాహాల రిజిస్ట్రేషన్ గణాంకాలు

సంవత్సరం	హిందూ వివాహాలు	ప్రత్యేక వివాహాలు
2019-20	97,149	3,377
2020-21	81,164	3,368
2021-22	95,555	3,837
2022-23	95,555	4,329
2023-24	1,09,462	4,854





చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తి

- ఎమ్మెల్యే హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాట కాలంలో వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికి ఎంతో స్ఫూర్తి అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఎక్స్‌లో ఆమెకు ఘన నివాళులర్పించారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక ఐలమ్మ అని కొనియాడారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం చాకలి ఐలమ్మ త్యాగాలకు గుర్తుగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భావితరాలకు ఆ మహనీయురాలి చరిత్ర తెలియాలని పాఠ్యాంశంగా పెట్టి గౌరవించిందని హరీశ్‌రావు గుర్తు చేశారు.

నెమ్మదించిన కీలక కేసుల దర్యాప్తు

- విదేశాల్లోనే ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక నిందితులు
- అంతులేక సాగుతున్న గొర్రెల పథకం స్కాం దర్యాప్తు
- జీఎస్టీ కుంభకోణం కేసులో పడని ముందడుగు



సాక్షి, హైదరాబాద్: ఇటీవల కాలంలో ఎంతో సంచలనంగా మారి.. నిత్యం వార్తల్లో నిలిచిన కొన్ని ముఖ్యమైన కేసుల దర్యాప్తు ముందుకు సాగడం లేదు. ఒక్కో కేసులో ఒక్కో అంశం కారణంగా దర్యాప్తు నెమ్మదించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అత్యంత సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు వరుస అరెస్టులతో మొదట్లో హడావుడిగా నడిచింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఇష్టానుసారంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారన్నది ప్రధాన అభియోగం. ఈ కేసులో అప్పటి ఎస్‌ఐబీ అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ రాధాకిషన్‌రావులను అరెస్టు చేశారు. ప్రాథమిక చార్జిషీట్ సైతం దాఖలుచేశారు. ఇక్కడి వరకు దర్యాప్తు ఫుల్‌స్పీడ్‌లో కొనసాగింది. అయితే, కీలక నిందితుడు ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, మరో కీలక నిందితుడు శ్రవణ్‌కుమార్ అమెరికాలో ఉండటంతో వారిని అరెస్టు చేసి, తమ కస్టడీలోకి తీసుకుంటే తప్ప దర్యాప్తులో ముందుకుసాగని పరిస్థితి. ప్రభాకర్‌రావుపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయాలని దర్యాప్తు అధికారులు సీబీఐ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు.

గొర్రెల కేసులో...

ఇక కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణకు ఆదేశించిన మరో కీలక కేసు గొర్రెల కొనుగోళ్లలో జరిగిన అక్రమాలకు సంబంధించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన గొర్రెల కొనుగోళ్లలో రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. అయితే, ఈ కేసు దర్యాప్తు అధికారి మారడంతో మళ్లీ కేసును మొదటి నుంచి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో కీలక అరెస్టులు జరిగినా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలతో ఈ కేసు ముడిపడి ఉండడం.. ఏసీబీలో సరిపడా సిబ్బంది లేకపోవడం సైతం క్షేత్రస్థాయిలో దర్యాప్తు జాప్యానికి కారణం అవుతోంది.

రూ.1,000 కోట్ల జీఎస్టీ కేసులో..

అత్యంత సంచలనంగా మారిన మూడో కేసు.. వాణిజ్యపన్నుల శాఖలో రూ.1000 కోట్ల జీఎస్టీ కుంభకోణం. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను నిందితుడిగా చేర్చడంతో ఈ కేసుపైనా తీవ్ర చర్చ జరిగింది. కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించింది. అయితే, తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చినా.. ఈ కేసులో శాస్త్రీయ ఆధారాలు సరిగా లేవని అంటున్నారు. ప్రాథమిక ఆధారాలు లేనిదే నిందితులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలవడం సాధ్యం కాకపోవడంతో సీఐడీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ కేసులో అవసరమైన సమాచారం కోసం ఇప్పటికే వాణిజ్య పన్నుల శాఖకు లేఖలు రాశారు. ఆ సమాచారం వస్తే తప్ప దర్యాప్తులో ముందడుగు పడని పరిస్థితి.

'చాకలి ఐలమ్మ' పేరుతో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

- దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: చాకలి ఐలమ్మ పేరుతో ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి, అగ్రవర్ణ అట్టడుగు వర్గాల మహిళలపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ కోరారు. మంగళవారం బీసీ రాజ్యాధికారి సమితి కేంద్ర కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ భూమికోసం, భుక్తికోసం దొరలను తరిమిన స్ఫూర్తితో ప్రభుత్వం మహిళలకు అన్ని రకాల అవకాశాలను ఇవ్వాలని, రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వాలని సురేశ్ డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సాధ్యమైనా.. బీసీ మహిళలకు తగినంత అవకాశం లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే మంత్రివర్గ తీర్మానం చేయాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు అవకాశాలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. అలాగే తెలంగాణ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, మహిళల రక్షణ కోసం రాష్ట్రంలో చట్టాలను కఠినం చేయాలని సురేశ్ విన్నవించారు.

అడవుల సంరక్షణకు ప్రాణాలర్పిస్తున్నారు: మంత్రి సురేఖ

సాక్షి, హైదరాబాద్: దేశ రక్షణ కోసం సైనికులు ప్రాణాలర్పిస్తుంటే.. సహజ వనరులైన అడవుల సంరక్షణకు అటవీ ఉద్యోగులు ప్రాణాలర్పిస్తున్నారని అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సెప్టెంబర్ 11 సందర్భంగా అడవుల సంరక్షణలో అమరులైన వారిని ఆమె స్మరించుకున్నారు. మానవ మనుగడకు అడవుల ప్రాధాన్యాన్ని గుర్తించి అటవీ శాఖ ఏర్పాటైందన్నారు. వన మహోత్సవం కార్యక్రమం ద్వారా రాష్ట్ర అటవీ సంపదను 24 నుంచి 33 శాతానికి పెంచే మహాయజ్ఞంలో భాగస్వాములైన అటవీ ఉద్యోగులు, సిబ్బంది కార్యదక్షతతో పనిచేయాలని సురేఖ సూచించారు. పచ్చదనం పరిరక్షణకు, వన్యప్రాణుల సంరక్షణకు అటవీ అమరవీరుల ప్రేరణతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం కులగణన ప్రారంభించాలి: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: మూడు నెలల్లో కుల గణన రిపోర్టు ఇవ్వాలని కోర్టు చెప్పిందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కులగణన ప్రారంభించాలని మాజీ మంత్రి వి.హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్రలో కులగణన చేయాలని చెప్పారన్నారు. కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, సీఎం రేవంత్‌రెడ్డి రూ.150 కోట్లు విడుదల చేస్తే రెండు నెలల్లో కుల గణన రిపోర్టు వస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన సకల జనుల రిపోర్టు ఎక్కడికి పోయిందో చెప్పాలని, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లకు చిత్తశుద్ధి ఉంటే బయటపెట్టాలని వీహెచ్ డిమాండ్ చేశారు. సకలజనుల రిపోర్టు ఇస్తే బీసీ కులగణనకు ఉపయోగపడుతుందని, ఆ రిపోర్టును సీఎస్ శాంతికుమారికి ఇవ్వాలని కోరారు.

'పాఠశాల పారిశుధ్య నిర్వహణకు నిధులివ్వాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు వెంటనే పారిశుధ్య నిర్వహణ నిధులు మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్ మాస్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజభాను చంద్రప్రకాశ్ ప్రభుత్వాన్ని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు పారిశుధ్య నిర్వహణ నిధులు ఇస్తామని ఇటీవల ముఖ్యమంత్రి ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.





ఆటోమెటిక్ తలుపులు.. ఆధునిక టాయ్‌లెట్లు

త్వరలో పరుగులు తీయనున్న స్లీపర్ వందేభారత్‌లో ప్రత్యేకతలెన్నో

వెయ్యి కి.మీ.మించిన దూరం మధ్య తిరిగేందుకు సిద్ధం

పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన రైళ్లు



సాక్షి, హైదరాబాద్: పరిమిత దూరంలో ఉన్న నగరాల మధ్య 160 కి.మీ. గరిష్ట వేగంతో దూసుకుపోతున్న వందేభారత్ రైళ్లు.. ఇక వెయ్యి కి.మీ.ని మించిన దూరప్రాంతాల మధ్య తిరిగేందుకు సిద్ధమయ్యాయి. ఇందుకుగాను తొలిసారి స్లీపర్ బెర్తులతో కూడిన వందేభారత్ రైలు పూర్తిస్థాయిలో సిద్ధమై త్వరలో తొలి పరుగుకు సిద్ధమైంది. ఇప్పటివరకు మన రైళ్లలో కనిపించని ఆధునిక రూపుతో ఇవి కళ్లు చెమర్చేలా ఉండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల ఈ రైలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి ఆమోదముద్ర పడటంతో మరిన్ని రైళ్ల తయారీ కూడా ఊపందుకుంది. పూర్తిస్థాయిలో అగ్ని నిరోధక భద్రతా ప్రమాణాలతో రూపొందిన ఈ రైలు పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందడం విశేషం.

ప్రత్యేకతలు ఇవే..

- స్లీపర్ వందేభారత్ రైలును ఆస్టెనిటిక్ స్టెయిన్‌లెస్ స్టీలుతో రూపొందించారు. వందేభారత్ తరహాలో దీని వెలుపలి రూపు ఏరోడైనమిక్ డిజైన్‌తో కనువిందు చేస్తోంది.
- ఇంటీరియర్‌ను జీఎఫ్‌ఆర్‌పీ ప్యానెల్‌తో రూపొందించారు. ఇందులో మాడ్యులర్ పాంట్రీ ఉంటుంది.
- అగ్ని నిరోధక వ్యవస్థలో ఈఎన్-45545 ప్రమాణ స్థాయితో రూపొందింది.
- దివ్యాంగులు కూడా సులభంగా వినియోగించగలిగే పద్ధతిలో ప్రత్యేక బెర్తులు, టాయిలెట్లను ఇందులో పొందుపరిచారు.
- ఆటోమేటిక్ పద్ధతిలో తెరుచుకొని మూసుకునే పద్ధతిగల తలుపులను ఏర్పాటు చేశారు. ఇది సెన్సార్ ఆధారిత ఇంటర్ కమ్యూనికేషన్‌తో పనిచేస్తాయి.
- దుర్వాసనను నియంత్రించే ప్రత్యేక వ్యవస్థతో కూడిన పూర్తి సౌకర్యవంతమైన టాయ్‌లెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.
- లోకోపైలట్ల కోసం ప్రత్యేక టాయిలెట్లను ఏర్పాటు చేశారు.
- మొదటి శ్రేణి ఏసీ కోచ్‌లో వేడి నీటితో కూడిన షవర్ వ్యవస్థ అందుబాటులో ఉంటుంది.
- కోచ్‌లలోని బెర్తుల వద్ద రీడింగ్ లైట్లు, యూఎస్‌బీ చార్జింగ్ వసతి ఉంటుంది.
- అనౌన్స్‌మెంట్‌ల కోసం ఆడియో, వీడియో వ్యవస్థ ఉంటుంది.
- ప్రయాణికుల లగేజీ భద్రపరిచేందుకు విశాలమైన కోచ్ ఉంటుంది.
- సెక్యూరిటీ, రైల్వే సిబ్బందికి ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. లోకోపైలట్‌తో నేరుగా మాట్లాడేందుకు ప్రత్యేక ఆడియో వ్యవస్థ అక్కడ అందుబాటులో ఉంటుంది.

మొత్తం 16 కోచ్‌లు....

ఈ ఆధునిక స్లీపర్ వందేభారత్ రైలులో 16 కోచ్‌లు ఉంటాయి. అందులో ఏసీ 3-టైర్ కోచ్‌లు 11 ఉంటాయి. వాటిల్లో 611 బెర్తులు అందుబాటులో ఉంటాయి. ఏసీ 2 టైర్ కోచ్‌లు 4 ఉంటాయి. వీటిల్లో 188 బెర్తులు ఉంటాయి. ఫస్ట్ క్లాస్ ఏసీ కోచ్ ఒకటి ఉంటుంది. అందులో 24 బెర్తులుంటాయి. అప్పర్ బెర్తులోకి చేరుకునేందుకు ప్రత్యేక నిచ్చెన తరహా ఏర్పాటు ఉంటుంది. మిడిల్ బెర్తు నారింజ రంగులో, లోయర్, అప్పర్ బెర్తులు గ్రే కలర్‌లో ఉంటాయి. అప్పర్ బెర్తులను నిలిపి ఉంచేందుకు గతంలో గొలుసు తరహా ఏర్పాటు ఉంటే, ఇందులో ప్రత్యేక స్టీల్ స్ట్రిప్ ఏర్పాటు చేశారు. బెర్తుల వద్ద మేగజైన్ బ్యాగు, మొబైల్ ఫోన్ పెట్టుకునే బాక్సు ఏర్పాటు చేశారు. బెర్తులు ఆరడుగుల పొడవుతో ఏర్పాటు చేశారు.



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన రాజ్ భవన్‌ల సీనియర్ అధికారులకు మంగళవారం రాజ్ భవన్ లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం అనే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు

విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉన్న దేశాలేవి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

వ్యవసాయం

ప్రముఖ ఆర్థిక భౌగోళిక శాస్త్రజ్ఞుడు విట్లిసీ కింద సూచించిన వ్యవసాయ వ్యవస్థలను గుర్తించాడు.

- సాంద్ర జీవనాధార వ్యవసాయం
- విస్తార వాణిజ్య వ్యవసాయం
- మిశ్రమ వ్యవసాయం
- వాణిజ్య పండ్ల తోటల సాగు
- మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్
- ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్
- వాణిజ్య పాడి మండలం
- వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)
- పోడు వ్యవసాయం
- సంచార పశు పోషణ

సాంద్ర జీవనాధార వ్యవసాయం

ఆయనరేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాలకు చెందిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో జీవనాధార సాంద్ర వ్యవసాయం అమల్లో ఉంది. ఇండియా, చైనా, బ్రెజిల్, థాయ్‌లాండ్, మెక్సికో, ఈజిప్ట్ లాంటి వ్యవసాయ ప్రధాన దేశాల్లోని వ్యవసాయ వ్యవస్థలు ఈ కోవకు చెందినవి. సాంద్ర వ్యవసాయంలో పంటల తీవ్రత అధికం. పెద్ద మొత్తాల్లో ఎరువులు, క్రిమిసంహారక మందులు, సేద్యపు నీటిని వాడతారు. వ్యవసాయ భూకమతాల సగటు పరిమాణం చాలా తక్కువ. జనాభాలో అధిక శాతం ప్రత్యక్షంగా వ్యవసాయంపైనే ఆధారపడతారు. కాబట్టి వ్యవసాయ భూమిపై ఒత్తిడి అధికం. ప్రధానంగా ఆహార పంటలను పండిస్తారు. జనాభా, జనసాంద్రతలు అధికంగా ఉండటం వల్ల వ్యవసాయ ఉత్పత్తులను పూర్తిగా దేశీయంగానే వినియోగిస్తారు. మిగులు లేకపోవడంతో ఎగుమతులు అత్యల్పం. వ్యవసాయంలో శ్రామిక శక్తిని అధికంగా వినియోగిస్తారు. సగటు వ్యవసాయ భూమికి దిగుబడులు అధికంగా ఉన్నప్పటికీ, తలసరి దిగుబడులు కనిష్టంగా ఉంటాయి. వ్యవసాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉంటుంది. ఈ వ్యవసాయ మండలంలో రైతుల ఆదాయాలు స్వల్పంగా ఉంటాయి. రైతులు తమ గృహ అవసరాల ఆధారంగా పంటలను ఎంచుకుంటారు.

విస్తార వాణిజ్య వ్యవసాయం

ఐరోపా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అర్జెంటీనాల్లో విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉంది. వ్యవసాయంపై ఆధారపడే శ్రామిక జనాభా శాతం చాలా తక్కువ. వ్యవసాయంలో యాంత్రీకరణ స్థాయి అధికం. వ్యవసాయ భూకమతాలు చాలా పెద్దవి. ఉదాహరణకు యూఎస్ఏలో సగటు భూకమతాల పరిమాణం 1000–1400 హెక్టార్లు. పంటల తీవ్రత సాంద్ర వ్యవసాయ మండలంతో పోలిస్తే తక్కువగా ఉంటుంది.

ప్రపంచ మార్కెట్లను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మండలంలో పంటలు పండిస్తారు. జనాభా, జనసాంద్రత తక్కువగా ఉండటం వల్ల స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం తక్కువ. మిగులు వ్యవసాయ ఉత్పత్తుల వల్ల పెద్ద మొత్తాల్లో ఎగుమతి చేస్తారు. విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉండే యూఎస్ఏ, కెనడా, రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా దేశాలు ప్రపంచంలో ప్రధాన వ్యవసాయ ఎగుమతిదారులు. ఈ మండలాన్ని ప్రపంచ ధాన్యాగారంగా అభివర్ణిస్తారు. ఈ తరహా వ్యవసాయం విస్తారంగా పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకొని ఉంది.

మిశ్రమ వ్యవసాయం

పంటలతోపాటు పశుపోషణ కోసం కూడా వ్యవసాయ భూమిపై ఆధారపడటాన్ని మిశ్రమ వ్యవసాయంగా వ్యవహరిస్తారు. ఈ తరహా వ్యవసాయంలో పంటల నుంచి వచ్చిన రొట్టను, వ్యవసాయ ఉత్పత్తులను పశుగ్రాసంగా వాడతారు. పశువుల మేతకోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లు ఉండవు. అయితే జీవనాధార వ్యవసాయంలా కాకుండా, ఈ మండలంలో వ్యవసాయ పంటలు, పశుపోషణ వాణిజ్య తరహాలో జరుగుతుంది. పశ్చిమ, మధ్య ఐరోపాల్లో వ్యవసాయం ఈ కోవకు చెందింది. ఈ మండలంలో సగటు వ్యవసాయ భూకమతాల పరిమాణం మధ్యస్థంగా (100–200 హెక్టార్లు) ఉంటుంది.

వాణిజ్య పండ్ల తోటల సాగు

మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతాలు పండ్ల తోటల సాగుకు అనుకూలం. కవోష్ణ వాతావరణం వల్ల ముఖ్యంగా సిట్రస్ జాతికి చెందిన పండ్ల తోటలు ఇక్కడ సాగవుతాయి. మధ్యధరా తీరంలోని ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, గ్రీస్, మొరాకో, అల్జీరియా, ట్యునీషియా ప్రాంతాలు, దక్షిణాఫ్రికాలోని కేప్ ప్రాంతం, యూఎస్ఏలోని కాలిఫోర్నియా తీరం, మధ్య చిలీ, ఇజ్రాయెల్ తీర ప్రాంతాలు ఈ వ్యవసాయ మండలం కిందకు వస్తాయి. ఈ ప్రాంతాల్లో బత్తాయి, నిమ్మ, ద్రాక్ష, నారింజ, దానిమ్మ లాంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను వాణిజ్య పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఇది పెట్టుబడితో కూడుకున్న వ్యవసాయం. పండ్ల రసాలు, జామ్‌లు, జెల్లీలు, సాస్‌లు, ఎండు పళ్లను ఈ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఎగుమతి చేస్తున్నారు. ద్రాక్ష సారాయి తయారీ కూడా పెద్ద పరిశ్రమగా రూపొందింది. ఫ్రాన్స్‌లోని రైన్ లోయ, ఇటలీలోని గెరాన్ బేసిన్ వీటికి ప్రసిద్ధి.



- ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో జీవనాధార సాంద్ర వ్యవసాయం అమల్లో ఉంది.
- ఐరోపా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అర్జెంటీనాల్లో విస్తార వాణిజ్య వ్యవసాయం అమల్లో ఉంది
- వ్యవసాయ భూమిపై పంటలే కాక పశుపోషణ కూడా ఆధారపడటాన్ని మిశ్రమ వ్యవసాయంగా వ్యవహరిస్తారు.
- మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతాలు పండ్ల తోటల సాగుకు అనుకూలం.
- ద్రాక్ష సారాయి తయారీకి ఫ్రాన్స్‌లోని రైన్ లోయ, ఇటలీలోని గెరాన్ బేసిన్ ప్రసిద్ధి.

మార్కెట్ గార్డెనింగ్/ట్రక్ ఫార్మింగ్

పారిశ్రామిక విప్లవం తర్వాత ఐరోపా, ఉత్తర అమెరికాల్లో విస్తృత నగరీకరణ జరిగింది. విస్తరిస్తున్న మెట్రోపాలిటన్ నగరాల్లో తాజా కూరగాయలు, పండ్లకు గిరాకీ బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో వాయవ్య ఐరోపా, ఉత్తర అమెరికాల్లోని పెద్ద పెద్ద నగరాల సమీపంలో పండ్లు, కూరగాయల సాగు వాణిజ్య పద్ధతిలో ప్రారంభమైంది. రోజూ ఉదయాన్నే ఈ వ్యవసాయ ప్రాంతాల నుంచి నగరాలకు భారీ ట్రక్కుల ద్వారా తాజా పండ్లు, కూరగాయల రవాణా జరుగుతుంది. అందువల్ల దీన్ని ట్రక్ ఫార్మింగ్ (మార్కెట్ గార్డెనింగ్) అని పిలుస్తారు. ఆగ్నేయ ఆస్ట్రేలియాలోని నగర జనాభాకు కావాల్సిన తాజా పండ్లు, కూరగాయలను టాస్మానియా దీవి నుంచి బాస్ జలసంధి ద్వారా మర పడవలపై సరఫరా చేస్తారు. అందువల్ల టాస్మానియా దీవిని 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా వ్యవహరిస్తారు.

ఉద్యానవన తోటలు/ఎస్టేట్ ఫార్మింగ్

ఎస్టేట్ ఫార్మింగ్ పద్ధతుల్లో ఉద్యానవన తోటల పెంపకాన్ని వలస పాలనా కాలంలో వలస రాజ్యాలు ప్రారంభించాయి. ఉష్ణమండల ఆయన రేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాల్లోని దేశాల్లో వలస పాలకులు కాఫీ, తేయాకు, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, చెరకు, అరటి పంటలను ఎస్టేట్‌ల రూపంలో సాగు చేయడం ప్రారంభించారు. ఈ రకమైన సాగులో వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా నడిపిస్తారు. ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టే యాజమాన్యం కేవలం విధాన నిర్ణయాలను మాత్రమే తీసుకుంటుంది. సాగు నిర్వహణ కోసం సుశిక్షితులైన, సాంకేతిక అర్హతలు ఉన్న వారిని 'మేనేజర్లు'గా వేతన ప్రాతిపదికన నియమిస్తారు. శ్రామికులను దినసరి లేదా రోజువారీ కూలీ ప్రాతిపదికన వినియోగిస్తారు. లాభాలను ఆశించి ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేస్తారు. ఇప్పటికీ ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు కన్పిస్తాయి.

దేశం	ఎస్టేట్లు	పెట్టుబడి పెట్టిన దేశం
శ్రీలంక	తేయాకు	బ్రిటన్
మలేషియా	రబ్బరు	బ్రిటన్
ఇండోనేషియా	రబ్బరు, చెరకు	డచ్
దక్షిణాఫ్రికా	చెరకు	డచ్, బ్రిటన్
బ్రెజిల్	కాఫీ	పోర్చుగల్
ఫిలిప్పీన్స్	కొబ్బరి	యూఎస్ఏ
కరేబియన్ దీవులు	చెరకు, అరటి	యూఎస్ఏ
పశ్చిమ ఆఫ్రికా	కొకురా	ఫ్రాన్స్

వాణిజ్య పాడి మండలం

వాయవ్య ఐరోపాలోని సమశీతోష్ణ వాతావరణంలో పచ్చిక బయళ్లు విస్తారంగా పెరుగుతాయి. ఈ పరిస్థితులు పశుపోషణకు అనుకూలం, జెర్సీ, ఆరిషైర్, స్విస్‌బ్రౌన్, ఆబర్డన్, హార్ట్‌ఫోర్డ్, ఫ్లెచ్‌విక్ లాంటి మేలి రకం పాడి పశువుల జాతులకు ఈ ప్రాంతాలు నిలయాలు. పెద్ద మొత్తాల్లో పెట్టుబడులు పెట్టి ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని వాడుతూ పాడి పశువులను పెంచుతారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలోని యూకే, డెన్మార్క్, బెల్జియం, నెదర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, నెదర్లాండ్ దేశాల నుంచి పెద్ద మొత్తాల్లో పాడి వస్తువులు ఉత్తర అమెరికా, యూరప్‌లోని ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. డెన్మార్క్‌ను Butter House of Europe గా అభివర్ణిస్తారు. కొపెన్‌హెగెన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజూ విమానాల ద్వారా వెన్నను ప్రపంచం నలుమూలలకు ఎగుమతి చేస్తారు.

వాణిజ్య పశుమాంస ఉత్పత్తి మండలం (రాంచింగ్)

పశ్చిమ యూఎస్ఏలోని రాకీ పర్వత ప్రాంతం, అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వే దేశాలు రాంచింగ్ (Ranching) మండలం కిందకు వస్తాయి. ఈ మండలంలో మాంసం ఉత్పత్తి కోసం పశువులను పెంచుతారు. పశుపోషణ కోసం ప్రత్యేకంగా పచ్చికబయళ్లను నిర్వహిస్తారు. పశువుల మేత కోసం ప్రత్యేకంగా మొక్కజొన్నను పండిస్తారు. బాగా లావెక్కిన పశువులను యాంత్రిక వధ శాలల్లో సంహరించి, మాంసాన్ని యంత్రాల సహాయంతో శుద్ధి చేసి ప్యాక్ చేస్తారు. మాంసం శుద్ధి, ప్యాకింగ్ ఒక పెద్ద పరిశ్రమగా అభివృద్ధి చెందింది. అర్జెంటీనా, ఉరుగ్వే, పరాగ్వేల నుంచి శుద్ధి చేసిన మాంసాన్ని యూఎస్ఏకు ఎగుమతి చేస్తారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో కూడా రాంచింగ్ అమల్లో ఉంది.

సంచార పశు పోషణ

దట్టమైన అటవీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల నుంచి కొన్ని ఆదిమ తెగల సమాజాల్లో ఇప్పటికీ సంచార పశుపోషణ, సంచార వ్యవసాయం అమల్లో ఉంది. ఈశాన్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని 'జూమింగ్'గా పిలుస్తారు. మధ్య భారతదేశంలో 'బేవార్' అని, కేరళలో 'పొనమ్' అని పిలుస్తున్నారు. సంచార వ్యవసాయం బ్రెజిల్ (రోకా), మలేషియా (లడాంగ్)లలో కూడా అమల్లో ఉంది.


మాదిరి ప్రశ్నలు

1. వ్యవసాయ జనాభా ప్రధానంగా సన్న, చిన్నకారు రైతుల రూపంలో ఉండే వ్యవసాయ విధానం ఏది?
   1) సాంద్ర జీవనాధార వ్యవసాయం
   2) విస్తార వాణిజ్య వ్యవసాయం
   3) మిశ్రమ వ్యవసాయం
   4) పైవేవీ కాదు
2. Butter House of Europe గా పేరొందిన దేశం ఏది?
   1) ఆస్ట్రేలియా 2) చిలీ
   3) దక్షిణాఫ్రికా 4) డెన్మార్క్
3. పండ్ల తోటల సాగుకు అనువైన శీతోష్ణస్థితి ఉన్న ప్రాంతం ఏది?
   1) వాయవ్య ఐరోపా 2) పశ్చిమ ఆఫ్రికా
   3) మధ్యధరా ప్రాంతం
   4) తూర్పు ఐరోపా
4. 'గార్డెన్ స్టేట్ ఆఫ్ ఆస్ట్రేలియా'గా పేరొందిన ప్రాంతం ఏది?
   1) టాస్మానియా 2) న్యూసౌత్‌వేల్స్
   3) క్వీన్స్‌లాండ్ 4) విక్టోరియా
5. మధ్య భారతదేశంలో సంచార వ్యవసాయాన్ని ఏమని పిలుస్తారు?
   1) జూమింగ్ 2) పొనమ్
   3) బేవార్ 4) ఏదీకాదు
6. కింద సూచించిన పంటల్లో చల్లటి వాతావరణంలో పండించే పంట ఏది?
   1) కొబ్బరి 2) రబ్బరు
   3) తేయాకు 4) చెరకు
7. దేశంలో వాణిజ్య పద్ధతుల్లో అత్యధికంగా పూలను ఎగుమతి చేస్తోన్న రాష్ట్రం ఏది?
   1) కేరళ 2) తమిళనాడు
   3) తెలంగాణ 4) కర్ణాటక
8. కింది వాటిలో రాంచింగ్ మండలంలో ఉన్న దేశం ఏది?
   1) ఉరుగ్వే 2) కెనడా
   3) లాత్వియా 4) శ్రీలంక
9. ఏ దేశాన్ని ఆదర్శంగా తీసుకొని భారత్‌లో సహకార రంగంలో పాడి సహకార సంఘాలను స్థాపించారు?
   1) బ్రెజిల్ 2) నెదర్లాండ్స్
   3) ఇజ్రాయెల్ 4) డెన్మార్క్

సమాధానాలు

1) 1 2) 4 3) 3 4) 1
5) 3 6) 3 7) 4 8) 1
9) 4

'బ్లడ్ అండ్ ఐరన్ పాలసీ' సృష్టికర్త ఎవరు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ స్టడీస్

మాదిరి ప్రశ్నలు

1. సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రధాన కేంద్రం ఏది?
   1) ఇటలీ 2) జర్మనీ
   3) రష్యా 4) స్పెయిన్
2. ఇంగ్లండ్‌లో ముద్రణా యంత్రాన్ని ఎవరు నెలకొల్పారు?
   1) పీటర్ స్కోఫర్ 2) విలియం కాక్స్టన్
   3) ఫ్రాన్సిస్ బేకన్ 4) జాన్ బుల్
3. కాన్‌స్టాంటినోపుల్‌కు మరో పేరు?
   1) బహ్రాయిన్ 2) ఇస్తాంబుల్
   3) ఇథియోపియా 4) వర్సయిల్
4. కింది వాటిలో సరైన జత ఏది?
   1) గెలీలియో – లోలకసూత్రం
   2) బేకన్ – న్యూ అట్లాంటిస్ గ్రంథం
   3) క్రిస్టోఫర్ కొలంబస్ – జినోవా
   4) పైవన్నీ
5. 'పరిధులు లేని స్వేచ్ఛావాదం' అని దేనిని అంటారు?
   1) మానవతావాదం 2) సామ్రాజ్యవాదం
   3) వాణిజ్యవాదం 4) వలసవాదం
6. సెయింట్ లారెన్స్ నదీముఖ ద్వారాన్ని కనుగొన్నది ఎవరు?
   1) జాన్ కాబట్ 2) కార్టియర్
   3) పెడ్రో కాబ్రల్
   4) ఫెర్డినాండ్ మాజిలన్
7. నూతన భూభాగాలను పోప్ పోర్చుగల్, స్పెయిన్‌ల మధ్య ఎప్పుడు పంపకం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు?
   1) 1493 2) 1490
   3) 1488 4) 1453
8. కింది వాటిలో సరైన జత ఏది?
   1) గోథిక్ శైలి – మధ్యయుగ వాస్తు విధానం
   2) ఇండల్జెన్సెస్ – పాపపరిహార పత్రాలు
   3) ఆనేట్స్ – వివిధ దేశాల నుంచి రోమ్ చర్చికి లభించే పన్ను
   4) పైవన్నీ
9. ఏసుక్రీస్తు 'మోక్ష', 'బంధనా' అధికారాలు ఎవరికి ఇచ్చాడు అని మత్తాయ్ సువార్త చెబుతుంది?
   1) పాల్ 2) మార్క్
   3) పీటర్ 4) జాన్
10. భౌగోళిక అన్వేషకులు (నావికులు) ఉపయోగించే పటాలను ఏమంటారు?
   1) పోరోలని 2) క్రిసెండమ్
   3) ఆస్ట్రోలేబ్ 4) ఓకస్
11. క్రైస్తవ మత సంప్రదాయం ప్రకారం 'మరణ కాలంలో ఉన్న వారికి ఐహిక జీవితపు మచ్చను ఆత్మ నుంచి తుడిచివేసే తైల లేపనం'ను ఏమంటారు?
   1) కన్ఫర్మేషన్ 2) మాట్రిమొని
   3) ఎక్స్‌ట్రీం అన్‌క్షన్ 4) పెనన్స్
12. పవిత్ర రోమన్ సామ్రాజ్య పరిషత్‌లో జర్మన్ ప్రభువర్గం కాథలిక్ – లూథరన్ పక్షాలుగా ఎప్పుడు విడిపోయారు?
   1) 1517 2) 1521
   3) 1526 4) 1532
13. మార్టిన్ లూథర్ బైబిల్‌ను ఏ భాష నుంచి జర్మన్‌లోకి అనువదించాడు?
   1) హీబ్రూ 2) టర్కీ
   3) పారశీక 4) అరబిక్
14. 'నైట్ జార్జి' అని ఎవరిని పిలిచేవారు?
   1) జ్వింగ్లీ 2) మార్టిన్ లూథర్
   3) జాన్ విక్లిఫ్ 4) ఆరో అలెగ్జాండర్
15. కింది వాటిలో సరైంది ఏది?
   1) వల్గేట్ – ప్రామాణిక బైబిల్
   2) మర్కంటైలిజం – వాణిజ్య వాదం
   3) ట్రెంట్ పరిషత్ – పోప్ ఆస్థానం
   4) పైవన్నీ
16. జతపరచండి.
   జాబితా-I
   a) జ్వింగ్లి b) కోపర్నికస్
   c) జాన్ గూటెన్‌బర్గ్
   d) వెరజానో e) ఛాసర్
   జాబితా-II
   i) పోలెండ్ ii) ఇటలీ
   iii) జర్మనీ iv) స్విట్జర్లాండ్
   v) ఇంగ్లండ్
   1) a-v, b-iii, c-iv, d-i, e-ii
   2) a-iv, b-i, c-iii, d-ii, e-v
   3) a-i, b-ii, c-iii, d-iv, e-v
   4) a-iii, b-iv, c-i, d-v, e-ii
17. 'ది హెవెన్లీ అరబ్స్' రాసిందెవరు?
   1) సర్ ఐజాక్ న్యూటన్
   2) కోపర్నికస్
   3) గిల్బర్ట్ 4) డాంటే
18. యూరప్ ఖండానికి పశ్చిమంగా ఉన్న స్కాండినేవియన్ దేశాల జాబితాలో లేనిది?
   1) జర్మనీ 2) స్వీడన్
   3) డెన్మార్క్ 4) నార్వే
19. కాన్‌స్టాంటినోపుల్ ఏ సముద్ర తీరాన ఉంది?
   1) నల్ల సముద్రం
   2) మధ్యధరా సముద్రం
   3) కాస్పియన్ సముద్రం
   4) ఎర్ర సముద్రం
20. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) లాస్ట్ జెడ్జిమెంట్ చిత్రం – మైఖేలాంజిలో
   2) ది మోనాలిసా చిత్రం – లియోనార్డో డావిన్సీ
   3) టెలిస్కోప్ పరికరం – గెలీలియో
   4) ది ప్రిన్స్ గ్రంథం – మోంతాన్
21. 1498లో వాస్కోడిగామా కాలికట్‌లో అడుగు పెట్టే కాలం నాటికి ఢిల్లీ సుల్తాన్ ఎవరు?
   1) దౌలత్‌ఖాన్ లోడి
   2) బహలాల్ లోడి 3) సికిందర్ లోడి
   4) ఇబ్రహీం లోడి
22. జ్వరాన్ని కొలిచే 'థర్మామీటర్'ను తొలిసారిగా తయారు చేసింది ఎవరు?
   1) బేకన్ 2) జాన్ కెప్లర్
   3) గిల్బర్ట్ 4) గెలీలియో
23. కింది వాటిలో ఎరాస్మస్ రచన ఏది?
   1) ది ప్రైజ్ ఆఫ్ ఫాలీ
   2) డాన్ క్విగ్జోట్ 3) డివైన్ కామెడీ
   4) జెరూసలేం డెలివర్డ్
24. 'న్యూ అట్లాంటిస్' గ్రంథకర్త ఎవరు?
   1) జాన్ కెప్లర్ 2) బేకన్
   3) రెండో జాన్ 4) ది హెన్రీ
25. 'దేశం మీద నిర్మించిన సమాధి' అని దేనిని అంటారు?
   1) పీసా టవర్ 2) ఈఫిల్ టవర్
   3) వర్సే రాజప్రాసాదం
   4) స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ
26. కింది వాటిలో సరైన జత ఏది?
   1) సెయింట్ పాల్ చర్చి – లండన్
   2) చర్చిల్లో బృందగానం – మార్టిన్ లూథర్
   3) డేవిడ్ విగ్రహం – మైఖెలాంజిలో
   4) పైవన్నీ
27. 'మత సంస్కరణోద్యమానికి వేగు చుక్క' అని ఎవరిని అంటారు?
   1) ఇగ్నేషియేస్ లయోలా
   2) జాన్ విక్లిఫ్ 3) ఎరాస్మస్
   4) జ్వింగ్లీ
28. కింది వారిలో 1400 నాటకాలకు పైగా రాసిన వ్యక్తి ఎవరు?
   1) టిషన్ 2) రాఫెల్
   3) లోప్‌డవేగా 4) పెట్రార్క్
29. ఆధునిక రాజనీతి శాస్త్ర పితామహుడు ఎవరు?
   1) మాఖియవెల్లి 2) థామస్ ఆక్వినస్
   3) థామస్ మోర్ 4) జాన్‌బుల్
30. క్రైస్తవ మత న్యాయస్థానాన్ని ఏమని పిలుస్తారు?
   1) లీగ్ ఆఫ్ కొన్యాక్ 2) ఇంక్విజిషన్
   3) గాబెల్లి 4) క్రిసెండమ్
31. సాంస్కృతిక పునరుజ్జీవనం ఏ నగరంలో ప్రారంభమైంది?
   1) ఫ్లారెన్స్ 2) జినోవా
   3) వెనిస్ 4) మిలాన్
32. అభివృద్ధి చెందిన దేశాలతో పీటర్ ది గ్రేట్ అనే రష్యా రాజు అనుసరించిన విధానం?
   1) కిటికీ తెరిచి ఉంచే విధానం
   2) కిటికీ మూసి ఉంచే విధానం
   3) నీలి నీటి విధానం
   4) వేడి నీటి విధానం
33. జతపరచండి.
   జాబితా-I
   a) 1765 b) 1770
   c) 1773 d) 1774
   జాబితా-II
   i) బోస్టన్ హత్యాకాండ
   ii) ప్రథమ అమెరికా ఖండ మహాసభ
   iii) స్టాంపుల చట్టం
   iv) బోస్టన్ టీ పార్టీ
   1) a-i, b-ii, c-iii, d-iv
   2) a-iv, b-iii, c-i, d-ii
   3) a-iii, b-i, c-iv, d-ii
   4) a-ii, b-iii, c-i, d-iv
34. రష్యాలో 1861లో బానిసత్వాన్ని రద్దు చేసింది ఎవరు?
   1) మొదటి నికోలస్
   2) రెండో అలెగ్జాండర్
   3) రెండో నికోలస్
   4) మూడో అలెగ్జాండర్
35. గులాబీల యుద్ధం ఇంగ్లాండ్‌లో ఎప్పుడు ముగిసింది?
   1) 1465 2) 1475
   3) 1485 4) 1495
36. 'బ్లడ్ అండ్ ఐరన్ పాలసీ' సృష్టికర్త ఎవరు?
   1) లెనిన్ 2) గారిబాల్డీ
   3) ఆటోవాన్ బిస్మార్క్
   4) ముస్సోలిని
37. బైబిల్‌ను ఆంగ్లంలోకి తర్జుమా చేయించిన ఇంగ్లాండ్‌కు చెందినవారు ఎవరు?
   1) ఎనిమిదో హెన్రీ 2) మేరీ
   3) మొదటి ఎలిజబెత్ 4) ఎడ్వర్డ్
38. 1789 ఫ్రెంచ్ విప్లవ కాలం నాటి ఫ్రాన్స్ రాజు ఎవరు?
   1) 7వ హెన్రీ 2) 14వ లూయీ
   3) 15వ లూయీ 4) 16వ లూయీ
39. జర్మనీ ఏకీకరణకు తొలి మెట్టు అని దేని స్థాపనను అంటారు?
   1) కార్బోనారీ (బొగ్గు కాల్చేవారు)
   2) జాల్వేరిన్ వర్తక సుంకాల సంస్థ
   3) థర్డ్ సెక్షన్
   4) మీర్ అనే గ్రామ వ్యవస్థ
40. నానాజాతి సమితిలో రష్యా ఎప్పుడు సభ్యత్వం పొందింది?
   1) 1934 2) 1935
   3) 1936 4) 1937
41. 'ఇండస్ట్రియల్ రెవల్యూషన్' గ్రంథకర్త ఎవరు?
   1) చార్లెస్ టౌన్‌షెండ్
   2) ఆర్నాల్డ్ టాయిన్‌బీ
   3) జేమ్స్ వాట్ 4) రిచర్డ్ ఆర్క్‌రైట్
42. ఫ్రాన్స్ జాతీయ దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుకుంటారు?
   1) మార్చి 23 2) ఏప్రిల్ 16
   3) మే 11 4) జూలై 14
43. 'వ్యవసాయ నిపుణుల మక్కా' అని ఏ దేశాన్ని అంటారు?
   1) ఇంగ్లాండ్ 2) ఫ్రాన్స్
   3) రష్యా 4) జర్మనీ
44. కింది వాటిలో సరైంది ఏది?
   1) కమ్యూనిస్ట్ మెనిఫెస్టో – 1848
   2) బోల్షివిక్ పార్టీ రష్యా కమ్యూనిస్ట్ పార్టీగా అవతరణ – 1918
   3) ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటు – 1948
   4) పైవన్నీ
45. స్కాట్లాండ్ దేశానికి చెందిన ఆండ్రూమైకే కనుగొన్న సాధనం?
   1) పంటనూర్చే యంత్రం
   2) కలుపుతీసే యంత్రం
   3) రోడ్లు వేసే యంత్రం
   4) ఆవిరి యంత్రం
46. అమెరికా స్వాతంత్ర్య ప్రకటనను రూపొందించింది ఎవరు?
   1) థామస్ జెఫర్‌సన్
   2) జేమ్స్ ఓటిస్ 3) శామ్యూల్ ఆడమ్స్
   4) జార్జి వాషింగ్టన్
47. 1773 బోస్టన్ టీపార్టీ సంఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంత గవర్నర్?
   1) పాట్రిక్ హెన్రీ 2) హచిన్‌సన్
   3) గేజ్ 4) థామస్ పెయిన్
48. కింది వాటిలో సరైన జత ఏది?
   1) సేఫ్టీలాంప్ – సర్ హంఫ్రీడేవి
   2) స్పిన్నింగ్ మ్యూల్ – శామ్యూల్ క్రాంప్టన్
   3) మరమగ్గం – ఎడ్మండ్ కార్ట్‌రైట్
   4) పైవన్నీ
49. భౌగోళిక వ్యక్తీకరణ లేదా నామమాత్రమైన రాజ్యంగా ఏదేశాన్ని పిలుస్తారు?
   1) జర్మనీ 2) ఇటలీ
   3) స్పెయిన్ 4) డెన్మార్క్
50. కింది వాటిలో సరైన జత ఏది?
   1) 1688 – రక్తపాత రహిత విప్లవం
   2) 1763 – సప్తవర్ష సంగ్రామం అంతం
   3) 1789 – పారిస్ స్త్రీల ఆకలియాత్ర
   4) పైవన్నీ
51. ఫ్రెంచ్ విప్లవ కాలంలో ఫ్రాన్స్‌ను వదలి విదేశాలకు పారిపోయిన వారిని ఏమంటారు?
   1) పిల్‌గ్రిం ఫాదర్స్ 2) ప్యూరిటన్లు
   3) ఎమిగ్రేస్ 4) ప్రెస్బిటేరియన్లు
52. 'నేనే రాజ్యం' అని ప్రకటించిన ఫ్రాన్స్ రాజు?
   1) 4వ హెన్రీ 2) 14వ లూయీ
   3) 15వ లూయీ 4) 16వ లూయీ
53. ఫ్రాన్స్‌లో 'కాహియర్'లు అంటే ఏమిటి?
   1) ఎన్నికల ముందు ప్రజలు రూపొందించిన కరపత్రాలు
   2) సైనికుల వాహనాలు ఆగే స్థలాలు
   3) పోలీస్ స్టేషన్లు
   4) నాణేల ముద్రాణా కేంద్రాలు
54. రాయల్ నౌకాదళానికి అంకురార్పణ చేసింది ఎవరు?
   1) మొదటి ఎలిజబెత్
   2) ఎనిమిదో హెన్రీ
   3) విక్టోరియా మహారాణి
   4) లంకాస్ట్రియన్
55. మానవతా దృక్పథంతో కార్మిక సంక్షేమానికి పునాది వేసిన స్కాట్లాండ్ వాసి?
   1) రాబర్ట్ ఫుల్టన్ 2) హంఫ్రీ డేవి
   3) హెన్రీకార్ట్ 4) రాబర్ట్ ఓవెన్
56. ఫ్రెంచ్ విప్లవ కాలంలో జాతీయ రక్షణ దళాధిపతి ఎవరు?
   1) బెయిలీ 2) లఫాయితే
   3) ఓల్టేర్ 4) డాంటన్
57. జర్మనీలో వడ్డీ వ్యాపారులను ఏమనేవారు?
   1) మీర్ 2) కులక్
   3) పార్లిమా 4) ఛెకా
58. రష్యాను రోమనోవ్ వంశస్థులు ఏ కాలంలో పరిపాలించారు?
   1) 1688–1857 2) 1789–1917
   3) 1613–1917 4) 1815–1917
59. బెనిటో ముస్సోలిని పనిచేసిన పత్రిక ఏది?
   1) ఇస్క్రా 2) పీపుల్ అబ్జర్వర్
   3) సోషలిస్ట్ 4) ది సన్
60. 1870 నుంచి మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభ వరకు 'జాకల్ విధానం'ను అనుసరించిన దేశం?
   1) ఇటలీ 2) ఫ్రాన్స్
   3) జర్మనీ 4) స్పెయిన్

సమాధానాలు

1) 1 2) 2 3) 2 4) 4 5) 1
6) 2 7) 1 8) 4 9) 3 10) 1
11) 3 12) 3 13) 1 14) 2 15) 4
16) 2 17) 2 18) 1 19) 1 20) 4
21) 3 22) 4 23) 1 24) 2 25) 3
26) 4 27) 2 28) 3 29) 1 30) 2
31) 1 32) 4 33) 3 34) 2 35) 3
36) 3 37) 1 38) 4 39) 2 40) 1
41) 2 42) 4 43) 1 44) 4 45) 1
46) 1 47) 2 48) 4 49) 2 50) 4
51) 3 52) 2 53) 1 54) 2 55) 4
56) 2 57) 2 58) 3 59) 3 60) 1

శిశువు జన్మించే ప్రక్రియలో తోడ్పడే హార్మోన్ ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ



హార్మోన్లు

1. గొంతు భాగంలో ఉండే అతిపెద్ద గ్రంథి?
   1) థైరాయిడ్ 2) పారాథైరాయిడ్
   3) పిట్యూటరీ 4) ఎడ్రినల్ గ్రంథి
2. మెదడులో ఉండే గ్రంథి ఏది?
   1) పిట్యూటరీ 2) హైపోథాలమస్
   3) ఎడ్రినల్ 4) గోనాడ్స్
3. కింది వాటిలో కోపోద్రేకాలకు సంబంధించిన గ్రంథి ఏది?
   1) ఎడ్రినల్ 2) పిట్యూటరీ
   3) కాలేయం 4) క్లోమం
4. శరీరంలో అతిపెద్ద అంతస్రావ గ్రంథి ఏది?
   1) పిట్యూటరీ 2) ఎడ్రినల్
   3) కాలేయం 4) థైరాయిడ్
5. హార్మోన్లను ఉత్పత్తి చేయని గ్రంథి ఏది?
   1) పిట్యూటరీ 2) కాలేయం
   3) క్లోమం 4) పారాథైరాయిడ్
6. 'పోరాడే లేదా పలాయనం చెందే గ్రంథి' (Fight and Flight Gland)గా దేన్ని పిలుస్తారు?
   1) కాలేయం 2) క్లోమం
   3) ఎడ్రినల్ 4) గోనాడ్స్
7. శరీరంలో కార్బోహైడ్రేట్లను జీర్ణం చేయడానికి తోడ్పడే హార్మోన్ ఏది?
   1) అమైలేజ్ 2) కార్టిసోల్
   3) ఆల్డోస్టిరాన్ 4) ఇన్సులిన్
8. శరీరంలో ఆకలి, దాహం లాంటి వాటిని నియంత్రించే మెదడులోని భాగం ఏది?
   1) మెడుల్లా 2) సెరిబ్రం
   3) సెరిబెల్లం 4) హైపోథాలమస్
9. మానవ శరీరంలో Na^+ అయాన్లను నియంత్రించే హార్మోన్ ఏది?
   1) కార్టిసోల్ 2) ఆల్డోస్టిరాన్
   3) ఎడ్రినలిన్ 4) థైరాక్సిన్
10. పారాథైరాక్సిన్ లోపం వల్ల వచ్చే వ్యాధి?
    1) టెటానస్ 2) టిటాని
    3) టీనియాసిస్ 4) పైవన్నీ
11. శరీరంలో అతిపెద్ద గ్రంథి ఏది?
    1) పిట్యూటరీ 2) థైరాయిడ్
    3) కాలేయం 4) క్లోమం
12. థైరాక్సిన్ ఉత్పత్తికి అవసరమైన మూలకం?
    1) Fe 2) I 3) Ca 4) P
13. థైరాక్సిన్ లోపం వల్ల పెద్దవారిలో వచ్చే వ్యాధి ఏది?
    1) టిటాని 2) క్రెటినిజం
    3) గాయిటర్ 4) రికెట్స్
14. వ్యంధ్యత్వానికి కారణమైన హార్మోన్ ఏది?
    1) ఈస్ట్రోజన్ 2) ప్రొజెస్టిరాన్
    3) థైరాక్సిన్ 4) టెస్టోస్టిరాన్
15. ACTH హార్మోన్‌ను ఉత్పత్తి చేసే గ్రంథి?
    1) ఎడ్రినల్ 2) పిట్యూటరీ
    3) థైరాయిడ్ 4) పారాథైరాయిడ్
16. FSH హార్మోన్ నిర్వహించే విధి ఏమిటి?
    1) చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది
    2) అండకణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది
    3) జీర్ణక్రియకు తోడ్పడుతుంది
    4) ఏదీకాదు
17. క్లోమగ్రంథిపై పరిశోధన చేసిన శాస్త్రవేత్త?
    1) పాల్ లంగర్ హాన్స్
    2) కొహెలర్ 3) పావ్‌లోవ్
    4) స్టార్లింగ్
18. మానవుడి సాధారణ పెరుగుదలపై ప్రభావం చూపే హార్మోన్ ఏది?
    1) ఈస్ట్రోజన్ 2) ప్రొజెస్టిరాన్
    3) టెస్టోస్టిరాన్ 4) థైరాక్సిన్
19. యుక్తవయసులో కంఠంలోని మార్పునకు కారణమైన హార్మోన్ ఏది?
    1) ఈస్ట్రోజన్ 2) థైరాక్సిన్
    3) టెస్టోస్టిరాన్ 4) ప్రొజెస్టిరాన్
20. కోపం ఎక్కువ కావడానికి కారణమైన హార్మోన్ ఏది?
    1) ఎడ్రినలిన్ 2) థైరాక్సిన్
    3) పారాథైరాక్సిన్ 4) ఆక్సిటోసిన్
21. డయాబెటిస్ ఇన్‌సిపిడస్ వ్యాధికి కారణమైన హార్మోన్ ఏది?
    1) ఇన్సులిన్ 2) థైరాక్సిన్
    3) ఆక్సిటోసిన్ 4) వాసోప్రెస్సిన్
22. ఎముకల పెరుగుదలపై ప్రభావం చూపే హార్మోన్ ఏది?
    1) థైరోట్రోఫిన్ 2) సోమాట్రోఫిన్
    3) ల్యూటినైజింగ్ 4) టెస్టోస్టిరాన్
23. రక్తపీడనం (Blood Pressure) పెరగడానికి కారణమైన హార్మోన్ ఏది?
    1) ఎడ్రినలిన్ 2) వాసోప్రెస్సిన్
    3) ఇన్సులిన్ 4) ఆక్సిటోసిన్
24. పాల ఉత్పత్తికి తోడ్పడే హార్మోన్ ఏది?
    1) పారాథైరాక్సిన్ 2) FSH
    3) ఎడ్రినలిన్ 4) ప్రొలాక్టిన్
25. పిట్యూటరీ గ్రంథి ఏ భాగంలో ఉంటుంది?
    1) సెరిబ్రం 2) సెరిబెల్లం
    3) మెడుల్లా 4) ఏదీకాదు
26. గ్లూకగాన్ హార్మోన్ ఎక్కడ ఉత్పత్తవుతుంది?
    1) కాలేయం 2) క్లోమం
    3) అడ్రినలిన్ గ్రంథి 4) థైరాయిడ్ గ్రంథి
27. ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే కణాలేవి?
    1) T - కణాలు 2) C - కణాలు
    3) ఆల్ఫా కణాలు 4) బీటా కణాలు
28. చర్మంపై వెంట్రుకలు నిక్కబొడుచుకోవడానికి (Goose Bumps) కారణమైన హార్మోన్ ఏది?
    1) ఎడ్రినలిన్ 2) థైరాక్సిన్
    3) వాసోప్రెస్సిన్ 4) ఆక్సిటోసిన్
29. ఇన్సులిన్ హార్మోన్ విధి ఏమిటి?
    1) రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుంది
    2) రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతుంది
    3) రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది
    4) రక్తంలో కొవ్వు శాతాన్ని తగ్గించి చక్కెర స్థాయిని పెంచుతుంది
30. మొక్కల్లో విత్తనాలు లేని ఫలాలు ఏర్పడటానికి తోడ్పడే హార్మోన్లు ఏవి?
    1) సైటోకైనిన్లు 2) ఆక్సిన్లు
    3) జిబ్బరెల్లిన్లు 4) ఇథిలిన్
31. ఫలాలు రాలిపోవడానికి కారణమైన హార్మోన్ ఏది?
    1) ఆక్సిన్ 2) సైటోకైనిన్
    3) అబ్‌సైసిక్ ఆమ్లం 4) ఇథిలిన్
32. విత్తన సుప్తావస్థను ప్రేరేపించే హార్మోన్ ఏది?
    1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) ఇథిలిన్
    3) ఆక్సిన్ 4) సైటోకైనిన్
33. కలుపు మొక్కలను చంపడానికి ఉపయోగించే హార్మోన్ ఏది?
    1) ఆక్సిన్లు 2) సైటోకైనిన్లు
    3) ఇథిలిన్ 4) జిబ్బరెల్లిన్లు
34. బోల్టింగ్‌లో తోడ్పడే హార్మోన్ ఏది?
    1) ఆక్సిన్లు 2) సైటోకైనిన్లు
    3) అబ్‌సైసిక్ ఆమ్లం 4) జిబ్బరెల్లిన్లు
35. మొక్కల్లో మరుగుజ్జుతనాన్ని తొలగించడానికి ఉపయోగపడే హార్మోన్ ఏది?
    1) జిబ్బరెల్లిన్లు 2) ఆక్సిన్లు
    3) సైటోకైనిన్లు 4) ఇథిలిన్
36. అగ్రాధిక్యాన్ని చూపే హార్మోన్ ఏది?
    1) సైటోకైనిన్ 2) ఇథిలిన్
    3) అబ్‌సైసిక్ ఆమ్లం 4) ఆక్సిన్
37. మొక్కల్లో కాండం దేన్ని చూపుతుంది?
    1) గురుత్వానువర్తనం
    2) కాంతి అనువర్తనం
    3) స్పర్శానువర్తనం
    4) రసాయనిక అనువర్తనం
38. 'హార్మోన్' అనే పదాన్ని వాడుకలో తెచ్చింది ఎవరు?
    1) స్టార్లింగ్ 2) రాబర్ట్ హుక్
    3) లాండ్ స్టీనర్ 4) వాట్సన్
39. శిశువు జన్మించే ప్రక్రియలో తోడ్పడే హార్మోన్ ఏది?
    1) వాసోప్రెస్సిన్ 2) ఆక్సిటోసిన్
    3) LH 4) FSH
40. చిన్నపిల్లల్లో బుద్ధిమాంద్యం ఏర్పడటానికి కారణమైన హార్మోన్ ఏది?
    1) ఎడ్రినలిన్ 2) ఆక్సిటోసిన్
    3) థైరాక్సిన్ 4) పారాథైరాక్సిన్
41. 'మిక్సోడిమా' వ్యాధి దేని లోపం వల్ల వస్తుంది?
    1) థైరాక్సిన్ 2) పారాథైరాక్సిన్
    3) ఎడ్రినలిన్ 4) ఆక్సిటోసిన్
42. 'ఎమర్జెన్సీ హార్మోన్' అని దేన్ని పిలుస్తారు?
    1) పారాథైరాయిడ్ 2) క్లోమం
    3) ఎడ్రినల్ 4) పిట్యూటరీ
43. టెస్టోస్టిరాన్‌ను ఉత్పత్తి చేసే కణాలేవి?
    1) ఆల్ఫా కణాలు 2) బీటా కణాలు
    3) లీడింగ్ కణాలు 4) ఏదీకాదు
44. బాలగ్రంథి (Thymus) మానవ శరీరంలో ఎక్కడ ఉంటుంది?
    1) గుండె సమీపంలో
    2) మూత్రపిండాలపైన
    3) మెదడులో 4) గొంతు భాగంలో
45. కింది వాటిలో వినాళ గ్రంథి కానిది ఏది?
    1) థైరాయిడ్ 2) పారాథైరాయిడ్
    3) ఎడ్రినల్ 4) పాంక్రియాస్
46. 'అతి ప్రధాన గ్రంథి' (Master Gland)గా దేన్ని పేర్కొంటారు?
    1) థైమస్ 2) థైరాయిడ్
    3) పిట్యూటరీ 4) ఎడ్రినల్
47. అనిషేక ఫలనం జరగడానికి కారణమైన హార్మోన్లు ఏవి?
    1) ఆక్సిన్లు 2) సైటోకైనిన్లు
    3) జిబ్బరెల్లిన్లు 4) ఇథిలీన్
48. పత్రాల వయసును పెంచే హార్మోన్ ఏది?
    1) సైటోకైనిన్ 2) ఆక్సిన్
    3) ఇథిలిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
49. విత్తనాలు త్వరగా మొలకెత్తడానికి ఉపయోగపడే హార్మోన్ ఏది?
    1) ఇథిలిన్ 2) ఆక్సిన్
    3) జిబ్బరెల్లిన్ 4) ఏదీకాదు

సమాధానాలు

1) 1	2) 1	3) 1	4) 4	5) 2
6) 3	7) 2	8) 4	9) 2	10) 2
11) 3	12) 2	13) 3	14) 4	15) 2
16) 2	17) 1	18) 4	19) 3	20) 1
21) 4	22) 2	23) 2	24) 4	25) 1
26) 2	27) 4	28) 1	29) 3	30) 3
31) 3	32) 1	33) 1	34) 4	35) 1
36) 4	37) 2	38) 1	39) 2	40) 3
41) 1	42) 3	43) 3	44) 1	45) 4
46) 3	47) 3	48) 1	49) 3	

ఉద్యోగాలు

టీఎంసీ, ముంబైలో 29 నాన్ మెడికల్ పోస్టులు

ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్(టీఎంసీ)-టాటా మెమోరియల్ హాస్పిటల్(టీఎంహెచ్) నాన్ మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 29

» **పోస్టుల వివరాలు:** సైంటిఫిక్ ఆఫీసర్'ఎస్‌బీ' (పాథాలజీ)-02, సైంటిఫిక్ అసిస్టెంట్ 'బి'-10, అసిస్టెంట్ మెడికల్ సోషల్ వర్కర్-02, టెక్నీషియన్ ఎ/సి-06, క్లర్క్ కమ్ టెలిఫోన్ ఆపరేటర్-01, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్-08.

» **విభాగాలు:** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-ప్రోగ్రామర్, రేడియేషన్ ఆంకాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, రేడియోడయాగ్నోసిస్, సెంట్రల్ స్టెరైల్ సప్లై, మైక్రో బయాలజీ, బయో మెడికల్, పల్మనరీ ఫంక్షన్ టెస్టింగ్ ల్యాబ్, జనరల్ మెడిసిన్, ఐసీయూ, ఓటీ, ప్లంబర్, మెకానికల్.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.

» **వయసు:** సైంటిఫిక్ ఆఫీసర్‌కు 35 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు, టెక్నీషియన్/క్లర్క్ కమ్ టెలిఫోన్ ఆపరేటర్/అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.09.2024

» **వెబ్‌సైట్:** https://tmc.gov.in

ఎన్ఐటీవీఏఆర్, పుణెలో యూడీసీ, ఎల్‌డీసీ పోస్టులు

పుణెలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్)-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ వైరాలజీ అండ్ ఎయిడ్స్ రీసెర్చ్(ఎన్ఐటీవీఏఆర్) అప్పర్ డివిజన్ క్లర్క్(యూడీసీ), లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.

» **పోస్టుల వివరాలు:** యూడీసీ-03,ఎల్‌డీసీ-05.

» **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

» **వయసు:** 18 నుంచి 27 ఏళ్లు మించకూడదు.

» **వేతనం:** నెలకు యూడీసీ పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100, ఎల్‌డీసీ పోస్టులకు రూ.19,900 నుంచి రూ.63,200.

» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **దరఖాస్తులకు చివరితేది:** 19.09.2024.

» **వెబ్‌సైట్:** https://main.ic-mr.nic.in

Students will think twice..



MODEL QUESTIONS

Directions (Q.No. 1-5): Read the following information carefully and answer the questions that follow:

Twelve friends are sitting in two squares. One square is inside another. Ravi, Praveen, Suri, Suma, Raju and Robert are in the outer square facing inward. Smith, Chandra, Audhi, John, Balu and Jacob are sitting in the inner square facing outward. They all are sitting in such a way that in each square four persons are sitting in the middle of the sides and two persons are sitting on diagonally opposite corners. Each friend in the inner square is facing another friend of the outer square. There are exactly two persons sitting between Ravi and Raju. Balu sits second to the left of Smith. Suri is on the immediate left of the one who is facing Smith. Neither Balu nor Smith faces either Raju or Ravi. Suma is facing Jacob and Praveen is not opposite Suri in the outer square. Raju is not sitting adjacent to Suma. Chandra is not facing Ravi. Between Chandra and John there are as many persons as between Suri and Robert. Ravi sits on any of the corner.

1. Who is sitting opposite Chandra?
   1) Robert 2) Praveen
   3) Raju
   4) Data inadequate
   5) None of the above
2. Robert is facing which of the following persons?
   1) Balu 2) John 3) Smith
   4) Data inadequate
   5) None of the above
3. Who is sitting on the immediate left of Suri?
   1) Smith 2) Suma 3) Ravi
   4) Data inadequate
   5) None of the above
4. Four of the five are alike in a certain manner. Select the one which is not similar to the other four.
   1) Balu, Suri
   2) Smith, Suma
   3) John, Jacob
   4) Jacob, Praveen
   5) None of the above
5. Who is sitting second to the left of John?
   1) Smith 2) Balu 3) Jacob
   4) Data inadequate
   5) None of the above

Directions (Q. No. 6-10): Study the following information carefully and answer the questions given below.

A1, A2, A3, A4, A5, A6, A7 and A8 are eight friends sitting around a circle in one arrangement and in a straight line in another arrangement. While sitting around a circle they are facing outward and while sitting in a straight line they are facing north. One of the immediate neighbours of A8 in the straight line sits opposite A8 in the circle. A5 sits third to the right of A2 in the circle, while fourth to his left in the straight line. A6 and A3 are the immediate neighbours of A2 in both the arrangements, but A3 is not at the extreme ends of the line. The one who sits on the extreme left end sits second to the right of A5 in the circle. A8 is not on the immediate left of A6 in both the arrangements. A7 sits on the immediate left of A8 in the circle, but both are not immediate neighbours of each other in the straight line. A4 sits third to the right of A6 in the straight line. The one who sits on the immediate left of A2 in the straight line is sitting on the immediate right of A2 in the circle.

6. Who among the following sits on the immediate right of A5 in the circle?
   1) A4 2) A1 3) A7
   4) A3 5) None of these
7. Which of the following pairs sits at the extreme ends of the row?
   I) A8, A5 2) A7, A4 3) A6, A7
   4) Can't be determined
   5) None of these
8. The one who sits third to the right of A3 in the circle is at what position in the straight line with respect to A7?
   1) Third to the left
   2) Fourth to the right
   3) Immediate right
   4) Third to the right
   5) None of these
9. The person sitting between A5 and A7 in the circle is sitting at what position in the straight line?
   1) Extreme left end of the straight line
   2) Fourth from the right end
   3) Extreme right end of the straight line
   4) Third from the left end
   5) None of these
10. The one sitting at the extreme left end of the straight line is sitting at what position in the circle?
    1) Third to the left of A1
    2) Opposite A6
    3) Second to the left of A5
    4) Immediate right of A8
    5) None of these

Directions (Q. No. 11-13): In these questions, a relationship between different elements is shown in the statements. The statements are followed by two conclusions.

Give answer:
1) If only conclusion I is true
2) If only conclusion II is true
3) If either conclusion I or II is true
4) If neither conclusion I nor II is true
5) If both conclusions I and II are true

11. **Statement:**
    W > O > N = D ≤ E = R
    Conclusions:
    I. W > D II. R > N
12. **Statement:**
    P < Q = T > N , V < S < P
    Conclusions:
    I. N > S II. S < T
13. **Statements:**
    L = M > S > G, H < K = G
    Conclusions:
    I. L > K II. S > H

Directions (Q. No. 14 & 15): Study the following information carefully and answer the following questions:

In a certain code language "Maruti Suzuki India recall" is written as "pa ma sa ga", "India spokesperson" is written as "ra ma", "Cars unsold" is written as "na re", "Maruti manufactures cars" is written as "sa ja na" and "Suzuki informed manufactures" is written as "ga ja ta".

14. What will be the code for "Suzuki recall manufactures"?
    1) ga pa na 2) sa ga pa
    3) pa ja na 4) ga pa ja
    5) ma sa ga
15. What may be the possible code for "Maruti manufactures cars only" in the given code language?
    1) sa ja na ha 2) sa ja ta te
    3) sa na ta re 4) sa pa ja ta
    5) Can't be determined


Directions (Q. No. 16 & 17): In each question below is given a statement followed by two assumptions numbered I and II. An assumption is something supposed or taken for granted. You have to consider the statement and the following assumptions is implicit in the statement.

Give answer:
1) If only assumption I is implicit
2) If only assumption II is implicit
3) If either assumption I or assumption II is implicit
4) If neither assumption I nor assumption II is implicit
5) If both assumption I and II are implicit

16. **Statement:**
    Govt. schools should have uniformity in charging various fees.
    Assumptions:
    I) The govt. subsidy comes from the money collected by way of taxes from people.
    II) The govt. while giving subsidy, may have stipulated certain uniform conditions regarding fees.
17. **Statement:**
    If degrees are delinked from jobs, students will think twice before joining college.
    Assumptions:
    I) Students join college for getting a job.
    II) A degree is of no used for getting a job.


Answers with Explanations


(1-5):



Ans: 1) 3; 2) 1; 3) 3; 4) 3; 5) 1

(6-10):






Ans: 6) 1; 7) 2; 8) 4; 9) 3; 10) 2

11. Given statement:
    W > O > N = D ≤ E = R
    Thus, W > D is true. But conclusion II (R ≥ N) is not true. **Ans: 1**
12. Given statements:
    P < Q = T > N ......(i)
    V < S < P .... (ii)
    Combining both the statements, we get
    V < S < P < Q = T > N
    Thus, N ≥ S is not true. But S ≤ T is true. **Ans: 2**
13. Given statements:
    L = M > S > G .... (i)
    H < K = G .... (ii)
    Combining both the statements, we get
    L = M > S > G = K > H
    Thus, L > K is true, Again, S > H is also true. **Ans: 5**

(14 & 15):



Ans: 14) 4; 15) 1

16. Assumption (I) is not related to the statement, so it is not implicit. Assumption II is vague. **Ans: 4**
17. Job is the main motto of the student. Hence, if degrees are delinked with jobs, students will think twice before joining college. So I is true. II is contrary to it. **Ans: 1**